

పోతన
శ్రీ భాగవతం

పోతన

# శ్రీ భాగవతం



ప్రఖ్యలోకనాథ వేంకట మహేశ్వర శర్మ

**Rs. 126/-**

---

**RACHANA PUBLICATION**

**IST LINE, MADHURA NAGAR**

**VIJAYAWAR - 11**

## విషయసూచిక


ప్రథమ స్కందము
భాగవత ప్రాశస్త్యము - 7
నారదుని పూర్వజన్మ - భగవద్ధ్యాన మహిమ -
సజ్జన సాంగత్య వైభవం - 8
శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళుట - పరీక్షిత్తు పుట్టుట - 18
ధరణి - ధర్మదేవతల సంవాదం - కలిపురుషుడు ధర్మదేవతను తన్నడం - 25
పరీక్షిత్తుకి భగవదనుగ్రహం కలగడం - శుకమహర్షి రావడం - 33
ద్వితీయ స్కందం
నారదుని సందేహం - చతుర్ముఖ బ్రహ్మ సమాధానం - 37
తృతీయస్కందము
దుర్యోధనుడు విదురుని నిందించుట - విదురుడు తీర్థయాత్రలకు వెళ్ళుట - 45
విదురమైత్రేయ సంవాదం - శ్రీకృష్ణుడు ఉపదేశించిన సృష్టి క్రమం - 48
శ్రీహరి వరాహరూపంగా అవతరించుట - హిరణ్యాక్షుని సంహరించుట - 52
మహర్షులను నిందించిన వైకుంఠ ద్వారపాలకులు -
మహర్షుల శాపంతో రాక్షసులగుట - 53
హిరణ్యాక్ష హిరణ్యకశిపుల పుట్టుక -
యజ్ఞ వరాహుని చేతిలో హిరణ్యాక్షుడు మరణించుట - 57
బ్రహ్మదేవుడు అనేక శరీరాలను విడిచి పెట్టడం -
యక్షాది దేవతలను సృష్టించడం - 59
కర్దమముని తపస్సు చేయుట -
శ్రీమహావిష్ణువు అతనిని అనుగ్రహించుట - 61
విష్ణువు కపిలావతారుడగుట -
కపిలుడు దేవహూతికి తత్త్వోపదేశం చేయుట - 62
నాలుగవ స్కందము
మనువంశ విస్తరణ -ఎవరెవరు ఎవరెవరికి - 67
కర్దముని సంతతి - దత్తాత్రేయుని పుట్టుక - 68
దక్షుని సంతతి - నరనారాయణుల పుట్టుక - 70
ఈశ్వరునిపై దక్షుడు కోపించుట - నందీశ్వరుడు దక్షుని శపించుట - 72
సతీదేవి దక్షుని యజ్ఞానికి వెళ్ళుట - దాక్షాయణిగా తనువు చాలించుట - 74
వీరభద్రుడు దక్షయజ్ఞమును ధ్వంసం చేయుట -
దేవతలు చతుర్ముఖునితో మొరపెట్టుకొనుట - 76
బ్రహ్మాది దేవతలు ఈశ్వరుని స్తుతించుట -
ఈశ్వరుడు దక్షాదులను అనుగ్రహించుట - 78
ధ్రువుడు తపస్సు చేయుట - హరి అనుగ్రహమును పొందుట - 80
వేనుని అరాచకాలు నాస్తికత -
వేనుడు మహర్షుల కోపాగ్నిలో దహించబడుట - 91

పృథుచక్రవర్తి పుట్టుట - భూమినుండి ఓషధులను పితుకుట - 94
పృథువు దేవేంద్రుడితో సఖ్యము చేయుట -
చివరకు పరమాత్మలో ఐక్యమగుట - 98
పృథువు యొక్క వంశక్రమ వర్ణన -
ప్రచేతసులు రుద్రోపదేశమును పొందుట - 103
ఐదవ స్కందము
ప్రియవ్రతుని పరాక్రమం - ప్రియవ్రతుడు విష్ణుసాన్నిధ్యాన్ని చేరడం - 113
అగ్నీధ్రుడు పూర్వచిత్తిని వివాహమాడుట -
ఆమెనే అనుసరించి బ్రహ్మలోకానికి చేరుకొనుట - 115
రాజర్షి భరతుడు లేడిగా పుట్టుట - అంగిరసపుత్రుడై ముక్తిని పొందుట - 119
షష్ఠమ స్కందము
విశ్వరూపుడు ఆచార్యుడగుట - ఇంద్రుడు విశ్వరూపుని సంహరించుట - 127
దేవేంద్రుడు వృత్రుని సంహరించుట -
బ్రహ్మ హత్యాదోషము నుండి బయటపడుట - 130
వృత్రుడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడగుట -
చిత్రకేతువుగా పార్వతిచే శపించబడుట - 131
ఏడవ స్కందము
విష్ణు ద్వారపాలకులు సనకాదులచే శపించబడుట -
బాల యముడు సుయజ్ఞుని కథ చెప్పుట - 137
ప్రహ్లాదుడు భక్తి తత్పరత్వముతో ఉండుట -
ప్రహ్లాదుని రక్షించుటకై శ్రీహరి నృసింహుడగుట - 141
శ్రీహరి సిద్ధరసమును త్రాగుట -
హరుడు త్రిపురాసురులను సంహరించుట - 143
వర్ణాశ్రమ ధర్మాలు - వాటి వలన మానవులకు కలిగే ప్రయోజనం - 144
ప్రహ్లాద అజగర సంవాదం - నారదుని పూర్వ వృత్తాంతం - 146
ఎనిమిదవ స్కందము
క్షీరసాగర మధనం - కూర్మావతార ఆవిర్భం - 151
ఈశ్వరుడు విషాన్ని తినడం - శ్రీహరి మోహినీ వేషాన్ని ధరించడం - 153
హరి రాహువుని సంహరించడం - హరుని మోహింపచెయ్యడం - 154
వామనుడు అవతరించుట - త్రివిక్రమునిగా విజృంభించుట - 160
మత్స్యావతార ఆవిర్భావం - సత్యవ్రతుడు వివస్వంతుడై పుట్టడం - 165
తొమ్మిదవ స్కందము
వైవస్వత మనువంశ వర్ణన - నాభాగుడు రుద్రానుగ్రహమును పొందుట - 167
అంబరీషునిపై దుర్వాసుడు ఆగ్రహించుట - శ్రీహరి అంబరీషుని రక్షించుట - 174
ఇక్ష్వాకు వంశక్రమం - హరిశ్చంద్రుడు ముక్తుడగుట - 176
సగరుని పుట్టుక - భగీరథుడు గంగను భూమికి తెచ్చుట - 181

శ్రీహరి శ్రీరాముడై అవతరించుట - అయోధ్యలో పట్టాభిషిక్తుడగుట - 183
రాబోయే రాజులు - చంద్రవంశపు రాజులు - 186
పదవస్కందము
శ్రీహరి శ్రీకృష్ణునిగా అవతరించుట - బాలకృష్ణుని బాల్యలీలలు - 198
శ్రీకృష్ణుడు అవతరించడం - శ్రీమాత కంసుని హెచ్చరించడం - 201
శ్రీ కృష్ణుడు లీలలు మొదలుపెట్టడం - విశ్వరూపాన్ని చూపించడం - 204
యశోద శ్రీకృష్ణుని పట్టుకొనుట - శ్రీకృష్ణుడు రోటికి కట్టబడుట - 211
వత్సాసుర బకాసురులను చంపడం - బ్రహ్మదేవుడికి బుద్ధి చెప్పడం - 215
శ్రీకృష్ణుడు గోపికలతో రాసలీల చేయుట - రుక్మిణిని వివాహమాడుట - 226
పదవస్కందము - ఉత్తరభాగము
శ్రీకృష్ణుడు లోకనిందను పోగొట్టుకొనుట - సత్యభామను వివాహమాడుట - 236
శ్రీకృష్ణుడు మిత్రవిందాదులను వివాహమాడుట -
నరకాసురుని సంహరించుట - 239
ఉషా, అనిరుద్ధుల వివాహము - నృగమహారాజు కథ - 239
శ్రీకృష్ణుడు శిశుపాలుని వధించుట - దంతవక్త్రుని సంహరించుట - 245
బలరాముని తీర్థయాత్ర -పల్వలాసురుని అంతిమయాత్ర - 247
విష్ణుమాయతో వృకుడు నశించడం -
శ్రీకృష్ణుడు విప్రసూతులను తీసకురావడం - 253
పదకొండవ స్కందము - 257
విదేహఋషభ సంవాదం - హరిభక్తికి ఉపాయం - 259
ద్వారకకు బ్రహ్మదుల రాక - వైకుంఠమునకు బలరామకృష్ణులు - 264
పన్నెండవ స్కందము - 265
యుగధర్మములు - పరిణామాలు - 266
శుకమహర్షి పరీక్షిత్తుకి హితబోధ చెయ్యడం -
పరీక్షిత్తు పుణ్యలోకాలకు చేరుకోవడం - 268
కర్మసాక్షి - ద్వాదశాదిత్యులు - 269
భాగవత ప్రశస్తి - పఠనఫలము - 270

-----



## ముందుమాట

శ్రీ మహావిష్ణు స్వరూపుడైన వ్యాసభగవానుడు నాలుగు వేదాలలో చెప్పిన విషయాలనే వేదం చదవలేని వాళ్ళ కోసమని పద్దెనిమిది పురాణాల రూపంలో రచించి అందించాడు. ఆ పద్దెనిమిది పురాణాలలో ఒకటి ఈ శ్రీమద్భాగవతం. ఇది భక్తి ప్రధానమైన, భగవద్గుణ వైభవాలను వర్ణించి చెప్పిన మహాగ్రంథం.

వ్యాసభగవానుడు వేదాలను భాగాలుగా విభజించాడు. పద్దెనిమిది పురాణాలను రచించాడు. లక్ష శ్లోకాలతో కూడిన మహాభారతాన్ని రచించాడు. అయినా అతనికి మనసులో ఏదో దిగులు చింత, వెలితి. ఇంకా ఏదో చెయ్యాలి, ఏదో చెప్పాలి అని.

అట్లా దిగులుగా కూర్చున్న వ్యాసమహర్షి దగ్గరికి మూడు లోకాలలో తిరుగుతుండే నారదుడు వచ్చాడు. వ్యాసమహర్షి దిగులుకి కారణం అడిగాడు. మహర్షి తన మనసులో చింతకి

కారణం తెలియడం లేదని చెప్పాడు నారదునికి. అప్పుడు నారదుడు వ్యాసుని మనసులోని దిగులుకి కారణం చెప్పి, అతడి సందేహాన్ని తీర్చి, శ్రీమహావిష్ణువు యొక్క లీలలను వర్ణిస్తూ, భక్తిని ప్రబోధం చేస్తూ, వేదాంతాన్ని సూచిస్తూ భాగవత గ్రంథాన్ని రచించమని ఉపదేశం చేశాడు. నారదుని ఉపదేశం ప్రకారంగా వ్యాసుడు విష్ణుభాగవతాన్ని రచించి, భక్తిని బోధించాడు. ఆ తరువాత శుకుడు ఆ గ్రంథాన్ని పరీక్షిత్తుకు బోధించాడు. ఆపైన నైమిశారణ్యంలో శూతమహర్షి శౌనకాది మహర్షులకు ఆ శ్రీమద్భాగవతాన్ని వినిపించాడు.

ఇంతటి పవిత్రమైన, భక్తి ప్రబోధకమైన భాగవత గ్రంథాన్ని సామాన్య మానవులకు అర్థమయ్యే రీతిలో సులభంగా వ్రాయమని ప్రోత్సహించిన కె.వెంకటేశ్వర్లుగారికి నా ధన్యవాదములు. నా ఈ రచనా వ్యాసంగానికి సహకరించిన నా సతీమణికి నా ఆశీస్సులు.

## గ్రంథ పరిచయము

ఈ భాగవత గ్రంథంలో పన్నెండు స్కందాలు ఉన్నాయి. స్కందం అంటే కణువు. చెఱుకుగడలో తీపి కణుపు కణుపుకీ పెరిగనట్లే భాగవతంలోనూ భగవంతుని పట్ల భక్తినీ, సాధకుని భక్తినీ, సాధననూ పెంచే శక్తి అనే తీపి ఉన్నది. ఈ గ్రంథం ద్వారా చేయబడే హరిసంకీర్తనం వలన మానవుడికి గల చదువూ, నీతీ, తపస్సు, దానమూ, బుద్ధీ, సజ్జనగోష్ఠీ అనే వాటన్నింటికీ మంచి ఫలితం కూడా కలుగుతుంది. వ్యాసుడు

తాను రచించిన ఏ ఇతర గ్రంథాలలోనూ చెప్పని విష్ణు కథలను ఇందులో వర్ణించాడు. అందుకే ఈ గ్రంథం చదవడం వలన, మానవుడు చేసే హరిసంకీర్తనం వలన అతడు ముక్తిని పొందగలుగుతాడు. అందుకే ఈ గ్రంథానికి మిగిలిన గ్రంథాలన్నింటికంటే అత్యధికమై ఆదరణ లభించింది.

# పోతన శ్రీభాగవతం

## ప్రథమ స్కందము

### భాగవత ప్రాశస్త్యము

శ్రీభాగవత ప్రవచనం జరిగింది నైమిశారణ్యంలో. భాగవతం జరిగిన కాలం కలియుగ ప్రారంభ సమయం. భాగవత ప్రవచనం చేసిన వాడు సూతమహర్షి. విన్న వారు శౌనకాది మహర్షులు. దీనిని మొట్టమొదట వ్యాసమహర్షి శుకమహర్షికి చెప్పాడు. శుకమహర్షి పరీక్షిన్మహారాజుకి చెప్పాడు.

పుట్టిన ప్రతివ్యక్తీ మోక్షాన్ని పొందాలి. మోక్షాన్ని పొందాలనే ఆలోచన, కోరిక కలగడం కోసం ఎన్నో సత్కర్మలు చెయ్యాలి. ఆ కర్మల వలన పరిపక్వమైన మనసుకి మోక్షం కోసం ప్రయత్నించాలనే సంకల్పం వస్తుంది. ఆ సంకల్పం కలిగిన మనసుతో వినాల్సిన పరమపవిత్రమైన, మోక్ష ప్రదాయకమైన, భవత్సంబంధమైన, ఉత్తమోత్తమమై గ్రంథమే శ్రీమద్భాగవతం.

## నారదుని పూర్వజన్మ - భగవద్ధ్యాన మహిమ - సజ్జన సాంగత్య వైభవం

పరాశర తనయుడైన వ్యాసుడితో నారదుడు "మహాత్మా! నేను ఇంతకుముందు కల్పంలో మొట్టమొదటి జన్మలో వేదవేత్తల ఇంటిలో పనిచేసే దాసికి కుమారుడినై పుట్టాను. ఒకానొకప్పుడు ఆ వేదవేత్త ఆజ్ఞ ప్రకారంగా చాతుర్మాస్య దీక్షతో కాలం గడిపే యోగులకు సేవ చేయడానికి వెళ్ళాను. అప్పుడు ఆ యోగులకు సేవ చేస్తూ, వాళ్ళతో పాటుగా విష్ణుసేవ కూడా చేశాను. వాళ్ళ వలననే నాకు విష్ణు భక్తి కలిగింది. ఈ శరీరం శాశ్వతంగా ఉండేది కాదు అనీ తెలిసింది. నాలుగు నెలల దీక్షాకాలం పూర్తి అయిపోయింది. యోగులు యాత్రలకు వెళ్తూ నాకు ఈశ్వర జ్ఞాన రహస్యాన్ని బోధించారు. వాళ్ళు చేసిన ఆ బోధవలన నాకు విష్ణుమాయా తత్వం అర్థమయ్యింది. ఓంకారాన్ని "వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధ" అనే పదాలకు ముందు చేర్చి, చివరగా 'నమః' అనే పదాన్ని జతచేసి, నమస్కరించి, మంత్రమే స్వరూపంగా కలిగిన, ఏ స్వరూపమూ లేని ఆ యజ్ఞ పురుషుడికి చక్కని, మంచి చూపు కలుగుతుంది. అదుగో అట్లా కలిగిన చూపుతో నేను ఆ విధంగా విష్ణువును ఆరాధించాను. నా పట్ల ప్రసన్నుడయ్యాడు శ్రీమహావిష్ణువు. తనను గురించిన విజ్ఞానాన్ని నాకు అనుగ్రహించాడు. కనుక నువ్వు కూడా ఆ శ్రీహరిని ధ్యానించు. ఆయనను ధ్యానించినా,

స్తోత్రం చేసినా, స్తోత్రాలు విన్నా సమస్త దుఃఖాలూ హరించుకు పోతాయి" అని చెప్పాడు.

వ్యాసుడు నారదుడిని "నీకు ఈ విధమైన భక్తి తత్పరత ఎట్లా కలిగింది? ఇంతకు ముందు కల్పంలో జరిగిన విషయం ఇప్పటికీ నీకు ఎట్లా గుర్తుంది? దాసీ పుత్రుడిగా ఆ జన్మంతా ఎట్లా గడిపావు?" అని అడిగాడు.

నారదుడు వ్యాసమహర్షితో "ఆ యోగీశ్వరులు చేసిన బోధ నా మనసులో మెదులుతూనే ఉంది. వాళ్లు వెళ్ళిపోయారు. ఒక రోజున నా తల్లి రాత్రి పూట ఆవుపాలు పితుకుతూ ఒక పామును తొక్కింది. వెంటనే ఆ పాము మా అమ్మను కరిచింది. మా అమ్మ చనిపోయింది. అప్పటికి నేను ఐదేళ్ళ పిల్లవాడినే. అయినా అమ్మ చనిపోయిందన్న బాధ నాకు ఏమాత్రం కలుగలేదు. ఉన్న బంధం ఒక్కటి. అదీ తొలిగిపోయింది కదా అని సంతోషం కలిగింది. ఒంటరిగా ఉంటూ విష్ణుసేవ చేస్తూ జీవితం గడపాలని నిర్ణయించు కున్నాను.

అడవిలోకి వెళ్ళాను. అక్కడ ఒక మడుగు దగ్గరకు వెళ్ళి, అందులో స్నానం చేసి, దాహం తీర్చుకుని, ఒక రావిచెట్టు క్రింద కూర్చుని విష్ణువును ధ్యానించడం మొదలుపెట్టాను. నా మనసులోనే నాకు ఆ భగవంతుని దర్శనం కలిగింది. సంతోషంతో పరవశించిపోయాను. నన్ను నేను మరచిపోయి ఉండిపోయాను. కొంతసేపటికి నాకు నేను జ్ఞాపకం వచ్చాను. లేచి నిలబడి మళ్ళీ ఆ భగవంతుని

దివ్య రూపాన్ని చూడాలని మళ్ళీ ప్రయత్నం చేశాను. అలా ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఎంతగా ధ్యానం చేసినా నాకు తోచలేదు. వెర్రివాడిలాగా ఆ అడవిలోనే తిరుగుతున్నాను. ఇంతలో ఆ భగవంతునికి నా పట్ల అనుగ్రహం కలిగింది. నా దుఃఖాన్ని పోగొట్టి, నా కోరిక తీర్చదలుచుకన్న ఆ శ్రీహరి నాతో "వత్సా! ఎందుకు ఇంతగా ప్రయాసపడుతున్నావు? ఇక ఈ జన్మలో నువ్వు నన్ను చూడలేవు. కానీ నువ్వు నాకోసం చేసిన ధ్యానం, నాకు చేసిన సేవ వృధాపోవు. ఇప్పుడు నీకు కలిగిన భక్తి నిన్ను తరువాత జన్మలలోనూ వదిలిపెట్టదు. ఈ శరీరాన్ని వదిలిపెట్టి, మళ్ళీ పుట్టినాక కూడా నువ్వు నా భక్తుడిగానే ఉంటావు. ఈ సృష్టి అంతా నశించిపోతుంది. ఆ తరువాత ప్రళయరాత్రి వస్తుంది. ఆ రాత్రి వెయ్యి యుగాలు ఉంటుంది. ఆ తరువాత మళ్ళీ సృష్టి మొదలవుతుంది. అప్పుడు కూడా నువ్వు మళ్ళీ పూర్వజన్మ జ్ఞానంతోనే పుడతావు. పరమపవిత్రుడిగానే ఉంటావు. శుద్ధ సాత్త్వికులలో గొప్పవాడివి అవుతావు" అని చెప్పాడు ఆకాశవాణి రూపంలో.

వెంటనే నేను ఆ స్వామికి నమస్కరించాను. ఆ భగవంతునికి ఈ భక్తుని పట్ల కలిగిన దయకు మిక్కిలి సంతోషించాను. నాలోనే ఉన్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరుగురు శత్రువులనూ తరిమివేశాను. శ్రీహరి లీలలను తలుచుకుంటూ కాలం గడిపాను. చివరికి ఆ శరీరాన్ని వదిలిపెట్టి మళ్ళీ పుట్టాను. అప్పుడూ హరి భక్తుడినే అయ్యాను. ఆ తరువాత ప్రళయం వచ్చింది. అప్పుడు

బ్రహ్మదేవుడి నిట్టూర్పుతో నారాయణునిలోకి వెళ్ళాను. వెయ్యి యుగాలు గడిచిపోయినాయి. బ్రహ్మదేవుడు మళ్ళీ సృష్టించడం మొదలుపెట్టాడు. మరీచి మొదలైన మహర్షులతో పాటు నేనూ పుట్టాను.

అప్పటినుండి పరమపవిత్రమైన బ్రహ్మచారినై, శ్రీహరి అనుగ్రహంతో ఎటువంటి ఆటంకాలు లేకుండా బ్రహ్మదేవుడు నన్ను అనుగ్రహించి ఇచ్చిన, మీటకుండానే పలికే ఈ వీణను చేతబట్టి హరి సంకీర్తన చేసుకుంటూ మూడు లోకాలలోనూ తిరుగుతూ హరిభక్తిని ప్రబోధిస్తున్నాను" అంటూ తన పూర్వజన్మ గురించి చెప్పాడు.

అని సూతమహర్షి శౌనకాది ఋషులకు చెప్పాడు. శౌనకాదులు "నారదుడు వెళ్ళిపోయిన తర్వాత వ్యాసుడు ఏం చేశాడు?" అని ప్రశ్నించారు సూతమహర్షిని.

సూతుడు శౌనకాదులతో "అప్పుడు బాదరీ నారాయణుడు సరస్వతీ నదీ తీరాన రేగువనంలో ఉన్న ఒక సుప్రసిద్ధమైన తపోవనంలో ఒంటరిగా కూర్చుని భక్తితో నిండిన మనసుతో, తన మనసులో శ్రీహరిని ప్రతిష్ఠ చేసుకుని శ్రీమద్భాగవతాన్ని రచించి, మోక్షం కోరుకునే శుకయోగి చేత ఆ భాగవతాన్ని చదివించాడు" అని చెప్పాడు.

**పెద్దలను సేవించడం పరమప్రయోజనకరం. పెద్దల సేవ చేసే భాగ్యం లభించడమే భగవంతుడిచ్చిన ఒక వరంగా భావించాలి. తద్వారా తరించాలి.**

## అర్జునుడు అశ్వత్థామను అవమానించుట - బ్రాహ్మణుని చంపకూడదని శ్రీకృష్ణుడు ఉపదేశించుట

ఇక్కడ ఈ విధంగా భాగవత బోధ జరిగింది. అక్కడ కురుక్షేత్రంలో భీముడు దుర్యోధనుని తొడలు విరగ్గొట్టాడు. ఈ విషయం తెలిసిన అశ్వత్థామ దుర్యోధనుడికి ఇష్టమైనవి చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే పాండవుల శిబిరంలోకి ప్రవేశించి, నిద్రపోతున్న ద్రౌపది యొక్క కుమారులందరి తలలూ నరికి, తీసుకువెళ్ళి దుర్యోధనుడికి ఆత్మకు సమర్పించాడు. ఐదుగురు కుమారులూ ఒక్కసారే మరణించడంతో ద్రౌపది దారుణమైన దుఃఖాన్ని పొందింది. ద్రౌపది దుఃఖాన్ని చూడలేని అర్జునుడు అశ్వత్థామ మీదకి వెళ్ళాడు.

తన మీదకి వస్తున్న అర్జునుడిని చూసి అశ్వత్థామ భయంతో వణికిపోతూ, గుర్రాలకి ఓపిక ఉన్నంతసేపూ అర్జునుడికి అందకుండా రథం మీదే పరుగులు తీశాడు. చివరికి ఏమీ చెయ్యలేక, పారిపోలేక, ఆపడం ఎలాగో తెలియకపోయినా 'బ్రహ్మశిరోనామకమనే' అస్త్రాన్ని ప్రయోగించాడు. గొప్ప అగ్ని జ్వాలలను విరజిమ్ముతూ వస్తున్న అస్త్రాన్ని చూసి అర్జునుడు దాని గురించి శ్రీకృష్ణుని ద్వారా తెలుసుకున్నాడు. శ్రీకృష్ణుడు "దుర్మార్గుడైన ఆ అశ్వత్థామకు ఆ అస్త్రాన్ని ఉపసంహరించడం కూడా తెలీదు. కనుక అతడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని నువ్వు మళ్ళీ బ్రహ్మాస్త్రాన్నే ప్రయోగించి ఉపసంహరించు" అని అర్జునునికి ఆదేశించాడు.

శ్రీకృష్ణుని ఆజ్ఞ ప్రకారం అర్జునుడు రెండు బ్రహ్మాస్త్రాలనూ ఉపసంహరింప చేశాడు. తరువాత పారిపోతున్న అశ్వత్థామను తరిమి తరిమి పట్టుకుని కట్టి, శిబిరానికి ఈడ్చుకు వచ్చి, అందరిముందు చంపే ప్రయత్నం చేశాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు "అర్జునా! వీడు నిద్రపోతున్న వారిని చంపడం తప్పే. తన జోలికి రానివాళ్ళనీ, నిద్రపోతున్న పసివారిని చంపిన క్రూరుడే వీడు. కానీ **'భయపడే వాడినీ, దిగులుతో మతిపోయిన వాడినీ, ఓడిపోయిన వాడినీ, సాధువై జడత్వంతో తిరిగేవాడినీ, రక్షించమని మొరపెట్టుకునే వాడినీ, స్త్రీలనూ చంపకూడదు'**. క్రూరత్వంతో ఇతరులను చంపేసి, తన ప్రాణాలను రక్షించుకోవాలనుకునే వాడు నరకానికి వెళ్ళి అక్కడ దుఃఖాలను అనుభవిస్తాడు. రాజదండన తప్పించుకుని యమదండానికి గురి అవుతాడు. కనుక వీడిని ఆ యముడికే వదిలెయ్యి" అంటూ అర్జునుడి కోపాన్ని తగ్గించేశాడు. అప్పుడు "ఎంతటి తప్పు చేసినా బ్రాహ్మణుని చంపకూడదన్న ధర్మం" జ్ఞాపకం వచ్చింది అర్జునుడికి. వెంటనే అశ్వత్థామను ద్రౌపది ముందుకు తీసుకొచ్చి నిలబెట్టాడు.

అశ్వత్థామ సిగ్గుతో ద్రౌపది ముఖం చూడలేకపోయాడు. ముఖం పక్కకు తిప్పుకుని, తలవంచుకుని నిలబడ్డాడు. అతడిని చూసి ద్రౌపది గురుపుత్రుడైన అశ్వత్థామకు నమస్కరించి "కుమారుని రూపంలో ఉన్న ఆచార్యుడివై ఉండి కూడా ఏమాత్రం దయలేకుండా మీ తండ్రి దగ్గర చదువుకున్న వారినే చంపేశావు. గురువు శిష్యులను చంపడం ధర్మమేనా?

ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్న పిల్లలను చంపడానికి నీకు చేతులెట్లా వచ్చాయి? పుత్ర శోకంతో గుండెలు పగిలిపోతున్న నాలాగానే నీ తల్లి కూడా అర్జునుడికి బంధీవైన నిన్ను గురించి గుండెలు పగిలేలా విలపిస్తుంటుంది. కనుక నాకు కలిగించినట్లుగా నీ తల్లికి కూడా గర్భశోకం కలగకుండా చూడాలి" అని కృష్ణార్జునులతో అశ్వత్థామను వదలిపెట్టమని చెప్పింది. ఒక్క భీముడు తప్ప మిగిలిన వారంతా ద్రౌపది మాటలను అంగీకరించారు.

భీముడు అశ్వత్థామ మీదకి విజృంభించాడు. ఒక్క గుద్దుతో వీడి తలను వెయ్యి ముక్కలు చేస్తానన్నాడు. ద్రౌపది అడ్డుపడింది. అయినా భీముడు ఆగడం లేదు. అప్పుడు శ్రీకృష్ణుడు తన నాలుగు చేతులలోని రెండు చేతులతో ద్రౌపదిని పక్కకు త్రోసి, రెండు చేతులతో భీముడిని ఆపాడు. "భీమసేనా! నువ్వు అన్నట్లే చెయ్యాలి వీడిని. నిజంగానే వీడిని వదిలిపెట్టకూడదు. కానీ వీడు ఎంత నీచుడైనా బ్రాహ్మణుడై పుట్టాడుగా! 'బ్రాహ్మణో నహంతవ్యః' బ్రాహ్మణుని చంపకూడదు అని వేదం ఘోషిస్తోంది కదా! కాబట్టి నువ్వు శాంతించి, ఈ అశ్వత్థామను వదిలిపెట్టు" అన్నాడు. అర్జునుడితో "ద్రౌపదికీ, నాకూ, భీముడికీ కూడా నచ్చే విధంగానూ, ఇంతకు ముందు నువ్వు చేసిన ప్రతిజ్ఞ నెరవేరే విధంగానూ" చెయ్యమని ఆదేశించాడు. వెంటనే అర్జునుడు అశ్వత్థామపై కత్తి దూసి, అతడి వెంట్రుకలను నరికి, వాటిలో ఉన్న ముడిని తీసుకుని, 'పోరా పో' అని శిబిరంలో నుంచి బయటకి గెంటేశాడు.

తరువాత శ్రీహరి ఆజ్ఞ ప్రకారంగా పాండవులు యుద్ధంలో చనిపోయిన బంధువులందరికీ ఉత్తర క్రియలు జరిపించారు. తరువాత శ్రీకృష్ణుడు దుఃఖితులైన పెద్దలను ఓదార్చి, ధర్మజునికి పట్టాభిషేకం చేయించి, అతడి చేత మూడు అశ్వమేధయాగాలు కూడా చేయించాడు.

## శ్రీకృష్ణుడు ఉత్తరగర్భమును రక్షించుట - కురుపితామహుడు తనువు చాలించుట

తరువాత శ్రీకృష్ణుడు రథమెక్కి ద్వారకకు వెళ్ళబోతున్నాడు. ఇంతలో ఉత్తర "ఏదో కాలాగ్నితో సమానమైన బాణం నా గర్భాన్ని కాల్చడానికి నా మీదకు వస్తోంది. దాని నుండి తప్పించుకోవడం నాకు సాధ్యం కావడం లేదు. నాకు నువ్వే దిక్కు. నువ్వే నన్ను, నా గర్భమును కూడా రక్షించు" అంటూ మొరపెట్టుకుంది. వెంటనే శ్రీకృష్ణుడు చక్రంతో బ్రహ్మాస్త్రాన్ని అడ్డగించి, ఉత్తరనూ, ఆమె గర్భాన్ని కూడా రక్షించాడు. అప్పుడు పాండవులంతా వచ్చి పరమాత్మను ఎంతగానో మెచ్చుకున్నారు. ఎన్ని విధాలుగానో పొగిడారు.

తరువాత బంధువులందరినీ చంపాను గదా అని ఎంతగానో చింతిస్తున్న ధర్మజునికి ఎన్నో విధాలుగా చెప్పారు. ఎవరెన్ని చెప్పినా ధర్మజుని చింత తగ్గలేదు. అప్పుడే బృహదశ్వ, భరద్వాజ, పరశురామాది మహర్షులంతా అక్కడికి వచ్చారు. ధర్మరాజు అందరితో కలిసి బాణాలతో చేసిన శయ్యపై భీష్ముడి దగ్గరకు వెళ్ళాడు. భీష్ముడు మహర్షులందరినీ గౌరవించి,

యథాచితంగా మన్నించాడు. తనకు నమస్కరించిన ధర్మరాజాదులను కూర్చోమని చెప్పాడు.

భీష్ముడు పాండవులతో "మీరు బ్రాహ్మణులనూ, శ్రీహరినీ, ధర్మాన్నీ దిక్కుగా తీసుకున్నారు. అయినా ఎన్నో కష్టాలు పడ్డారు. మీ తండ్రి పోయినప్పటి నుండి ఎన్నో కష్టాలు పడి మిమ్మల్ని మీ తల్లి పెంచింది. సుఖం అంటే ఏమిటో ఆమెకి అసలు తెలియనే తెలియదు కదా! ఆకాశంలో మబ్బులు గాలికి ఒకచోట కలుసుకుంటాయి. అదే గాలికి చెదిరిపోతుంటాయి. అట్లాగే ఈ లోకమంతా కాలానికి వశమై ఉంటుంది. మనుషుల కలయికలు, విడిపోవడాలు కూడా కాలానుగుణంగానే జరుగుతుంటాయి. కాలం ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. కానీ దానిని మాత్రం ఎవరూ దాటి ప్రవర్తించలేరు. అదే దైవతంత్రం. కనుక దాని కోసం చింతించనక్కర్లేదు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అంటారు గదా! అట్లా అందరికీ దిక్కయిన శ్రీమహావిష్ణువే ఈ శ్రీకృష్ణుడు. అయినా యాదవులలో చేరాడు. తనను ఎవరూ గుర్తించకుండా అందరినీ తన మాయతో మోహింప చేస్తున్నాడు. ఈ భగవంతుడి లీలలు శివుడికి, నారదునికి, కపిలుడికి తెలుసు. ఈ భగవంతుని మీరు మేనమామ కొడుకని, దూత అని, సారథి అని, మంత్రి అని, స్నేహితుడు అని, బంధువు అని రకరకాలుగా ఆయా కాలాలకు తగినట్లుగా ఉపయోగించుకుంటున్నారు. అందువలన మీకు తగ్గిందీ లేదు. ఆ శ్రీహరికి పెరిగిందీ లేదు. ఈయన

భక్తవత్సలుడు. కనుకనే తనతోనే ఉండే భక్తులకు సులభంగా దొరకుతుంటాడు.

యోగి ఎవరి యందు మనస్సును నిలిపి, ఎవరి నామాన్ని కీర్తించి, శరీరాన్ని విడిచి పెడతాడో అటువంటి పరమాత్మ నేను ఎప్పుడు ప్రాణాలు విడుస్తానా అని ఎదురు చూస్తూ చిరునవ్వుతో, నాలుగు చేతులతో నాముందే నిలబడి ఉన్నాడు. నా అదృష్టం ఎంత గొప్పదో కదా!" అన్నాడు.

ఆ తరువాత ధర్మరాజు కురుకులపితామహుడైన భీష్ముడి ద్వారా మానవజాతికి అవసరమైన, ఆచరించదగిన, ఉత్తమమైన సాధారణ ధర్మాలనూ, వర్ణాశ్రమ ధర్మాలనూ, ప్రవృత్తి ధర్మాలనూ, నివృత్తి ధర్మాలనూ, దానధర్మాలనూ, రాజధర్మాలనూ, స్త్రీ ధర్మాలనూ తెలుసుకున్నాడు. భీష్ముడిని అడిగి మరెన్నో కథలనూ, ఇతిహాసాలనూ తెలుసకున్నాడు.

ఇంతలోనే యోగీశ్వరులు కోరుకునే ఉత్తరాయణం వచ్చింది. అది గ్రహించిన గంగానందనుడు మాట్లాడటం ఆపేశాడు. తాను శరీరాన్ని వదలిపెట్టడానికి తగిన సమయం ఇదే అని నిర్ణయించుకున్నాడు. బాణాల బాధను మరచిపోయాడు. మనసును మాధవుని మీద నిలబెట్టాడు. కృష్ణుని పొగుడుతూ, అతడినే చూస్తూ, అతడిలోనే కలిసిపోయాడు.

ధర్మరాజు తాతగారికి ఉత్తరక్రియలు జరిపించాడు. తరువాత శ్రీకృష్ణుడిని, ఇతరులందరినీ వెంటబెట్టుకుని హస్తినాపురానికి వచ్చాడు. గాంధారీ ధృతరాష్ట్రుల అనుమతి తీసుకుని రాజ్యపాలనను ప్రారంభించాడు.

## శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళుట - పరీక్షిత్తు పుట్టుట

శ్రీకృష్ణుడు కొంతకాలం ధర్మరాజాదులను ఓదార్చుతూ, రాజ్యపాలన చేయిస్తూ హస్తినలోనే ఉండిపోయాడు. తరువాత అతికష్టం మీద ధర్మరాజాదులను ఒప్పించి ద్వారకకు బయలుదేరాడు. దారిలో అనేక రాజ్యాల రాజులు సమర్పించిన కానుకలను స్వీకరించి, ద్వారకానగరం వచ్చి తన శంఖాన్ని పూరించాడు.

ఆ శంఖధ్వని విన్న ద్వారకావాసులంతా తమ ప్రభువైన శ్రీకృష్ణుడు వచ్చాడని మిక్కిలి సంతోషించారు. అనేక సంబారాలు తీసుకుని ఆ స్వామికి ఎదురువెళ్ళారు. తామంతా తెచ్చిన కానుకలను ఆయనకు సమర్పించారు. శ్రీకృష్ణుడు తన రాకకోసం ఎదురు వచ్చిన యాదవప్రముఖులకు నమస్కరించి, ఆలింగనం చేసుకుని, వారిని సంతృప్తి పరిచాడు. తరువాత వారందరితో కలిసి మహావైభవంగా ద్వారకలోకి ప్రవేశించాడు.

మొట్టమొదటగా తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి, వాళ్ళకు నమస్కరించి, వాళ్ళ ఆశీర్వచనాలు తీసకున్నాడు. తరువాత పదహారు వేల నూట ఎనిమిది రూపాలు ధరించి, అన్ని భవనాల అంతఃపురాలలోకీ ఒక్కసారిగా ప్రవేశించాడు. ఆ అంతఃపురాలలోని కాంతకాలంగా భర్త తన దగ్గరికే ముందుగా వచ్చాడని ఎవరికివారే అనుకున్నారు. సిగ్గుతో భర్తను సమీపించారు. ఆ భామలంతా ఆ జగదీశ్వరుడికి వారివారి భక్తిని ప్రేమతో సమర్పించుకుని ఆయనను అర్చించారు.

ఈ విధంగా సూతుడు చెప్పిందంతా విన్నారు మహర్షులంతా. శౌనకుడు సూతమహర్షిని "తల్లి గర్భంలో ఉన్న శిశువుని శ్రీహరి ఎట్లా బ్రతికించగలిగాడు? అట్లా బ్రతికిన పిల్లవాడు మరణ భయాన్ని వదిలిపెట్టి ఎంతకాలం బ్రతికాడు. ఆయన చరిత్ర ఏమిటి? శుకమహర్షి అతడికి ఎందుకు జ్ఞానోపదేశం చేశాడు? అతడు శరీరాన్ని ఎట్లా వదిలిపెట్టాడు?" వివరంగా చెప్పమని అడిగాడు. శౌనకుని ప్రశ్నలకు సమాధానం చెప్పడం మొదలుపెట్టాడు.

"ధర్మరాజుకి రాజ్యభోగాలనుభవిస్తున్నా, రాజ్యపాలన చేస్తున్నా వాటిపై ఆయన మనసు ఉండేది కాదు. శ్రీహరిసేవ ఎంతగా చేసినా తృప్తి పడేవాడు కాదు. ఇంకా ఏదో చెయ్యలేకపోతున్నాననే అనుకునేవాడు. ఈ విధంగా కాలం గడిచిపోతోంది.

కొంతకాలం గడిచిపోయాక ఉత్తర గర్భంలోని బాలుడికి పదిమాసాలు నిండినాయి. అతడు గర్భంలో ఉండే "ఈ పొట్టలో ఉన్నాను. నాకు దిక్కు ఏది? అశ్వత్థామ వదిలిన బాణపు వేడికి తట్టుకోలేకపోతున్నాను. నన్ను రక్షించేవారు ఎవరూ లేరని అమ్మ అంటుంటే విన్నాను? అసలు రక్షించే తండ్రి ఎవరు? ఈ మంటలు ఎట్లా తొలగిపోతాయి? ఓ దైవమా! ఈ గర్భంలో కలిగే బాధ ఎవరికి తెలుస్తుంది? ఈ మంటలకి నేను మరణించి బైటికి వెళ్ళలేకపోతే, నా తల్లికి వేదన మరింత ఎక్కువౌతుంది గదా! అప్పుడు నా తల్లి కూడా మరణిస్తుంది కదా! మా అమ్మ ఎప్పుడూ శ్రీహరే రక్షిస్తాడు'

అంటూ ఉంటుంది. అది నిజమేనా? సమస్త భూతాలలో ఉన్నవాడు నన్ను చూడడానికి ఇక్కడికి రాడా? లేకపోతే ఇక్కడ లేడా? ఈ మంటల బాణాన్ని తొలగించి, నాకు అభయమియ్యడా? అది వరకు తనకు నమస్కరించినవారిని రక్షించే వాడుగదా! ఎందరినో రక్షించాడు కదా! మరి నా కర్మ ఏమిటో? నన్ను రక్షించడానికి వస్తాడో? రాడో?" అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో భక్తపరాధీనుడైన భగవంతుడు బొటనవేలంత శరీరాన్ని ధరించి, మిక్కిలి తేజస్సుతో గదాధారియై ఆవిర్భవించాడు. గర్భంలోని శిశువు చుట్టూ ఉన్న మంటలని తన గదని త్రిప్పుతూ ఆర్పేశాడు. ఆ శిశువుకి ఆనందం కలిగించాడు. ఎవరో దయామయుడు నన్ను రక్షించాడు అని అనుకుని ఆ శిశువు పరమాత్మను చూశాడు. వెంటనే పరమాత్మ అదృశ్యుడయ్యాడు.

ఆ తరువాత ఒక చక్కని శుభముహూర్తంలో ఉత్తర కుమారుడిని ప్రసవించింది. ధర్మజుడు ఆ పిల్లవాడికి జాతకర్మాదులన్నీ జరిపించాడు. విష్ణువు చేత రక్షించబడ్డాడు కనుక 'విష్ణురాతుడు' అని ప్రసిద్ధిపొందుతాడన్నారు పెద్దలు, బ్రాహ్మణులు. వారంతా ఆ పిల్లవానికి గురించి ధర్మజునితో "శ్రీరామ, శిబి, భరత, ధనుంజయ, కార్తవీర్యుల లాగా లోకోత్తర చరిత్ర గలవాడవుతాడు. గొప్పకీర్తిని సంపాదించి, వంశాన్ని పెంచుతాడు. అశ్వమేధ యాగాలు చేస్తాడు. పాపాకార్యాలు చేసేవారిని పట్టి శిక్షించి కలిదోషాలను

నివారిస్తాడు. తన రాజ్యాన్ని రామరాజ్యం చేస్తాడు. వేదశాస్త్రాలను అనుసరించి ప్రవర్తిస్తాడు. గొప్ప విషయం ఏమిటంటే ఇతడు గొప్ప విష్ణు భక్తి పరాయణుడౌతాడు. చాలా కాలం జీవిస్తాడు. చివరికి ఒక బ్రాహ్మణ కుమారుని శాపం వలన తనకు పాముకాటుతో మరణం సంభవిస్తుందని తెలుసుకుంటాడు. సమస్తమైన బంధాలనూ వదిలిపెట్టి, ముకుందుని పాదపద్మాలనే హృదయంలో నిలుపుకుని, శుకయోగీంద్రుని వలన ఆత్మవిజ్ఞాన సంపన్నుడౌతాడు. గంగాతీరంలో శరీరాన్ని వదిలిపెట్టి, ఏ విధమైన భయమూ లేని లోకానికి చేరుకుంటాడు" అని చెప్పి, సత్కారాలు స్వీకరించి వెళ్ళిపోయారు.

ఆ పిల్లవాడు తన తల్లి కడుపులో ఉండగా తాను చూసిన ఆ భగవంతుడు ఈ విశ్వంలో అంతటా నిండి ఉన్నాడని పరీక్షిస్తూ పరీక్షగా చూసేవాడు. అందుకని ఆ పిల్లవాడిని ప్రజలంతా 'పరీక్షిత్తు' అని పొగిడి, అట్లాగే పిలవడం మొదలుపెట్టారు. అతడు శుక్లపక్ష చంద్రుడిలా పెరిగి పెద్దవాడయ్యాడు.

ధర్మరాజు బంధువులను చంపిన దోషం పోగొట్టుకోడానికి గొప్ప యగాలు మూడు చేశాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడు అర్జునుని తీసుకుని ద్వారకకు వెళ్ళాడు.

తీర్థయాత్రలకు వెళ్ళిన విదురుడు మైత్రేయ మహర్షి దగ్గర ఎన్నో విశేషాలు తెలుసుకుని, ఆత్మ విజ్ఞానాన్ని పొంది హస్తినాపురానికి తిరిగి వచ్చాడు. ధర్మజుడు విదురుని

ఆదరించి, తీర్థయాత్రా విశేషాలు అడిగాడు. విదురుడు తాను చెప్పిదగిన విశేషాలన్నింటినీ ధర్మజునికి చెప్పాడు. తాను శూద్రుడు గనుక చెప్పకూడని దాని గురించి మాట్లాడలేదు.

విదురుడు శూద్రుడుగా పుట్టడానికి కారణం మాండవ్య మహర్షి యమధర్మరాజుని శూద్రయోనియందు పుట్టమని శపించడమే. అందుకనే యముడు శూద్రస్త్రీకి 'విదురుడు' అనే పేరుతో పుట్టాడు. అందుకనే యదువంశం నశించిన విషయం విదురుడు ధర్మజునికి చెప్పలేదు. అందుకని శ్రీకృష్ణుడి నిర్యాణం చెందిన విషయం ధర్మరాజుకి తెలియదు. కనుకనే మనుమడి ఆటపాటలు చూస్తూ, ఆనందంగా రాజ్యపాలనను కొనసాగిస్తున్నాడు ధర్మజుడు.

**విదురుని ఉపదేశం - గాంధారీ ధృతరాష్ట్రుల దేహత్యాగం - ధర్మజునికి నారదుని ఉపదేశం**

ఒక రోజు విదురుడు ధృతరాష్ట్రుడితో "మహారాజా! పుట్టుకతో గుడ్డివాడివైన నీకు వయస్సు పైబడింది. నీ ఇంట నువ్వూ, వదినా మాత్రమే మిగిలారు. తప్పక దాయాదుల పంచలో కాలం గడుపుతూ, శోకంతో కాలం గడుపుతున్నారు. ఇది కూడా ఒక బ్రతుకేనా! ఈ శరీరం శాశ్వతం కాదని తెలుసుకుని, మోహాన్ని వదిలిపెట్టి, మునివృత్తిని స్వీకరించి, ఉత్సాహంతో ఇల్లు వదిలిపెట్టి వెళ్ళినవాడు ముక్తిని పొందుతాడు" అని అన్నాడు.

గాంధారీ ధృతరాష్ట్రులిద్దరూ విదురుడి ఉపదేశాన్ని మెచ్చుకున్నారు. ఒకనాటి రాత్రి గాంధారి, ధృతరాష్ట్రుడు,

విదురుడూ కలిసి ఎవరికీ చెప్పకుండా హిమాలయ పర్వత ప్రాంతవనాలకి ప్రయాణమయ్యారు. తెల్లవారి పెదతండ్రికి నమస్కరించడానికి వచ్చిన ధర్మజునికి ధృతరాష్ట్రాదులు కనపడలేదు. సంజయుడిని అడిగాడు. సంజయుడు "రాత్రి విదురుడు, ధృతరాష్ట్రులవారు చాలా సేపు మాట్లాడుకున్నారు. కానీ వారు ఎక్కడికి వెళ్ళారో తెలియదని" చెప్పాడు. నాకు చెప్పకుండా ముగ్గురూ ఎక్కడికి వెళ్ళారో అని దుఃఖిస్తున్నాడు.

ఇంతలో నారదుడు తుంబురునితో కలిసి ధర్మజుని దగ్గరకు వచ్చాడు. "ధర్మజా! తల్లులెవరు? తండ్రులెవరు? కుమారులెవరు? మిత్రులెవరు? ఇదంతా మాయా ప్రభావమే. నువ్వు ఎవరి కోసమూ చింతించకు. శ్రీకృష్ణుడు ఉన్నన్నాళ్ళూ మీరూ ఇక్కడ ఉండండి. ఆ తరువాత మీకు కూడా ఈలోకంతో ఏమీ పని ఉండదు. ఏమిటి నారదుడు ఇట్లా చెబుతున్నాడని ఆశ్చర్యపోకు. కాలాన్ని తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. ధృతరాష్ట్రుడు విదుర గాంధారులతో కలిసి హిమాలయాలకు వెళ్ళి, అక్కడ నిరాహారదీక్షతో ఉండి చివరి క్షణం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ రోజుకి ఐదవరోజున యోగాగ్నితో శరీరాన్ని తానే దహింపచేసుకుంటాడు. గాంధారి కూడా భర్తతో పాటు అగ్నిలోకి ప్రవేశిస్తుంది. వారి మరణం చూసి విదురుడు దుఃఖిస్తూ తీర్థయాత్రలు చేస్తాడు" అని చెప్పి స్వర్గానికి వెళ్ళిపోయాడు.

## అర్జునుడు ధర్మజునికి కృష్ణ నిర్యాణమును చెప్పుట - ధర్మజుడు మహాప్రస్థానము చేయుట

ధర్మజుడు భీమునితో “ఓషధులు ఒకప్పుడు ఫలిస్తూ మరొకప్పుడు ఫలించడం లేదట. మానవులు కామక్రోధాదులకు లొంగి భయభక్తులు లేకుండా ఉంటున్నారట. లోకవ్యవహారాలన్నీ మోసంతో నిండిపోతున్నాయట. చూడు కాలం ఎంత వింతగా ఉందో! అర్జునుడు ద్వారకకు వెళ్ళి చాలా రోజులైంది. ఈ నెలరోజుల్లో అక్కడి నుండి ఒక్క సమాచారమూ రాలేదు. యాదవులంతా ఎట్లా ఉన్నారో? ఏమిటో? నా మనస్సు ఎదో కీడును సూచిస్తోంది. ఈశ్వరుడు ఏం చేయబోతున్నాడో ఏమో? ఎన్నో చెడు శకునాలు కనిపిస్తున్నాయి. హరి పాదపద్మాలు ఇకపై ఈ భూమి మీదకు రావేమో! నా శరీరంలో ఎడమభుజమూ, ఎడమకన్నూ అదే పనిగా అదురుతున్నాయి. ఈ భూమికి ఏదైనా దురవస్థ వస్తుందో ఏమో! అంటూ చింతిస్తున్నాడు.

ఇంతలో ద్వారకనుండి అర్జునుడు తిరిగి వచ్చాడు. దుః ఖిస్తూ అన్నగారి పాదాల మీదపడిపోయాడు. అతడి దుఃఖానికి కారణమడిగిన ధర్మజునికి శ్రీకృష్ణుడు శరీరాన్ని వదిలేసిన విషయం చెప్పాడు. మౌనంగా ఉండిపోయాడు. ధర్మజుడు కూడా నారదుడి మాటలు జ్ఞాపకానికి తెచ్చుకున్నాడు. స్వర్గానికి వెళ్ళే ప్రయత్నం చేస్తున్నాడు. అంతలోనే కుంతీదేవి యదుక్షయ వార్తవిని, మనసులో శ్రీహరిని నింపుకుని, శరీరాన్ని వదిలేసింది.

ధర్మజుడు కూడా తన మనుమడైన పరీక్షిత్తునికి పట్టాభిషేకం చేసి, విరక్తిని పొంది, ప్రజాపత్యమనే యజ్ఞం చేసి, ఆ అగ్నులను తనలోకి నింపుకుని, ఉత్తర దిశకు వెళ్ళాడు. భీమార్జున, నకుల సహదేవులూ, ద్రౌపది కూడా ఈ భౌతికమైన శరీరాలను వదిలిపెట్టి వైకుంఠానికి చేరుకున్నారు. విదురుడు కూడా ప్రాణాలను వదిలిపెట్టి పితృవర్గంతో కలిసి దండధరుడై తన లోకానికి చేరుకున్నాడు.

తరువాత పరీక్షిత్తు మహాభక్తుడై ధర్మబద్ధంగా రాజ్యమేలుతూ, ఉత్తరుడి కూతురైన ఐరావతిని వివాహం చేసుకున్నాడు. అతడికి ఆమె యందు జనమేజయాదులు కలిగారు. పరీక్షిత్తు కృపాచార్యుడి శిష్యుడై, గంగాతీరంలో నిజరూపాలతో హవిస్సులందుకుంటున్న దేవతలను చూస్తూ మూడు అశ్వమేధయాగాలు చేశాడు. తరువాత దిగ్విజయ యాత్ర మొదలుపెట్టాడు. ఆ యాత్రలో ఒకచోట గోవుల జంటను తన్నుతున్న చండాలస్వరూపుడైన రాజర్షులతో ఉన్న కలిని పట్టుకుని నిగ్రహించాడు" అని సూతుడు చెప్పాడు.

## ధరణి - ధర్మదేవతల సంవాదం - కలిపురుషుడు ధర్మదేవతను తన్నడం

శౌనకుడు సూతమహర్షిని "ఆ చండాలస్వరూపుడు గోవుల జంటను ఎందుకు తన్నాడు? పరీక్షిత్తు కలిని ఎట్లా నిగ్రహించగలిగాడు?" అని అడిగాడు. అప్పుడు శౌనకుని ప్రశ్నలకు సూతమహర్షి ఈ విధంగా సమాధానం చెప్పడం మొదలుపెట్టాడు.

దిగ్విజయయాత్రకు బయలుదేరిన పరీక్షిత్తు ఇలావృతం మొదలు భారతవర్షం దాకా, ఉత్తరమేరు భూములనూ జయించాడు. ఆయా ప్రాంతాలలోని పూర్వరాజుల చరిత్రలను విన్నాడు. శ్రీకృష్ణపాండవుల అనుబంధాన్ని కూడా విని, ఆ శ్రీహరి పట్ల భక్తిని మరింతగా పెంచుకున్నాడు.

అదే సమయంలో ధర్మదేవత ఎద్దు రూపాన్ని ధరించి ఒకే పాదంతో కుంటుతూ నడుస్తోంది. భూదేవి గోరూపాన్ని ధరించి అతనికి దగ్గరలోనే కన్నీరు కార్చుతూ లేత గడ్డిని తింటున్నది. అది చూసిన వృషభం గోవుతో.."నువ్వు ఎందుకు కన్నీరు కారుస్తున్నావు. ఒంటికాలితో నడుస్తున్న నన్ను దుర్మార్గులు పట్టి బంధిస్తారనా? యాగాలు సాగకపోతే దేవతలకు హవిస్సులు ఉండవనా? ప్రజాపాలనలో న్యాయానికి స్థానం ఉండదనా? మానవులు తినడం, తాగడం, నిద్రపోవడం మొదలైన పనులు తప్ప ధర్మ కార్యాలు చెయ్యరనా? ఇన్నాళ్ళూ నీ మీద నడియాడిన శ్రీహరి ఈనాడు కనపడడం లేదనా? ఇకపై ఏ దుర్మార్గుడు రాజు అవుతాడో అని భయపడా? ఇకపై ఏ కష్టాలు పడాల్సి వస్తుందో అనా? కాలవశాన శ్రీకృష్ణుడు దూరమవగానే దేవతలకు కూడా ముచ్చటగా ఉండే నీ ఒప్పందం తప్పిపోయిందనా?" అన్నది.

అప్పుడు భూదేవి ధర్మదేవతతో "అదివరకు నాలుగు పాదాలతో నడిచే నువ్వు శ్రీకృష్ణుడు లేకపోవడం వల్లనే కదా ఒంటికాలపై నడుస్తున్నావు. ఆ జగన్నాథుడు లేకపోవడంతో కలి ప్రేరణ పెరిగింది. దాంతో జనులు పాప బుద్ధులయ్యారు

గదా! అని వాళ్ళని చూసి చింతిస్తున్నాను. దేవతలకూ, ఋషులకూ, పితృదేవతలకూ, నీకూ, నాకూ బుద్ధిమంతులకూ, అనేక వర్ణాశ్రమాలకూ, గోవులకూ బాధే కదా! అని ఆలోచిస్తూ దుఃఖిస్తున్నాను. ఇకపై నాకు శ్రీకృష్ణచరణార వింద స్పర్శ ఉండదు గదా అని దుఃఖిస్తున్నాను" అన్నది.

ఈ విధంగా భూదేవి, ధర్మదేవతలు గోవృషభరూపాలను ధరించి మాట్లాడుకుంటున్న చోటికి పరీక్షిత్తు మహారాజు వచ్చాడు.

ఇంతలోనే కాలమంతటి కోపం గలవాడూ, దండమును ధరించిన వాడూ, రాజు ఆకారంలో ఉన్న ఒక చండాల స్వరూపుడు అక్కడికి వచ్చి ఒంటికాలిమీద నిలబడిన ధర్మదేవతని నేలపై చతికిలబడేటట్లుగా తన్నాడు. వాడి దౌర్జన్యం చూసేసరికి పరీక్షిత్తుకి కోపం వచ్చింది. వెంటనే ధనస్సు ఎక్కుపెట్టి 'నీకు ఏ విధమైన అపకారము చెయ్యని ఈ సాధుప్రాణిని ఎందుకు తన్నావు? నేను పాలించే ఈ భూమిలో ఎప్పుడూ, ఎక్కడా, ఎవరూ ఏ విధమైన నేరాలూ చెయ్యకూడదని నీకు తెలియదా? నువ్వు చేసిన తప్పుకి నేను నిన్ను శిక్షించకుండా వదిలిపెట్టను. కృష్ణార్జునులే లేరు గదా! అని శిక్షించకూడని వారిని కొట్టకూడని వాళ్ళని కొడుతున్నావా? కనుక నువ్వు దండించదగినవాడివి" అన్నాడు.

తరువాత వృషభాన్ని చూస్తూ "ఓ గోరూప దేవా? ఈ కురురాజు పాలిత భూమిలో అధర్మంతో విడిచే కన్నీటిని

ప్రజలు చూడరు. ఈ దుర్మార్గుడిని ఇప్పుడే, ఇక్కడే, నీ ముందే సంహరించి, నిన్ను నాలుగుపాదాల మీద నడిచేటట్లు చేస్తాను" అన్నాడు. గోవుతో "ఓ శుభప్రదాయినీ! గోపాలుడు ఎక్కడికి వెళ్ళాడో అని కన్నీరు కారుస్తున్నావా? వీడికి భయపడకు. ఈ నీచుడిని ఇప్పుడే సంహరిస్తాను. బ్రహ్మదేవుడు రాజులను, మంచివారిని రక్షించడానికీ, దుర్మార్గులను శిక్షించడానికేగా సృష్టించాడు. కనుక ఆ పరమధర్మాన్ని పాటించి నేను మిమ్మల్ని రక్షిస్తాను" అన్నాడు.

ధర్మదేవత "సత్యయుగం తపస్సూ, శౌచమూ, దయా, సత్యము అనే నాలుగు పాదాలతో నడిచేది. ఆ ధర్మదేవతకి త్రేతాయుగంలో తపస్సు అనే పాదమూ, ద్వాపరయుగంలో శౌచము అనే పాదమూ, కలిలో దయ అనే పాదమూ కుంటుపడతాయి. కలియుగం గడిచే కొద్దీ సత్యమనే నాల్గవ పాదమూ కుంటుపడిపోతుంది. నా పరిస్థితి ఇట్లా ఉండగా, భూదేవి శ్రీకృష్ణపాద స్పర్శకు దూరమై, నీచులు ప్రభువులై తనని శాసిస్తారు కదా! అని దుఃఖిస్తోంది" అని పరీక్షిత్తుతో అన్నది.

వెంటనే పరీక్షిత్తు కత్తి దూసి కలిని చంపబోయాడు. అంతలోనే కలి రాజరూపాన్ని వదిలిపెట్టి భయపడిపోతూ పరీక్షిత్తు పాదాల మీద పడ్డాడు. "కోపంతో కూడిన నీ చూపుకే చచ్చాను. ఇంకా నన్ను చంపడమెందుకు? నన్ను రక్షించి నా ప్రాణాలను నిలబెట్టు" అని వేడుకున్నాడు.

పరీక్షిత్తు కలిపురుషునితో "శరణు వేడావు కనుక బ్రతికిపోయావు. ఇకపై దౌర్జన్యం చెయ్యడం మానేసి బ్రతకు

గడుపు. నువ్వు పాపులకు చుట్టానివి. కనుక నా రాజ్యంలో నీకు చోటు లేదు. కనుక ఈ భూమిపై ఎక్కడా ఉండకు. దూరంగా వెళ్ళిపో" అని కలిని శాసించాడు.

అప్పుడు కలి "నాకు ఎక్కడ చూసినా నువ్వే దండధారివై కనిపిస్తున్నావు. మరి నేను ఎక్కడ ఉండాలో నువ్వే చెప్పు" అని అడిగాడు. అప్పుడు పరీక్షిత్తు "నువ్వు ప్రాణి వధా, స్త్రీ, జూదమూ, మద్యపానము" అనే నాలుగింటిలోనూ, అసత్యం, మదం, కామం, హింస, వైరం అనే ఐదుచోట్ల మొత్తం తొమ్మిది ప్రదేశాలలో మాత్రమే ఉండు. మరెక్కడ ఉండకు" అని శాసించాడు.

ధర్మదేవతకు తపస్సూ, శౌచమూ, దయా అనే మూడు పాదాలనూ ఇచ్చి, భూదేవికి సంతోషం కలిగించి, పరీక్షిత్తు హస్తినకు వెళ్ళి ధర్మబద్ధుడై పూర్వం లాగే రాజ్యపాలన చేశాడు.

"కలియుగంలో చేస్తేనే గానీ పాపం అంటదు. కానీ ఈ పని చెయ్యాలి అని అనుకోగానే పుణ్యం మాత్రం వస్తుంది. కనుక మోసం లేదని పరీక్షిత్తు కలిని సంహరించకుండా వదిలిపెట్టేశాడు" అని చెప్పాడు.

అప్పుడు శౌనకాదిమునులంతా "పరమ భాగవతోత్తముడైన పరీక్షిన్మహారాజు గురించి వివరంగా చెప్పు. ఆ రాజు శుకయోగి ద్వారా భాగవతం విని ఎట్లా తరించాడో కూడా మాకు వినిపించు" అని సూతమహర్షిని ప్రార్థించారు. సూతుడు "ఆహా! విష్ణు కథలు వినిపించే భాగ్యం నాకు లభించింది. కనుక నాకు తెలిసిన విషయమంతా దాచకుండా చెప్తాను" అని అన్నాడు మహర్షులతో.

## శృంగి పరీక్షిన్మహారాజును శపించుట - పరీక్షిత్తు ప్రాయోపవేశం చేయుట

ఒకరోజు పరీక్షిత్తు వేటకు వెళ్ళాడు. చాలాసేపు వేటాడాడు. ఆ శ్రమ వలన అతనికి చాలా దాహం వేసింది. చల్లని నీటి కోసం తిరిగి తిరిగి చివరికి ఒక తపోవనంలోకి వెళ్ళాడు. ఆ వనంలో శమీక మహర్షి సమాధి నిష్ఠలో ఉన్నాడు. పరీక్షిత్తు ఆ విషయం గమనించలేదు. మహర్షి ఎదురుగా నిలబడి "చాలా సేపు వేటాడి అలసి, దాహం తీర్చుకుందామని వచ్చాను. చల్లని నీరు ఇచ్చి నా దాహం తీర్చండి" అన్నాడు. కానీ బయటి ప్రపంచపు తెలివిలో లేని ఆ మహర్షి రాజు మాటలకు బదులు చెప్పలేదు. అంతే పరీక్షిత్తుకి కోపం వచ్చింది.

"ఈ బ్రాహ్మణుడికి ఎంత గర్వమో! మహారాజునైన నేను అడుగుతుంటే సమాధానం చెప్పడం లేదు. పోనీ మౌన నియమంతో ఉంటే మాట్లాడకుండా లేచి, నీరిచ్చి , నా దాహం తీర్చచ్చు కదా! లేదా ఏ పళ్ళైనా ఇవ్వచ్చు కదా! ఆయన తన తపస్సులో, తపస్సుతో అంతటి గొప్పవాడయ్యాడా? దాహంతో ఉన్నవాడికి నీరు ఇవ్వడం అనేది ఎంత పరమధర్మం. ఈ ముని నా దాహం తీర్చడెందుకు?" అంటూ కోపంతో చుట్టూ చూశాడు. దగ్గరలో చచ్చిన పాము పడి ఉంది. తన ధనస్సు యొక్క కొనతో ఆ పామును తీసి, తపోనిష్ఠలో ఉన్న మహర్షి మెడలో వేసి, తన నగరానికి వెళ్ళిపోయాడు.

ఈ జరిగిన విషయమంతా ముని బాలకులు శమీక మహర్షి కుమారుడైన శృంగికి చెప్పారు. వెంటనే శృంగి కోపంతో మండిపడుతూ, విసురుగా వెళ్ళి, కౌశికి నదిలోని నీటిని ముట్టుకుని, "నా తండ్రి మెడలో పొగరుతో పాముని వేసిన రాజు శివకేశవుల చాటున దాక్కున్నా సరే, ఈ రోజు నుండి ఏడవనాడు తక్షకుడనే పాము యొక్క విషాగ్ని జ్వాలల్లో మాడి చస్తాడు" అని శపించి, తండ్రి దగ్గరికి వచ్చాడు. తండ్రి భుజం మీద పాముతో ఉండడం చూశాడు. అది తియ్యడం చేతకాక గట్టిగా ఏడవసాగాడు.

ఆ ఏడుపుకి శమీక మహర్షి సమాధిలో నుండి బయటికి వచ్చాడు. నెమ్మదిగా కళ్ళు తెరిచి, తన భుజంపై వేలాడుతున్న పాముని చూసి, తీసి పడేశాడు."మనం ఎవరికీ ఏ విధమైన అపకారమూ చెయ్యం గదా! నా మీదకి పాము ఎట్లా వచ్చింది..నువ్వు ఎందుకు ఏడుస్తున్నావని" కుమారుని అడిగాడు. శృంగి విషయమంతా చెప్పాడు. అంతా విన్న మహర్షి కుమారునితో "అంత చిన్న తప్పు చేసిన మహారాజుకి అంత పెద్ద శాపం పెట్టావా! మంచినీళ్ళ కోసం ఎవరైనా వస్తే భక్తితో గౌరవించి, వారి దాహం తీర్చి పంపించాలి. అంతేగానీ శపించవచ్చా?' అంటూ దుఃఖించాడు. తరువాత ఒక శిష్యుని పిలిచి "మహారాజు దగ్గరకు వెళ్ళి, పిల్లవాడు చిన్నతనంతో శాపం పెట్టాడని, శాపం విషయం వివరంగా చెప్పి, ఏదో ఒక పని చేసి మహారాజుని తన ప్రాణాలను రక్షించుకొమ్మని చెప్పిరా" అని అతడిని రాజు దగ్గరకు

పంపించాడు. తాను నీళ్ళు ఇవ్వలేకపోయానే అని చింతించాడే తప్ప శమీకుడు కుమారుని కోపగించుకోలేదు.

పరీక్షిత్తుకి విషయం అంతా తెలిసింది. తాను కూడా తిరిగి శృంగిని శపించగలడు. అయినా శపించకుండా ఊరుకున్నాడు. ఏది ఏమైనా ఏడవరోజుకి తనకు చావు తప్పదని నిశ్చయించుకున్నాడు. రాజ్యాన్ని వదిలేసి, నిరాహార దీక్షను అవలంబించాడు. గంగా ప్రవాహంలోనే శరీరాన్ని వదలిపెట్టాలని నిశ్చయించుకుని, మనస్సును శ్రీహరి పాదపద్మాల యందు లగ్నం చేసి, ఆ గంగానదీ తీరాన ప్రాయోపవేశం చేయాలనుకున్నాడు.

ఈ వార్త అత్రి వశిష్ఠ విశ్వామిత్రాది మహర్షులందరికీ తెలిసింది. వెంటనే దేవర్షుల నుండి సమస్త ఋషిజాతులంతా అక్కడికి వచ్చారు. పరీక్షిత్తు వారందరినీ చూసి, నమస్కరించి, తాను చేసిన పాపకార్యం చెప్పి, ఆ పాపం నశించే ఉపాయము తెలియ చెయ్యండని" ప్రార్థించాడు. తన కుమారుడైన జమేజయుని గంగాతీరానికి రప్పించి, మునుల సమక్షంలో రాజ్యభారం అతడికి అప్పగించాడు. ఏకాగ్రమైన, స్థిరమైన మనస్సుతో శ్రీహరి పాదాలే ధ్యానం చేస్తూ గడపసాగాడు. వెంటనే స్వర్గం నుండి దేవతలంతా రాజుపై పూలవాన కురిపించారు.

పరీక్షిత్తు "మహర్షులారా! నేను బ్రతికి ఉండే ఈ ఏడురోజుల్లోనే ఈ సంసారం మీద ఉండే చింత నశించి, మోక్షం పొందడానికి ఏదైనా మార్గం ఉపదేశించండి. మీ

అనుగ్రహంతో నేను మళ్ళీ మళ్ళీ పుట్టవలసిన దుఃఖాన్ని అనుభవించకుండా సుఖపడతాను” అంటూ ప్రార్థించాడు. రాజుకి ఏమి ఉపాయం చెప్పాలా? అని మునులంతా ఆలోచిస్తున్నారు.

### పరీక్షిత్తుకి భగవదనుగ్రహం కలగడం - శుకమహర్షి రావడం

ఊరకరారు మహానుభావులు అంటారు. భగవంతుని అనుగ్రహమే మహాత్ముల రాకకు సూచన. పరీక్షిత్తుని భగవంతుడు అనుగ్రహించదలుచకున్నాడు. అందుకే ఆయన దగ్గరకు శుకమహర్షి వచ్చాడు. రాజు శుకమహర్షిని, పూజించి, గౌరవించాడు. “నా అదృష్టం కొద్దీ మీరే నా దగ్గరకు వచ్చారు. పావన మూర్తులై మీరు సరి అయిన సమయానికే వచ్చారు. నాకు మోక్ష మార్గం ఉపదేశించమని” రాజు శుక మహర్షిని వినయంతో ప్రార్థించాడు.

**శ్రీమద్భాగవతంలోని ప్రథమ స్కందం పరిసమాప్తం.**

## ద్వితీయ స్కందం

### శుకుడు పరీక్షిత్తుకి మోక్షమార్గముపదేశించుట - భక్తి మార్గమును ప్రబోధించుట

సూతమహర్షి శౌనకాది మమర్షులకు ఈ విధంగా చెప్తున్నాడు. అప్పుడు శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుతో ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

“మహారాజా! వినదగిన విషయాలు చాలా ఉన్నాయి. కానీ వాటిలోకెల్లా నువ్వు అడిగిన విషయం చాలా

ముఖ్యమైనది. సంసారులైన మానవులు ఆత్మతత్త్వాన్ని తెలుసుకునే ప్రయత్నం చెయ్యరు. ఎప్పుడూ విందులు, వినోదాలు, భార్యాబిడ్డలు, బంధుమిత్రులు, పశువులు, ధనం, శరీరం అంటూ అవే శాశ్వతం అనుకుంటూ కాలం గడుపుతూనే మరణిస్తారు. చావు తప్పదని తెలిసినా కూడా అప్పుడే ఏం చెయ్యాలో అనేదాని గురించి ఏమాత్రం పట్టించుకోరు. ఈ చావు పుట్టకల నుండి బయట పడాలనుకునేవాడు సర్వాత్మకుడూ, మహా వైభవం కలిగినవాడైన శ్రీమహావిష్ణువు గురించి వినాలి. ఆయననే ఆరాధించాలి. ధ్యానించాలి. అట్లా చేసినవాడికి మళ్ళీ పుట్టడం అనేది ఉండదు.

పూర్వం ఖట్వాంగమహారాజు తన శక్తియుక్తులతో ధర్మబద్ధంగా సప్తద్వీపాలనూ పాలిస్తున్నాడు. ఒకప్పుడు దేవదానవ యుద్ధంలో దేవతల కోరిక మేరకు వాళ్ళకి సహాయం చేశాడు. దేవతలు సంతోషించి ఖట్వాంగుని వరం కోరుకోమన్నారు. "నాకు ఇంకా ఎంతకాలం బ్రతికే అవకాశం ఉందో చెప్పమని" అడిగాడు దేవతలను. దేవతలు "నీకు ఒక్క ముహూర్తకాలం మాత్రమే బ్రతికే అవకాశం ఉంది" అని చెప్పారు. వెంటనే ఖట్వాంగమహారాజు ఆకాశమార్గం ద్వారా భూలోకానికి వచ్చి, తన రాజ్యాన్నీ, సంపదలనూ వదిలేసి, ఏకాగ్రమైన మనస్సుతో హరిసంకీర్తన చేస్తూ భయరహితుడై మోక్షాన్ని పొందాడు.

రాజా! నీకు ఏడురోజుల కాలం గడిస్తే గానీ మరణం రాదు. ఈ లోపల నువ్వు మోక్షాన్ని సంపాదించుకోవచ్చు. చావు వచ్చేస్తోందని భయపడనవసరం లేదు. మొట్టమొదట సంతానం, భార్య, ధనాదుల మీద ఉన్న మోహాన్ని వదలుకోవాలి.

పూర్వం బ్రహ్మదేవుడు భక్తి వల్లనే మోక్షం లభిస్తుందని నిశ్చయించుకుని, ఆ మార్గాన్నే అనుసరించి జనార్ధనుని ఆశ్రయించాడు. ఈశ్వరుడు ఆత్మ రూపంలో సమస్త ప్రాణులలోనూ ఉంటాడు. బుద్ధి మొదలైన లక్షణాలకు కనిపిస్తూ, భక్తవాత్సల్యంతో నమస్కరించదగిన వాడౌతాడు. ఆత్మస్వరూపుడైన ఆ శ్రీహరి కథలను వినేవారు ఆయన పాదాల దగ్గరకే చేరుకుంటారు. తత్త్వనిష్ఠుడైన వాడు మాత్రం మోక్షాన్నే కోరుకుంటూ, తన మనస్సులో ఆ పరమపురుషుడినే నిలుపుకుని సేవిస్తూ కాలం గడుపుతారు. శ్రీహరిని సేవిస్తే నిర్మలమైన జ్ఞానమూ, విరక్తీ, ముక్తీ కూడా లభిస్తాయి. ఆ విష్ణుకథలను విని ఆనందించని వాళ్ళు ఉంటారా?"

"శుకయోగి ఏం కోరుకున్నాడు? శుకయోగి ఆ పరీక్షిత్తుకి ఏయే పుణ్యకథలు వినిపించాడు..? అవన్నీ మాకూ వినాలని ఉంది అన్నాడు సూతుడితో శౌనకుడు. సూతుడు "పుట్టకముందే పరమాత్మను చూడగలిగిన ఆ రాజు ఇంకేం కోరుకుంటాడు? వాసుదేవపరాయణుడైన శుకుడు పరీక్షిత్తుకి ఏం చెప్పాడో చెప్తాను వినండి" అన్నాడు.

"ప్రేమతో, భక్తితో, శ్రద్ధతో విష్ణుకథలు వినేవాళ్ళ జోలికి ఎవరూ రారు. రాలేరు. అట్లా విష్ణుకథలు విననివాళ్ళ ఆయుర్దాయాలను సూర్యుడు తన ఉదయాస్తమయాలతో హరించకు పోతాడు. ఈ విషయం తెలియని అజ్ఞాని "నేను చాలాకాలం బ్రతుకుతాను" అని భ్రమ పడుతుంటాడు. భగవంతుడు తనకిచ్చిన జీవితకాలాన్ని ఆయన కోసం కాక భార్యాబిడ్డలు, ధనము, బంధుమిత్రాదుల కోసం వినియోగిస్తాడు. చివరికి యమభటులు వచ్చి తీసుకు వెళ్ళేటప్పుడు... అయ్యో అందరికోసం అన్నీ చేశాను. కానీ నాకోసం ఒక్కపుణ్యకార్యమైనా చేసుకోకుండా పాపబుద్ధితో వ్యవహరించాను" అంటూ దుఃఖిస్తాడు. చేతులు కాలాక ఆకుల పట్టుకున్నట్లు అంతా అయిపోయినాక దుఃఖించి ఏం ప్రయోజనం?

కాబట్టి బ్రతికి ఉండగానే శ్రీహరి పాదాలను ఆశ్రయించి, ఆరాధించి ఈ సంసారసముద్రాన్ని దాటాలి" అని చెప్పాడు.

శుకుడు చెప్పిన మాటలు విన్న ఉత్తరానందనుడు సమస్త విషయాలపై విరక్తి పొంది, మనస్సును శ్రీహరి పాదారవిందాల యందు లగ్నం చేసి ఆయనతో "ఎంతసేపు విన్నా ఇంకా విష్ణు కథలు వినాలనే ఉంది. ఎప్పుడూ ఒక్కడుగా ఉండే ఆ శ్రీహరి అనేక రూపాలు ధరించి ఎందుకు సంచరించాడు? అట్లా సంచరించకపోతే ఆయనకు వచ్చే నష్టం ఏమిటి?" వివరంగా చెప్పమని కోరాడు.

## నారదుని సందేహం - చతుర్ముఖ బ్రహ్మ సమాధానం

ఒకసారి నారదుడు తన తండ్రి అయిన బ్రహ్మదేవునితో "తండ్రీ! నువ్వు నాలుగు ముఖాల గల గొప్పవాడివి. దేవతలందరి కంటే పెద్దవాడివి. నాలుగు వేదాలూ నీ ముఖాల్లోనే శోభిల్లుతుంటాయి. లోకజనని సరస్వతి నీకు భార్య. నీకు అన్ని విషయాలు అరచేతిలో ఉసరికాయలే. నాకు ఒక సందేహం వచ్చింది. అది నువ్వే తీర్చాలి. ఒకపని చెయ్యాలని అనుకున్నప్పుడు ఆ చేసే విధానాన్ని అనుగ్రహించేవాడు ఎవరు? ఆ విధానానికి ఆధారం ఏమిటి? దానికి కారణం ఏమిటి? నువ్వు నడిపించే ఈ సంసారానికి అంతు కనిపించదేమిటి? నేను నువ్వు మాత్రమే గొప్పవాడివి అనుకుంటున్నాను. నీకంటే పైన ఎవరైనా ఉన్నారా? ఉంటే అందరికీ అధికారిగా ఉన్నారా? ఏం లాభం కోరుకుని నువ్వు ఈ లోకాలను సృష్టిస్తున్నావు?" అని అడిగాడు.

బ్రహ్మదేవుడు "కుమారా! ప్రకృతిని నా అంతట నేనే సృష్టించలేదు. ఈశ్వరుని ఆజ్ఞ ప్రకారంగానే సృష్టించాను. నాకు ఆ సామర్థ్యాన్ని అనుగ్రహించిందీ ఈశ్వరుడే. నేనే లోకేశ్వరుడి ననుకుంటూ నాకే సమస్కరించే వారిని చూస్తే నాకు నవ్వూ, కోపమూ రెండు వస్తాయి. ఈ సమస్తానికీ కారణం విష్ణుమాయ మాత్రేమ సుమా! హరికానిది ఈ లోకంలో ఏదీ లేదు. ఈ సమస్త లోకాలకూ, నాకూ, నీకూ, మాయకూ, సమస్త ప్రాణులకు నాయకుడూ, ఈశ్వరుడూ, అనంతుడూ అయిన ఆ హరి ఒక్కడే అధిపతి. ఈ సమస్తానికీ

ఆధారమూ అతడే. నిరంతరం నేను ఆయన ధ్యానంలోనే ఉంటాను కనుక నేను మాట్లాడినదంతా నిజమే అవుతుంది. నేను ఆయనకు కుమారుడినే. అయినా నా పుట్టుక గురించి నాకే తెలియదు. అటువంటిది మరి ఆ పరమేశ్వరుని గురించి తెలుసుకోగలనా?" అని చెప్పాడు నారదుడికి.

## శ్రీమన్నారాయణుని లీలావతార వర్ణనం - లీలావతార విశేష వైభవ వివరణ

నిరంతరం ఇతర విషయాలు వినడం వలన శూన్యమైన చెవులలో శ్రీహరి యొక్క దివ్య కథామృతాన్ని నింపి ధన్యుడవు కావాలి.

హిరణ్యాక్షుడు భూమండలాన్నంతా చాప చుట్టినట్టుగా చుట్టి తీసుకుపోతున్నప్పుడు శ్రీహరి " యజ్ఞవరాహరూపాన్ని" ధరించి, అతడిని సంహరించి లోకాలను రక్షించాడు. స్వాయంభువుని కుమార్తె ఆకూతికీ, రుచిప్రజాపతికీ హరి "సుయజ్ఞునిగా" పుట్టి, దక్షిణ అనే ఆమె యందు దేవతలను పుట్టించి, ఇంద్రుడై, ఉపేంద్రుడై, సమస్త లోకాల ఆర్తినీ హరించాడు. అప్పుడు స్వాయంభువ మనువు సుయజ్ఞుని "హరి" అని కీర్తించాడు. కనుక ప్రజాపతికీ "కపిలుడు" అనేపేరుతో పుట్టడు. శ్రీహరిని చేరడానికి సులవైన మార్గాన్ని తల్లికి ఉపదేశించాడు. పుత్రసంతానం కోసం తపస్సు చేసిన అత్రిమహర్షికి "నేను నీకు నన్ను ఇచ్చుకుంటున్నాను" అని చెప్పి, "దత్తాత్రేయుడై" పుట్టి, మహర్షిగా ప్రసిద్ధిపొంది హైహయులందరినీ అనుగ్రహించాడు. కల్పం ప్రారంభంలో

విశ్వాన్ని సృష్టించాలనుకుని తపస్సు చేస్తూ "సన" అని అన్నాను. అప్పుడు "సనక, సనంద, సనత్కుమార, సనత్సుజాతులనే" పేర్లతో నలుగురు నాకు మానసపుత్రులై పుట్టి, ఆత్మీయతత్వాన్నీ, సంప్రదాయ పద్ధతినీ లోకమంతటా ప్రచారం చేశారు. నలుగురిగా పుట్టినా వాళ్ళలో ఉన్న విష్ణు కళలతో వాళ్ళు నలుగురూ ఒక్కటిగా ఉన్నవాళ్ళే. ధర్ముడికి దాక్షాయణి అనే స్త్రీ యందు మహాతపోనిష్ఠులైన "నరనారాయణులుగా" ఉద్భవించారు. వీళ్ళు కామక్రోధాలను రెండింటినీ జయించిన మహాత్ములు. ఉత్తానపాద మహారాజుకి సునీతి అనే రాణియందు నారాయణుడు "ధ్రువుడై" పుట్టి, తనను తిరస్కరించిన సవతి తల్లిపై రోషంతో అడవులకు వెళ్ళి, గొప్ప తపస్సు చేసి, సర్వోన్నత శరీరంతో ఉండి ఇప్పటికీ వెలుగొందుతూ నిలిచి ఉన్నాడు. వేనుడనే రాజు మరణించగా అతడి శరీరం నుండి విష్ణ్వంశతో మహాత్ముడైన "పృధువుగా" పుట్టి, భూదేవిని గోవుగా చేసి, అనేక అమూల్యమైన వస్తువులను పితికి లోకమంతటినీ భాగ్యవంతం చేశాడు. సుదేవికీ అగ్నిధ్రునికీ పుట్టిన నాభివలన మేరుదేవి యందు "వృషభుడు" అనే పేరుతో ఉద్భవించాడు శ్రీహరి. ఒకప్పుడు నేను చేస్తున్న యజ్ఞంలో బంగారు రంగుతో "యజ్ఞపురుషుడిగా" ఆవిర్భవించాడు శ్రీమన్నారాయణుడు. యుగాంత సమయంలో వైవస్వత మనువుకు "మత్సరూపంలో" (చేపగా) సాక్షాత్కరించి సమస్త జీవులకూ ఆశ్రయింప దగినవాడై, నేను పోగొట్టుకున్న వేదాలను నాకు

తెచ్చి యిచ్చాడు. దేవదానవులు పాలసముద్రాన్ని చిలికినప్పుడు, మందరపర్వతం సముద్రంలో మునిగిపోకుండా ఉంచడం కోసం "కూర్మరూపుడై" (తాబేలు) అవతరించి అమృతాన్ని ఉద్భవింపచేశాడు. లోకకంటకుడైన హిరణ్యకశిపునికి "నృసింహ" (నరసింహ) రూపంలో ప్రత్యక్షమై, అతడిని సంహరించి, అతడి పుత్రుడు, తన భక్తుడు అయిన బాలప్రహ్లాదుని రక్షించాడు. గజేంద్రుడు మొసలి కాటుకిగురియై మొరపెట్టుకున్నప్పుడు వైకుంఠంలో నుండి ఉన్నవాడు ఉన్నట్లుగా "ఆదిమూలావతారుడై" దిగి వచ్చి మొసలిని సంహరించి గజేంద్రుని కాపాడాడు. "మనువు" గా అవతరించి చక్రాన్ని చేపట్టి దుష్టులైన రాజులను సంహరించి శిష్టులను కాపాడాడు. ఆ పరమేశ్వరుడే "హంసావతారుడై" నీ భక్తికి మెచ్చి, నీకు మహాభాగవత పురాణాన్ని ఉపదేశించాడుగా! "ధన్వంతరిగా" అవతరించి తన పేరు తలుచుకున్న వారికి రోగనివారణం చేస్తూ ఆయుర్వేదాన్ని సృష్టించాడు. "పరశురాముడై" గొడ్డలి చేతబట్టి దుష్టులైన, సాధుకంటకులైన హైహయవంశపు రాజులను ఇరవై ఒక్కసార్లు దునుమాడాడు. ఓ నారదా! పరమ దుర్మార్గులై, మూడులోకాలనూ హింసిస్తున్న రావణ కుంభకర్ణులను సంహరించడం కోసం సూర్యవంశంలో దశరథమహారాజుకు కుమారునిగా "శ్రీరాముడిగా" అవతరించాడు. రాక్షస బాధను తట్టుకోలేక భూదేవి

మొరపెట్టుకుంటే ద్వాపరయుగం చివరలోయదువంశంలో "బలరాముడిగా" రోహిణికి, "శ్రీకృష్ణునిగా" దేవకీదేవికి అవతరించాడు.

మానవులకు అగమ్యంగా ఉన్న వేదాలను విభజించడం కోసం సత్యవతీ తనయుడై "వ్యాసమహర్షిగా" ఆవిర్భవించాడు. "బుద్ధుడై" పుట్టి త్రిపురాసుర సంహారంలో శివుడికి విజయాన్ని సమకూర్చాడు. ఇక ముందు పరమపాపాత్ములైన బ్రాహ్మణులనూ, నీచులైన ప్రభువులనూ అణచి వెయ్యడం కోసమని "కల్కిగా" అవతరించి ధర్మ సంస్థాపన చేస్తాడు.

ఆ మహాత్ముడు సృష్టినిర్వహణ, రక్షణల కోసం ఎన్నో అవతారాలు ఎత్తుతుంటాడు. ఆ మహానుభావుని అవతారాలను లెక్కించడం, ఇన్ని అని నిర్ధారణ చేసి చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు. అతని అవతారాలను లెక్కించడం మాని, ఆయా అవతార విశేష వైభవాలను తలుచుకుంటూ, తననే ధ్యానించే పరమభక్తులకు మాత్రం ఆ భగవంతుడు తన మాయను తరించే జ్ఞానాన్ని ప్రసాదించి అనుగ్రహిస్తాడు.

విష్ణుమాయను తరించడానికి భక్తి మాత్రమే ముఖ్యం గాని ఆ జీవుడు ఏ శరీరంలో ఉన్నాడు అన్నది ముఖ్యం కాదు. కనుక పశు, పక్షి మృగలుగా ఉన్నా విష్ణుమాయను దాటి తరించవచ్చు..."విష్ణు భక్తులను చూసి అవిద్య సిగ్గుతో తలదించుకుని పోతుంది" అని వ్యాసుడు నారదుడికి చెప్పినదంతా శుకమహర్షి పరీక్షిన్మహారాజుకి వినిపించాడు.

## పరీక్షిత్తు శుకునితో చెప్పిన విష్ణుభక్తి మహిమ - శుకుని ద్వారా సృష్టి రచనా విధానమను తెలుసుకొనుట

పరీక్షిత్తు వ్యాసపుత్రుని ఈ విధంగా అడిగాడు.

"ఓ మహర్షీ! మీరు పరమమంగళకరములైన హరి లీలలను వినిపిస్తుంటే, నేను నా హృదయంలో ఆ శ్రీహరిని స్థిరంగా నిలుపుకుని, నిందించదగిన ఈ శరీరాన్ని విడిచి పెడతాను. "నిరంతరం తననే భక్తితో పొగుడుతూ, స్తోత్రం చేస్తూ, తన గుణగుణాలనే వింటూ, వర్ణిస్తూ ఉండేవాడి హృదయంలోకి శ్రీకృష్ణుడు చెవిరంధ్రం ద్వారా ప్రవేశించి, అతడి ఆత్మలోని మాలిన్యాన్ని తొలగించి కాపాడతాడు."

దేనితోనూ సంబంధంలేని ఆత్మకి అన్నింటితో సంబంధం ఎట్లా వచ్చింది? పరంజ్యోతి స్వరూపుడైన పద్మనేత్రుడికీ, పద్మసంభవుడికీ భేదమేమైనా ఉందా? సమస్త భూతములకూ ఈశ్వరుడైన సర్వేశ్వరుడు తన మాయను వదలిపెట్టి ఎక్కడెక్కడ నిద్రించాడు? మహాకల్పాలూ, అవాంతల కల్పాలూ, దేవ, పితృ, మనుష్యుల ఆయుర్దాయాలు ఎంతెంత ఉంటాయి. ఏ ఏ పనుల వలన ఏ ఏ జీవులు ఏ ఏ లోకాలను పొందుతారు? ఏ ఏ పనులు చేసిన ఏ ఏ శరీరాలను పొందుతారు? పంచభూతాల ఉత్పత్తీ, బ్రహ్మాండం యొక్క ప్రమాణమూ, మహాత్ముల చరిత్రలూ, యుగాలూ, యుగాల ప్రమాణాలూ, యుగధర్మాలూ, యుగంలో పాటించవలసిన ధర్మాలూ మొదలైన విషయాలన్నీ నాకు వినిపించాలి.

“నువ్వు బ్రాహ్మణ శాపం పొందావు. శోకంతో బాధపడుతున్నావు. ఆహారమేమీ తీసుకోకుండా వ్రతం చేస్తూ అలసిపోయి వున్నావు. ఇవన్నీ ఎట్లా వింటావు? ఎట్లా వినగలవు?” అని మీరు అనద్దు. మీ మాటలనే అమృతమే నాకు ఉన్న చింతలనూ, శ్రమలనూ దూరం చేస్తుంది” అన్నాడు రాజు.

శుకయోగీంద్రుడు రాజుతో “పూర్వం కల్పం ప్రారంభం అయ్యేటప్పుడు కమల సంభవుడు (నాలుగుముఖాల బ్రహ్మదేవుడు) తన పుట్టుకకు కారణమైన పద్మానికి ఆధారం ఏమిటో తెలుసుకోవాలని నీటిలో చాలాసేపు తిరిగి తిరిగి శ్రమపడ్డాడు. కానీ తెలుసుకోలేకపోయాడు. మళ్ళీ ఆ పద్మంలోకే వెళ్లి, లోకాలన్నింటినీ సృష్టించాలనుకున్నాడు. కానీ ఎట్లా సృష్టించాలో తెలియలేదు అతడికి. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్న బ్రహ్మదేవుడికి “తప” అనే పదం రెండుసార్లు వినిపించింది. అంటే తపస్సు చెయ్యమని అర్థం. అప్పుడు బ్రహ్మదేవుడు ఆ పదమునందే నమ్మకం పెట్టుకుని, ప్రాణాయామ పరాయణుడై జ్ఞానేంద్రియాలనూ, కర్మేంద్రియాలనూ జయించాడు. ఏకాగ్రచిత్తుడై వెయ్యి సంవత్సరాల పాటు ఘోరమైన తపస్సు చేశాడు. అప్పుడు బ్రహ్మదేవుడికి ఈశ్వరుడు ప్రత్యక్షమై వైకుంఠం చూపించాడు.

అక్కడ సకలసౌందర్య సంపత్స్వరూపిణి అయిన శ్రీమహాలక్ష్మి ఆ స్వామి పాదపద్మాలను తన మృదువైన పద్మాలవంటి చేతులతో నెమ్మది నెమ్మదిగా ఒత్తుతున్నది.

ఆ విధంగా ఉన్న ఆ పరమపురుషుడిని చూసి బ్రహ్మదేవుడు తన నాలుగుముఖాలనూ ఆ పాదపద్మాలకు తగిలేవిధంగా చేసి నమస్కరించాడు. ఆ స్వామి ఆదరంతోనూ, వాత్సల్యంతోనూ బ్రహ్మదేవుని పైకి లేవదీసి "వత్సా! నామాట విని తపస్సు చేశావు కనుక మోహంలో నుండి బయటపడ్డావు. నీకు ఏం కావాలో అడుగు" అన్నాడు.

బ్రహ్మదేవుడు "లోక సృష్టి, స్థితి సంహారాలు చేసే నీ మహిమను తెలుసుకునే విజ్ఞానాన్ని నాకు అనుగ్రహించు. సృష్టి చేసేటప్పుడే 'నేనే బ్రహ్మను' అనే అహంభావాన్ని నాకు రానివ్వకు" అని వేడుకున్నాడు. బ్రహ్మదేవుడి కోరిక విన్న విష్ణువు "చతుర్ముఖా! శాస్త్రార్థవిచార విజ్ఞానమూ, భక్తీ, సమధిక సాక్షాత్కారమూ అనే ఈ మూడింటినీ ఎప్పుడూ, ఏ పనిలోనూ విడిచిపెట్టకుండా ఉండు. అప్పుడ నీకు నా యొక్క అనేక అవతార తత్త్వాలనూ తెలుసుకునే విజ్ఞానం లభిస్తుంది" అని చెప్పి అంతర్ధానమయ్యాడు. బ్రహ్మదేవుడు హరి ఆజ్ఞను శిరసావహించి సమస్త ప్రపంచాన్నీ సృష్టించాడు.

అప్పుడు నారదుడు బ్రహ్మదేవుని "ఈ ప్రపంచసృష్టి, స్థితి, సంహారాలు ఏ పరమేశ్వరుని వలన జరుగుతున్నాయో ఆ పరమేశ్వరుని ఎట్లా తెలుసుకోవాలి? మాయ వలన మోహం పొందకుండా ఎట్లా ఉండగలుగుతాము?" అని అడిగాడు. అప్పుడు బ్రహ్మదేవుడు హరి తనకు చెప్పినదంతా నారదుడికి చెప్పాడు. ఆ నారదమహర్షి మా తండ్రి వ్యాసుడికి చెప్పారు. అదే విషయం నా తండ్రి నాకు చెప్పారు. నేను

నీకు చెప్తున్నాను" అన్నాడు శుకమహర్షి" అని సూతుడు శౌనకాదులకు చెప్పాడు. శౌనకాదులు "శుకుడు పరీక్షిత్తుకు చెప్పినదంతా మాకూ చెప్పమని" సూతమహర్షిని అడిగారు.

## శ్రీమద్భాగవతంలోని ద్వితీయ స్కందము పరిసమాప్తము

# తృతీయస్కందము

### దుర్యోధనుడు విదురుని నిందించుట - విదురుడు తీర్థయాత్రలకు వెళ్ళుట

సూతుడు శౌనకాదులకు ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

"పాండురాజు మునిశాపంతో మరణించాడు. మాద్రి పాండురాజుతో పాటు సహగమనం చేసింది. కుంతి కుమారులైదుగురినీ తీసుకుని హస్తినాపురానికి చేరుకుంది. ధృతరాష్ట్రుడు పాండుకుమారులను కూడా తన కుమారులతో పాటుగా విద్యాబుద్ధులు నేర్పిస్తూ, అన్న వస్త్రాదులనిచ్చి పోషిస్తున్నాడు. దుర్యోధనాదులు మాత్రం పాండవుల మీద అసూయను పెంచుకున్నారు. పాండవులను చంపడం కోసం విషం కలిపిన అన్నం పెట్టారు. పాముల చేత కరిపించారు. గంగానదిలోకి తోయించారు. లక్క ఇంట్లో పెట్టి మంటల పాలు చెయ్యాలని చూశారు. రాజ్యం నుంచి వెళ్లగొట్టారు.

కౌరవులు ఇన్ని చేసినా పాండవులు ధర్మమార్గాన్ని వదిలిపెట్టకపోవడం వల్లనే పుణ్యాత్ములయ్యారు. శ్రీహరి అనుగ్రహానికి పాత్రులయ్యారు. వాసుదేవుని కటాక్షంతో మళ్ళీ

రాజ్యాన్ని సంపాదించుకున్నారు. రాజసూయ యాగం చేశారు. ఎన్ని చేసినా పాండవులు మళ్ళీ పైకి రావడం చూసి ఓర్చుకోలేకపోయాడు దుర్యోధనుడు. శకుని మామ సలహాపై ధర్మరాజును జూదానికి పిలిచాడు. జూదంలో శకుని మాయతో పాండవులను ఓడించాడు.

పాండవులను పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసానికీ, ఒక సంవత్సరం అజ్ఞాతవాసానికీ పంపించాడు. పాండవులు శ్రీకృష్ణానుగ్రహంతో ఎన్నో కష్టాలకోర్చి అరణ్య, అజ్ఞాత వాసాలను చక్కగా పూర్తి చేశారు. అయినా సరే సూదికొన మోపడానికి వీలైన చోటును కూడా ఇవ్వనన్నాడు దుర్యోధనుడు. హింసాపూర్వకమైన యుద్ధం చెయ్యడానికి మనసు అంగీకరించని ధర్మరాజు తన తరపున శ్రీకృష్ణుని రాయబారిగా పంపించాడు దుర్యోధనుడి దగ్గరికి. ఎవరొచ్చినా, ఎన్ని చెప్పిన నా నిర్ణయానికి తిరుగులేదు, నా మాటకి ఎదురులేదు అన్నట్లుగా ప్రవర్తించి, దూతగా వచ్చిన నందనందనుని కూడా బంధించడానికి ప్రయత్నించాడు దుర్యోధనుడు.

మాయలకే మాయను కల్పించే శ్రీకృష్ణుడు దుర్యోధనుడి మాయలో పడలేదు. శ్రీకృష్ణుడు చేసిన రాయబారమూ ప్రయోజనం లేకుండా పోయింది. ధృతరాష్ట్రుని సోదరుడైన విదురుడు ధర్మప్రియుడు. అతడు ఒక్క దుర్యోధనుడి కోసం ధర్మం తప్పి, కౌరవవంశాన్ని నాశనం చెయ్యద్దని ధృతరాష్ట్రుడిని హెచ్చరించాడు. అది చూసిన దుర్యోధనుడు మిక్కిలి రోషంతో

అడ్డు అదుపు లేకుండా నోటికెంత వస్తే అంత అన్నట్లు అదే పనిగా నిందించాడు విదురుడిని.

దాంతో విదురుడు అప్పటికప్పుడే వైరాగ్యాన్ని పొంది అరణ్యాలకు బయలుదేరి వెళ్ళాడు. ఎన్నో మున్యాశ్రమాలూ, మరెన్నో పుణ్యతీర్థాలూ చూసుకుంటూ ప్రభాస తీర్థానికి చేరుకున్నాడు. అప్పటికి కురుపాండవుల మధ్య యుద్ధం పూర్తి అయ్యింది. కౌరవులంతా నాశనమయ్యారు. ఆ వార్త విన్న విదురుడు మిక్కిలి దుఃఖించాడు. చేసేదిలేక, చేయగలిగిందీ లేక మనఃశ్శాంతి కోసం ఎన్నెన్నో పుణ్యనదుల్లో స్నానం చేశాడు. మరెందరో దేవతలను పూజిస్తూ మత్స్య, కురుజాంగల దేశాలు దాటి యమునా నదీ తీరానికి చేరాడు.

## విదురుడు ఉద్ధవముని ద్వారా శ్రీకృష్ణాదుల వృత్తాంతం వినడం - మైత్రేయ మహర్షిని కలుసుకోవడం

మయునా తీరంలో విదురుడికి శ్రీకృష్ణుని బాల్య స్నేహితుడైన ఉద్ధవుడు కనిపించాడు. వెంటనే విదురుడు అతడి దగ్గరికి వెళ్ళి బలరామ కృష్ణుల యోగక్షేమాలు అడిగాడు. ఉద్ధవుడు ఉబికివస్తున్న కన్నీటిని ఆపుకుంటూ, పొరలివస్తున్న దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ, బొంగురుపోయిన గొంతుకతో "విదురా! యముడనే కాలసర్పం నోట్లోకి శ్రీకృష్ణుడు కూడా వెళ్ళిపోయాడని నేను నీకు ఎట్లా చెప్పగలను? శ్రీకృష్ణుడు తన మానవ తేజాన్ని మాయం చేశాడు" అని చెప్పి, యాదవకుల క్షయమైన విధానమును వివరంగా చెప్పాడు.

విదురుడు మిక్కిలి దుఃఖిస్తూ "ఉద్ధవా! ఆ భగవానుడు నీకు ఏమి ఉపదేశించాడో అని నాకూ వినిపించు" అని అడిగాడు. ఉద్ధవుడు "విదురా! మైత్రేయ మహర్షి రెండవ విష్ణువే. కనుక ఆ మహర్షి ద్వారా వినడమే మనకు ఉత్తమం" అన్నాడు. మరునాడు ఉదయాన విదురుడు, ఉద్ధవుడు యమున దాటి బదరికారణ్యానికి వెళ్ళారు.

అంతా విన్న పరీక్షిత్తు శుకమహర్షిని "అందరూ మరణిస్తే ఉద్ధవుడు ఒక్కడు ఎట్లా బ్రతికి వున్నాడు? ఎందుకు బ్రతికి ఉన్నాడు?" వివరంగా చెప్పమని అడిగాడు.

శుకుడు "మహారాజా! భగవంతుడైన శ్రీకృష్ణుడు తనతో పాటు సమస్త యదువంశాన్నీ నాశనం చేయబోతూ 'లోకంలో విజ్ఞాన తత్వాన్ని నిలబెట్టడం కోసం ఆ ప్రళయం నుండి ఉద్ధవుని తప్పించాడు' అని చెప్పాడు.

ఉద్ధవుడు తన దారిన తాను వెళ్ళాడు. విదురుడు ఒక్కడే యమున దాటి, అనేక పుణ్యక్షేత్రాలు చూస్తూ, గంగాతీరానికి చేరుకున్నాడు. అక్కడ ఒక ఇసుకతిన్నెపై మిక్కిలి నిష్ఠతో భగవద్ధ్యానపరాయణుడై ఉన్న మైత్రేయ మహర్షిని చూశాడు.

## విదురమైత్రేయ సంవాదం - శ్రీకృష్ణుడు ఉపదేశించిన సృష్టి క్రమం

విదురుడు మైత్రేయుడి దగ్గరకు వెళ్ళి, నమస్కరించి, "మహాత్మా! లోకంలో అందరూ ఏదో గొప్ప సుఖాన్ని అనుభవించాలని ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ అవి అన్నీ విఫలమై పోతుంటాయి. కర్మలు అన్నీ బంధాన్ని

మరింత గట్టి పరుస్తాయే తప్ప మానవునికి కలిగే దుఃఖాలలో నుండి బయట పడవెయ్యలేవు. చావు పుట్టుకల ప్రవాహంలో కొట్టుకుపోయే మూఢులైన మానవులు తరించాలంటే ఉపాయం ఏమిటి. నారాయణ పరాయణులైన మీరే దయతో నాకు జ్ఞాన మార్గాన్ని ఉపదేశిస్తారన్న నమ్మకంతో మీ దగ్గరికి వచ్చాను. ఆ కేశవుని అవతార ప్రయోజనాలను మీరు చెప్పగలిగినన్ని చెప్పి నన్ను ధన్యుణ్ణి చెయ్యండి" అంటూ ప్రార్థించాడు.

మైత్రేయ మహర్షి విదురుడితో "ఆ శ్రీహరికి నువ్వంటే చాలా ఇష్టం. అందుకనే ఆ శ్రీకృష్ణుడు తాను నిర్యాణం చెందుతూ నన్ను పిలిచి, విజ్ఞానమంతా ఉపదేశించి, ఆ విజ్ఞానాన్నంతటినీ నీకు వినిపించమని ఆదేశించాడు" అని చెప్పి తనకు శ్రీకృష్ణులవారు చెప్పినదంతా చెప్పడం మొదలుపెట్టాడు.

"శ్రీహరి నాభిలో నుండి పుట్టిన బ్రహ్మ వెయ్యి సం॥లు నీళ్ళలో వెతికి, తిరిగి పద్మంలోకే వచ్చి గొప్ప తపస్సు చేశాడు. అప్పుడు అతడికి మనస్సులోనే శ్రీహరి కనిపించాడు..."నువ్వు లోకాలను సృష్టించడం కోసమే ఈ తామరపువ్వులో పుట్టావు. ఇదంతా నేను అనుకోవడం వలననే జరిగింది. నువ్వు నన్ను ఎప్పుడూ మరిచిపోకుండా ఉంటే నీకు నేను ఎప్పుడూ సహాయపడుతుంటాను. తపస్సుతో సాధించలేనిది ఏదీ ఉండదు. కనుక ఇప్పటివరకూ నువ్వు చేసిన తపఃశ్శక్తితోనే నువ్వు లోకాలన్నింటినీ సృష్టించగలవు. నాలోనే అన్ని

జీవరాశులూ ఉంటాయి. వాటన్నింటినీ నువ్వు నీ తపఃశ్శక్తితో చూడగలవు. నా పట్ల భక్తితో ఉన్నంత వరకూ నీకు రాజసం పుట్టదు. నీలో రజోగుణం పుట్టనంత వరకూ నీకు అశాంతి అనేది ఉండదు. సృష్టి కార్యమంతా అవలీలగా చెయ్యగలుగుతావు" అని చెప్పి మాయమైపోయాడు.

తరువాత బ్రహ్మదేవుడు తామరపువ్వు లోపలకి వెళ్ళి, సమస్త లోకాలనూ చూసి, తిరిగి వచ్చి లోకాలను సృష్టించడం మొదలు పెట్టాడు.

మొట్ట మొదట ఐదురకాల అవిద్యలతో కూడిన ప్రాణులను సృష్టించాడు. పాపపుసృష్టి ఎందుకుచేశానా అని చింతించి, పశ్చాత్తాపం పొంది, పరమ పవిత్రులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులను పుట్టించి ప్రజాభివృద్ధి చెయ్యమని ఆదేశించాడు. ఆ పని చెయ్యడానికి వాళ్ళు అంగీకరించలేదు. అప్పుడు బ్రహ్మదేవుడికి వచ్చిన కోపంలో నుండి "రుద్రుడు" పుట్టాడు.

ఆ రుద్రుడు బ్రహ్మదేవుడిని "నేను ఎక్కడ ఉండాలి? నా పేరు ఏమిటి? నేను ఏం చెయ్యాలి?" అని అడిగాడు. అప్పుడు బ్రహ్మదేవుడు "నువ్వు ఏడుస్తూ పుట్టావు, కనుక నీ పేరు రుద్రుడు. నువ్వు "చంద్రుడు, సూర్యుడు, వాయువు, అగ్ని, నీరూ, ఆకాశమూ, భూమీ, ప్రాణమూ, తపస్సూ, హృదయమూ, ఇంద్రియమూ" అనే పదకొండింటిలో నివసించు. నీకు మరొక పన్నెండు పేర్లు కూడా ఉంటాయి. నువ్వు నిన్ను సేవించే పదకొండుమంది భార్యలతో కలిసి

సంతానాన్ని పొందాలి" అని ఆదేశించాడు. రుద్రుడు బ్రహ్మదేవుడు చెప్పినట్టుగా సంతానాన్ని పొందాడు. రుద్రుడి కుమారులనే "రుద్రగణాలు" అంటారు. వాళ్ళు తండ్రి స్వభావాన్నే పొందడంతో కోపంతో ప్రపంచాన్నే మింగేశారు.

బ్రహ్మదేవుడు మీరంతా తపస్సు చేసుకోమని రుద్రగణాలను ఆదేశించాడు. తనకు వచ్చిన కోపం వలన పుట్టిన రుద్రుడి కుమారులకీ అదే లక్షణం వచ్చి లోకాలకు హాని కలిగిందని నిశ్చయించుకున్నాడు బ్రహ్మదేవుడు.

కాబట్టి కోపాన్ని పొందకుండా ఉండాలని ప్రయత్నించి "దక్షుడు, నారదుడు, పులహుడు, పులస్త్యుడు, భృగువు, క్రతువు, అంగీరసుడు, వసిష్ఠుడు, మరీచీ, అత్రీ" అనే పదిమంది మునీశ్వరులను సృష్టించాడు. బ్రహ్మదేవుడి కుడి స్తనం నుండి ధర్మం, వీపు నుండి మృత్యువూ, మృత్యువు నుండి అధర్మం పుట్టినాయి. బ్రహ్మదేవుడి మనస్సు నుండి "కాముడు" పుట్టాడు. తరువాత కనుబొమ్మలు, పెదవులు మొదలైన అవయవాల నుండి క్రోధమూ, లోభమూ, సరస్వతీ, సముద్రాలూ, నిఋతీ, కర్దముడూ మొదలైన వారంతా పుట్టారు.

బ్రహ్మదేవుడు తన ముఖం నుండి పుట్టిన సరస్వతిని చూసి కూతురనే ఆలోచన కూడా లేకుండా ఆమెను చేపట్టాడు. అది చూసి మరీచి మొదలైన మహర్షులు తండ్రిని అసహ్యించుకుంటూ మాటిమాటికీ అతడు చేసిన పనిని ఎత్తి చూపిస్తున్నారు. దాంతో బ్రహ్మదేవుడు సిగ్గుపడి ఆ శరీరాన్ని

వదిలేశాడు. అప్పుడు ఆ శరీరాన్ని దిక్కులన్నీ వచ్చి భరించాయి. అదే చీకటిగా దట్టమైన మంచుగా అయ్యింది.

తరువాత బ్రహ్మదేవుడు మరొక శరీరాన్ని ధరించి సృష్టి చేద్దామనుకున్నాడు. కానీ అతడి మనస్సు పనిచెయ్యలేదు. అతడి నాలుగు ముఖాల్లోంచి నాలుగు వేదాలు వచ్చాయి. వాటితో పాటుగా యజ్ఞాలూ, సదాచారాలూ, నాలుగు ఆశ్రమాలూ పుట్టాయి. ఆ నాలుగు ముఖాల్లోంచే సమస్త విద్యలూ, పురాణ ఇతిహాసాలూ, వైఖానసులూ, వాలిఖిల్యులూ మొదలైన వారంతా జన్మించారు.

ఆ తరువాత 'స్వాయంభువ మనువూ', అతడి భార్య 'శతరూపాదేవీ' బ్రహ్మదేవుడు ధరించిన రెండు శరీరాల నుండీ పుట్టారు. ఆ దంపతులకు "ప్రియవ్రతుడూ, ఉత్తానపాదుడూ" అనే కుమారులూ, "ఆకూతీ, దేవహూతీ, ప్రసూతీ" అనే కుమార్తెలూ పుట్టారు. స్వాయంభువ మనువు ఆకూతిని రుచికీ, దేవహూతిని కర్దముడికీ, ప్రసూతిని దక్షుడికీ ఇచ్చి వివాహాలు జరిపించాడు. వీళ్ళ సంతానం వలన ప్రజాభివృద్ధి జరిగింది.

## శ్రీహరి వరాహరూపంగా అవతరించుట - హిరణ్యాక్షుని సంహరించుట

స్వాయంభువ మనువు బ్రహ్మదేవుని ఆజ్ఞ ప్రకారంగా యజ్ఞాలు చేస్తూ భూభారాన్ని నిర్వహించాలనుకున్నాడు. కానీ అతడికి భూమి కనపడలేదు. భూమి నీటిలో మునిగిపోయింది.

"ఈ భూమిని ఎట్లా ఉద్ధరించాలి?" అని తండ్రిని అడిగాడు. బ్రహ్మదేవుడు శ్రీహరిని ధ్యానం చేశాడు. అప్పుడు

శ్రీహరి బ్రహ్మదేవుని ముక్కు రంధ్రాల నుండి బొటన వ్రేలంత రూపంలో వరాహంగా ఉద్భవించి, బయటకు వస్తూనే ఏనుగంత వరాహంగా అయ్యాడు. ఆ వరాహాన్ని చూసి మహర్షాదులంతా ఆశ్చర్యపోతున్నారు.

ఇంతలో వరాహం పెద్దగా అరుస్తూ, సముద్రంలోకి పరుగు దీసి, పాతాళంలోకి ప్రవేశించి, భూమి దగ్గరకి వెళ్ళింది. వెంటనే హిరణ్యాక్షడనే రాక్షసుడు గదతో వరాహస్వామిని కొట్టాడు. ఆ వరాహస్వామి సింహం ఏనుగును చీల్చినట్లుగా ఆ రాక్షసుడిని తన కోరలతో చీల్చేశాడు. తన కోరల మధ్య భూమిని నిలబెట్టుకుని నీటిపైకి వచ్చాడు అవలీలగా. బ్రహ్మాదిదేవతలూ, మహర్షులు అందరూ ఆ వరాహస్వామిని పొగుడుతున్నారు. వరాహస్వామి భూమిని యథాస్థానంలో పెట్టి కనిపించకుండా పోయాడు" అని చెప్పాడు మైత్రేయుడు విదురుడికి. ఈ విషయాన్ని శుకయోగి పరీక్షిన్మహారాజుకి చెప్పాడు.

## మహర్షులను నిందించిన వైకుంఠ ద్వారపాలకులు - మహర్షుల శాపంతో రాక్షసులగుట

దక్షప్రజాపతి కుమార్తె దితి కశ్యపుడికి భార్య అయ్యింది. ఒక రోజున దితి సంతానం పొందాలనే కోరికతో భర్త దగ్గరకు వెళ్ళింది. సాయంకాల హోమం పూర్తిచేసుకుని కూర్చున్న భర్త దగ్గరకు వెళ్ళి, తన కోరికను ఆయనకు చెప్పింది. అప్పుడు కశ్యపుడు "నీ కోరిక తప్పక తీరుస్తాను. కానీ ఇది నీ కోరిక తీర్చడానికి తగిన సమయం కాదు. ఇది సంధ్యా సమయం.

పరమేశ్వరుడు వృషభవాహన మెక్కి, తన భూతగణాలతో కలసి తిరుగుతుంటాడు. కాబట్టి ఇది ఉగ్రమైన సమయం. ఈ సమయం దాటినాక నీ కోరిక తీరుస్తాను" అంటూ ఎంతగానో నచ్చచెప్పాడు. కానీ దితి మహర్షి మాటలు వినకుండా ఇప్పుడే నా కోరిక తీర్చమని మొండిపట్టు పట్టింది. తప్పని పరిస్థితిలో కశ్యపుడు దితి యొక్క కోరికను తీర్చాడు.

కొంతకాల గడిచినాక కశ్యపుడు దితి గర్భమును ధరించిన విషయం గమనించాడు. ఒకరోజు భార్యతో "ఇప్పుడు నీవు గర్భవతివి. నీకు మహాబలవంతులైన ఇద్దరు పుత్రులు పుడతారు. కానీ వారిద్దరూ మహాక్రూరులై సాధువులను హింసిస్తారు. వీళ్ళ గోలను పెద్దలంతా శ్రీహరికి మొరపెట్టుకుంటారు. అప్పుడు శ్రీహరి వీళ్ళని మట్టుపెడతాడు" అని చెప్పాడు.

అంతా విన్న దితి మిక్కిలి దుఃఖించింది. కశ్యపుడు ఆమెను చూసి జాలిపడ్డాడు. "వీళ్ళిద్దరూ హరి చేతిలో మరణించినా, వీళ్ళలో పెద్దవాడికి హరిభక్తుడైన, కులపవిత్రుడైన, కుమారుడు పుట్టి, లోక ప్రసిద్ధుడౌతాడులే" అని ఆమెను ఓదార్చాడు. పోనీలే కుమారులు శరీరాలు వదిలేసినా మనుమడు గొప్పవాడు అవుతాడు గదా అని దుః ఖాన్ని దిగమింగి సంతోషించింది.

దితి నూరు సంవత్సరాల పాటు గర్భాన్ని ధరించి, తగిన సమయం వచ్చినాక ప్రసవించడానికి సిద్ధంగా ఉంది. ఆమె గర్భంలోని తేజస్సు భూమి, ఆకాశాలను కప్పేసింది. పగలూ,

రాత్రీ తేడా తెలియకుండాపోతోంది. దేవతలంతా ఈ గండం తప్పించమని బ్రహ్మదేవునితో మొరపెట్టుకున్నారు.

వారి మొర విన్న బ్రహ్మదేవుడు దేవతలతో "ఒకప్పుడు సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు లక్ష్మీనారాయణులను చూడడానికి వైకుంఠానికి వెళ్ళారు. ఆ వైకుంఠానికి జయుడు, విజయుడు అనే వారు ద్వారపాలకులుగా ఉన్నారు. వీళ్ళు ఆ మహర్షులను లోపలకి వెళ్ళనివ్వలేదు. అందుకని ఆ మహర్షులు వీళ్ళపై కోపించి, "మీరు భూలోకంలో పుట్టి, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సరాల్యనే వాటికి వశులై ఉండమని" శపించారు. జయవిజయులు దుఃఖిస్తున్నారు.

ఇంతలో బంగారు వాకిళ్ళను దాటి లక్ష్మీనారాయణులే బయటికి వచ్చారు. వారిని చూసిన మహర్షులు తమను తామే మరచిపోయారు. అప్పుడు నారాయణుడు ఋషులతో "వీళ్ళిద్దరూ నా ద్వారపాలకులు. సాధుపుంగవులైన మిమ్మల్ని చులకనగా మాట్లాడారు. వీళ్ళు చేసిన తప్పుకి మీరు తగిన శిక్షే వేశారు. దానికి నేనూ ఒప్పుకుంటున్నాను. అదీ కాక 'సేవకులు చేసిన తప్పు స్వామిదే అవుతుంది. కనుక ఈ విషయంలో నేను కూడా తప్పు చేసినవాడినే. కనుక నా తప్పును మన్నించి, నన్ను క్షమించండి" అని ప్రార్థించి.. ఈ జయవిజయులు మీమాట ప్రకారంగా భూలోకంలో పుట్టి దేవతలను పీడిస్తూ, నా పేరు వింటేనే మండిపడుతూ, నాతో యుద్ధం చేస్తూ, నా చక్రం చేతనే ప్రాణాలు పోగొట్టుకుంటారు.

అప్పుడు తిరిగి నా దగ్గరకే వస్తారు. పగతోనైనా నన్నే తలుచుకుంటూ, నన్నే చూస్తూ ప్రాణాలను విడిచిపెట్టి, పావిముక్తులౌతారు. ఆ తరువాత వీరికి మళ్ళీ పుట్టడం ఉండదు. మీరు కూడా జరిగినదానికి చింతించకండి. మన బంధుత్వం ఎప్పటిలాగానే ఉంటుంది" అని అన్నాడు.

నారాయణుడి మాటలకు మహర్షులు సంతోషించారు. సంతృప్తిపడ్డారు. ఆయనకు నమస్కరించి తిరిగి వెళ్ళారు. స్వామి జయవిజయులతో "మీరు దిగులపడకండి. మీరు రాక్షసులై పుట్టినా, నన్ను తీవ్రంగా ద్వేషిస్తున్నా, ఎప్పుడూ నన్నే తలచుకుంటూ నా చేతిలోనే మరణించి, మళ్ళీ నా దగ్గరికే వస్తారు" అని చెప్పి అంతఃపురంలోకి వెళ్ళిపోయారు.

అదిగో! ఆ జయవిజయులే ఇప్పుడు దితి గర్భంలో ఉన్నారు. వాళ్ళ తేజస్సు మీకు అడ్డుపడి అణచివేస్తోంది. అంతటికీ మూలకారణం నారాయణుడే. కనుక ఆయన మీకు మేలే చేస్తాడు" అని చెప్పాడు. బ్రహ్మదేవుడు చెప్పిన మాటలు విన్న దేవతలు కమలాసనుడే చూసుకుంటాడని స్వర్గానికి తిరిగి వెళ్ళారు.

(సజ్జనులను, భక్తులను, పెద్దలను నిందించకూడదు. సేవకుల తప్పులకు ప్రభువులు బాధ్యత వహించాలి. ఎంతటివారైనా చేసిన పనికి, తప్పుకు తగిన శిక్షను అనుభవించి తీరాల్సిందే అనే విషయాలను మనం గ్రహించాలి.)

## హిరణ్యాక్ష హిరణ్యకశిపుల పుట్టుక -యజ్ఞ వరాహుని చేతిలో హిరణ్యాక్షుడు మరణించుట

అంతలో దితి ఇద్దరు కుమారులను కన్నది. మొదటి వాడికి "హిరణ్యకశిపుడు" అనీ, రెండవ వాడికి "హిరణ్యాక్షుడు" అని పేరు పెట్టాడు కశ్యపుడు. హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుని గురించి తపస్సు చేసి అనేక వరాలను పొందాడు. ఆ వర బలగర్వంతో తనకు ఎదురులేదని, దిక్పాలకులను లోబరుచుకున్నాడు. అట్లాగే హిరాణ్యాక్షడూ బ్రహ్మదేవుడి గురించి తపస్సు చేసి, కోరుకున్న వరాలన్నింటినీ పొంది, గద పట్టుకుని మూడులోకాల్లో తిరుగుతూ, కనపడిన వాడినల్లా భయపెడుతున్నాడు. హరిణ్యాక్షుని చూడగానే దేవతలు పారిపోతున్నారు. ఇక మానవుల సంగతి చెప్పేదేముంటుంది? తోటి రాక్షసులు వాడికి మిత్రులై రాబోయే ఆపద నుండి బయటపడుతున్నారు.

ఒకసారి హిరణ్యాక్షుడు వరుణుని యుద్ధానికి రమ్మని పిలిచాడు. వరుణుడు "నేను దీక్షలో ఉన్నాను. ఆయుధం పట్టుకోకూడదంటూ తప్పించుకుని... నీవు వైకుంఠానికి వెళ్ళి అక్కడ ఉండే విష్ణుదేవుడు నీతో యుద్ధం చేస్తాడు.. నీ కోరిక తీరుతుంది" అనిచెప్పాడు.

వెంటనే హిరణ్యాక్షుడు వైకుంఠానికి బయలుదేరాడు. దారిలో నారదుడు ఎదురు వచ్చి "విష్ణువు ఇప్పుడు పాతాళంలో ఉన్నాడు" అని చెప్పాడు. హిరణ్యాక్షుడు మహా వేగంగా పాతాళానికి వెళ్ళాడు. అక్కడ భూమిని కోరలపై పెట్టుకున్న

వరాహమూర్తిని చూసి గర్జించాడు. "నేను బ్రహ్మదేవుడిచ్చిన వరంతో భూమిని ఇక్కడ దాచాను. ఈ భూమి నా సొమ్ము. దాన్ని నువ్వు తీసుకు పోతున్నావేంటి? విడిచి పెట్టు. లేకపోతే నిన్ను చంపుతాను" అన్నాడు.

వరాహమూర్తి హిరణ్యాక్షుని అరుపులు విని, అతనిపై కోపగించుకున్నాడు. కానీ తన కోరల మీద ఉండి భయపడుతున్న భూదేవిని దింపుకోవడం కోసం మౌనంగా ఉండి, నీటిలో నుండి పైకి వెళ్తున్నాడు. అది చూసి హిరణ్యాక్షుడు వరాహస్వామి తనకు భయపడి పారిపోతున్నా డనుకున్నాడు. ఏనుగును పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న మొసలిలాగా తనను వెంబడిస్తున్న రాక్షసుని చూశాడు వరాహమూర్తి. వెంటనే భూమిని నీటిపై నిలబెట్టి, వేగంగా రాక్షసుడి వైపుకి తిరిగాడు. గదతో వాడిని ఎదుర్కొన్నాడు. వాళ్ళిద్దరి మధ్య చాలా సేపు యుద్ధం జరిగింది. ఇద్దరూ ఒకరి అంతు మరొకరు చూడాలి అన్నట్లుగా పరాక్రమిస్తున్నారు.

వీళ్ళిద్దరి యుద్ధం చూస్తున్న బ్రహ్మదేవుడు శ్రీహరితో ''నేను ఇచ్చిన వరాల బలంతో వీడు అందరినీ బాధిస్తున్నాడు.ఆ లోక కంఠకుడిని చంపకుండా వినోదం చూస్తున్నావేమిటి? ఇప్పుడు అభిజిత్ ముహూర్తం. ఇది దాటినాక సంధ్యాసమయం వచ్చిందా వీడి బలానికి తిరుగు ఉండదు. అది రాక్షసులకు అనకూలమైన సమయం. కనుక వీడిని ఇప్పుడే సంహరించు" అని హెచ్చరించాడు.

ఆ మాటలు విన్న నారాయణుడు బ్రహ్మదేవుడి మాట ప్రకారంగా రాక్షసుడితో పోరాడి సంధ్యా సమయం రాకముందే అతడి గూబ మీద గట్టిగా ఒక్క దెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకి రాక్షసుడు నెత్తురు కక్కుతూ గుడ్లు తేలేసి ప్రాణాలను వదిలాడు. హిరణ్యాక్షుడి మరణం చూసి దేవతలంతా ఆశ్చర్యపోయారు.

బ్రహ్మదేవుడు ఈ పవిత్రమైన కథను దేవతలకు చెప్పాడు. దానినే మైత్రేయుడు విదురుడికీ, శుకయోగి పరీక్షిన్మహారాజుకీ చెప్పారు.

**బ్రహ్మదేవుడు అనేక శరీరాలను విడిచి పెట్టడం - యక్షాది దేవతలను సృష్టించడం**

తరువాత మైత్రేయ మహర్షి విదురుడి కోరిక మేరకు దేవతల పుట్టుక వివరించాడు.

నారాయణుని నాభి కమలం నుండి పుట్టిన విరించి తన నీడ వలన సమస్త జగత్తునూ సృష్టించాడు. ఐదురాకల మోహాలతో అవిద్యను పుట్టించాడు. తరువాత ఆ శరీరాన్ని వదలి మరొక శరీరాన్ని ధరించాడు. ఆయన వదిలిన శరీరం ఆకలిదప్పికలకు నివాసము, రాత్రి సమయము అయింది. దాని నుండి యక్ష రాక్షసులు పుట్టారు. వారు ఆకలిబాధకు తట్టుకోలేక తమను పుట్టించిన బ్రహ్మదేవుడినే తినడానికి సిద్ధపడ్డారు. విరించే వారిని చూసి భయపడి వాళ్ళతో "నేను మీ తండ్రిని. మీరు నా కుమారులు. నన్ను హింసించకండి" అంటూ "మా జక్షత! రక్షత!" అన్నాడు. ఆ మాటల వలననే వాళ్ళకి యక్షులూ, రాక్షసులూ అనే పేర్లు వచ్చాయి.

తరువాత విరించి మరొక శరీరాన్ని ధరించి, సత్త్వగుణ ప్రధానులైన దేవతలను సృష్టించి, ఆ శరీరాన్ని వదలిపెట్టాడు. ఆ శరీరం పగలుగా మారి దేవతలకు ఆశ్రమయ్యింది. తరువాత సృష్టికర్త నడుము భాగం నుండి మిక్కిలికాముకులైన రాక్షసులు పుట్టి, సృష్టికర్తనే తమకు భార్యగా ఉండమని నిర్భంధించారు. విధాత వెంటనే ఆ శరీరాన్ని వదిలిపెట్టాడు. ఆ శరీరమే 'సంధ్య' అనే సుందరిగా విరాజిల్లింది. రాక్షసులు ఆమెను చుట్టుముట్టారు. విధాత అమ్మయ్య గండం గడిచింది అని ఆనందిస్తూ.. తన అరచేతిని వాసన చూశాడు. దానిలో నుండి గంధర్వులు, అప్సరసలు పుట్టారు. విధాత వెంటనే ఆ శరీరాన్ని వదిలి మరొక శరీరాన్ని ధరించాడు. అతడు వదిలిన శరీరం వెన్నెల అయ్యింది. దానిని గంధర్వులు స్వీకరించారు.

ఆ తరువాత కూడా విధాత అనేకసార్లు ఒక శరీరం విడిచి మరొక శరీరాన్ని ధరిస్తూ పిశాచ, గుహ్యక, సిద్ధభూత గణాలనూ, పితృ సాధ్య గణాలనూ ఇంకా అనేక జాతుల ఆకాశసంచారులనూ సృష్టించాడు. ఆయన వదిలిన శరీరాలు తత్తరపాటు, ఉన్మాదము, నిద్ర, అంతర్ధానము మొదలైనవి అయినాయి. తన సృష్టి పెరగలేదే అనుకుంటూ కాళ్ళూ, చేతులూ విదిలించుకుని పడుకున్నాడు విధాత. అప్పుడు ఆయన శరీరంలో నుండి రాలిన రోమాలే మహా సర్పాలయినాయి. ఆ తరువాత తృప్తి పడిన విధాత

మనువులను సృష్టించాడు. వాళ్ళకి పురుషరూపమైన తన శరీరాన్ని ఇచ్చాడు. ఋషి వేషాన్ని ధరించి ఋషులను పుట్టించి, వాళ్ళకి తన శరీరాంశాలైన "సమాధి, యోగము, ఐశ్వర్యము, తపస్సు, విద్య, విరక్తీ" అనే వాటిని ప్రసాదించాడు.

తరువాత మైత్రేయుడు విదురుడికి కపిలావతార కథను వినిపించడం మొదలుపెట్టాడు.

## కర్దమముని తపస్సు చేయుట - శ్రీమహావిష్ణువు అతనిని అనుగ్రహించుట

"కృతయుగంలో బ్రహ్మదేవుడు కర్దమ మహర్షిని ప్రజలను సృష్టించమని ఆజ్ఞాపించాడు. కర్దముడు బ్రహ్మదేవుని ఆజ్ఞ ప్రకారంగా సరస్వతీ నదీ తీరాన పదివేల దివ్య సంవత్సరాలు తపస్సు చేశాడు. కర్దముడికి శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయ్యాడు. "మహర్షీ! నీ కోరిక తీరుతుంది. స్వాయంభువ మనువుకి 'దేవహూతి' అనే కుమార్తె ఉంది. ఆమె నా భక్తురాలు. ఆమె నీకు తగిన భార్య అవుతుంది. ఆ మనువే తన భార్యతో నీ దగ్గరకే వచ్చి ఆమెను నీకు ఇచ్చి పెళ్ళి చేస్తాడు. ఆమె వలన నీకు తొమ్మిదిమంది కుమార్తెలు పుడతారు. వాళ్ళు మహామునులకు భార్యలై సంతానవంతు లౌతారు. ఈ విధంగా నువ్వు నీ తండ్రి ఆజ్ఞప్రకారం ప్రజాసృష్టి చేస్తావు. ఆ తరువాత నేనే నీకు 'కపిలుడు' అనే పేరుతో పుట్టి నీకు తత్త్వోపదేశం చేస్తాను" అని చెప్పి మాయమై పోయాడు.

తరువాత విష్ణువు చెప్పినట్లే మనువు భార్యా సమేతుడై వచ్చి, తన కుమార్తెను మహర్షికి ఇచ్చి వివాహం జరిపిస్తానన్నాడు. కర్దముడు మనువుతో 'ఈమె బిడ్డలను కన్న తరువాత నేను సన్న్యాసం తీసుకుంటాను" అని చెప్పాడు. అయినా దేవహూతి కోరిక మేరకు కర్దముడికే ఇచ్చి వివాహం చేశాడు మనువు.

మహారాజు కుమార్తె అయినా మహర్షి భార్యగానే జీవించి, పతినే దైవంగా భావించి సేవిస్తూండేది. మహర్షి తన పట్ల ఆమెకు గల భక్తికి సంతోషించి సంసారంలో కలిగే అపాయాలకు మూలమును తెలుసుకోగల దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఆ దివ్య దృష్టితో ఆమె తాను ఊరట పొంది, ఇతరుల దుఃఖాలకూ ఊరట కలిగించేది.

ఒక రోజున మహర్షి భార్య కోరిక ప్రకారం ఆమెకు రాజభోగాలన్నింటినీ సమకూర్చాడు. తరువాత కాలగమనం గల విమానమెక్కి అనేక లోకాలు తిరుగుతూ ఆనందంగా కాలం గడిపారు. ఆ దంపతులకి తొమ్మిదిమంది కుమార్తెలు కలిగారు. కర్దముడు భార్యతో సన్యాసం తీసుకుంటానన్నాడు. ఆమె కుమార్తెలకు వివాహాలు జరిపించి, తనకు తత్త్వోపదేశం చెయ్యగల పుత్రుని ప్రసాదించమని వేడుకుంది.

## విష్ణువు కపిలావతారుడగుట - కపిలుడు దేవహూతికి తత్త్వోపదేశం చేయుట

కర్దముడు "నీకు తప్పక తత్త్వోపదేశం చెయ్యగల కుమారుడు ఉదయిస్తాడు. నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు" అని

భార్యను ఊరడించాడు. మహర్షి మాట వమ్ము కాదు గదా! కొద్ది రోజులకే దేవహూతి గర్భం ధరించింది. తొమ్మిది నెలలు నిండగానే జిమ్మచెట్టు తొర్రలో నుండి అగ్ని బయటకి వచ్చినట్లుగా ఆమె గర్భంలో నుండి శ్రీమహావిష్ణువు పుత్రుడై ఉదయించాడు. ఆ పుత్రుడే కపిలమహర్షిగా, సాంఖ్యయోగాచార్యుడుగా ప్రసిద్ధుడయ్యాడు. శ్రీహరికి గల ఇరవై ఒక్క అవతారాలలో ఈ కపిలావతారం ఒకటి.

బ్రహ్మదేవుడు మరీచి మొదలైన మహర్షులను వెంటబెట్టుకుని కర్దముడి దగ్గరకు వచ్చాడు. ఆ పుణ్య దంపతలుతో "జ్ఞాన విజ్ఞాన యోగాలను ఉపదేశించి కర్మబంధాలలో చిక్కుకున్న జీవులను ఉద్ధరించడం కోసమే శ్రీహరి ఈ కపిలావతారంలోకి వచ్చాడు. ఈ కపిలుడు సాంఖ్య యోగాన్ని ప్రచారం చేసి మూడు లోకాల్లో ప్రసిద్ధుడై, తత్త్వోపదేశం చేసి మిమ్మల్ని కూడా తరింపచేస్తాడు. మీ కుమార్తెలను ఈ మరీచాది మహర్షులకు ఇచ్చి వివాహాలు జరిపించండి. వాళ్ళు ఆ మహర్షుల వలన చక్కని సంతానాన్ని పొంది, మీకూ చక్కని కీర్తిని సంపాదించి పెడతారు" అని చెప్పాడు.

బ్రహ్మదేవుడు చెప్పిన మాటను అంగీకరించి కర్దముడు తన కుమార్తెలలో 'కళ'ను మరీచికీ, 'అనసూయ'ను అత్రికీ, 'హవిర్భువను' పులస్త్యునికీ, 'గతి'ని పురుహూతికీ, 'క్రియ'ను క్రతువుకీ, 'ఖ్యాతి'ని భగువుకీ, 'అరుంధతి'ని వసిష్ఠుడికీ, 'శాంతి'ని అధర్వునికీ ఇచ్చి శాస్త్రప్రకారంగా పెళ్ళిళ్ళు

జరిపించాడు. ఆ తొమ్మిదిమందీ వారి భర్తలతో వారి వారి నివాసాలకు వెళ్ళారు. ఆ తరువాత కర్దమప్రజాపతి సంసారాన్ని వదిలిపెట్టి సన్న్యాసం తీసుకుని, ప్రపంచమంతటినీ వాసుదేవమయంగా భావిస్తూ, భక్తియోగతత్పరుడై మోక్షసామ్రాజ్యానికి చేరుకున్నాడు. తల్లికి తత్త్వోపదేశం చెయ్యడం కోసం కపిలుడు కొంతకాలం పాటు ఆశ్రమంలోనే ఉన్నాడు.

ఒక రోజు దేవహూతికి బ్రహ్మదేవుడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చినాయి. వెంటనే తనకి ముక్తిమార్గాన్ని ఉపదేశించమని కొడుకుని కోరింది. అప్పుడు కపిలుడు దేవహూతికి ఈ విధంగా తత్త్వోపదేశం చెయ్యడం మొదలుపెట్టాడు.

"అమ్మా! సమస్త బంధాలకీ మనస్సే కారణం. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరుగురు శత్రువులును జయించినప్పుడే మనస్సు పవిత్రమవుతుంది. "అందరికీ మించిన గొప్ప ఆప్తుడు భగవంతుడే" అనే నమ్మకం పెరిగితే భగవంతుడి పట్ల భక్తి పెరుగుతుంది. ఆభక్తి వల్లనే సులభంగా ముక్తి లభిస్తుంది.

భక్తిని దృఢం చేసుకోడానికి భగవద్భక్తులతో మాత్రమే కలిసి ఉండాలి. భక్తులలో కొందరు గుణములతో కూడి న స్వరూపాన్నీ, మరికొందరు ఏ గుణాలూ లేని స్వరూపాన్నీ ధ్యానిస్తుంటారు. భక్తితో ఏమూర్తిని ధ్యానించినా మోక్షం లభిస్తుంది. కానీ రెండు రకాల భక్తులకీ ప్రధానంగా కావలసింది ఇహలోక సుఖాల మీద విరక్తి కలగడమే.

అమ్మా! ఈ సృష్టికి మూలకారణం ప్రకృతి పురుషుల సంయోగమే. అయితే పురుషుడు ఆ ప్రకృతికి వశపడితే మాత్రం జీవుడై, కర్మపాశాలలో చిక్కుకుని, తనను తానే మరచిపోయి, దుఃఖాలనుభవిస్తుంటాడు. తామరాకు మీద నీటిచుక్కలాగా ప్రకృతిని అంటినట్లున్నా, అంటకుండా ఉండేవాడే ఆత్మస్వరూపుడై, సమస్త దుఃఖాలకూ అతీతుడైపోతాడు. ఏపనీ నేనే చేశానని విర్రవీగడు. ఏది జరుగుతున్నా అన్నింటినీ సాక్షిలాగా చూస్తూ ఉంటాడు. దేనికీ విచారించడు. ఇట్లా ఉన్న వ్యక్తికి దేనిమీదా అభిమానము గానీ, ద్వేషంగానీ ఉండవు. లోకమంతా విష్ణుమయంగానే కనిపిస్తుంది అతడికి. ఆ భావన ఒక్కటే అతడిని తరింపచేస్తుంది.

తల్లీ! ఈ మట విను. మనం సూర్యుడిని కన్నెత్తి చూడకపోయినా ఇంటా, బయటా కనిపించే సూర్యకాంతిని బట్టి సూర్యుడిని గుర్తిస్తున్నాం గదా! అట్లాగే అనేకరకాల ప్రాణుల శరీరాలలో ఉండే మాటలు, చేష్టలు మొదలైనవన్నీ కూడా భగవంతుని యొక్క 'చిద్విలాసాలే' అని గుర్తించ గలుగుతాడు జ్ఞాని. జ్ఞాని కూడా సంసారానుభవాన్ని మరుక్షణంలో మరిచిపోతాడు. తాను వేరు, శరీరం వేరు కనుక ఈ రెండింటి కలయికతో వచ్చే సుఖదుఃఖాలతో తనకు ఏమీ సంబంధం లేదని తెలుసుకుంటాడు. ఆ విధమైన జ్ఞానమే మోక్ష సంపాదనకు ప్రధానమైన సాధనం.

అమ్మా! ప్రతి జీవుడూ తల్లి గర్భంలో ఉండగా తను ఈ విధంగా పుట్టడం ఎందుకని చింతిస్తూ ఉంటాడు. ఆ తల్లి గర్భంలో నుండి తనను త్వరగా బయటపడేసి, ఆ నరకం నుండి తప్పించమని ఆ శ్రీమన్నారాయణుడిని వేడుకుంటూనే ఉంటాడు. కానీ తల్లి గర్భంలో నుండి బయటపడిన మరుక్షణంలో ఆ శ్రీమన్నారాయణుని మాయకులోనైపోతాడు. అట్లా మాయకు లోబడిపోకుండా ఉండాలంటే భగవంతుని పట్ల భక్తి ఉండడమే ప్రధానం. ఈ సంసారసముద్రాన్ని దాటడానికి ఉపయోగపడే గొప్ప నౌక 'భక్తి' మాత్రమే."

ఈ విధంగా కపిలమహర్షి తల్లికి భక్తియోగాన్నీ, సాంఖ్యయోగాన్నీ ఉపదేశించి, ఆమె దగ్గర సెలవు తీసుకుని, ఆ ఆశ్రమం విడిచి సముద్రంవైపుకి వెళ్లాడు. దేవహూతి హరి అవతారుడైన కపిలుని రూపాన్నే మనసులో నిలబెట్టుకుని, మమతలన్నీ మరచిపోయి, యోగ మార్గాన్ని అవలంబించి ఆకాశమార్గం వెంట వెళ్ళి శ్రీహరిలో ఐక్యమయ్యింది. దేవహూతి మోక్షం పొందిన క్షేత్రమే 'సిద్ధిప్రద'మనే పేరుతో ప్రసిద్ధికెక్కింది.

కపిలుడు సిద్ధులూ, చారణులూ చేస్తున్న పొగడ్తలు వింటూ సముద్రతీరానికి చేరుకున్నాడు. సముద్రుడు ఆయనను పూజించి కృతార్థుడయ్యాడు. ఆ తరువాత కపిలుడు సాంఖ్య యోగాన్ని ప్రతిష్ఠించి ఉత్తర దిక్కుగా వెళ్ళాడు" అని శుకుడు పరీక్షిత్తుకి చెప్పినట్లుగా సూతుడు శౌనకాదులకు చెప్పాడు. శౌనకాదులు సూతుడితో "హరికథలు ఎంతవిన్నా ఇంకా

వినాలని ఉంది మాకు. కనుక మరెన్నో విశేషాలను మాకు వినిపించమన్నారు.

## శ్రీమద్భాగవతము నందలి మూడవ స్కందము పరిసమాప్తము

# నాలుగవ స్కందము

### మనువంశ విస్తరణ -ఎవరెవరు ఎవరెవరికి

అప్పుడు సూతుడు శౌనకాదులకు ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు. ప్రాయోపవేశం చెయ్యదలచిన పరీక్షిన్మహారాజుతో శుకుడు ఇట్లా చెప్తున్నాడు.

"మహారాజా! మైత్రేయ మహర్షి విదురుడికి ఇట్లా చెప్పాడు. స్వాయంభువ మనువుకి శతరూపాదేవి వలన 'అకూతీ – దేవహూతీ – ప్రసూతీ' అనబడే కుమార్తెలూ, 'ఉత్తానపాదుడు' అనే కుమారుడూ కలిగారు. మనువు ఆకూతిని 'రుచి'ప్రజాతికి ఇచ్చి వివాహం జరిపించాడు. ఈ దంపతులకు విష్ణు అంశతో 'యజ్ఞుడు' అనే కుమారుడు, లక్ష్మీదేవి అంశతో 'దక్షిణ' అనే కుమార్తె జంటగా పుట్టారు. వీళ్ళు ఆదిదంపతులే కనుక దక్షిణయజ్ఞుడినే భర్తగా వరించింది. ఈ దంపతులకు 'తోషుడు, ప్రతోషుడు, సంతోషుడు, భద్రుడు, శాంతి, ఇడస్పతి, ఇంద్రుడు, కవీ, విభుడూ, వహ్ని, సుదేవుడు, రోచనుడు' అనే పేర్లతో ప్రసిద్ధులైన దేవతలు పుట్టారు. వీళ్ళని యమనామధేయ దేవతలు అంటారు. మరీచి మొదలైన మునులూ, యజ్ఞుడు, దేవేంద్రుడు, ప్రియవ్రత, ఉత్తానపాదుడు సంతాన

వంతులవగా వారి కుమారులూ, మనుమలతో యమవంశం చక్కగా వృద్ధి పొందింది.

ఇక మనువు యొక్క రెండవ కుమార్తె దేవహూతి కర్దముని పెండ్లాడింది గదా! మూడవ కుమార్తె ప్రసూతి 'దక్షప్రజాపతికి' భార్య అయ్యింది. ఈ దంపతులకు కలిగిన సంతానపరంపర మూడు లోకాలకూ వ్యాపించింది.

**కర్దముని సంతతి - దత్తాత్రేయుని పుట్టుక**

మరీచి మహర్షి భార్య కళ. వీరిద్దరి పుత్రుడు కశ్యపుడు. పుత్రిక పూర్ణిమ. పూర్ణిమ, కశ్యపుల సంతానం కూడా మూడు లోకాలకూ వ్యాపించింది. పూర్ణిమకు 'దేవకుల్య' అనే కుమార్తె, 'విరజుడు' అనే కుమారుడు పుట్టారు. ఈ దేవకుల్య మరొకజన్మలో విష్ణుపాదమునందు 'గంగ' అను పేరుతో పుట్టి, మూడులోకాలలో ప్రసిద్ధమైన నదీమ తల్లిగా పేరుపొందింది.

అత్రి మహర్షి భార్య అనసూయ. వీళ్ళకి బ్రహ్మ యొక్క అంశతో 'చంద్రుడు', విష్ణువు యొక్క అంశతో 'దుర్వాసుడు, దత్తాత్రేయుడు' అవిర్భవించారు. వీరు ఇట్లా పుట్టడానికి కారణం ఒక కథ ఉంది. వినండి.

అత్రిమహర్షి బ్రహ్మదేవుని ఆజ్ఞ ప్రకారంగా భార్యాసమేతుడై 'ఋక్ష' పర్వతం మీద వంద దివ్య సంతవ్సరాలు తీవ్రమైన తపస్సు చేశాడు. తపస్సు చివరలో "సమస్తలోకాలకూ ప్రభువైన భగవంతుడు నన్ను అనుగ్రహించి, తనతో సమానమైన సంతానాన్ని ప్రసాదిస్తే బాగుండును' అనుకున్నాడు. అట్లా అనుకోగానే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ ఒక్కసారే ప్రత్యక్షమయ్యారు.

మహర్షితో 'వేము చూడడానికి విడిగానూ, ముగ్గురంగానూ కనిపిస్తున్నాం. కానీ మా ముగ్గురిలో ఏ విధమైన భేదమూ లేదు. నువ్వు సమస్తలోకాలకూ ఈశ్వరుడైన వాడిని ధ్యానం చేశావు. వేం ముగ్గురం కలిసే సమస్తలోకాలనూ పాలిస్తున్నాము. అందుకనే నీ కోరిక ప్రకారం మేం ముగ్గురమూ వచ్చాం. నువ్వు సంతానం కోసమేగా తపస్సు చేశావు. నీ కోరిక తప్పక తీరుతుంది. మా ముగ్గురి అంశతో నీకు ముగ్గురు కుమారులు పుడతారు" అని చెప్పి కనిపించకుండా పోయారు. వాళ్ళు ఇచ్చిన వరం కారణంగానే అత్రి అనసూయలకు చంద్ర, దూర్వాస, దత్తాత్రేయులు పుట్టారు.

అంగీరస మహర్షి భార్య 'శ్రద్ధ'. వీళ్ళకు 'సినీవాలీ, కుహువూ, రాకా, అనుమతీ' అనే పేర్లతో నలుగురు కుమార్తెలు పుట్టారు. ఉదద్యుడూ, బృహస్పతీ అనే కుమారులు పుట్టారు.

పులహుడికి 'హవిర్భుక్కు' అనే ఆమె భార్య. వీళ్ళ కుమారుడే అగస్త్యుడు. ఈ అగస్తుడే మరొక జన్మలో 'జఠరాగ్ని' రూపంలో ప్రవర్తించాడు. పులస్త్యుని కుమారుడు 'విశ్రవసుడు'. విశ్రవసుని భార్య 'ఇలబిల.' వీరికి కుబేరుడు పుట్టాడు. విశ్రవసువుకి 'కైకసి' అనే భార్య యందు రావణ, కుంభకర్ణ, విభీషణులు పుట్టారు. 'గతి' అనే ఆమె యందు పులహుని వలన 'కర్మశ్రేష్ఠుడూ, వరీయాంసుడూ, వసిష్ఠుడూ' అనే కుమారులు కలిగారు. 'క్రియా, క్రతువూ' అనే దంపతులకు అరవైవేలమంది పుత్రులు పుట్టారు. మహాతపస్సంపన్నులై

నందువల్ల 'వాలిఖిల్యుల'ని పేరు పొందారు.

వసిష్ఠునికి 'ఊర్జ' అనే భార్యయందు 'చిత్రకేతుడు, సురోచీ, విరజుడు, మిత్రుడు, ఉల్బణుడు, వసుభృద్యానుడు, ద్యుమంతుడు' అని ఏడుగురు ఋషులు పుట్టారు. 'శక్తి' అనే మరొక భార్య యందు 'శక్తి ' మొదలైన నూరుమంది మునులు జన్మించారు.

అథర్వుడికి చిత్త వలన 'దధ్యందుడు', భృగువుకి ఖ్యాతి యందు "ధాతా విధాతా' అనే కుమారులూ, 'శ్రీ' అనే కుమార్తె పుట్టారు. ఆ ధాతా విధాతలు మేరుపుత్రికలైన 'ఆయతీ, నియతీ' అనే వాళ్ళను వివాహం చేసుకుని, 'మృకండుడు, ప్రాణుడు' అనే పుత్రులను పొందారు. మృకండుని కుమారుడు 'మార్కండేయుడు'. ప్రాణుని కుమారుడు 'వేదశిరుడు'. భృగుమహర్షికి ఉశన అనే ఆమె యందు 'కవి' అనే కుమారుడు కలిగాడు. ఈ విధంగా కర్దముని తొమ్మిదిమంది పుత్రికల సంతాన పరంపరతో లోకాలన్నీ పరిపూర్ణమైనాయి.

## దక్షుని సంతతి - నరనారాయణుల పుట్టుక

బ్రహ్మదేవుని కుమారుడైన దక్షుడికీ, స్వాయంభువ మనువు కుమార్తె ప్రసూతి వలన పదహారుమంది పుత్రికలు పుట్టారు. వాళ్ళలో 'శ్రద్ధా, మైత్రీ, దయా, శాంతీ, తుష్టీ, పుష్టీ, ప్రియ, ఉన్నతి, బుద్ధి, మేధా, తితిక్షా, హ్రీమూర్తీ' అనే పదమూడుమంది కన్యలు ధర్మదేవుని ధర్మపత్నులయ్యారు. మిగిలిన ముగ్గురిలో 'స్వాహా' దేవిని అగ్నిదేవునికీ, 'స్వధా'

దేవిని పితృదేవతలకూ, 'సతీ' దేవిని ఈశ్వరుడికీ ఇచ్చాడు. ధర్మదేవుడికి దక్షుని పుత్రికల వలన వరుసగా 'శ్రతమూ, ప్రసాదము, అభయము, సుఖము, మదము, స్మయము, యోగము, దర్పము, అర్ధము, స్మృతీ, క్షేమము, ప్రశ్రయము, నరనారాయణులనే ఇద్దరు ఋషులూ పుట్టారు. ఈ ఋషులు పుట్టినప్పుడు విశ్వమంతా పరమమంగళ రూపం ధరించింది. దేవతలంతా ఆ కారణజన్ములని అనేక విధాలుగా కీర్తించారు. తరువాత ఆ ఋషీశ్వరులు తండ్రి అనుమతి తీసకుని, గంధమాదవ పర్వతంపైకి వెళ్ళి తపస్సు చేశారు. వాళ్ళే భూభారం తీర్చడం కోసం ద్వాపరయుగంలో 'కురు–యదు'వంశాల్లో 'అర్జునుడు–కృష్ణుడు' అనే పేర్లతో పుట్టారు.

అగ్నికి స్వాహాదేవియందు 'పావకుడు, పవమానుడు, శుచీ' అనే ముగ్గురు పుత్రులు పుట్టారు. వీళ్ళ వలన నలభై ఐదు అగ్నులు పుట్టినాయి. తండ్రులతోనూ, తాతలతోనూ కలిసి మొత్తం అగ్నుల సంఖ్య నలభై తొమ్మిది అయింది. బ్రహ్మవాదులంతా యజ్ఞకర్మలలో ఆ అగ్నులను ఆశ్రయించే అగ్నిదేవతాసంబంధమైన ఇష్టులను చేస్తుంటారు. ఆ అగ్నులన్నీ 'అగ్నిష్వాత్తులూ, బర్హిషదులు, సౌమ్యులు, పితలు, అజ్యపులు, సాగ్నులు, నిరగ్నులు' అని ఏడు శాఖలైనాయి. 'స్వధా' అనే ధర్మపత్ని యందు 'వయునా, ధారుణీ' అనే కుమారులు ఉదయించారు.

## ఈశ్వరునిపై దక్షుడు కోపించుట - నందీశ్వరుడు దక్షుని శపించుట

"ఈశ్వరుని భార్య సతీదేవి మహాపతివ్రత. ఈమెకు చాలాకాలం వరకూ సంతానం కలుగలేదు. ఇంతలో దక్షుడు ఈశ్వరుడిని అవమానించాడు. తన భర్తను అవమానించాడన్న కారణంగా తండ్రి మీద కోపంతో యోగమార్గం ద్వారా శరీరాన్ని వదిలిపెట్టింది" అని మైత్రేయుడు చెప్పాడు. అది విన్న విదురుడు ఆశ్చర్యపోతూ ఆ విషయమంతా నాకు వివరంగాచెప్పమని మైత్రేయుని ప్రార్థించాడు. మైత్రేయుడు ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

పూర్వం బ్రాహ్మణులు చేస్తున్న 'సత్రయాగం' చూడడానికి బ్రహ్మాదిదేవతలు, మహర్షులు వచ్చారు. దక్షప్రజాపతి కూడా వచ్చాడు. దక్షుడు రాగానే అందరూ తమ గౌరవాన్ని సూచిస్తూ లేచి నిలబడ్డారు. కానీ బ్రహ్మదేవుడు, ఈశ్వరుడు మాత్రం కూర్చునే ఉన్నారు. దక్షుడు తండ్రి అయిన బ్రహ్మదేవుడికి నమస్కరించాడు. దేవతలు తనకు చేసిన నమస్కారాలను అందుకున్నాడు. కానీ శివుడు తనకు అల్లుడై కూడా తనను చూసి లేవనందుకు, తనకు నమస్కరించనందుకు చాలా కోపగించుకున్నాడు. శివుడని 'యజ్ఞంలో దేవేంద్రాదులతో కలసి హవిర్భాగం తీసుకునే అర్హత, అధికారం పోతాయి' అని శపించాడు. సభలో ఉన్నవారంతా "నువ్వు శివుడి మీద కోపం తెచ్చుకోకూడదనీ, ఆయనను అట్లా శపించకూడదనీ ఎంతగా చెప్పినా దక్షుడు వినలేదు. పైగా చెప్పిన వాళ్ళ మీద

మండిపడుతూ అక్కడినుండి వెళ్ళిపోయాడు. అది చూసి అందరూ మౌనంగా ఉన్నారు.

కానీ ఈశ్వరుడి సేవకుడు నందీశ్వరుడు మాత్రం దక్షుడిపై మండిపడ్డాడు. "ఈ దక్షుడు మానవశరీరమే గొప్పదనుకుని ఎవరికీ ఏ అపకారమూ చెయ్యని, భగవంతుడైన ఈశ్వరుడిపైనే కోపగించి, శాపం పెట్టాడు. మూర్ఖుడైన వీడు అసలు విషయం ఏమిటో తెలుసుకోలేడు. కనుక వీడు అశాశ్వతమైన సుఖం కోరుకుంటూ అర్థవాదాలైన వేదాలతో కర్మతంత్రాన్ని పెంచుతాడు. భౌతికమైన వస్తువులపైనే మమకారం పెంచుకుని, ఆత్మతత్త్వం మరచిపోయి తిరుగుతూ, పశువులాగా స్త్రీలపట్ల కోరిక గలవాడౌతాడు.

ఇంక కొద్దిరోజుల్లోనే వీడికి మేకముఖం వస్తుంది. వీడిని అనుసరించే వాళ్ళంతా కూడా వాళ్ళు ఎంతటి వారైనా సంసార బంధంలో చిక్కుకుని మాటిమాటికీ చస్తూపుడుతూ ఉంటారు. శివుడిని ద్వేషించే బ్రాహ్మణులు మోహంతో కర్మలయందే ఆసక్తి కలవారవుతారు. దేనినిపడితే దానినే తింటూ, చేసే ప్రతిపనినీ శరీరం కోసమే ఉపయోగిస్తూ ధనం కోసం, ఇంద్రియ సుఖం కోసం వ్యామోహపడుతూ యాచకులై తిరుగుతుంటారు' అని శపించాడు.

ఇట్లా వీళ్ళు ఒకళ్ళనొకళ్ళు శపించుకున్నా భగవదనుగ్రహం ఉన్న వాళ్ళు కనుక నశించలేదు. వికలమైన మనస్సుతో ఈశ్వరుడు తన నివాసానికి చేరుకున్నాడు. ఆ

తరువాత బ్రహ్మదేవుడు ప్రయాగ తీర్థ తీరాన నూరు సంవత్సరాలపాటు, వైష్ణవ యజ్ఞం చేశాడు. అందరూ ఆ యజ్ఞం పూర్తైనాక వెళ్ళారు.

## సతీదేవి దక్షుని యజ్ఞానికి వెళ్ళుట - దాక్షాయణిగా తనువు చాలించుట

కాలం గడుస్తున్న కొద్దీ దక్షిడికి అల్లుడి మీద అంతకంతకూ కోపం పెరుగుతుందే గాని తగ్గలేదు. దక్షుడు అల్లుడిని పిలవకుండానే వాజపేయు యాగం చేశాడు. "బృహస్పతిసవనం" అనే యజ్ఞాన్నీ మొదలుపెట్టాడు. ఆ యాగం చూడడానికి దేవతలు, ఋషులు, ప్రజాపతులు, వారి భార్యలూ వచ్చారు.

మరికొందరు ఆ యజ్ఞం గురించి మాట్లాడుకుంటూ ఆకాశ మార్గాన కైలాసం మీదుగా వెళ్తున్నారు. వారి మాటలు విన్ని సతీదేవి పరమేశ్వరుని వద్దకు వెళ్ళి "మీ మామగారు ఏదో గొప్ప యజ్ఞం చేస్తున్నారట. మనం కూడా చూడడానికి వెళ్దామా?" అని అడిగింది. శివుడు సతి మాటలకు చిరునవ్వు నవ్వుతూ "దేవీ! బంధువుల ఇళ్ళకు పిలవకపోయినా వెళ్ళచ్చు. కానీ వాళ్ళు మనలను ఆదరించనప్పుడు ఎట్లా వెళ్తాం? నీ తండ్రి ఎంతో గొప్పవాడే. కానీ నువ్వు నా భార్యవి కదా! అక్కడ నీకు గౌరవం లభించదు. నా మాట కాదని వెళ్ళినా నీకు అక్కడ అవమానం తప్పదు. బంధువుల వలన గౌరవం కలగకపోతే పోనీ, అవమానం జరిగిందా అది మరణంతో సమానమేగా!" అన్నాడు.

వెళ్ళమంటే ఆమె అవమానాల పాలవుతుంది. వద్దంటే దుఃఖిస్తుంది. కనుక ఈశ్వరుడు మౌనంగా ఉండిపోయాడు. మౌనం అంగీకారసూచనమే అన్నట్లు సతీదేవి పుట్టింటిపై ప్రేమతో తనకు శరీరంలో సగభాగము ఇచ్చిన పతినే వదిలిపెట్టి బయలుదేరింది. వేలమంది రుద్రానుచరులూ ఆమె వెంట వెళ్ళారు.

దక్షుని ఇంట బృహస్పతి సవనం మహా వైభవంగా సాగుతోంది. దక్షుడు మహోత్సాహంతో యజ్ఞం చేస్తున్నాడు. అంత హడావుడిలోనూ సతీదేవి రావడం చూశాడు. కానీ కనీసం కళ్ళతోనైనా ఆమెని పలకరించలేదు సరిగదా ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. అది గమనించిన సతీదేవి మిక్కిలి ఆశ్చర్యపోయింది. మనసులోనే దుఃఖించింది. రుద్రుడే లేని ఆ యాగం చూసి సతి రోషంతో ఉంది. రుద్రానుచరులు దక్షుని సంహరిస్తామంటూ ముందుకు పోతుంటే వారిని ఆపింది.

తండ్రితో "ఈశ్వరుడికి ప్రియమైన వాళ్ళూ, అప్రియమైన వాళ్ళూ అంటూ ఎవరూ లేరు. ఆయనకు ఎవరిమీదా మాత్సర్యమూ లేదు. అటువంటి భగవంతుని పట్ల నువ్వు ద్వేషం పెట్టుకోవచ్చా? పెంచుకోవచ్చా? ఇకపై నీకూతురినని చెప్పుకోవడం కంటే సిగ్గులేనిపని నాకు మరొకటి లేదు. తెలియక పాడైన పదార్థం తిన్నవాడు బలవంతాగనైనా దాన్ని కక్కి శరీరాన్ని పవిత్రం చేసుకున్నట్లుగా శివనింద చేసే నీకు కుమార్తెనైన పాపాన్ని ప్రక్షాళన చేసుకోడానికి తుచ్ఛమైన ఈ

శరీరాన్ని వదిలిపెట్టడం తప్ప నేను పవిత్రురాలిని కావడానికి మరొక మార్గం లేదు. కనుక ఈ శరీరాన్ని వదిలేసి పవిత్రతను సంపాదించుకుంటాను” అని ఉత్తర దిక్కుకు తిరిగి, ఆచమనం చేసి, మౌనంగా ఉండి, యోగమార్గంలో అగ్నిని సృష్టించుకుని, శరీరాన్ని ఆ అగ్నితో కాల్చేసుకుంది. అది చూసి అక్కడ ఉన్నవారంతా గగ్గోలుపెట్టారు.

రుద్రానుచరులు దక్షుడి మీదకి దండెత్తారు. భృగువు హోమం చేసి దేవతలను రప్పించాడు. దేవతలు శివానుచరులను తరిమికొట్టారు. ఆ క్షణమే నారదుడు ఈ వార్తను శివుడికి వినిపించాడు. మహాదేవుడు కోపంతో దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చెయ్యాలనుకుని, తన జుట్టును పెరికి నేలమీదకి విసిరికొట్టాడు.

## వీరభద్రుడు దక్షయజ్ఞమును ధ్వంసం చేయుట - దేవతలు చతుర్ముఖునితో మొరపెట్టుకొనుట

వెంటనే అక్కడ రెండవ రుద్రుడా అన్నట్టున్న వీరభద్రుడు ఉదయించాడు. తన వెయ్యి చేతులతో శివునికి నమస్కరించి “నేనేం చెయ్యాలి?” అని అడిగాడు. శివుడు “కుమారా! నా అనుచరులకు నాయకుడివై వెళ్ళి దక్షుడు యజ్ఞం చేస్తున్న చోటికి చేరి, యజ్ఞంధ్వంసం చేసి, దక్షుని సంహరించు. నా అంశతో పుట్టిన నిన్ను బ్రాహ్మణులు గెలవలేరు” అన్నాడు. వెంటనే ప్రమథగణాలను వెంటబెట్టుకుని వీరభద్రుడు దక్షుడి యజ్ఞశాలకు వెళ్ళాడు.

రుద్రగణాలు యజ్ఞశాలలను కూల్చేశారు. వంటశాలను తగలబెట్టారు. యజ్ఞపాత్రలను పాడు చేశారు. హోమాగ్నులను ఆర్పేశారు. ఋషులను బాధించారు. ఋషిపత్నులను భయపెట్టారు. దేవతలను అవమానించారు. అనేక విధాలుగా బాధించి, హింసించారు. రుద్రగణాలు పెట్టే బాధలను తట్టుకోలేక దేవతలూ, మునులూ పారిపోయారు.

దక్షుడు ఈశ్వరుని నిందిస్తుంటే కళ్ళు ఎగరేసి ప్రోత్సహించిన భరుడమహర్షి కళ్ళను పెరికాడు నందీశ్వరుడు. శివనింద వింటూ నవ్విన సూర్యుడికి పళ్ళు ఊడగొట్టాడు చండీశ్వరుడు. ఈశ్వర నింద చేస్తుండగా మీసం తిప్పుకున్న భృగువు యొక్క మీసాలు పెరికేశాడు వీరభద్రుడు.

చివరగా వీరభద్రుడు దక్షుడి మీదపడి ఎంతగానో హింసిస్తున్నాడు. కానీ మంత్ర బలసంపన్నుడైన దక్షుడు ఎంతకీ చావడం లేదు. అప్పుడు వీరభద్రుడు దక్షుడి గొంతు పిసికి, తలను మొండెం నుంచి వేరుచేసి అగ్నికుండంలో పడేశాడు. అది చూసి దక్షుడి బంధువులు దుఃఖిస్తున్నారు. వీరభద్రుడు జయజయధ్వనులు చేస్తూ ప్రమథగణాలతో కైలాసానికి వెళ్ళాడు.

శివకింకరుల చేత అవమానింపబడ్డ దేవతలు బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళి తమ గోడు వినిపించారు. బ్రహ్మదేవుడు దేవతలతో “ఈశ్వరుడికి భాగం లేకుండా యజ్ఞం చెయ్యడం దక్షుడిది తప్పు గదా! ఆ యజ్ఞంలో హవిర్భాగాలు తీసుకోడానికి మీరు వెళ్ళడమూ తప్పే గదా! మీరు చేసిన

తప్పుకే మీరు అవమానింపబడ్డారు. కనుక ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని వెళ్ళి ఆ పరమేశ్వరుడినే ఆశ్రయించండి. ఆయన శరణు వేడిన వారిని ఎప్పుడూ వదిలిపెట్టడు. నేనూ మీతో పాటుగా వస్తాను" అని చెప్పి అందరినీ వెంటబెట్టుకుని కైలాసానికి వెళ్ళాడు.

**(మహదేవుడే దేవాధిదేవుడు... శివనింద చెయ్యడం మహాదోషం... అని మనం తెలుసుకోవాలి.)**

## బ్రహ్మాది దేవతలు ఈశ్వరుని స్తుతించుట - ఈశ్వరుడు దక్షాదులను అనుగ్రహించుట

మహేశ్వరుడు కైలాసంలో ఒక మఱ్ఱిచెట్టు నీడలో కూర్చుని ఉన్నాడు. బ్రహ్మదేవుడు మహేశ్వరునికి నమస్కరించగానే మహేశ్వరుడు కూడా ప్రతినమస్కారం చేసి బ్రహ్మదేవుని తన ప్రక్కనే కూర్చోబెట్టుకున్నాడు.

అప్పుడు సృష్టికర్త లయకర్తతో "సమస్త లోకాలకూ బీజభూతాలైన శివశక్తి రూపాలు రెండూ నీవే. నువ్వే విశ్వనాథుడివి. నీకు ఎటువంటి వికారాలూ లేవు. లోకంలో వాళ్ళందరినీ రాగద్వేషాలతో కట్టిపడేసే విష్ణుమాయ నీ దరిదాపులకు కూడా రాలేదు కదా! తప్పించుకోడానికి వీలులేని మాయలో పడి దోషాలు చేసే వారిని నువ్వు క్షమించాలి. హవిర్భాగం పొందే అర్హతగల నీకే హవిర్భాగాన్ని ఇవ్వనందువల్లనే దక్షుడి యజ్ఞం మధ్యలోనే ఆగిపోయింది. ఆ యజ్ఞం పూర్తిచెయ్యడం కోసం నువ్వు దక్షుడిని మళ్ళీ బ్రతికించాలి. భగుడికి కళ్ళూ, భృగువుకి మీసాలూ, సూర్యుడికి

దంతాలూ ప్రసాదించు. ప్రమథగణాల చేత దెబ్బలు తిని బాధపుడుతున్న వారిని కాపాడు. అంగవైకల్యం పొందిన వారికి అన్ని అవయవాలు సక్రమంగా ఉండేట్లు అనుగ్రహించు. ఆరోగ్యం పోగొట్టుకున్నవారికి ఆరోగ్యాన్ని అనుగ్రహించు" అంటూ ప్రార్థించాడు.

బ్రహ్మదేవుడి ప్రార్థన విన్న మహాదేవుడు "కమలాసనా! నువ్వు చెప్పింది నిజమే. ఎంతటివాళ్ళైనా విష్ణుమాయలో మునిగిపోతుంటారు. అటువంటి వారి పట్ల నాకు జాలి వేస్తుందే కాని కోపం రాదు. దక్షయజ్ఞ ధ్వంసంలో దుఃఖపడిన వారంతా సంతోషాన్ని పొందుతారు. పోగొట్టుకున్నవన్నీ పొందగలుగుతారు" అని చెప్పాడు.

మహాదేవుడి మాటలు విన్న దేవతలంతా చాల సంతోషించారు. మహాదేవుని కూడా తమతో పాటు దక్షయజ్ఞం పరిసమాప్తం చేయించడానికి రమ్మని ప్రార్థించారు. పరమేశ్వరుడు దేవతల ప్రార్థనను అంగీకరించి దక్షుడి యాగశాలకు వెళ్ళాడు. మేకతలతో దక్షుడి మొండెమును అతికించారు. వెంటనే దక్షుడు తన ఎదురుగా ఉన్న శివుడిని చూశాడు. ఆ క్షణంలోనే దక్షుడి మనసు శివునిపై భక్తితో నిండిపోయింది. పరమేశ్వరుని అనేక విధాలుగా స్తోత్రం చేశాడు. పరమేశ్వరుని అనుమతి తీసకుని దక్షుడు యజ్ఞాన్ని పూర్తి చేశాడు.

దక్షపుత్రికగా శరీరాన్ని వదిలినాక సతీదేవి హిమవంతునికి కుమార్తెగా పుట్టి, 'పార్వతి' అనే పేరుతో

ప్రసిద్ధిపొంది, గొప్ప తపస్సు చేసి, మళ్ళీ శివునికే ఇల్లాలు అయ్యింది.

సనకాది యోగీశ్వరులూ, నారదమహర్షీ, హంసుడూ, అరుణుడు, ఋభుడు, యతీ మొదలైన వాళ్ళు యోగనిష్ఠులై గృహస్థాశ్రమం స్వీకరించకపోవడం వలన వాళ్ళ వంశాలు వృద్ధి చెందలేదు.

అధర్వుడికి మృషి అనే భార్య యందు 'దుంభుడు' అనే పురుషుడూ, 'మాయ' అనే స్త్రీ పుట్టి జంట అయ్యారు. వాళ్ళని సంతానం లేని నికృతి పెంచుకున్నాడు. ఆ మాయదంభులకు 'లోభుడనే' పురుషుడూ, 'నికృతి' అనే స్త్రీ పుట్టి దంపతలుయ్యారు. వాళ్ళకి క్రోధుడు, హింస అనే వాళ్ళు పుట్టి భార్యాభర్తలయ్యారు. వాళ్ళకి 'కలీ, నిరుక్తీ' పుట్టి మిధునమయ్యారు. వాళ్ళకి భయమూ, మృత్యువూ అనేవాళ్ళు పుట్టి సతీపతులైనారు. వాళ్ళకి నిరయ–యాతనలు పుట్టారు. వీళ్ళు అధర్మమనే చెట్టు శాఖలని పేరు పొంది ఈ సంసారానికే కారణమైనారు. కనుక శ్రేయస్సును పొందాలనుకునే పురుషుడు వీళ్ళని అనుసరించకూడదని తెలుసుకోవాలి.

**ఇప్పుడు నేను నీకు చెప్పిన ఈ ప్రతిసృష్టిని మూడుసార్లు చదివిన వాళ్ళకి పాపవిముక్తి అవుతుందన్న విషయం ముమ్మాటికీ సత్యం.**

## ధ్రువుడు తపస్సు చేయుట - హరి అనుగ్రహమును పొందుట

లోకపాలన కోసం బ్రహ్మదేవునికి శివుని అంశతో పుట్టిన స్వాయంభువ మనువుకి శతరూపాదేవి యందు

'ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు' అని ఇద్దరు కుమారులు పుట్టారు. ఉత్తానపాదుడికి 'సునీతి, సురుచి' అని ఇద్దరు భార్యలు. ఉత్తానపాదుడికి సునీతిపై అనాదరం. సురుచి ప్రాణసమానం.

సునీతి కుమారుడు ధ్రువుడు. ఒక రోజున ఉత్తానపాదుడు సురుచి కుమారుని ఒళ్ళో కూర్చోబెట్టుకుని ముద్దాడుతున్నాడు. ధ్రువుడు కూడా తండ్రి ఒళ్ళో కూర్చోబోయాడు. కానీ తండ్రి అతడిని చూసీ చూడనట్టు వదిలేశాడు. సవతి తల్లి 'నా కడుపున పుట్టకపోవడం వలన నీకు రాజు ఒళ్ళో కూర్చునే అర్హత లేదు. ఒకవేళ నీకు నీ కోరిక తీరాలంటే శ్రీహరిని గురించి తపస్సు చేసి, ఆయన వలన నా కడుపున కుమారుడిగా పుట్టేట్లుగా వరం పొందు' అని అన్నది.

సవతి తల్లి మాటలు ముళ్ళు గుచ్చుకున్నట్లుగా గుచ్చుకున్నాయి ధ్రువునికి. తండ్రి సవతి తల్లిని మందలించకపోవడం మరింత బాధించింది. వెంటనే తోకతొక్కిన త్రాచుపాములాగా రోషంతో కన్నతల్లి దగ్గరికి వెళ్ళి జరిగినదంతా చెప్పాడు. సునీతి కూడా కుమారుని దుస్థితికి దుఃఖిస్తూ "నీ తండ్రి నన్ను భార్యగానే చూడడం లేదు. కనుకనే నీకు ఆయన ఒళ్ళో కూర్చునే అదృష్టం పట్టలేదు. కాబట్టి నీ కోరిక తీరాలంటే తప్పక నువ్వు శ్రీహరి పాదాలను ఆశ్రయించాల్సిందే" అన్నది.

తల్లి మాటలు విన్న ధ్రువుడు వెంటనే తల్లికి నమస్కరించి, తపస్సు కోసం వనానికి బయలుదేరాడు.

దారిలో ఆ పిల్లవాడికి నారదమహర్షి కనిపించి "ఇంత చిన్న పిల్లవాడవి, ఒంటరిగా అడవిలో ఎక్కడికి, ఎందుకని వెళ్తున్నావు?" అని అడిగాడు.

ధ్రువుడు తనకు జరిగిన పరాభవం చెప్పాడు. అది విని నారదుడు "హాయిగా ఆడుతూ పాడుతూ గడపాల్సిన ఈ చిన్న వయసులో నీకు మాటపట్టింపులెందుకు? అయినా హరి అనుగ్రహం పొందాలంటే యోగమార్గాన్ని అవలంబించాలి. సుఖదుఃఖాలు రెండింటినీ సమానంగా చూడాలి. దైవనిర్ణయం ప్రకారం ఏది వచ్చినా సంతోషంగా అనుభవించాలి. సుఖం వస్తే పొంగిపోకూడదు. దుఃఖం వస్తే క్రుంగిపోకూడదు. నిజమైన విజ్ఞానం ఇదే. నీకంటే గుణవంతుడైన వాడిని చూసి సంతోషపడాలి. నీకంటే గుణహీనుడైన వాడిని చూసి దయ చూపించాలి. నీతో సమానుడైతే స్నేహం చెయ్యాలి. ఇట్లా ప్రవర్తిస్తే తాపత్రయాల నుండి విముక్తి లభిస్తుంది" అని చెప్పాడు.

"మహర్షీ! సుఖదుఃఖాలకు లొంగిన వాళ్ళకి విజ్ఞానం లభించదంటున్నారు. నేను క్షత్రియుడనై పుట్టడం వలన నా సవతి తల్లి మాటలు నన్ను బాధిస్తున్నాయి. మరి నా పిరిస్థితి ఏంటి? తండ్రి తొడపై కూర్చునే యోగ్యతే లేని నాకు ఎవరూ పొందలేని, సమస్తలోకాలలో ఉన్నతమైన స్థానాన్ని పొందాలని కోరిక. కనుక మీరే నా కోరిక తీర్చుకునే ఉపాయం చెప్పాలి. ఆ కోరిక తీరే దాకా నాకు తోచదు, శాంతి ఉండదు" అన్నాడు ధ్రువుడు.

ధ్రువుడు చెప్పిన మాటలు విని నారదుడు చాలా ఆశ్చర్యపోయాడు. “ఓ బాలుడా! కేవలం శ్రీహరిని తలుచకుంటేనే నీకు ఈ కోరిక కలిగింది. కాబట్టి నువ్వు నిరంతరం ఏకాగ్రమైన మనస్సుతో సర్వకాల సర్వావస్థల్లోనూ (ఏ పని చేస్తున్నా, ఎక్కడ ఉన్నా) ఆ శ్రీహరినే ధ్యానిస్తూ ఉండు. “ఓం నమో భగవతే వాసుదేవాయ” అనే పన్నెండు అక్షరాల మహామంత్రాన్ని నిరంతరం జపం చేస్తూ ఉండు. శ్రీహరి తనను ఆరాధించే వాళ్ళకి ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలనూ ప్రసాదిస్తాడు” అని చెప్పాడు.

ధ్రువుడు వెంటనే నారదుని అనుమతి తీసుకుని మధువనానికి వెళ్ళాడు. నారదుడు ఉత్తానపాదుడి దగ్గరకి వెళ్ళి, కుమారుడి కోసం విచారిస్తున్న అతడిని ఓదార్చి, “నీ కుమారుని దేవతలకే రక్షకుడైన పద్మనేత్రుడే రక్షిస్తున్నాడు. అతడు మూడు లోకాలలో విఖ్యాతుడైన పురుషుడై తిరిగి వస్తాడని” ఓదార్చి తన దారిన తాను వెళ్ళాడు.

మధువనానికి చేరిన ధ్రువుడు యమునలో స్నానం చేసి నారదుడు ఉపదేశించిన విధంగా తపస్సు చేయుడం మొదలుపెట్టాడు. అతడి తపఃశ్శక్తి కారణంగా సమస్త ప్రాణులకూ ప్రాణం కదలిక ఆగిపోతోంది. అది గమనించి ఇంద్రాదిదేవతలు విష్ణువు వద్దకు వెళ్ళి “సమస్త ప్రాణులకూ ప్రాణనిరోధం జరుగుతోంది. ఇదివరకెన్నడూ ఇటువంటి బాధ రాలేదు. ఇప్పుడిలా రావడానికి కారణమే తెలియడం లేదు.

స్థితి కారకుడవైన నువ్వే మమ్మల్ని రక్షించాలి” అంటూ మొరపెట్టుకున్నాడు.

వాళ్ళ మొర విన్న శ్రీహరి చిరునవ్వుతో “ఉత్తానపాదుని కుమారుడైన ధ్రువుడు అనే ఐదేళ్ళ బాలుడు ప్రపంచస్వరూపడినైన నన్నే తన మనసులో నిలుపుకుని తపస్సు చేస్తున్నాడు. అందుకని మీ కందరికీ ప్రాణం అడ్డగింపబడుతోంది. నేను ఈ క్షణమే అతనికి ప్రత్యక్షమై అతడి తపస్సును ఆపుతాను. మీరు నిర్భయంగా మీ మీ నివాసాలకు వెళ్ళమని అభయమిచ్చి పంపించి, ధ్రువుడి ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

ధ్రువుడు తన ఎదురుగా ప్రత్యక్షమైన శ్రీహరిని చూసి, పులకిస్తున్న శరీరంతో ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. అనేక విధాలుగా స్తోత్రం చేశాడు. ఆ బాలుని స్తోత్రాలకు హరి కరిగిపోయాడు.

ఆనందంతో “రాకుమారా! నీ కోరిక ఏమిటో నాకు తెలుసు. నీ కోరిక తప్పక తీరుతుంది. ఈ రోజు నుండి ఇరవై ఆరువేల సం॥లు గడిచిన తరువాత నువ్వు ప్రళయకాలంలోనూ నశించనిదీ, లోకోన్నతమైనదైన ‘ధ్రువపదాన్ని’ పొందుతావు. అప్పటి దాకా నీ తండ్రి వలన లభించిన సింహాసనమెక్కి, ప్రజాపాలన చేస్తూంటావు. సమస్త ప్రజారంజకంగా ఉంటుంది నీ పాలన.

నీవు నాకు ప్రీతికలడగం కోసం ఎన్నో యజ్ఞాలు చేసి, అత్యధికమైన దక్షిణలను ఇచ్చి బ్రాహ్మణులను

సంతోషపెడతావు. చివరి దశలో నన్నే తలుచకుంటూ సప్తర్షుల మండలం కంటే కూడా ఉన్నతమైన నా స్థానాన్ని అలంకరిస్తావు" అని చెప్పి అదృశ్యుడయ్యాడు.

**భగవంతుని పట్ల భక్తి ఏదో ఒక విధంగా చిన్నతనం నుండే పిల్లలకు అభ్యాసం చేయించడం పెద్దల బాధ్యత. వాళ్ళ అభివృద్ధికి అదే సరియైన రాజమార్గము చూపిస్తుందనే విషయం తల్లిదండ్రులు గ్రహించాలి. తనను చూసి పుత్రోత్సాహం పొందేలే చేశాడు తండ్రిని ధ్రువుడు.**

తరువాత ధ్రువుడు "నారాయణుడే ప్రత్యక్షమైతే మోక్షం కాకుండా ఉన్నతమైన పదం కోరుకుని, ఆరునెలల నా తపస్సుని వృధా చేసుకున్నాను. లౌకికమైన కోరిక కోరుకున్నానంటే నా మనస్సు ఇంకా నిర్మలం కాలేదు. నారదమహర్షి చెప్పినట్లే జరిగింది. ఆయుర్దాయం లేని రోగికి ఎన్ని మందులు వాడినా గుణం కనిపించనట్లే నాకు విష్ణువే సాక్షాత్కరించినా ఈ సంసారం మీద భ్రాంతి పోలేదు' అని ఆలోచించుకుంటూ తన నగరానికి చేరుకున్నాడు.

కుమారుడు నగరానికి వస్తున్న సమాచారం తెలుసుకున్న ఉత్తానపాదుడు మంత్రి, బ్రాహ్మణ, పురప్రముఖాదులందరినీ వెంట బెట్టుకుని అతడికి ఎదురొచ్చి స్వాగతం పలికాడు. రథం దిగి కుమారుని గట్టిగా కౌగిలించుకుని ఆనందభాష్పాలతో అతడిని అభిషేకించాడు.

ధ్రువుడు తల్లులకు, తండ్రికీ సాష్టాంగ నమస్కారం చేసి, తమ్ముని కౌగిలించుకున్నాడు. సవతి తల్లి ధ్రువుడిని

ప్రేమాదరాలతో దగ్గరకు తీసుకుని "చిరంజీవివై వర్ధిల్లమని' ఆశీర్వదించింది. భగవదనుగ్రహాన్ని పొందిన ప్రాణుల (మహాత్ముల)పట్ల ఎవరికీ ఏ విధమైన ద్వేషమూ ఉండదు. సమస్త ప్రాణికోటీ ఆ మహానుభావులకు వశమై ఉంటాయి.

సునీతి కూడా కుమారుని దగ్గరకు తీసుకుని కొన్ని క్షణలపాటు బయటి ప్రపంచాన్ని మరిచిపోయింది. మహారాజు ధ్రువుడిని భద్రగజంపై ఎక్కించి నగరంలోకి తీసుకువచ్చాడు. కుమారుని గుణాలు తలచుకుని పొంగిపోతూ ఉత్తానపాదుడు అంతటి పుణ్యమూర్తి జన్మనిచ్చినందుకు ధన్యుడనయ్యా ననుకున్నాడు. ధ్రువుడికి రాజ్యమప్పగించి తపోవనానికి వెళ్ళాడు.

ధ్రువుడు మాత్రం నారదమహర్షి చెప్పిన విషయాలకు అనుగుణంగానే ప్రవర్తిస్తూ, ప్రజారంజకంగా పాలిస్తూ, 'భ్రమీ, ఇలా' అనే కన్యలను వివాహం చేసుకున్నాడు. భ్రమి వలన కల్పుడూ, వత్సరుడూ అనే కుమారులనూ, ఇల వలన 'ఉత్కలుడు' అనే కుమారునీ, మిక్కిలి సౌందర్యవంతురాలైన కుమార్తెనూ పొందాడు.

సురుచి తనయుడు ఉత్తముడు వివాహం చేసుకోలేదు. ఒకరోజు వేటకువెళ్ళిన ఉత్తముడికి హిమవత్పర్వత ప్రాంతంలో ఒక యక్షుడితో తగాదా వచ్చింది. ఆ తగాదాలో ఉత్తముడు మరణించాడు. ఆ వార్త విన్న సురుచి ఎవరికీ చెప్పకుండా అరణ్యాలకు వెళ్ళి, అక్కడ ఏర్పడిన దావాగ్నిలో చిక్కుకుని బూడిదైపోయింది.

## ధ్రువుడు కుబేరానుచరులతో పోరాడుట - కుబేరుడు ధ్రువుడికి సుస్థిరమైన హరిభక్తిని అనుగ్రహించుట

తమ్ముడిని కుబేరుడి అనుచరుడైన యక్షుడెవడో చంపాడని విన్న ధ్రువుడు శోకరోషాలతో ఊగిపోతూ అలకాపురానికి వెళ్ళి యక్షులను యుద్ధానికి పిలిచాడు. వాళ్ళేమో మాయలు తెలిసిన పదమూడు వేలమంది. ధ్రువుడేమో ఎంత పరాక్రమవంతుడైనా మానవుడు. పైగా ఒక్కడు.

అయినా వాళ్ళు ధ్రువుడి ధాటికి తట్టుకోలేక నగరంలోకి పారిపోయారు. తరువాత కుబేరుని సేవకులైన రాక్షసులు ధ్రువుడి మీదకి యుద్ధానికి వచ్చారు. ఈ రాక్షసుల అండ చూసుకుని పారిపోయిన యక్షులూ మళ్ళీ యుద్ధానికి వచ్చారు.

హరిభక్తుడైన ధ్రువుడికి విజయం లభించాలన్న కోరికతో కొంతమంది మహర్షులు ధ్రువుడి దగ్గరకు వచ్చి "వీళ్ళ రాక్షస మాయలకు నువ్వేం భయపడకు. ఈ రాక్షసులను సంహరించగల శ్రీమహావిష్ణువే నీకు ఇష్టదైవం కదా! కనుక ఆయనను తలచుకుని శత్రువులపై విజృంభించు. మరుక్షణంలో వాళ్ళ మాయలన్నీ పటాపంచలవుతాయి. తప్పక నీకు విజయమే సిద్ధిస్తుంది" అని చెప్పారు.

ధ్రువుడు మహర్షులు చెప్పినట్లే చేశాడు. సమస్త శత్రువులను సంహరించే నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని ధాటికి నిలువలేక ఎందరో యక్షరాక్షసులు పరలోకాలకు చేరుకున్నారు.

అది చూసి తన మనుమడిని ఈ హింసాకార్యం నుండి ప్రక్కకు తిప్పాలని స్వాయంభువ మనువు ఋషిసమూహంతో వచ్చి "నీ తమ్ముడిని ఎవరో చంపితే నువ్వు ఈ యక్ష రాక్షసులే అతడిని చంపారిని వీరిని తుదముట్టపెడుతున్నావు. కోపం నరకానికి రాజమార్గం. పరమశివుడికి పరమభక్తుడైన కుబేరుని అనుచరులని ఎందరినో చంపావు గదా! ఈ పని కపాలకునికి అప్రియమైనదే కదా! కాబట్టి ఇప్పిటికైనా తప్పు తెలుసుకుని, పశ్చాత్తాపంతో ఆ కుబేరుని పూజించి, నీపట్ల ప్రసన్నుని చేసుకో" అని హితబోధ చేసి మనువు తన దారిన తాను వెళ్ళాడు.

ఇంతలో కుబేరుడే ధ్రువుడి దగ్గరకు వచ్చి, తనకు నమస్కరించిన ధ్రువుని ఆశీర్వదించి "నీ తాతమాట విని యుద్ధం ఆపినందుకు చాలా సంతోషం. జీవుల చావు పుట్టుకులకు కారణం కాలమే. నీ తమ్ముని యక్షలు చంపలేదు. నువ్వూ యక్షులను చంపలేదు. 'బుద్ధిని పట్టి పని జరుగుతుంటుంది'. చేసిన పనిని బట్టి జీవులకు సుఖదుః ఖాలు వస్తుంటాయి. ఆ సుఖదుఃఖాలు కూడా నువ్వూ, నేనూ అనే భేదబుద్ధి మీద ఆధారపడి ఉంటాయి. ఆ భేద బుద్ధికి మూలం ఈ శరీరమే. నేను (ఆత్మ)అని అనుకోవడమే కారణం. కనుక ఆ భేద బుద్ధికి కారణమైన భ్రాంతిని తొలగించుకోటానికీ, ఆత్మజ్ఞానం కలగడానికీ సమస్త ప్రాణులలోనూ ఉన్న ఆ భగవంతుని ఆరాధించు. నీకు శుభం

కలుగుతుంది. నన్ను చూడడం వలన నీకు ఏదో మేలు జరగాలి కనుక ఏదైనా వరమడుగు ఇస్తాను” అన్నాడు.

ధ్రువుడు కృతజ్ఞతాపూర్వకంగా కుబేరుడికి నమస్కరించి “శ్రీహరి పట్ల స్థిరమైన భక్తిని ప్రసాదించమని” ప్రార్థించాడు. కుబేరుడు ధ్రువుని కోరిక తీర్చి అదృశ్యుడయ్యాడు.

తరువాత ధ్రువుడు రాజ్యానికి వచ్చి, ప్రజారంజకంగా పాలిస్తూ తనకు నారాయణుడు చెప్పిన కాలం పూర్తి కాగానే రాజ్యాన్ని కుమారునికి అప్పగించి తపోవనానికి వెళ్ళాడు. మనసులో సమస్త చింతలనూ వదిలేసి, శ్రీహరిని మాత్రమే నిలుపుకుని, తీవ్రమైన తపస్సు చేసి, విష్ణుపదానికి చేరుకున్నాడు.

కానీ తనకు ఈ భాగ్యాన్ని కలిగించిన తల్లిని భూలోకంలోని విడిచి వచ్చాను కదా అని చింతిస్తున్నాడు ధ్రువుడు. అప్పుడు విష్ణు భక్తులైన నందసునందులు “మహారాజా! భూలోకంలో మీకు ఇష్టమైన వాళ్ళు ఇంకెందరో ఉన్నారు కదా! మరి వాళ్ళ గురించి ఎందుకు ఆలోచించవు. ఏదేమైనా భూలోకంలో ఉన్నంతవరకే బంధుమిత్రులు. ఈ పరలోకంలో ఎవరిగతి వారిదే. వాళ్ళ వాళ్ళపుణ్య పాపాలను బట్టి స్వర్గనరకాలు వస్తాయి. అయినా నీ తల్లి నీకంటే ముందుగానే దివ్యవిమానంలో పుణ్యలోకాలకి వెళ్ళిపోతుంది చూడు” అని ఆ విమానాన్ని చూపించారు ధ్రువుడికి.

ధ్రువుడు తల్లిని చూసి సంతుష్టుడై గ్రహ మండలాన్నీ

సప్తర్షి మండలాన్నీ కూడా దాటి, విష్ణు పదానికి చేరుకుని, 'త్రిలోక చూడామణిగా' ఈనాటికీ వెలిగిపోతున్నాడు. ఆ మహాత్ముడికి ఆ పదవి నుండి జారడమనేదే లేదు."

**('మాతృదేవోభవ' అనే వేదవాక్యాన్ని చివరి క్షణం దాకా అనుసరించి, ఆచరించి చూపించాడు ధ్రువుడు. తానెంతటి గొప్పవాడైనా ఆ స్థితిని అనుభవించడానికి కారణమైన శరీరాన్ని ఇచ్చిన తల్లిని ఏ లోకంలోనూ మరిచిపోకూడదని సూచిస్తోంది ధ్రువ చరిత్ర.)**

ఇట్లా మైత్రేయుడు చెప్పినదంతా విన్న విదురుడు ప్రచేతసుల గురించీ, వాళ్ళు చేసిన యజ్ఞం గురించీ, దాని కారణం మొదలైన విషయాలన్నీ చెప్పమని అడిగాడు. మైత్రేయుడు ధ్రువుడి తరువాత జరిగినది చెప్పడం మొదలుపెట్టాడు.

ధ్రువుడి పెద్దకుమారుడు ఉత్కలుడు యోగనిష్ఠుడైన కారణంగా అతడి తమ్ముడు వత్సరుడు రాజయ్యాడు. వత్సరుడి భార్య సర్వర్ధి. ఆ దంపతులకు "పుష్పార్ణుడు, చంద్రకేతువు, ఇషుడు, ఊర్జుడు, వసువు, జయుడు" అని ఆరుగురు కుమారులు.

పుషార్ణుడికి "ప్రభా, దోషా" అని ఇద్దరు భార్యలు. "ప్రాత, మధ్యందిన, సాయం" అనే ముగ్గురు పుత్రులు ప్రభకి. 'పదోష, నిశీధ, వ్యుష్టులనే' ముగ్గురు పుత్రులు దోషాకి కలిగారు. వీళ్ళలో వ్యుష్టునికి 'పుష్కరుణి' అనే భార్య యందు 'సర్వతేజుడు' అనే కుమారుడు పుట్టాడు. ఈ సర్వతేజుడకీ,

ఆకూతికీ కలిగిన పుత్రుడే 'చక్షుర్మనువు'. ఈ చక్షుర్మనువుకి 'అద్వల' అనే భార్య యందు 'పురువూకుత్సుడు, త్రితుడు, ద్యుమ్నుడు, సత్యవంతుడు, ఋతుడు, వ్రతుడు, అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, సద్యుమ్నుడు, శిబి, ఉల్ముకుడు' అని పన్నెండు మంది కొడుకులు పుట్టారు. వీరిలో ఉల్ముకుడికి 'పుష్కరిణి' అనే స్త్రీ యందు 'అంగుడు, సుమనసుడు, ఖ్యాతి, క్రతువు, అంగిరసుడు, గయుడు' అని ఆరుగురు పుత్రులు కలిగారు. ఆ అంగుడికి సునీలాదేవి యందు పుట్టినవాడే వేనుడు.

## వేనుని అరాచకాలు నాస్తికత - వేనుడు మహర్షుల కోపాగ్నిలో దహించబడుట

వేనుడు తల్లి వైపు తాతగారైన మృత్యువు లాగా క్రూరుడై ధనుర్బాణాలు ధరించి పశుపక్షిమృగాలను ఏ కారణం లేకుండానే చంపేవాడు. చిన్నతనంలో తనతో అడుకునే పిల్లలనూ చంపేవాడు. అదిచూసి వేనుడి తండ్రి అంగుడు తన మనసులో ఇటువంటి దుర్మార్గుడైన కొడుకు పుట్టడం కంటే కొడుకే లేకుండా ఉంటే బాగుండేది గదా! దుర్మార్గుడైన కుమారుడి వలన తండ్రికి అపకీర్తి, అధర్మము, సమస్త జనులతో విరోధము, మానసికమైన వేదనా కలుగుతాయి.

ఇంతటి దుర్మార్గుని వదిలిపెట్టలేక మోహంలో మునిగే మానవుడి ఇల్లే దుఃఖానికి నిలయం. కనుక నాకు శోకాన్ని కలిగించే ఈ కుమారునీ, ఈ ఇంటినీ విడిచిపెట్టడమే నేను చెయ్యాల్సిన పని అని నిశ్చయించుకున్నాడు. ఒకరోజు రాత్రి

ఎవరికీ చెప్పకుండా భార్యనీ, రాజ్యాన్నీ కూడా వదిలిపెట్టి అరణ్యానికి వెళ్ళిపోయాడు.

తెల్లవారినాక మంత్రులు చారులను పంపించి మహారాజును వెతికించారు. కానీ రాజు జాడ తెలియలేదు. చేసేదిలేక సునీతాదేవి అనుజ్ఞ తీసుకుని వేనుడినే సింహాసనం ఎక్కించారు. అసలే కోతి. దానికి కొబ్బరికాయ దొరికింది. నిప్పు తొక్కింది. ఆపైన కల్లు తాగింది అన్నట్లుగా అసలే క్రూరుడైన వేనుడికి సింహాసనం దొరికింది. అధికారం లభించింది. ఇంకా వేనుడి క్రూరత్వం పెచ్చుమీరిపోయింది.

వేదశాస్త్రాలు చదవకూడదు.. యజ్ఞయాగాదులు చెయ్యకూడదు. దానధర్మాల పేరే ఎత్తకూడదు. ఏ దేవతనూ పూజింపకూడదు. నాస్తికత్వానికి మారుపేరై తనకు అనుకూలంగా లేని వారిపై ఇష్టమొచ్చినట్టు ప్రవర్తించడం, పెద్దలను తిరస్కరించడం మొదలుపెట్టాడు.

వేనుడు చెప్పేదీ, చేసేదీ చూసిన ఋషుల 'దేశం అరాచకమైతే దుర్మార్గుల వలన సజ్జనులు బాధలు పడతారు. అనర్హుడిని రాజుగా చెయ్యడం వలన ఇంతటి అనర్థాలు కలుగుతున్నాయి. మనం వెళ్ళి ఇది తగినపని కాదని హెచ్చరిద్దాం. వింటాడా సుఖపడతాడు. లేదా చేసిన దోషాలకు తగిన ఫలం అనుభవిస్తాడు' అని నిర్ణయించుకుని, వేనుడి దగ్గరకు వెళ్ళారు.

"మహారాజా! మీరు సంపూర్ణ ఆయుర్దాయంతో, భోగభోగ్యాలు అనుభవిస్తూ, సుఖశాంతులతో తుల

తూగుతుండాలని ఆశీర్వదించారు. మనం ధర్మాన్ని రక్షిస్తే (ఆచరిస్తే) అది మనను రక్షిస్తుంది. ప్రజలు ధర్మాన్ని ఆచరించాలంటే రాజు ధర్మాత్ముడై ఉండాలి. బ్రాహ్మణులకు 'యజ్ఞాలు చెయ్యడం, చేయించడం, వేదం చదవడం, చదివించడం, దానం చెయ్యడం, దానం పుచ్చుకోవడం" అనే ఆరూ పరమధర్మాలు. ఇవి చెయ్యకూడదని శాసించి అధర్మంగా ప్రవర్తించడం మీకు న్యాయమేనా? ప్రజా రంజకంగా పాలించే రాజు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖాలను అనుభవిస్తాడు. కనుక నువ్వు బ్రాహ్మణ ధర్మాలకు అడ్డుచెప్పి ఆటంకాలు కలిగించకు" అంటూ నచ్చ చెప్పారు.

నాస్తికుడైన వేనుడికి మహర్షుల మంచి మాటలు చెవికెక్కలేదు సరిగదా! వారితో "మీరు రాజు రూపంగా భగవంతుడిని నన్ను పూజించడం మానేసి ఎవరినో ఈశ్వరుడని పూజిస్తారా? నాకంటే పూజ్యనీయుడు మరొకడు లేదు. దేవతలంతా నాతోనే ఉన్నారు. అందరూ నన్నే పూజించాలి. వేశ్యావృత్తికి అలవాటు పడిన స్త్రీ భర్తను మోసం చేసి పరపురుషుడి దగ్గరకు వెళ్ళినట్లు మీరు నన్ను వదిలేసి వేరెవరినో పూజించడం ఏమిటి?" అన్నాడు.

ఆ మాటలు విన్న మహర్షుల కళ్ళు కోపంతో ఎర్రబడినాయి. ఆ కళ్ళతో ఒక్కసారి వేనుడిని చూశారు మహర్షులు. వేనుడి శరీరం మహర్షుల చూపుల నుండి పుట్టిన ఒక గొప్ప అగ్నిలో నిలువునా కాలిపోయింది. ఆ క్షణంలోనే వేనుడు సింహాసనం నుండి నేలమీదకి జారాడు. సునీతాదేవి

కుమారుడు మరణించడం చూసి దుఃఖించింది. యోగశక్తితో అతడి శరీరం శిథిలమవకుండా రక్షించింది. రాజు లేకపోవడంతో రాజ్యంలో దుర్మార్గులు హెచ్చు మీరి సాధుజనుల మీద విజృంభించడం మొదలుపెట్టారు.

అప్పుడు మహర్షులు హరిభక్తులైన అంగవంశం అంతరించకూడదనే సంకల్పంతో, ఆ వంశస్థులనే రాజుగా చేస్తే ధర్మం నిలబడుతుందనే స్థిర నిశ్చయంతో వేనుడి శరీరాన్ని మధించారు. అప్పుడు ఆ శరీరంలో నుండి కాకిఆలాంటి నల్లటి రంగు, కురుచగా ఉన్న అవయవాలతో ఒక పురుషుడు పుట్టి "నన్నెందుకు పుట్టించారు?" అని మహర్షులను అడిగాడు. "ఈ పుట్టినవాడు రాజ్యానికి అర్హుడు కాడు" అని నిర్ణయించుకున్న మహర్షులు "నిషీద" అనడంతో అతడి పేరు "నిషాదుడు" అయ్యింది. "నిషీద" అంటే "ప్రక్కకి తొలగిపొమ్మని" అర్థం. అతడు నగరం వదిలేసి దూరంగా ఉండిపోయాడు. అతడి వంశం వాళ్ళే నిషాదులనే పేరుతో కొండల్లో, అడవుల్లో తిరగేవారయ్యారు.

**పృథుచక్రవర్తి పుట్టుట - భూమినుండి ఓషధులను పితుకుట**

మహర్షులు మళ్ళీ వేనుడి శరీరాన్ని చిలికారు. అప్పుడు అందులో నుండి ఒక మహా తేజశ్శాలి అయిన ఒక పురుషుడు, మహా సౌందర్యవతి అయిన ఒక కన్య పుట్టారు. ఆ పరుషుడే విష్ణుమూర్తి అంశతో పుట్టిన "పృథువు" ఆ కన్య లక్ష్మి అంశతో పుట్టిన "అర్చి". అర్చి విష్ణువును వరించింది, అప్పుడు దేవతలు పూలవాన కురిపించారు. బ్రహ్మాది దేవతలు ఈ దంపతులను

చూడడానికి వచ్చారు. మునీశ్వరులు మహాదానందంతో ఆ పురుషోత్తముడికి రాజుగా పట్టాభిషేకం చేశారు. దేవతలంతా ఆ రాజుకి ఎన్నో గొప్ప కానుకలను సమర్పించారు. వందిమాగధులు అతని గుణగుణాలను స్తుతిస్తుంటే అట్లా స్తుతించడం మంచిది కాదని వారించాడు. మహారాజు వినయానికి అందరూ ముచ్చట పడ్డారు.

పృథుమహారాజు పాలన చేపట్టిన కొంతకాలానికి భూమి సారహీనమైపోయింది. పంటలు లేకపోవడంతో ప్రజలంతా ఆకలిమంటలతో అల్లాడిపోతూ మహారాజుతో మొరపెట్టుకున్నారు. వాళ్ళ గోడు విన్న పృథుచక్రవర్తి కరిగిపోయాడు. ప్రజలకు ఆహారపదార్థాలను ప్రసాదించి రక్షిస్తుంది కనుక భూమికి 'అవని' అని పేరు. మరి ఇప్పుడు భూమి ఆ పని చెయ్యిపోవటం ఆమె దోషమే కదా!' అని మహారాజు భూమి మీద ఆగ్రహంతో ధనుర్బాణాలను పట్టుకున్నాడు. రాజు యొక్క కోపానికి భయపడిన భూదేవి బోయవాడికి భయపడి పారిపోయే లేడి లాగా గోరూపాన్ని ధరించి పారిపోసాగింది. మహారాజు కూడా గోవు వెంట పరిగెత్తాడు.

తనను వెంబడిస్తున్న రాజుకి భయపడి వణికిపోతూ గోమాత రాజుతో "మహాత్మా! ధర్మతత్పరుడివైన నువ్వు ఆపదల్లో చిక్కుకున్న వాళ్ళని రక్షించేవాడివి. సమస్త ప్రాణులనూ రక్షిస్తానని కంకణం కట్టుకున్నావు. నేను ఏ పాపము చేయని దీనురాలిని. పైగా ఆడదానిని. నువ్వు నా

మీద ఎందుకు కోపం తెచ్చుకున్నావు? ధర్మతత్త్వజ్ఞులు తప్పు చేసిన స్త్రీలను కేకలేస్తారే కానీ చంపరు గదా! పైగా సమస్త ప్రాణులనూ భరించిన నేను నశిస్తే ఈ ప్రాణులన్నీ ఎక్కడ ఎట్లా జీవిస్తాయి? ఈ మాత్రం ఆలోచించడం లేదేమిటి నువ్వు?" అన్నది.

అప్పుడు పృథువు భూదేవితో "నువ్వు నా ఆజ్ఞను పాటించడం లేదు. యజ్ఞాలలో హవిర్భాగాలను తీసుకుంటూ కూడా ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచడం లేదు. పైగా గోరూపాన్ని ధరించి గడ్డి తింటూ పాలు కూడా ఇవ్వకుండా నీలోనే దాచుకుంటున్నావు. బ్రహ్మదేవుడు నీకు అనుగ్రహించిన సమస్త ఓషధీ బీజాలను మొలకెత్తనివ్వకుండా నీ శరీరంలోనే దాచుకుని ఉండడం నీ తప్పు కాదూ! నిన్ను చంపైనా సరే నా ప్రజల ఆకలి తీర్చడం నా బాధ్యత. నువ్వు స్త్రీవే. కానీ ప్రాణి హింసకు భయపడడం లేదు. కనుక నిన్ను చంపినా నాకు పాపం రాదు. ఒకవేళ నువ్వు నశించినా నా యోగమహిమతో ప్రాణులను ఉద్ధరిస్తాను.. ఉద్ధరించగలను" అని ధనస్సు ఎక్కుపెట్టి, బాణం సంధించాడు.

పృథువు యొక్క భయంకరాకారాన్ని చూసి భూదేవి భయపడుతూ "మహారాజా! నువ్వు పరమపురుషుడివైనప్పటికీ మాయను అనుగ్రహించి, సుగుణుడివై, అనేక రూపాలు ధరించి లోకాలను నడిపిస్తున్నావు. ఈ జీవులందరికీ ఆధారభూతంగా ఉండమని నన్ను సృష్టించిన నువ్వే నన్ను చంపబోతున్నావు. నన్ను నువ్వు కాకపోతే మరెవరు రక్షిస్తారు?

కాబట్టి కోపాన్ని వదిలేసి నన్ను ఆదరించవయ్యా! పూవులకు ఏ విధమైన హాని కలగకుండా వాటిలోని మకరందాన్ని త్రాగే తుమ్మెదలాగానే పురుషుడు కూడా ఉపాయంతో సారాంశం తీసుకోవాలిగా! ఉపాయం ఆలోచించకుండా చేసే పని వలన శ్రమ కలుగుతుందే తప్ప ఫలితం మాత్రం రాదు. పూర్వం రాజులు స్వార్థంతో ప్రజలను దుర్మార్గులను చేస్తూ వచ్చారు. నా నుంచి పుట్టిన పంటలు సజ్జనులకు అందలేదు. అందుకని అప్పటినుంచీ నేను ఓషధీబీజాలను నాలోనే దాచుకుంటూ వచ్చాను. ఇప్పుడు ఆ ఓషధులను బయటకి తీయాలంటే నువ్వు నాకు ఒక దూడను కల్పించి, పాలు తీయగల సమర్థుడిని కూడా తీసుకురావాలి. దూడను చూడగానే గోవు ఓషధులను పాలరూపంలో ఇవ్వడం మొదలుపెడుతుంది. పాలు పితికేవాడు నేర్పరితనం గలవాడైతే గోవును లాలిస్తూ తన పని చక్కబెట్టుకుంటాడు" అన్నది.

భూదేవి మాటలు మెచ్చుకున్న చక్రవర్తి తానే పాలుపితికేవాడిగా నిలబడి, మనువును దూడగా చేసి, మానవులకు కావలసిన వస్తువులను గోరూపాన్ని ధరించిన భూమి నుండి పాలరూపంలో పితికాడు. ఆ తరువాత ఋషులు బృహస్పతిని దూడగా చేసుకుని వేదమయమైన పాలను పితుక్కున్నారు. దేవతలు ఇంద్రుడిని దూడగా చేసుకుని కాంతి, బలపరాక్రమామృతమైన పాలను పిండుకున్నారు. ప్రహ్లాదుని దూడగా చేసుకుని, సురారూప వయస్సును పిండుకున్నారు. తరువాత అప్సరసలు, గంధర్వులు, పితృదేవతలు, సిద్ధులు

మొదలైన వారంతా విశ్వావసువు, సూర్యుడు, కపిలుడూ మొదలైన వాళ్ళని దూడలుగా చేసుకుని తమకు కావలసిన పదార్థాలను పాలరూపంలో పిండుకున్నారు.

తరువాత చక్రవర్తి అందరి కోరికలూ తీర్చిన భూదేవిని కుమార్తెగా స్వీకరించి ఆదరించాడు. తన ధనస్సు యొక్క కొసతో కొండలను పడగొట్టి, నేల అంతా వ్యవసాయానికి పనికి వచ్చేట్లుగా చేశాడు. సమస్త జాతుల ప్రజలకూ జీవదాతగా నిలిచి సాటిలేని కీర్తిని సమపార్జించాడు. సరస్వతీ నదీ తీరంలోని మనుక్షేత్రంలో నూరు అశ్వమేధయాగాలు చెయ్యాలని సంకల్పించుకుని ప్రారంభించాడు.

## పృథువు దేవేంద్రుడితో సఖ్యము చేయుట -చివరకు పరమాత్మలో ఐక్యమగుట

పృథువు మానవులకూ, మహర్షులకూ, దేవతలకూ కూడా ప్రీతిపాత్రుడే. మహారాజు యజ్ఞశాల ఎప్పుడూ అతిథి అభ్యాగతులతోనూ, విధ్వాంసులతోనూ నిండి ఉండేది. యాచకులు అడిగినదానికంటే ఎక్కువ ముట్టచెప్పేవాడు. యజ్ఞశాలలకు యాచకులుగా వచ్చిన ప్రతి ఒక్కరూ సంతృప్తితో చక్రవర్తిని వేనోళ్ళతో కీర్తిస్తుండేవారు.

ఈ విధంగా పృథువు తొంభై తొమ్మిది అశ్వమేధయాగాలు పూర్తి చేశాడు. నూరవ యజ్ఞానికి అన్నింటినీ సమకూర్చుకుని యజ్ఞాశ్వాన్ని దేశాటనకు వదిలిపెట్టాడు. అశ్వరక్షకుడిగా పృథువు యొక్క కుమారుడు వెళ్ళాడు.

నూరుయజ్ఞాలు చేసేవాడంటే భయపడే దేవేంద్రుడు పృథువు యొక్క యజ్ఞానికి ఆటంకం కలిగించాలనుకుని పాషండ వేషంలో వచ్చి అశ్వాన్ని అపహరించాడు. పృథుకుమారుడు అశ్వం కనిపించకుండా పోయినందుకు ఎంతో చింతిస్తున్నాడు. అప్పుడు అత్రిమహర్షి అతనికి అశ్వాన్ని అపహరించుకుపోతున్న అమరపతిని చూపించాడు. పృథుకుమారుడు “అశ్వాన్ని అపహరించినా ఆ పుణ్యాత్మునిపై బాణం ఎట్లా వెయ్యడం” అని సందేహిస్తున్నాడు. అత్రిమహర్షి యజ్ఞంలో హవిర్భాగాన్ని స్వీకరిస్తూ కూడా కృతఘ్నుడై దొంగతనం చేసిన ఈ దేవరాజు రూపాన్ని చూసి మోసపోకుండా అతడిని ఎదుర్కొని నీ తండ్రి యజ్ఞాశ్వాన్ని నీ స్వాధీనం చేసుకో” అని హెచ్చరించాడు.

వెంటనే పృథుకుమారుడు అమరేంద్రుడి మీదకి దండెత్తి తన పరాక్రమం చూపించాడు. అతడి ధాటికి తట్టుకోలేక అమరేంద్రుడు అశ్వాన్ని వదిలేసి అదృశ్యుడయ్యాడు. రాకుమారుడు యజ్ఞాశ్వంతో యజ్ఞశాలకు తిరిగిరావడం చూసి మహర్షులు సంతోషించి, మెచ్చుకుని, “జితాశ్వు” డని బిరుదు ఇచ్చారు.

ఇంత జరిగినా దేవరాజు తన దుర్బుద్ధిని విడువక యజ్ఞశాలలో ఉన్న గుర్రాన్ని మళ్ళీ అపహరించాడు. సేవకుల వలన ఆ వార్త విన్న రాకుమారుడు అత్రిమహర్షి అనుగ్రహంతో దేవరాజుని మళ్ళీ ఓడించి, గుర్రాన్ని తిరిగి యజ్ఞశాలకు తీసుకువచ్చాడు. దేవేంద్రుడు యజ్ఞాశ్వాన్ని అపహరించడానికి

వేసుకుని విడిచిన రూపాలను కొందరు మూఢులు ధరించారు. వాళ్ళే కాపాలికులు అయి యజ్ఞాలకు విరోధులయ్యారు.

వీళ్ళు చెప్పేది అధర్మమే. అయినా ధర్మంలాగా అనిపిస్తుంటుంది. ధర్మరక్షణలో దక్షుడైన పృథువు అధర్మప్రచారానికి మూలకారణుడైన దేవరాజు మీద కోపంతో బాణం వెయ్యబోయాడు. కానీ "యజ్ఞ దీక్షాపరుడు పశువును తప్ప మరేప్రాణినీ చంపకూడదు" అని మహర్షులు చక్రవర్తిని శాంతింపచేశారు.

మహర్షులంతా కలిసి తమ మంత్రశక్తితో దేవరాజునే యజ్ఞపశువుగా చేసి అగ్నికుండంలో ఆహుతిగా వేస్తాము" అని చెప్పి మహావీర్యవత్తమములైన మంత్రాలు చదువుతూ హోమం చెయ్యబోతున్నారు. ఇంతలో వాళ్ళ ఎదుట బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు.

"మహర్షులారా! యజ్ఞం చేస్తున్నది దేవతలను సంతోషపెట్టడానికే గదా. దేవతలంతా విష్ణు అంశతో పుట్టినవారే గదా! మరి విష్ణు అంశతో పుట్టిన ఇంద్రుడిని చంపడం మీకు ధర్మం కాదుగదా! నూరు యజ్ఞాలు పూర్తి చేసినవాడికి ఇంద్ర పదవి వస్తుంది గదా! ఇతడు ఈ యజ్ఞం పూర్తి చేస్తే తన పదవి జారిపోతుందనుకుని, ఈ విధంగా యజ్ఞానికి ఇంద్రుడు ఆటంకం కలిగిస్తున్నాడు. దీనిని మహర్షులైన మీరు సాక్షులుగా ఉండి చూడాలే తప్ప ప్రతీకారం చెయ్యకూడదు. ఈ పృథుచక్రవర్తికి తొంభై తొమ్మిది అశ్వమేధయాగాలు చేసిన ఫలం వస్తుంది. కనుక మీ ప్రయత్నం మానమని ఆదేశించాడు.

అప్పుడు మహర్షులు పృథు చక్రవర్తితో "ఈ యజ్ఞాలు కోరికలు గలవాళ్ళు చెయ్యవలసినవి. నువ్వేమో మోక్షం పొందాలనుకుంటున్నావు. మరి ఇంద్రుడి మీద కోపం ఉంటే నీకు మోక్షం ఎట్లా వస్తుంది? ఇంద్రుడు కూడా సామాన్యుడేం కాదు. ఎన్నో పుణ్యకార్యాలు చేసిన అతనితో మైత్రి చేసుకో. దాని వలన మీ ఇద్దరికీ శ్రేయస్సు కలుగుతుంది. పైగా నువ్వు వేనరాజు వలన లోకంలో లోపించిపోయిన వైదిక క్రియాకలాపాలను పునరుద్ధరించడం కోసమే నారాయణుని అంశతో పుట్టావు. కనుక నిన్ను సృష్టించిన నా కల్పానికి వ్యతిరేకంగా ప్రవర్తించగూడదు. అదీ గాక నీకు ఈ రోషం ఇంద్రుడి మాయవల్లనే కలుగుతోంది. నువ్వు ఆ మాయను జయించాలి గాని దానిలో చిక్కుకోకకూడదు. దానికి లొంగిపోకూడదు" అన్నాడు.

వెంటనే పృథువు బ్రహ్మదేవుని ఆజ్ఞ ప్రకారంగా అప్పటివరకూ ఇంద్రుడి పట్ల ఉన్న మాత్సర్యాన్ని వదిలేసి అతడితో బద్ధస్నేహం చేశాడు. యజ్ఞం పూర్తి కాగానే బ్రాహ్మణులు, దేవతలు కూడా మహారాజుని దీవించి అనేక వరాలు ఇచ్చారు. సదస్సులోని వారంతా "మహారాజా! నువ్వు చేసిన దానాలూ, సన్మానాలూ స్వీకరించి మానవులు అందరూ సంతృప్తి పొందారు. పితృదేవతలు, దేవతలు, మహర్షులు నీ పూజల వలన సంప్రీతులయ్యారు. నువ్వు కృతార్థుడివయ్యావు" అని మెచ్చుకున్నారు. ఇంతలో ఇంద్రుడితో పాటుగా ప్రత్యక్షమయ్యాడు శ్రీమన్నారాయణుడు.

పృథువుతో శ్రీమన్నారాయణుడు "నీ యాగానికి ఆటంకం కలిగించిన ఇంద్రుడు క్షమించమని నిన్ను ప్రార్థిస్తున్నాడు. నీ వంటి మహాత్ములు దేహాభిమానంతో ప్రాణులకు ఏ విధమైన కీడు కలిగించరు. కనుక ఇతడిని క్షమించు. సుఖదుఃఖాలను సమానంగా చూస్తూ లోకరక్షణం చేస్తూ ఉండు. **పాలకులకు లోకరక్షణకు మించిన ధర్మం లేదు. ప్రజారక్షాపరాయణులైన రాజులకు ప్రజలు చేసే పుణ్యంలో ఆరవవంతు లభిస్తుంది. ఒకవేళ రాజు ప్రజలను రక్షించని పక్షంలో మహారాజు చేసిన పుణ్యాలన్నీ నశించిపోవడమే కాదు. ప్రజల పాపాలకూ అతడే ఉత్తరదాయిత్వాన్ని పొందుతాడు.** నువ్వు పుణ్యాత్ముడివి కనుక నా అంతట నేనే నీ దగ్గరకు వచ్చాను నీకు ఏం వరం కావాలో అడుగు ఇస్తాను" అన్నాడు.

మహారాజు పాదాల మీద వ్రాలిన సురపతిని పైకి లేపి "అన్నా! నిన్నూ, నన్నూ, సమస్త ప్రాణికోటినీ నడిపించేది జగన్నాథుడేగా! మనం చేసేది ఏముంది? నువ్వు నన్ను క్షమించమని అడగడమేమిటి? నేను నిన్ను క్షమించదగినవాడిని కాను'' అంటూ దేవేంద్రుడిని మన్నించాడు.

తనను అనుగ్రహించడానికి వచ్చిన జగన్నాథునితో పృథువు "నువ్వు నాపట్ల చూపిస్తున్న వాత్సల్యం కంటే కోరుకోదగినది ఏముంది? ఎల్లప్పుడూ నీ కల్యాణగుణాలను విని ఆనందించే అదృష్టం తప్ప నాకు మోక్షం కూడా అక్కర్లేదు.

కనుక నీ కథలను వినడానికి నాకు పదివేల చెవులను ప్రసాదించు. నీ గుణాలు వినాలనే కోరిక కలవాడు మరింకేదైనా కోరుకుంటాడా?

పృథువు చెప్పింది విని నారాయణుడు సంతోషించి, అతడి కోరిక తీర్చి, అదృశ్యుడయ్యాడు. మహారాజు నారాయణ సాక్షాత్కారానికి పొంగిపోతూ నగరంలోకి ప్రవేశించాడు. ప్రజారంజకంగా పాలన సాగిస్తున్నాడు.

ఇంతలో ఒకరోజు సనకసనందాది మహర్షులు పృథువు దగ్గరకు వచ్చారు. పృథువు వారికి ఎదురెళ్ళి స్వాగత సత్కారాలు పలికి అర్ఘ్యపాద్యాదులతో పూజించాడు. పృథువు వినయానికి సంతోషించిన సనత్కుమార మహర్షి అతనికి మోక్ష మార్గాన్ని ఉపదేశించాడు. వాళ్ళు వెళ్ళినాక పృథువు మహర్షి చెప్పిన మార్గానే తలుచుకుంటూ, రాజ్యాన్ని కుమారులకు అప్పగించి, భార్యతో కలిసి తపోవనానికి వెళ్ళాడు.

తరువాత యోగనిష్ఠతో శరీరాన్ని వదిలిపెట్టి పరమాత్మలో ఐక్యమయ్యాడు. ఆయన భార్య అర్చి కూడా శరీరాన్ని వదిలిపెట్టి పరమపదమునే పొందింది.

## పృథువు యొక్క వంశక్రమ వర్ణన - ప్రచేతసులు రుద్రోపదేశమును పొందుట

పృథువుకు "విజితాశ్వుడు, హర్యశ్వుడు, ధూమ్రకేశుడు, వృకుడు, ద్రవిణుడు'' అని ఐదుగురు కొడుకులు. విజితాశ్వుడికి శిఖండి అనే స్త్రీ యందు త్రేతాగ్నులు పుత్రులయ్యారు. వాళ్ళు "పావకుడు, పవమానుడు, శుచీ"

అనే పేర్లతో ప్రసిద్ధులయ్యారు. వాళ్ళు మానవులై పుట్టినా తమ గొప్పదనంతో మళ్ళీ అగ్నులై వాళ్ళ స్థానాలను పొందారు.

విజితాశ్వుడికి సభస్వతి అనే మరొక భార్యయందు 'హవిర్ధనుడు' అనే కుమారుడు పుట్టాడు. హవిర్ధానుడికి హవిర్ధావి యందు "బర్హిష్మదుడు, గయుడు, శుక్లుడు, కృషుడు, సత్యుడు, జితవ్రతుడు" అని ఆరుగురు కొడుకులు పుట్టారు. ఈ హవిర్ధావి భూలోకమంతటినీ యజ్ఞశాలగా చేసి, ప్రాచీనాగ్రకుశలతో నింపడం వలన "ప్రాచీన బర్హి" పేరుతో ప్రసిద్ధుడయ్యాడు.

ప్రాచీనబర్హికి 'శతధృతి' అనే భార్యయందు పదిమంది కొడుకులు పుట్టారు. వీళ్ళే సమానమైన పేర్లు, వ్రతాలూ గలవారై 'ప్రచేతసులు' అని పేరు పొందారు. ఈ ప్రచేతసులు తండ్రి ఆజ్ఞ ప్రకారంగా ప్రజాసృష్టి చేస్తామని ఒప్పుకున్నారు.

కానీ మొదట తపస్సు చేసి విష్ణువు యొక్క అనుగ్రహం సంపాదించాలనుకుని అడవులకు వెళ్ళారు. అక్కడ అడవిలో ఒకచోట వారికి సజ్జనుల హృదయంలాగా స్వచ్ఛమైన నీటితో నిండిన ఒక పద్మం కనిపించింది. ఆ పద్మంలో ఒక దివ్య పురుషుడు కనిపించాడు.

ఆ దివ్య పురుషుడు అపరిమితమైన అనుగ్రహాన్ని ప్రసాదించే రుద్రుడే. తనకు భక్తితత్పరులై నమస్కరించిన ప్రచేతసులకు రుద్రుడు సనకాదులకు బ్రహ్మదేవుడు ఉపదేశించిన శ్రీహరి స్తోత్రాన్ని ఉపదేశించాడు.

తరువాత వాళ్ళతో "మీరు ఈ స్తోత్రాన్ని నిరంతరం చదువుతూ, సర్వేశ్వరుడిని స్తోత్రం చేసి, ధ్యానం చేసి, పూజిస్తూ

ఉండండి. ఈ స్తోత్రం చదవడం వల్లనే భృగుమహర్షి మొదులుగా గల మేమంతా తమోగుణాలను పోగొట్టుకుని, అనేక విధ ప్రజాసృష్టులను చెయ్యగలిగాము. మీరు కూడా ఏకాగ్రమనస్కులై ఈ స్తోత్రం చదివితే మీ కోరిక నెరవేరుతుంది" అని చెప్పి అదృశ్యుడయ్యాడు. ప్రచేతసులు రుద్రుడు చెప్పినట్లుగా పదివేల సంవత్సరాలు నీటి మధ్యలోనే ఉండి శ్రీహరి స్తోత్రాన్ని చదివారు.

## నారదుడు ప్రాచీనబర్హికి జ్ఞానమార్గమును ఉపదేశించుట - పురంజయోపాఖ్యానమును వివరించుట

ఇంతలో ఒకరోజు నారదమహర్షి ప్రాచీన బర్హి దగ్గరకు వచ్చి "నువ్వు లెక్కలేనన్ని యజ్ఞాలు చేసి లెక్కలేనన్ని పశువులను చంపావు. అవి అన్నీ నీమీద పగతో లోహాయంత్రమ యములైన కొమ్ములతో నిన్ను పొడవడానికి పరలోకంలో ఎదురుచూస్తూ ఉన్నాయి. వాటి బారిన పడకుండా నిన్ను నువ్వు రక్షించుకోడానికి నీకు ఒక కథ చెప్తాను విను" అన్నాడు.

పూర్వం ''పురంజనుడు'' అనే రాజు తాను నివసించడానికి తగిన పురం కోసం వెతుకుతున్నాడు. తిరగ్గా తిరగ్గా అతడికి హిమాలయాలకి దక్షిణం వైపున ఒక మనోహరమైన పురం కనిపించింది. ఆ పురానికి తొమ్మిది ద్వారాలున్నాయి. ప్రతి ద్వారానికీ కవాటాలు, కిటికీలు, తోరణాలు, గుమ్మాలు, గోపురాలు ఉన్నాయి. బంగారంతోనూ, వెండితోనూ నిర్మించిన శిఖరాలతో కూడిన మందిరాలు ఉన్నాయి. చూడడానికి అపర స్వర్గంలా ఉంది.

ఆ పురానికి ముందువైపున ఒకతోట, అందులో ఒక సరస్సు ఉన్నాయి. ఆ సరస్సులో విహరిస్తూ ఉన్న రకరకాల పక్షులు, వాటి ధ్వనులతో అటు వెళ్తున్న వాళ్ళ మనస్సులను ఆకర్షిస్తున్నాయి. అక్కడ ఒక అందమైన యువతి వెయ్యిమంది పరివారంతో విహరిస్తోంది. వాళ్ళలో వందమందికి ఒక నాయకుడు ఉన్నాడు. అట్లా పదిమంది నాయకులు. ఐదు తలలుగల ఒక నాగుడు ఆ యువతికి దారి చూపిస్తున్నాడు.

ఈ పురంజన మహారాజు ఆమె చక్కదనానికి, తన గాంభీర్యాన్ని పోగొట్టుకుని, ఆమెతో "నువ్వు ఎవరు? నీ వంశం ఏమిటి? నీ తండ్రి ఎవరు? నీ చుట్టూ ఇంతమంది సేవకులు ఎవరు? ఎందుకున్నారు?" అంటూ ఆమె వివరాలు అడిగాడు. ఒకసారి తనవైపు చూడమని ఆమెను బ్రతిమిలాడాడు.

ఆ యువతి ఆ రాజుతో "నా తండ్రి ఎవరో నాకు తెలియదు. నా ఊరుపేరు ఇతర వివరాలు ఏవీ నాకు తెలియవు. చాలాకాలం నుండి ఇక్కడే ఉంటున్నాను. కానీ దీన్ని ఎవరు కట్టారో కూడా చెప్పలేను. నా చుట్టూ ఉన్నారే వీళ్ళంతా నా స్నేహితులు. ఈ నాగుడు నేను నిద్రపోతున్నప్పుడు ఈ పురాన్ని పాలిస్తుంటాడు. నా అదృష్టం బాగుంది గనుక నువ్వు ఇక్కడికి వచ్చావు. నీ ఇంద్రియాలు సంతృప్తి కలిగించే సామాగ్రినంతటినీ నేను నీకు సమకూరుస్తాను. తొమ్మిది ద్వారాలు గల ఈ పురాన్ని నువ్వే పాలించు. ఈ పురానికి నువ్వే ప్రభువువి. నాకు నీకంటే ఇష్టమైన వాళ్ళే లేరు. తెలివిగల వాడివైన నిన్ను వదిలేసి

వేరొకళ్ళని ఎట్లా పెళ్ళాడతాను? గృహస్థాశ్రమమే ధర్మార్థ కామమోక్షాలను నాలుగింటినీ సంపాదించి పెడుతుందని పెద్దలంటారు కదా! కనుక నువ్వు నన్ను వివాహమాడి ఈ పురాన్ని పాలిస్తూ సమస్త భోగభాగ్యాలనూ అనుభవించు" అన్నది.

పురంజనుడు ఆ యువతి చెప్పిన మాటలను మనసుకు ఎక్కించుకున్నాడు. తన తిరుగుడికి తగిన ఫలితం లభించిందనుకున్నాడు. ఆ సుందరిని గాంధర్వ విధిననుసరించి వివాహం చేసుకుని సకల భోగభాగ్యాలను అనుభవిస్తున్నాడు.

అక్కడ ఆమె సేవకులు సూచించిన విధంగా నడుచుకుంటూ భార్యాపుత్రుల వలన కలిగే మోహప్రసాద హర్షాలతో నిరంతర కర్మాసక్తుడు, కామాసక్తుడు అయ్యాడు. అతడి బుద్ధే అతడిని మోసం చెయ్యడం వలన అతడు ఆమె దాహం తీర్చుకున్నాక తాను దాహం తీర్చుకోవడం దగ్గరనుండి సమస్తమైన పనులు ఆమె ఏది చేస్తే అదే తానూ చెయ్యడమే అతడి పనిగా ఉన్నాడు. బుద్ధి వియోగాన్ని పొందిన పురంజనుడు ఈ విధంగా స్వతంత్రతను పోగొట్టుకున్నాడు. ఒక రకంగా అతడు ఆమెకు పెంపుడు జంతువులాంటి వాడైపోయాడు.

ఒకరోజు రాజు ఐదు గుర్రాలు, రెండు చక్రాలు, ఒకే ఇరుసు, ఒకే పగ్గము, ఒక్కడే సారథీ కల రథం ఎక్కి వేటకు వెళ్ళి, పంచప్రస్థమనే వనంలోకి ప్రవేశించి, రాక్షస బుద్ధితో

ధర్మం తప్పి చెయ్యకూడని రోజులలో మృగసంహారం చేశాడు. చాలాసేపు వేటాడినాక మహరాజుకి ప్రియురాలు గుర్తుకు వచ్చింది.

సరాసరి అంతఃపురానికి వెళ్ళాడు. అక్కడ ఆమె కనపడలేదు రాజుకి. సేవకుల వలన సమాచారం తెలుసుకుని ఆమె వద్దకు వెళ్ళి, అనేక విధాలుగా బతిమాలి, బుజ్జగించి, ప్రసన్నురాలిని చేసుకుని, భోగాలు అనుభవించాడు. మహారాజుకి ఆమె వలన పదకొండు వందలమంది కుమారులు, నూటొక్కమంది కుమార్తెలు పుట్టారు.

వారందరినీ పెద్దచేసి, అందరికీ తగినవాళ్ళని చూసి వివాహాలు జరిపించాడు. అప్పటికి మహారాజు వయస్సు సగం గడిచిపోయింది. కానీ భార్యాపుత్రుల మీద మమకారం మాత్రం కాస్త కూడా తగ్గలేదు. తన వాళ్ళ సంపద వృద్ధి చెందడం కోసం ఎన్నో యజ్ఞాలు చేశాడు. ఎన్ని యజ్ఞాలు చేశాడో అన్ని పశువులను బలి ఇచ్చాడు.

ఇంతలో చండవేగుడనే గంధర్వరాజు మూడువందల అరవైమంది గంధర్వవీరులతో వచ్చి, ఆ పురాన్ని ముట్టడించాడు. పురపాలకుడైన ప్రజాగరుడు నూరుసంవత్సరాలు ఆ గంధర్వులతో యుద్ధంచేసి, ఆ పురాన్ని రక్షించాడు. కానీ తరువాత అతడు బలహీనుడైపోయాడు. పురంజనుడు మాత్రం భోగాసక్తితో పురరక్షణ పట్ల శ్రద్ధ చూపించలేదు.

ఇది ఇట్లా ఉండగా పూర్వం యయాతి తనయుడైన పూరవును వరించింది కాలపుత్రిక దుర్భగ. ఆమె కొంతకాలం

అతనితో గడిపినాక అతడిని పోగొట్టుకుని, తనకు తగిన మరొక పురుషుని కోసం వెతుకుతోంది. యవనరాజు సోదరుడైన ప్రజ్వారుని చేపట్టింది. ఆ యవనరాజు ప్రజ్వారుని నాయకత్వంతో సైన్యాన్ని పురంజనపురాన్ని తన ఆధీనం చేసుకోవడానికి పంపించాడు.

ప్రజ్వారునితో పాటు కాలకన్యక కూడా వచ్చింది. ఆమె రాకతో పురుషుడు బలం తగ్గుతోంది. ఆ కారణంగా పురంజనుడు శత్రువును ఓడించలేకపోయాడు. తన వాళ్ళకి రాబోయే కష్టాలను తలుచుకుంటూ దుఃఖిస్తున్నాడు. చివరికి పురాన్నే వదిలిపెట్టవల్సి వచ్చింది. భయుడు వచ్చి అతడిని పట్టుకెళ్తున్నాడు. పురంజనుడు అప్పటికీ భార్యాపుత్రుల కోసమే విచారిస్తున్నాడే కానీ తన పూర్వ స్నేహితుడైన ఈశ్వరుడిని మాత్రం తలుచుకోవడం లేదు.

భయుడు పురంజనుడిని సరాసరి నరకానికి తీసుకెళ్ళాడు. అక్కడ ఇంతకు ముందు యజ్ఞాల్లో పురంజనుడి చేత చంపబడ్డ పశువులు ఎప్పుడు అతడి మీద పగ తీర్చుకుందామా...!అని ఎదురు చూస్తున్నాయి.

నరకంలో పురంజనుడు ఆ పశువుల వలన అనేక బాధలు పడి, తరువాత జన్మలో విదర్భరాజుకి "ప్రమదోత్తమ" అనేపేరుతో కూతురై పుట్టాడు.

ఆ ప్రమదోత్తమకు యుక్తవయస్సు వచ్చినాక తండ్రి స్వయంవరం ప్రకటించాడు. అందులో పాండ్యరాజ కుమారుడైన మలయకేతువు ఈమెను చేపట్టాడు. వీళ్ళకి ఒక కుమార్తె, ఐదుగురు కుమారులు కలిగారు. ఈ కుమారులు

ద్రవిడదేశ పాలకులై చాలామంది సంతానాన్ని పొందారు. మలయకేతు కుమార్తె "ధృతవ్రత". ఈమెను అగస్త్యుడు వరించాడు. అగస్త్యుని అనుగ్రహంతో ఆమెకు "దృధచ్యుతుడు" అనే మునీశ్వరుడు పుట్టాడు. మలయకేతువు రాజ్యాన్ని కుమారులకు అప్పగించి, అరణ్యవాసం చేస్తూ తపోనిష్ఠుడై, తనలో తనే పరబ్రహ్మదర్శనాన్ని, పరబ్రహ్మలో తనను చూసుకుంటూ శరీరాన్ని వదిలి మోక్షం పొందాడు.

ప్రమదోత్తమ భర్త మరణం చూసి గుండె పగిలే విధంగా ఏడుస్తోంది. "ఇప్పుడు నా గతి ఏంటి? నువ్వు లేకపోతే నేను ఎట్లా బ్రతకగలనని విలపిస్తూ భర్తతో పాటు తానూ చితిపైకి ఎక్కబోయింది. ఇంతలో ఒక బ్రాహ్మణుడు అక్కడకు వచ్చి ఆమెకు సంబంధించిన వివరాలూ, ఆమె దుఃఖానికి కారణమూ అడిగాడు.

ఈ జన్మలో బంధం వలన అతడిని విడవలేక దుః ఖిస్తున్నావా? గత జన్మలో మనిద్దరం ప్రాణస్నేహితులం కదా! అప్పుడు నీకు నా మీద ఉన్న మమకారం ఏమైంది? మనది వెయ్యేళ్ళ స్నేహం. నువ్వు భూలోక సుఖాలు అనుభవించాలనే కోరికతో నన్ను వదిలేసి ఐదు ఆరామాలు, తొమ్మిది ద్వారాలూ కల ఒక పట్టణంలోకి ప్రవేశించావు. దానిని ఒక స్త్రీ పాలిస్తుండేది.

ఐదు ఆరామాలు అంటే ఐదు ఇంద్రియాలు. తొమ్మిది ద్వారాలంటే ముక్కూ, నోరూ మొదలైనవి. ఆ పురంలో ప్రవేశించిన పురుషుడంటే స్త్రీలోలత్వమూ, జ్ఞానరహితుడైన

మానవుడు. ఆ పురుషుడివి నువ్వే. స్త్రీ సౌఖ్యమే గొప్పదనుకుంటూ, అంతకు ముందున్న జ్ఞానాన్ని పోగొట్టుకుని, మరణించే సమయంలో స్త్రీనే తలుచుకుంటూ మరణించావు. అందుకే ఈ జన్మలో ఆడదానిగా పుట్టావు. ఇదీ నీ కథ.

నువ్వు విదర్భ రాజకుమార్తెవీ కాదు. ఇతడు నీ భర్తా కాడు. ఆనాడు ఆ స్త్రీ చేత పాలించబడిన పట్టణంలో నివసించిన పురంజనుడివీ కావు. "అదివరకు స్త్రీవి, ఇప్పుడు పురుషుడిని" అని అనుకోవడం భ్రమ మాత్రమే. ఇంతా నా మాయ వలననే జరిగింది. మొదట మనిద్దరం హంసలం..." అంటూ ఆ రూపాలు చూపించి.. "నువ్వే నేను, నేనే నువ్వు. మనిద్దరకీ ఏమాత్రం తేడా లేదు. ఈ విషయం విద్వాంసులకు మాత్రమే తెలుస్తుంది. అద్దంలో తన రూపాన్ని చూసుకునే వాడికి ఆ నీడ మరొక రూపమని ఎట్లా అనిపిస్తుందో అట్లాగే మనిద్దరికీ భేదం ఉన్నదనే భావన కూడా కలుగుతూ ఉంటుంది. కానీ నువ్వు పూర్వపు నా మిత్రుడివైన హంసవే" అని చెప్పాడు.

అప్పుడు ప్రమదోత్తమకు అజ్ఞానం నశించి, విజ్ఞానం కలిగింది.

ఈ విధంగా ప్రాచేతబర్హికి నారదమహర్షి ఈ కథకు సంబంధించిన రహస్య విషయాలను వివరించి తన దారిన తాను వెళ్ళిపోయాడు. ప్రాచేతబర్హి, ఆ క్షణమే రాజ్యాన్ని వదిలేసి, కపిలమహర్షి ఆశ్రమానికి వెళ్ళి, శ్రీహరిని గూర్చి తపస్సు చేసి అవ్యయానందాన్ని పొందాడు.

తరువాత ప్రచేతసులు తండ్రి ఆజ్ఞ ప్రకారంగా నీటి మధ్యలో ఉండి శ్రీహరిని గురించి తపస్సు చేశారు. శ్రీహరి ప్రత్యక్షమై "పితృవాక్యపాలన చేసిన మీ కీర్తి లోకమంతటా వ్యాపిస్తుంది. బ్రహ్మ జ్ఞాన సంపన్నుడు, వంశవృద్ధికరుడైన కుమారుని కూడా పొందుతారు. మీరు కండుమహర్షి కుమార్తె 'మారిష'ను వివాహం చేసుకోండి. చివరకు మీరు నన్నే చేరుకుంటారు" అని వరాలిచ్చాడు. అడగకుండానే వరాలు ఇచ్చినందకు ప్రచేతసులు ఆనందించారు.

శ్రీహరితో "నువ్వు ప్రత్యక్షమవ్వడమే మాకు గొప్పవరం. నిన్ను ఏ వరం ఇమ్మని అడగగలం? దాహంతో ఉన్న పిల్లవాడు సముద్రంలోని నీటిని ఎన్ని తాగగలుగుతాడు? అపారమైన నీ మహిమ దేనినైనా ప్రసాదించగలదు. కనుక మాకు 'ఈలోకంలో ఉన్నంతకాలం నీ భక్తులతో స్నేహం చేసే భాగ్యాన్ని అనుగ్రహించు' అని వేడుకున్నారు.

వాళ్ళు కోరిన వరమిచ్చి హరి అంతర్హితుడయ్యాడు. తరువాత ప్రచేతసులు శ్రీహరి ఆజ్ఞగా మారిషను వివాహమాడారు. వీళ్ళకి పుట్టినవాడే దక్షుడు. కొంతకాలమైనాక మారిషను దక్షుని వద్దనే ఉంచి ప్రాచేతసులు తపస్సుకు వెళ్ళారు.

నారదుడు వాళ్ళ ఆశ్రమానికి వచ్చి, వాళ్ళ కోరిక మేరకు వాళ్ళకు హరిమహిమను చెప్పి, ఆత్మ తత్త్వోపదేశం చేసి, సర్వభూతాంతర్యామి అయిన శ్రీమన్నారాయణమూర్తిని సేవించమని చెప్పి బ్రహ్మలోకానికి వెళ్ళారు. విష్ణుసేవతో

కాలం గడిపిన ప్రచేతసులు ముక్తికాంతా మహాహరులయ్యారు. ప్రియవ్రతుడు కూడా నారదోపదేశంతో రాజ్య భారాన్ని కుమారులకు అప్పగించి, హరిధ్యాన తత్పరుడై శరీరాన్ని వదిలాడు.

ఈ విధంగా మైత్రేయుడు చెప్పినదంతా విని విదురుడు మిక్కిలి సంతోషంతో, తన వాళ్ళను చూడాలనే కోరికతో హస్తినాపురానికి తిరిగివెళ్ళాడు.

## శ్రీమద్భాగవతము నందలి నాలుగవ స్కందము పరిసమాప్తము.

## ఐదవ స్కందము

### ప్రియవ్రతుని పరాక్రమం - ప్రియవ్రతుడు విష్ణుసాన్నిధ్యాన్ని చేరడం

సూతుడు శౌనకాది మహర్షులు ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

శుకమహర్షిని పరీక్షిన్నరేంద్రుడు “ప్రియవ్రతుడు పరమ భాగవతోత్తముడై ఆత్మారాముడు ఎట్లా అయ్యాడు? సంసారంలో ఉంటే భక్తి కలగదు. భక్తిలో మునిగితే సంసారం పట్టదు కదా! కనుక ప్రియవ్రతుని గాథను ప్రియమార చెప్పమని” అడిగాడు.

పరీక్షిత్తుకి కలిగిన సందేహం తీర్చడానికి శుకయోగి సమాధానం చెప్తున్నాడు.

“మహారాజా! శ్రీహరి పాదాలను ఆశ్రయించిన వాడికి ఇతరములైన పనుల పట్ల మనసు ప్రవర్తించదు. కానీ ఆ భక్తుడు

తనకు కలిగే ఆటంకాలను తొలగించుకుంటూ ముందుకు సాగిపోతూ హరిచరణారవిందాల దగ్గరకే చేరుకుంటాడు. ఇక్కడ ప్రియవ్రతుడు కూడా స్వాయంభువమనువు రాజ్యపాలన చెయ్యమని ఆదేశిస్తే కాదని తిరస్కరించి హరిధ్యానమగ్నుడే అయ్యాడు. చివరికి బ్రహ్మదేవుడు వచ్చి "రాజ్యపాలన వలన నీ జ్ఞాన సంపద తరగదు. నీకు రాజ్యపాలన తప్పదు. ఇది హరి ఆదేశమే" అని చెప్పాడు.

అప్పుడు ప్రియవ్రతుడు రాజ్యపాలనకు ఒప్పుకున్నాడు. స్వాయంభువ మనువు అతడికి పట్టాభిషేకం జరిపించాడు. తరువాత విశ్వకర్మ కుమార్తె 'బర్హిష్మతి'ని ప్రియవ్రతుడు వివాహమాడాడు. పదిమంది పుత్రులనూ, ఒక కుమార్తెను పొందాడు. ముగ్గురు పుత్రులు బ్రహ్మజ్ఞానసంపన్నులై, భక్తి యోగాన్ని అనుసరించి ఈశ్వరునిలో ఐక్యమయ్యారు.

ప్రియవ్రుతుని మరొక భార్య యందు "ఉత్తముడు, తామసుడు, రైవతుడు" అనే మహా తపఃశ్శాలులు పుట్టి మన్వంతరాలకు అధిపతులయ్యారు. "ఊర్జస్వతి" అనే కుమార్తె పుట్టి భార్గవునికి భార్య అయ్యింది. వీళ్ళ కుమార్తె దేవయాని.

ప్రియవ్రతుడు తన పరాక్రమంతో రాజులందరినీ జయించాడు. ఇంక చేసేది ఏమీలేక, ఊరికే కూర్చోడం ఇష్టంలేక సూర్యుడు కనపడని చోట ఉండే చీకటిని పోగొట్టడానికి సూర్యుడి రథంతో సమానమైన రథాన్ని ఎక్కి రాత్రులన్నింటినీ పగళ్ళు చేస్తానని నిశ్చయించుకుని, ఏడురోజుల పాటు సూర్యుడికి పోటీగా మరొక సూర్యుడిలా

వెలుగుతూ ప్రయాణం చేసి సూర్యరశ్మి తగలని భాగాల్లో పగళ్ళను సృష్టించాడు. అతడి రథం నడవడం వలననే ఏడు సముద్రాలు, ఏడు ద్వీపాలు ఏర్పడినాయి. తన కుమారులను ఏడుగురినీ ఆ ఏడు ద్వీపాలకు అధిపతులను చేసి, రాజ్యాన్ని వదిలేసి, గురువైన నారదుని మార్గాన్ని అనుసరించి విష్ణు సన్నిధికి చేరుకున్నాడు.

## అగ్నీధ్రుడు పూర్వచిత్తిని వివాహమాడుట - ఆమెనే అనుసరించి బ్రహ్మలోకానికి చేరుకొనుట

అగ్నీధ్రుడు జంబూ ద్వీపానికి ప్రభువై ప్రజలను కన్నబిడ్డల్లా పాలిస్తూ సంతానం కోసం బ్రహ్మదేవుని గురించి తపస్సు చేశాడు. అప్పుడు బ్రహ్మదేవుడు "పూర్వచిత్తి" అనే అప్సరసను అగ్నీధ్రుడి దగ్గరికి పంపించాడు. అగ్నీధ్రుడి మాటలు విన్న పూర్వ చిత్తి అతడి గుణగణాలను చూసి మెచ్చుకుంది. స్వయంగా మన్మథుడే పూర్వచిత్తీ అగ్నీధ్రులకు వివాహం జరిపించాడు.

అగ్నీధ్రుడు ఆమెతో సుఖభోగాలను అనుభవిస్తూ "నాభీ, కింపురుషుడు, హరివర్షుడు, ఇలావృతుడు, రమ్యకుడు, హిరణ్యయుడు, కురువు, భద్రాశ్వుడు, కేతుమాలుడు" అని తొమ్మిది మంది కుమారులను కన్నాడు.

తరువాత తాను వచ్చిన పని పూర్తి అయ్యిందని అప్సరస తిరిగి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయింది. అగ్నీధ్రుడు ఆమె ఎడబాటును సహించలేక రాజ్యాన్ని కుమారుకు అప్పగించి, వేదోక్త కర్మలను ఆచరించి, వాటి వైభవంతో బ్రహ్మలోకానికి చేరుకున్నాడు.

అగ్నీధ్రుడి కుమారులు తొమ్మిది మందీ జంబూద్వీపాన్ని పాలిస్తూ మేరుకుమార్తెలైన "మేరుదేవి, ప్రతిరూప, ఉగ్రదృష్ట, లత, రమ్య, శ్యామ, నారి, భద్ర, దేవీ" అనబడే తొమ్మిది మందినీ వివాహం చేసుకున్నారు.

## శ్రీమన్నారాయణుడు మేరుదేవికి పుత్రుడై అవతరించుట - ఋషభుడు పుత్రులకు హితోపదేశము చేయుట

కొంతకాలం గడిచినాక నాభి ఉత్తముడైన కుమారుని పొందడం కోసం భార్య మేరుదేవితో కలిసి వాసుదేవుని ఉద్దేశించి వేదం చెప్పినట్లుగా ఒక గొప్ప యజ్ఞం చేశాడు. శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై ఋత్విక్కుల ద్వారా నాభియొక్క కోరిక తెలుసుకుని, అందరూ చూస్తూండగానే మేరుదేవి గర్భంలోకి ప్రవేశించి కొంతకాలమైనాక మహా తేజశ్శాలి అయిన కుమారుడిగా పుట్టాడు. నాభి ఆ పిల్లవాడికి "ఋషభుడు" అని పేరు పెట్టాడు. ఆ ఋషభుడిని ఇహపర లోకాల వాళ్ళంతా మెచ్చుకుంటున్నారు.

అది చూసిన ఇంద్రుడికి ఈర్ష్య పుట్టింది ఋషభుడి మీద. దాంతో "నాభి పాలించే రాజ్యంలో కొంతకాలం కురవద్దని మేఘాలను ఆదేశించాడు." ఆ కారణంగా వానలు లేకపోవడంతో బ్రతుకు ఎట్లా గడుస్తుందని ప్రజలు కంగారు పడుతున్నప్పుడు చిన్న పిల్లవాడిగా ఉన్న ఋషభుడే తన యోగమాయా బలంతో రాజ్యమంతటా వానలు కురిపించాడు. ఆ సంవత్సరం పంటలు ఎప్పటికన్నా ఎక్కువగా పండినాయి. అది చూసి దేవేంద్రుడు తన ప్రతాపం పనికి రాదని బుద్ధి తెచ్చుకున్నాడు.

ఋషభుడికి యుక్త వయస్సు వచ్చాక రాజ్యానికి పట్టాభిషిక్తుని చేసి, నాభి మేరుదేవితో కలిసి బదరికాశ్రమానికి వెళ్ళి తపస్సు చేసి, చివరికి హరిలో ఐక్యమైనాడు. మహారాజైన ఋషభుడు దేవేంద్రుడి కుమార్తె జయంతిని వివాహం చేసుకున్నాడు. జయంతీ ఋషభులకు భరతుడు మొదలైన వందమంది కుమారులు పుట్టారు.

ఈ భరతుని పేరుతోనే మనదేశానికి భారతవర్షమనే పేరు వచ్చింది. ఋషభుడు తన కుమారులలో ఇలావర్త, కుశావర్త, బ్రహ్మావర్త, ఆర్యావర్త, మలయకేతు, భద్రసేన, నిద్రస్పృకీ, విదర్భ, కిరీటుడూ అనే తొమ్మిదిమందినీ వాళ్ళ పేర్లతో పిలవబడే దేశాలకే పాలకులను చేశాడు.

కవి, హరి అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, అవిర్హోత్రుడు, ద్రమీదుడు, దమనుడు, కరభాజనుడు అనే తొమ్మిది మంది భాగవత ధర్మప్రచారం చేయడమే ధ్యేయంగా కాలం గడిపారు. మిగిలినవారంతా శ్రోత్రియులైన బ్రాహ్మణోత్తములు. ఋషభప్రభువు సాక్షాత్తు నారాయణుడే. అయినా సామాన్య మానవుడి లాగానే వేదం చెప్పిన పనులను చేస్తూ, బ్రాహ్మణుల పట్ల భక్తుడై, వర్ణాశ్రమ ధర్మాలను రక్షిస్తూ, చాలాకాలం రాజ్యభోగాలను అనుభవించాడు. అతడి రాజ్యంలో ప్రజలందరూ బ్రహ్మజ్ఞాన సంపన్నులే గాని ఇహలోక వైభవ సంపన్నులుగా మాత్రం లేరు.

చాలా కాలం తరువాత ఋషభప్రభువు సంసార బంధాలను వదిలిపెట్టెయ్యాలని నిర్ణయించుకున్నాడు. తన

కుమారులను, మంత్రులనూ వెంటబెట్టుకుని బ్రహ్మావర్త దేశానికి వెళ్ళి అక్కడ పుత్రులకు ఈ విధంగా హితోపదేశం చేశాడు.

"కుమారులారా! వినండి! మీరు ఎప్పుడూ కోరికలకు దాసులు కావద్దు. పెద్దలను సేవించండి. దీనులను రక్షించండి. దుష్టులతో స్నేహం చెయ్యకండి. ఈ శరీరం రావడానికి కారణం కర్మ చెయ్యడమే. కనుక కర్మను వదిలిపెట్టండి. మనస్సులో శ్రీహరిని స్థిరంగా నిలుపుకుని, లౌకికమైె వాసనలను పోగొట్టుకోండి. మోక్షం పొందే ఉపాయం చెప్పనివాడు ఎంత దగ్గరవాడైనా వాడు నిజమైన బంధువు కాదు.

మీరంతా నా కుమారులు కనుక మీకందరికీ శాశ్వతమైన ఆనందం లభించాలని ఈ మాటలు చెప్తున్నాను. మీలో పెద్దవాడైన భరతుడిని నన్ను గౌరవించినట్లే గౌరవించండి. అదే మీరు పాటించాల్సిన పరమ ధర్మం. దేవతలందరిలోకి అధికుడైన విష్ణువుకు ప్రియమైన వేదమూర్తులైన విప్రులను ఎప్పుడూ గౌరవించండి. విప్రూ పూజే విష్ణుపూజ" అని చెప్పి, భరతుని రాజుగా పట్టాభిషిక్తుని చేసి, మునీశ్వరులకు అవధూత ధర్మాన్నీ తెలియచెప్పడం కోసం దిగంబరుడై, బ్రహావర్తాన్ని వదిలేసి మౌనవ్రతాన్ని పాటిస్తూ గమ్యస్థానమనేదే లేకుండా వెళ్తున్నాడు.

ఆయుర్దాయం ఉన్నంతకాల అట్లా తిరుగుతూ చివరికి వాసుదేవునికి అర్పించిన మనస్సుతో శరీరాన్ని వదిలేశాడు.

ఎనిమిది సిద్ధులూ అతడి వెంటపడినా వాటిని ఋషభుడు పట్టించుకోలేదు.

ఋషభరాజు రూపంలో నారాయణుడు కేవలం తన కుమారులకు మాత్రమే కాదు మానవులవైన మనకందరికీ కూడా ఉపదేశం చేశాడు. కనుక ప్రతిమానవుడూ ఋషభుని ఉపదేశాన్ని పాటించవలసిందే.

**రాజర్షి భరతుడు లేడిగా పుట్టుట -**
**అంగిరసపుత్రుడై ముక్తిని పొందుట**

భరతుడు తండ్రి చేసిన ఉపదేశాన్ని అనుసరిస్తూ ప్రజాపాలన చేస్తున్నాడు. విశ్వరాజమహారాజు కుమార్తె 'పంచజని'ని వివాహం చేసుకున్నాడు. "సుమతి, రాష్ట్రభుక్కు, సుదర్శనుడు, ఆచరణుడు, ధూమ్రకేతువు" అనే కుమారులను పొందాడు. వేదధర్మనిష్ఠా పరాయణుడైన భరతుడు రాజ్యాన్ని కుమారులకు పంచి యిచ్చి పులహుని ఆశ్రమంలో కాలం గడుపుతున్నాడు.

ఈ రాజర్షి భరతుడు ఒకరోజు గండకీ నదిలో స్నానం చేసి జపం చేసుకుంటున్నాడు. ఇంతలో నిండు గర్భిణిగా ఉన్న ఒక లేడి దాహం తీర్చుకోడానికి వచ్చింది. ఇంతలో ఆకలితో అరిచిన సింహపు గర్జనని విని భయంతో దాహం తీర్చుకోకుండానే పరుగులు తీయడం మొదలుపెట్టింది. ఇంతలో లేడి గర్భంలో నుండి లేడి పిల్లజారి ఆ నదీ జలంలో పడింది. కొండ ఎక్కుతూ తల్లి లేడి చనిపోయింది.

ధ్యానంలో నుండి బయటకువచ్చిన మహర్షికి నీటిపై తేలుతున్న లేడిపిల్ల కనపడింది. జాలిపడి ఆ లేడిపిల్లను పైకి తీసి పెంచడం మొదలుపెట్టాడు. క్రమంగా అతని మనస్సు తపస్సుకు దూరమై లేడిపిల్లకి దగ్గరైంది. అతడి మనసునిండా లేడిపిల్లే. చివరికి లేడిపిల్లలేకపోతే ఉండలేని పరిస్థితికి దిగజారాడు.

ఒకరోజున లేడిపిల్ల ఎక్కడో స్వేచ్ఛగా తిరుగుతూ దారి తెలియక చిక్కుకుపోయింది. రాజర్షి భరతడు ఆ లేడిపిల్ల కోసం అరణ్యమంతా వెదుకుతూ తిరిగాడు. కానీ లేడిపిల్ల కనిపించలేదు.

కొంతసేపటికి దుఃఖిస్తున్న అతడి ఒడిలోకి వచ్చింది ఆ లేడిపిల్ల. ఆనందంతో పొంగిపోయాడు భరతుడు. ఆ లేడిపిల్లే తన జీవిత సర్వస్వం అనుకుంటూ కాలం గడుపుతుండగానే భరతుడికి మృత్యువు వచ్చింది. లేడిపిల్లనే తలుచుకుంటూ మరణించడం వలన అంతటి తపస్వి అయిన రాజర్షి కూడా మరుసటి జన్మలో లేడిగా పుట్టాడు.

అయినా ఆయన తపఃశ్శక్తి, భగవద్భక్తి, ధర్మనిష్ఠల ఫలితంగా పూర్వజన్మ జ్ఞానంతోనే ఉన్నాడు. ఎంతపని చేశాను? ఎటువంటి వాడిని ఎట్లా దిగజారిపోయానని చింతిస్తూ, లేడిగా ఉన్నప్పటికీ పులహుని ఆశ్రమంలో హరినామ గుణసంకీర్తనలు వింటూ జీవితం గడిపి, ఆ లేడి శరీరాన్ని వదిలిపెట్టాడు.

ఆ తరువాత హరిగుణ కీర్తనలు విన్న ఫలితంగానూ, తన నిరంతర భగవత్ చింత వలన కొంతకాలానికి అంగిరసుడనే మహర్షికి కుమారుడై పుట్టాడు. చిన్నతనం నుండి ఎవరితోనూ ఏ విధమైన బంధము, సంబంధము పెట్టుకోకుండా, ఏమీ తెలియని పిచ్చివాడిలాగా కాలం గడిపాడు. తండ్రి చెప్పిన ఏ పనినీ బుద్ధిపెట్టి చేసేవాడు కాదు. అతడిని చూసి తండ్రి మిక్కిలి చింతిస్తూ శరీరం వదిలాడు.

జడుడిలాగ ప్రవర్తించే భరతుడు రకరకాల పనులు చేస్తూ, ఇంట్లోవారందరి చేత నిందించబడుతూ కాలం గడుపుతున్నా ఏమీ పట్టనట్లు ఉండేవాడు. చివరికి వృషల రాజాజ్ఞగా కాళికాదేవికి నరబలిగా ఇవ్వడానికి నరుని వెతుకుతున్న అతని సేవకులు భరతుని పట్టుకుపోయారు.

భరతుడు తన మీదకి కత్తి విసరబోతున్న రాజులోనూ, మీద పడబోతున్న కత్తిలోనూ, ఎదురుగా ఉన్న కాళీ విగ్రహంలోనూ కూడా అచ్యుతుడినే చూస్తున్నాడు. కాళిక భరతుని తేజస్సు చూసి ఆశ్చర్యపడి, అంతటి పరమయోగిని సంహరించబోయిన వారందరినీ సంహరించింది. జరిగినదంతా చూసి కూడా ఏమీ తెలియని వాడిలాగా తిరిగి వెళ్ళి, తన పనులు తాను చేసుకుంటున్నాడు.

మరొకసారి సింధుదేశపు రాజు తత్త్వోపదేశం చేయించుకోవడానికి కపిలమహర్షి దగ్గరకి పల్లకిలో బయలుదేరాడు. ఆ రాజు పల్లకీ మోసే బోయీలలో ఒకడు ఈ భరతుని పల్లకి మోయడానికి పిలిచాడు. కాదనకుండా వెళ్ళాడు

భరతుడు. కానీ అలవాటులేని కారణంగా పల్లకీని సరిగ్గా మోయలేకపోయాడు. ఒరిగిపోతున్న పల్లకిని చూసి రాజు కోపంతో బోయీలను ఎందుకిలా చేస్తున్నారని కేకలేశాడు.

"ఎవడో కొత్తవాడు మోస్తానని వచ్చాడు. వీడివల్లనే ఇలా ఊగిపోతోంది పల్లకి" అని చెప్పారు బోయీలు. రాజు భరతుడిని "వయసు పైబడిందనీ, నీ ఋణం వేం తీర్చుకోలేమనీ, చాలా దూరం చక్కగా మోశావనీ" ఎగతాళి చేశాడు. అయినా పట్టించుకోకుండా ముందుకు సాగిపోతున్నాడు భరతుడు. రాజుకి కోపం బాగా వచ్చి 'నీ అంతు చూస్తానన్నాడు.'

భరతుడు చిరునవ్వు నవ్వి రాజుతో "ఇంతదూరం పల్లకీ మోసింది నేను కాదు. ఈ శరీరం మోసింది. బరువు, తేలిక, లావు, సన్నం, చింతలు, రాగాలు, ఆకలిదప్పులు, ముసలితనం, పడుచుదనం ఇవన్నీ ఈ దేహానికే ఉంటాయి కానీ నాకేమీ ఉండవు. దొర సేవకుడు అనేవీ శరీరానికి సంబంధించినవే కానీ జీవుడికి సంబంధించినవి కావు నువ్వు నేను దొరను గదా అని గర్వంతో నన్ను శాసిస్తావు. అది నీ స్వభావం. దానికి నేనేం చెయ్యను? ఏది ఎట్లా జరిగినా పట్టించుకోని నన్ను నీ శిక్ష ఏం చేస్తుంది?" అన్నాడు.

అప్పుడు రాజు భరతుడి మాటల్లోని అర్థాన్నీ, ఆంతర్యాన్నీ గమనించి, పల్లకీలోంచి దూకి, భరతుడికి సాష్టాంగ నమస్కారం చేసి "నేను కపిలమహర్షి దగ్గరికి తత్త్వోపదేశం చేయించు కుందామని వెళ్తున్నాను. ఆ కపిలమహర్షి మీరేనా?" అని అడిగాడు.

అప్పుడు భరతుడు తన గతమంతా చెప్పి, ఇప్పుడిట్లా కాలం గడుపుతున్నాను అన్నాడు. రాజు ప్రార్థన మేరకు తత్త్వోదేశం చేసి అతడిని ధన్యుని చేశాడు. తరువాత భరతుడు యధేచ్ఛగా సంచరిస్తూ హరి ధ్యానతత్పరుడై ముక్తి సామ్రాజ్యాన్ని పొందాడు.

అని శుకుడు పరీక్షిత్తుకి చెప్పాడని సూతుడు శౌనకాదులకు చెప్పాడు. భరతుని తరువాత భరతవర్షానికి సుమతి అధిపతి అయ్యాడు. సుమతి భార్య ధృవసేన. వీళ్ళ పుత్రుడు దేవతాజిత్తు నుండి, ప్రియవ్రతుని వంశంలో చివరివాడైన విరజుని వరకు వివరించాడు.

ఆ తరువాత శుకుడు పరీక్షిత్తుకి జంబూ, పక్ష, కుశ, క్రౌంచ, శాక, శాల్మలీ, పుష్కరాలనే ఏడు ద్వీపాలను గురించి, పర్వతాల గురించీ, సప్తసముద్రాల గురించీ, నక్షత్రాల గురించీ, సూర్య, చంద్ర మండలాల గురించీ, జీవుల పాపాలకు తగినట్లుగా ఉండే అనేక రకాల నరకాల గురించీ వివరించాడు.

"ధర్మాత్ములు స్వర్గసుఖాలు అనుభవిస్తారు. పాపాత్ములు యమలోకంలో అనేక యాతనలను అనుభవిస్తుంటారు. ఇంకా పుణ్యపాపాలు అనుభవించాల్సిన వారు స్వర్గనరకాల్లోంచి వచ్చి మళ్ళీ భూలోకంలో పుడుతుంటారు" అని మానవుడు పొందే గతుల గూర్చి చెప్పాడు.

**శ్రీమద్భాగవతము నందలి ఐదవ స్కంధము పరసమాప్తము.**

# షష్ఠమ స్కంధము

## నరకానికి వెళ్ళకుండా తప్పించుకోవడానికి మార్గాలు - అజామీళుడు పాపవిముక్తుడై హరిని చేరుట

శౌనకాది మహర్షులకు సూతుడు ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

నరకమును గురించి విన్న పరీక్షిత్తు శుకమహర్షిని "మహాత్మా! నరకం వర్ణన వింటేనే నాకు ఒళ్ళు ఇంతగా జలదరిస్తోంది. వెళ్తే ఇంకెంత భయంకరంగా ఉంటుందో. కనుక మానవుడు నరకంలో పడకుండా ఉండాలంటే ఏం చెయ్యాలో చెప్పండి" అని ప్రార్థించాడు.

శుకమహర్షి "ఓ రాజర్షీ! మృత్యువు ఎక్కడినుండో రాదు. అది ఎప్పుడూ జీవి యొక్క వెన్నునే కాచుకుని ఉంటుంది. ఏ క్షణంలో ఎట్లా ఎక్కడ మరణం వస్తుందో ఎవరికీ తెలియదు. కాబట్టి నరకంలో పడకుండా తప్పించుకోవాలనుకున్నవాడు. పాపపు ఆలోచనలను మనస్సులోకి తెచ్చుకోకూడదు. పాపాత్ముల గురించి మాట్లాడుకోకూడదు. పాపపు పనులు చెయ్యకూడదు. చావు రాకముందే పాపం పోగొట్టుకోవడానికి ప్రయత్నించాలి. మానవులు చాలామంది తెలియకగానీ, తెలిసిగానీ అనేక పాపాలు చేస్తూంటారు.

అట్లా చేసేవాళ్ళు వాళ్ళు చేస్తున్న పనులను గురించి వాళ్ళని వాళ్ళే విమర్శించుకుంటూ, ఆ పాప కార్యాలను గుర్తించి, వాటిని నశింపచేసుకునే ప్రయత్నం శరీరంలో శక్తి ఉండగానే చెయ్యాలి. తపస్సూ, బ్రహ్మచర్యమూ, దానమూ,

శమమూ, దమమూ, జపమూ, సత్యమూ, శౌచమూ, సదాచారాలూ అనే వాటిని ప్రతిఒక్కరూ ఎవరికి చెప్పిన వాటిని వారు పాటించాలి.

అవి అగ్ని వెదుళ్ళను కాల్చినట్లుగా మానవులు పాపాలను బూడిద చేస్తాయి. వీటితో పాటు మానవుడు శ్రీహరి పాదపద్మాల యందు మనస్సును లగ్నం చేస్తే సమస్త పాపాల నుండి బయటపడచ్చు. సూర్యుడు మంచును ఎట్లా నశింపచేస్తాడో హరిభక్తి మానవుల పాపాలను అట్లాగే నశింపచేస్తుంది. ఎన్ని వ్రతాలూ, ఎన్ని సదాచారాలూ చేసినా హరి భక్తితో మాత్రం సాటిరావు. కనుక హరి భక్తిపరాయణులకు తప్ప ఇతరులకు శాశ్వతమైన మోక్షమనేది లభించదు. దీనికే అజామిళుడి కథ గొప్ప ఉదాహరణ. అది చెప్తాను విను" అన్నాడు.

కన్యాకుబ్జంలో 'అజామీళుడు' అనే ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడిలాంటి దుర్మార్గుడు మరొకడు లేడు. జూదమమాడడం, చెడు వాదాలు చెయ్యడం, తగాదాలు పడడం పెట్టడం అంటే అతడికి మహాప్రీతి. అతడు ఒక శూద్ర స్త్రీని వివాహం చేసుకుని చాలామంది కొడుకులను కన్నాడు. వాళ్ళందరినీ పోషించుకోవడం కోసం చెయ్యకూడని పనులన్నీ చేస్తూ ఎనభై ఏళ్ళ జీవితం గడిపాడు.

ఇతడి చివరి కొడుకు పేరు "నారాయణ". వీడంటే తల్లిదండ్రులిద్దరికీ చాలా ఇష్టం. కొంతకాలం గడిచింది. అజామీళుడికి మరణించే సమయం వచ్చింది. అజామిళుడికి

యమకింకరులు కనపడ్డారు. వాళ్ళను చూసి భయంతో ఎగిరిపడిపోతూ దూరంగా ఉన్న కుమారుడిని పిలవాలనే ఉద్దేశ్యంతో "నారాయణా! నారాయణా! నారాయణా!" అంటూ గట్టిగా పిలిచాడు. అది విని అక్కడికి దగ్గరలోనే ఉన్న విష్ణుభక్తులు అజామిళుని ప్రాణాలు తీయడానికి వచ్చిన యమభటులను మందలిస్తున్నారు. యమభటులు "చేయరాని పాపాలు చేసిన ఈ దుర్మార్గుడి వైపు మాట్లాడుతున్నారేంటి?" అని అడిగారు విష్ణు భటులని.

అప్పుడు విష్ణు భటులు "ఈ బ్రాహ్మణుడు ఎన్ని పాపాలు చేసినవాడైనా చనిపోతున్న క్షణంలో 'నారాయణ' అనే పేరు తలుచుకున్నాడు గదా! అతనికి ఆ క్షణంలో కుమారుడే గుర్తుకు వచ్చి అతడిని పిలిచినా, ఆ నామం శ్రీహరికి కూడా వర్తిస్తుంది గదా! 'నారాయణ' అనే పదాన్ని తలుచుకున్నంత మాత్రం చేతనే అన్ని పాపాలు నశించిపోతాయి. కనుకనే ఈ బ్రాహ్మణుడు ఇప్పటివరకూ చేసిన పాపాలన్నీ నశించాయి. కనుక మీరు ఇతడిని తీసుకువెళ్ళడం అధర్మమే. కనుక ఇతడిని విడిచిపెట్టి వెళ్ళిపొండి" అన్నారు.

యమకింకరులు విష్ణుదూతల ఆదేశాన్ని పాటించారు. అజామిళుడు తనను రక్షించిన హరి భటులకు మనస్సులోనే నమస్కారం చేశాడు. విష్ణు యమభటుల సంవాదం విని, మృత్యుముఖం నుండి బయటపడిన అజామిళుడు మిగిలిన కాలమంతా హరినే ధ్యానిస్తూ చివరికి విష్ణులోకానికే చేరుకున్నాడు.

యమభటుల యమలోకానికి వెళ్ళి జరిగినదంతా యముడికి చెప్పారు. యముడు కూడా వాళ్ళని విష్ణుభక్తుల జోలికి వెళ్ళద్దని హెచ్చరించాడు.

తరువాత పరీక్షిత్తు శుకమహర్షి చేత దేవ, దానవ, మానవాదుల సృష్టిని గురించి వివరంగా చెప్పించుకుని విన్నాడు.

## విశ్వరూపుడు ఆచార్యుడగుట - ఇంద్రుడు విశ్వరూపుని సంహరించుట

ఆ సృష్టిలో భాగంగానే అదితి కుమారులలో ఒకడైన 'త్వష్ట' అనే మనువుకి దైత్య సోదరి రచన యందు 'విశ్వరూపుడు' అనేవాడు పుట్టాడు. బృహస్పతి ఒకప్పుడు దేవతల మీద అలిగి వెళ్ళిపోయాడు. అప్పుడు దేవతలు ఈ విశ్వరూపుడిని గురువుగా ఎంచుకున్నారు.

పరీక్షిత్తు "దేవతలపై బృహస్పతి ఎందుకు అలిగాడు? విశ్వరూపుడు దేవతలకు గురువై వాళ్ళకేం ఉపకారం చేశాడు?" అని అడిగాడు మహర్షిని. అప్పుడు మహర్షి మహారాజుతో ఇట్లా చెప్పడం మొదలుపెట్టాడు.

ఒకప్పుడు నిండుకొలువులో ఉన్న దేవేంద్రుడు రంభాది అప్సరసల నాట్యం చూస్తూ ఆనందిస్తున్నాడు. ఆ సమయంలో సభలోకి వచ్చిన బృహస్పతిని ఇంద్రుడు గుర్తించి కూడా లేచి గౌరవించలేదు. ఇంద్రుడు తన పట్ల వినయంగా లేడని కోపంతో అలిగి సభలో నుంచి వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఎప్పటికో సభలో బృహస్పతి లేడన్న విషయాన్ని గమనించాడు

దేవేంద్రుడు. జరిగినది ఊహించుకుని, సభపూర్తి చేసి, గురు మందిరానికి వెళ్ళాడు. ఇంట్లోనే ఉండి కూడా కోపంతో ఉన్న గురువు ఇంద్రుడికి దర్శనం ఇవ్వలేదు. ఇంద్రుడు బాధతో తిరిగి వెళ్ళిపోయాడు.

ఆచార్యుడి కోపానికి గురి అయిన దేవేంద్రుని విషయం విన్న రాక్షసులు సులభంగా అతడిని జయించి, స్వర్గాన్ని తమ వశం చేసుకున్నారు. దేవేంద్రుడు చేసేదిలేక తన వాళ్ళందరినీ తీసుకుని సత్యలోకానికి వెళ్ళి, బ్రహ్మదేవుడితో తన గోడు చెప్పుకున్నారు.

బ్రహ్మదేవుడు దేవేంద్రుడికి అభయమిచ్చాడు. ఆచార్యుడు లేకపోవడం వలన వాళ్ళు నిన్ను గెలిచారు. కనుక నువ్వు విశ్వరూపుని ఆచార్యుడిగా చేసుకుంటే రాక్షసులపై విజయం సాధిస్తావు అని సలహా కూడా చెప్పాడు.

దేవేంద్రుడు వెంటనే విశ్వరూపుడి దగ్గరకు వెళ్ళి “ఆచార్యుడుని హితోపదేశం చెయ్యమని ప్రార్థించాడు. విశ్వరూపుడు ఇంద్రుడు కోరికను మన్నించి, ఇంద్రుడికి “విష్ణుకవచ” మనే విద్యను అనుగ్రహించాడు. ఆ విద్యప్రభావంతో దేవేంద్రుడు రాక్షసులపై విజయం సాధించి, మళ్ళీ దేవతలతో కలిసి స్వర్గభోగాలను అనుభవిస్తున్నాడు.

ఈ విశ్వరూపుడికి మూడు తలలు ఉండేవి. అతడు ఒక తలతో సోమరసాన్నీ, మరొక తలతో సురనూ త్రాగుతూ మూడవ తలతో అన్నం తినేవాడు. ఎంత దేవతలకు మేలు చేసినా రాక్షస స్త్రీకి పుట్టడం వలన రాక్షసుల పట్ల ప్రేమతో

దేవతలను మోసగించి రాక్షసులకు యజ్ఞభాగాలను అందించేవాడు.

ఈ విషయం తెలుసుకున్న దేవేంద్రుడు కోపంతో అతడి మూడు తలలనూ నరికేశాడు. విశ్వరూపుడి మూడు తలలో సోమపానం చేసే తల కముజు పిట్ట అయ్యింది. సురాపానం చేసే తల ఊరపిచ్చుక అయ్యింది. అన్నం తినే తల తిత్తిరిపక్షి అయ్యింది. ఇట్లా మూడు పక్షుల రూపాలూ ధరించి వచ్చి "మమ్మల్ని అనుగ్రహించమని" ఇంద్రుడిని కట్టేసింది.

దేవేంద్రుడు అందులో నుండి బయటపడలేక సంవత్సర కాలం బ్రహ్మహత్యను అనుభవించాడు. తరువాత తనదోషాన్ని పంచుకోమని భూమిని, నీటినీ, చెట్లను, స్త్రీలనూ ప్రార్థించాడు దేవేంద్రుడు. అతడి ప్రార్థనను కాదనలేక భూమి తనలో 'చవుడు' రూపంగా కొంత భాగాన్ని భరిస్తోంది. "నురుగూ, బుడగల" రూపంలో మరకొంత పాపాన్ని నీరు స్వీకరించింది. చెట్లు 'జిగురు' రూపంలో దేవేంద్రుడి పాపాన్ని పంచుకున్నాయి. ఇక స్త్రీలు 'రజస్సు' రూపంగా మిగిలిన పాపాన్ని ఇప్పటికీ మోస్తున్నారు.

తన పాపం తీసుకున్నందుకు కృతజ్ఞతగా దేవేంద్రుడు భూమికి ఆమె గోతులు వాటంతట అవే పూడిపోయే విధంగానూ, నీటికి దానిలో కడిగిన ప్రతి వస్తువూ పావనమయ్యే విధంగానూ, చెట్లకి నరికేసినా చిగుర్లు వేసే శక్తినీ, స్త్రీలకు ఎప్పుడూ కామసుఖం ఉండేట్లుగానూ వరాలిచ్చాడు.

## దేవేంద్రుడు వృత్రుని సంహరించుట -బ్రహ్మ హత్యాదోషము నుండి బయటపడుట

త్వష్ట ప్రజాపతి తనకుమారుడైన విశ్వరూపని చంపిన దేవేంద్రుడి మీద పగ తీర్చుకోవడానికి దేవేంద్రుడినే చంపగల కుమారుడు పుట్టాలని యజ్ఞం చేశాడు. అప్పుడు హోమగుండంలోనించి కల్పాంతంలో ఉండే యముడిలాంటి భయంకరుడైన వాడొకడు పుట్టాడు. త్వష్ట వాడికి 'వృత్రుడు' అని పేరు పెట్టాడు.

ఈ వార్త తెలిసిన దేవతలు అతడి మీదకి విజృంభించి, తలొక దిక్కుకీ పారిపోయారు. దేవేంద్రుడు వైకుంఠానికి వెళ్ళి జరిగింది చెప్పాడు. విష్ణువు దేవేంద్రాదులకు "విష్ణు కవచ విద్యతో చాల శక్తివంతమైన దధీచి మహర్షి ఎముకలను అడిగి తీసుకెళ్ళి విశ్వకర్మకు ఇవ్వండి. అతడు వాటితో నూరు అంచులు గల ఒక దివ్యమైన వజ్రాయుధాన్ని సృష్టించి ఇస్తాడు. నా తేజస్సుతో నిండిన ఆ ఆయుధంతో వృత్రుడి శిరస్సు తెగుతుంది" అని సలహా చెప్పాడు.

వెంటనే ఇంద్రుడు దధీచి దగ్గరకు వెళ్ళి, అతడి ఎముకలను తెచ్చి, విశ్వకర్మకు ఇచ్చి వజ్రాయుధాన్ని చేయించి, దానికి ప్రయోగించి వృత్రుని సంహరించాడు. ఆ తరువాత దేవేంద్రుడు తనకు అంటిన బ్రహ్మహత్యాదోషాన్ని వెయ్యి సంవత్సరాల పాటు విష్ణు కవచ పారాయణం చెయ్యటం వల్లనూ, ఈశాన్య దిక్కుకు అధిపతి అయిన ఈశ్వరుని అనుగ్రహం వల్లనూ పోగొట్టుకున్నాడు.

## వృత్రుడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడగుట - చిత్రకేతువుగా పార్వతిచే శపించబడుట

"లోకకంటకుడైన వృత్రుడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడు ఎట్లా అయ్యాడు?" అని అడిగాడు పరీక్షిత్తు శుకమహర్షిని. శుకమహర్షి పరీక్షిత్తుతో "పూర్వం చిత్రకేతువు అనే రాజు ఉండేవాడు. అతడు సంతానం లేదని దుఃఖిస్తున్నాడు. ఇంతలో అతడి దగ్గరికి అగస్త్య మహర్షి వచ్చి, అతడి దుఃఖానికి కారణం తెలుసుకున్నాడు. అగస్త్యుడు "రాజా! నీ కోరిక తీరడం కష్టం కాదు. కానీ ఆ కోరిక తీరిననాడు సుఖదుఃఖాలు రెండూ తప్పవు. అయినా నన్ను అడిగిన నీ కోరిక తీర్చడం నా ధర్మం" అని చెప్పాడు.

వెంటనే రాజు చేత పుత్రకామేష్ఠి చేయించి, ఆ యజ్ఞప్రసాదాన్ని అతడి పట్టపురాణి కృతద్యుతికి ఇప్పించాడు. 'ఈమె యందు నీకు పుత్రుడు పుడతాడు" అని అశీర్వదించి వెళ్ళిపోయాడు.

ముని ఆశీర్వచనం ప్రకారంగానే కృతద్యుతికి మిక్కిలి అందగాడైన కుమారుడు పుట్టాడు. తల్లితండ్రులకు ఆనందం కలిగిస్తూ చంద్రుడిలాగా రోజురోజుకీ పెరుగుతున్నాడు. అది చూసి సంతానం లేని ఇతర రాణులు ఓర్చుకోలేకపోయారు. అసూయతో విషం పెట్టి ఆ పిల్లవాడిని హతమార్చారు. పుత్ర మరణంతో కృతద్యుతీ, చిత్రకేతువూ మిక్కిలి దుఃఖిస్తున్నారు.

ఇంతలో అంగిరస, నారదమహర్షులు రాజ మందిరానికి వచ్చారు. రాజుతో "పుట్టినవాడు చావక తప్పదు. చచ్చిన

వాడు పుట్టక తప్పదు. కనుక అతడికోసం దుఃఖించడం అవివేకం" అని చెప్పాడు అంగిరస మహర్షి.

అయినా అతడి బాధ తీరకపోవడంతో మరణించిన పిల్లవాడి శరీరం వంక చూసి, "ఓ జీవుడా! ఇటుచూడు. నీ తల్లిదండ్రులు నీకోసం ఎంతగా దుఃఖిస్తున్నారో. కనుక నువ్వు మళ్ళీ ఈ శరీరంలోకి ప్రవేశించి, నీ తల్లిదండ్రులకు ఆనందం కలిగిస్తూ రాజ్యభోగాలను అనుభవించు" అని పిలిచాడు.

అప్పుడు ఆ జీవుడు "ఓ మునీశ్వరా! ఇదివరకు చేసిన కర్మలకు ఎన్ని జన్మలు ఎత్తానో? ఎంతమందికి కుమారుడినయ్యానో? వాళ్ళందరూ ఇప్పుడు ఏరి? అయినా ఇప్పుడు ఎవరిదారి వాళ్ళదే. శరీరం ఉన్నంతసేపు బంధుమిత్రులు. ఆ శరీరం లేకుండాపోయాక ఎవరికి వాళ్ళే తప్ప ఎవరికీ ఎవరూ ఉండరు" అని చెప్పి ఆ జీవుడు ఆ బాలుడి శరీరాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయాడు.

ఈ మాటలు విన్న చిత్రకేతుమహారాజు పుత్ర వ్యామోహాన్ని వదిలిపెట్టి, బాలుడి శరీరానికి అంత్యసంస్కారాలు జరిపి, నారదమహర్షి దగ్గర "సంకర్షణ" మంత్రాన్ని ఉపదేశంగా పొంది, ఆ మంత్రజప ప్రభావంతో విద్యాధరరాజై, ఒక దివ్య విమానమెక్కి సమస్త లోకాల్లో విహరిస్తున్నాడు.

కానీ శ్రీహరి ధ్యానాన్ని మాత్రం వదలలేదు. కొంతకాలానికి అతడి పుణ్యం పండి సంకర్షణుడి దర్శనాన్ని పొందాడు. సంకర్షణుడు (చిత్రకేతువు) విద్యాధర రాజుతో

"నారదాంగిరసులు ఉపదేశించిన తత్త్వోపదేశం వలన నన్ను చూడగలిగావు. నన్ను చూసినందుకు గాను నీకు పరమాత్మ జ్ఞానం కలుగుతుంది. ఇక మీదట నువ్వు సుఖదుఃఖాలకు అతీతుడివై ఉంటూ ముక్తిని పొందుతావు" అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

అట్లా హరిభక్తి తత్పరుడై సంచరిస్తున్న చిత్రకేతువు ఒకసారి కైలాసానికి వెళ్ళాడు. శివుడు అక్కడ నిండుగా కొలువుతీరి ఉన్నాడు. ఆ సభలో బ్రహ్మాదిదేవతలూ, దివ్యమహర్షులూ, ప్రమథులూ, మాతృకాది దేవతలూ ఉన్నారు. ఆ సభలో శివుడు పార్వతిని తన తొడపై కూర్చోబెట్టుకుని ప్రమథుల నాట్యాన్ని చూస్తున్నాడు. అది చూసిన చిత్రకేతుడు "ఇంతమంది పెద్దలున్న నిండు సభలో ఈ పరమేశ్వరుడు పామరుడిలాగా భార్యను ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు కదా! ధర్మసభలో ఇతని తీరు సదాచారమెట్లా అవుతుంది" అంటూ అవహేళన చేశాడు.

అతడి మాటలు విని పరమేశ్వరుడు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. సభలోని వారంతా కూడా ఒకసారి అతడి వంక చూశారే గాని బదులు చెప్పలేదు. కానీ భవాని మాత్రం అతడిని క్షమించలేకపోయింది. వెంటనే "ఓ చిత్రకేతూ! పరమేశ్వరుడినే నిందచేసిన నువ్వు రాక్షసుడివై పుట్టు. ఇకపై ఎప్పుడూ మహాత్ములను నిందించకు" అని శపించింది.

తరువాత చిత్రకేతువు తెలివి తెచ్చుకుని రథం దిగి "అమ్మా! నీ శాపాన్ని నేను నిండు మనసుతో

తీసుకుంటున్నాను. పూర్వకర్మల ననుసరించి ఈ సంసారంలో తిరిగే జీవులకు సుఖదుఃఖాలు కలగడం సహజమే. కానీ ఆత్మయందే ఉన్న వాడికి శాపానుగ్రహాలు, స్వర్గనరకాలు, సుఖదఃఖాలు సమానములే. భగవంతుడు ఒక్కడే తన మాయతో లోకాలనూ, జీవులనూ సృష్టించి, వాటిలో అంతర్యామిగా తానే ఉండి క్రీడిస్తున్నాడు.

అటువంటి భగవంతుడికి భార్యలెవరు? పుత్రులెవరు? మిత్రులెవరు? శత్రువులెవరు? కనుక నీ శాపానికి నేనేమీ భయపడడం లేదు. జగన్మాతవైన నీ మనస్సుకి బాధ కలిగేట్లుగా మాట్లాడినందుకు మాత్రమే బాధపడుతున్నాను. నా తప్పుని క్షమించు. పిల్లల తప్పులను తల్లిదండ్రులు గాక మరెవరు క్షమిస్తారు?" అని ప్రార్థించి, పార్వతీ పరమేశ్వరులను ప్రసన్నం చేసుకుని తన దారిని తాను వెళ్ళిపోయాడు.

అప్పుడు శివుడు పార్వతితో "చూశావా దేవీ! హరిభక్తులు సుఖదుఃఖాలను రెండింటినీ సమానంగానే చూస్తారు. ఈ చిత్రకేతువు ఆత్మజ్ఞాన సంపన్నుడు. హరిభక్తి పరాయణుడు. పైగా పరమశాంతుడు. అందుకే నిన్నే తిరిగి శపించగల శక్తిమంతుడైనా ఆ పని చెయ్యలేదు. అంతటి మహాత్ముని పై కోపం తెచ్చుకోకూడదు" అన్నాడు.

పరమేశ్వరుని మాటలకు పరాశక్తి శాంతించింది. పార్వతీదేవి శాపకరాణంగానే అంతటి ఆత్మజ్ఞానసంపన్నుడు కూడా యజ్ఞం వలన రాక్షసుడిగా త్వష్టకి పుట్టాడు. వృత్రుడనే పేరుతో ప్రసిద్ధుడై, దేవేంద్రాదులను జయించి కూడా శ్రీహరి

సంకల్పాన్ని అనుసరించి ఆ శరీరాన్ని వదిలేసి ముక్తుడయ్యాడు.

## ఇంద్రుడు దితి గర్భస్థ శిశువును ముక్కలుచేయుట - వారిని అనుగ్రహించి యజ్ఞ భాగములు ఇచ్చుట

ఆ తరువాత శుకమహర్షి పరీక్షిత్తుకి సూర్యుడు మొదలైన వాళ్ళ వంశక్రమాన్ని వివరంగా చెప్తున్నాడు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులకు పుట్టిన సంతానాన్ని వివరించాడు. వీళ్ళ తరువాత దితికి నలభైతొమ్మిది మంది పుత్రులు పుట్టారు. వాళ్ళు దేవతలతో పాటుగా దేవత్వం పొందారు" అని చెప్పాడు. వాళ్ళు ఎట్లా దేవత్వం పొందారో చెప్పమని అడిగాడు పరీక్షిత్తు.

దితికుమారులు అందరూ దేవేంద్రుడితో తగాదాలు పెట్టుకుని చనిపోవడం వలన దితికి దేవేంద్రుడి మీద ద్వేషం పెరిగింది. భర్త దగ్గరకు చేరి అతనికి సేవలు చేసి మెప్పించింది. వరం కోరుకోమన్న కశ్యపునితో "దేవేంద్రుడిని చంపగల పుత్రుడిని ప్రసాదించమని" అన్నది.

ఆమె కోరిక విన్న కశ్యపుడు కదలిక లేని వాడయ్యాడు. "మార్గశీర్ష శుద్ధ పాడ్యమి నుండి పన్నెండు నెలలపాటు విడవకుండా, శ్రద్ధగా నేను చెప్పిన వ్రతం చేస్తే ఇంద్రుడిని చంపగలకుమారుని పొందగలుగుతావు" అని వరం ఇచ్చాడు కశ్యపుడు. దితి కశ్యపుడు చెప్పినట్లే వ్రతం చేస్తూ గర్భాన్ని ధరించింది. అయినా మానకుండా వ్రతం చేయసాగింది.

చారుల వలన ఈ విషయం తెలుసుకున్న దేవేంద్రుడు మోసపూరితమైన భక్తితో నిండిన మనస్సుతో దితికి

ఉపచారాలు చేస్తూ ఆమె గర్భంలోని శిశువుని చంపే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.

ఒకనాటి సంధ్యా సమయంలో అశుచిగా ఉండి, కాళ్ళు కడుక్కోకుండా, మంచంపై పడుకుని నిద్రపోయింది. సరి అయిన సమయం ఇదే అని నిశ్చయించుకున్న దేవేంద్రుడు యోగమాయా బలంతో ఆమె గర్భంలోకి ప్రవేశించి, అందులోని బాలుని ఏడు ముక్కలు చేశాడు. ఏడు ముక్కలు ఏడుగురు పిల్లలయ్యారు. వాళ్ళు కుయ్యో! అని ఏడుస్తుంటే ఏడవకు, ఏడవకు అంటూ మళ్ళీ ఒక్కొక్క పిల్లవాడినీ ఏడు ముక్కలుగా నరికాడు. వీళ్ళు కూడా బాలురైనారు. మొత్తం నలభైతొమ్మిది మంది... "మేమంతా నీ కొలువులో ఉండి, మరుద్గణాలు అనే పేరుతో నిన్ను సేవిస్తాంటాము రక్షించమంటూ" ఇంద్రుడిని ప్రార్థించారు. ఇంద్రుడు వాళ్ళని హింసించడం మానేశాడు.

మెలుకువ వచ్చిన దితి ''ఎందుకిలా చేశావని'' ప్రశ్నించింది. "నీ వ్రతం పూర్తి అయితే నేను మరణించడం తప్పదుగా! అందుకే నువ్వు వ్రత నియమం మరిచిపోయినప్పుడు ఇట్లా చేశాను. నన్ను క్షమించు" అన్నాడు ఇంద్రుడు.

తన కుమారులను రక్షించమని అడిగింది దితి. అప్పుడు ఇంద్రుడు ఆ నలభై తొమ్మిది మందినీ తనతో స్వర్గానికి తీసుకెళ్ళాడు. సోమపానంలోనూ, హవిస్సులోనూ కూడా

మరుత్తులకి భాగాలు ఇచ్చాడు. మరుత్తులు కూడా ఇంద్రుడికి విధేయులై ఉంటూ సుఖంగా కాలం గడుపుతున్నారు.

**శ్రీమద్భాగవతమునందలి ఆరవ స్కందము పరిసమాప్తము.**

# ఏడవ స్కందము

## విష్ణు ద్వారపాలకులు సనకాదులచే శపించబడుట - బాల యముడు సుయజ్ఞుని కథ చెప్పుట

సూతుడు శౌనకాదులకు ఈ విధంగా చెప్తున్నాడు.

పరీక్షిత్తు శుకహర్షిని "దితి పుత్రులను చంపడం, దేవతలను రక్షించడం భగవంతుడైన శ్రీహరి చెయ్యదగిన పనేనా? గుణరహితుడైన పరమాత్మకు దానవులంటే భయమా ఏంటి? అతనికీ భయమూ, ద్వేషమూ అనేవి ఉంటాయా? దానవులను చంపితే దేవతల వలన భగవంతునకు ఏమైనా లాభం ఉందా?" అని అడిగాడు.

శుకుడు "మహారాజా! ఎంత చక్కని ప్రశ్న వేశావో! విష్ణువు యొక్క కథ వినడం చాలా విచిత్రమూ, త్రిలోకపవిత్రమూను. మునులనే వనాలకు విష్ణుకథ చైత్రం. సాధువులకు మిత్రము. భగవంతుడు అన్నీ తానై ఉన్నాడు. కనుక పరమాత్మకు శత్రువులెవరు? మిత్రులెవరు? కానీ తన మాయతో ఆ భగవంతుడు ఈ సృష్టిని చేశాడు. అతనిచే సృష్టించబడిన ఈ ప్రపంచం అంతా మూడు గుణాలతో కూడి ఉంటుంది. సత్త్వగుణం దేవతలది. రజస్తమోగుణాలు రాక్షసులవి. ఎవరికైనా ఎప్పుడైనా పెరగాల్సిందీ,

పెంచుకోవాల్సిందీ సత్త్వగుణం మాత్రమే. అందుకనే శ్రీహరి దేవతలకు అండగా నిలబడి రాక్షసులను సంహరిస్తుంటాడు.

పూర్వం మీ పెద్దతాత ధర్మరాజు రాజసూయం చేశాడు. అందులో శిశుపాలుడు అజ్ఞానంతో శ్రీకృష్ణుని నిందించి, ఆయన విడిచిన చక్రం చేతనే చంపబడ్డాడు. వెంటనే శిశుపాలుని శరీరంలో నుండి బయటకు వచ్చిన తేజస్సు శ్రీకృష్ణునిలో కలిసిపోయింది. అది చూసి ధర్మరాజు "నిత్యం హరిని ద్వేషించే శిశుపాలుడు ఎట్లా శ్రీహరిలో ఐక్యమయ్యాడు?" అని అడిగాడు నారదమహర్షిని.

నారదుడు "ధర్మజా! నింద, అలంకారం, తిరస్కారం అన్నీ శరీరానికే గాని పరమాత్మకి కాదు. ఆయనకు ఇవి ఏవీ లేవు. ఉండవు. శత్రుత్వంతో శ్రీహరిని చేరినంత తొందరగా భక్తితో చేరలేమేమో అని అనిపిస్తుంటుంది నాకు. గోపికలు కామంతోను, శిశుపాలాదులు శత్రుత్వంతోను, యాదవులూ మొదలైన వారు చుట్టరికంతోను, మీరు ప్రేమతోను, మేము భక్తితోనూ ఈ శ్రీహరిని చేరగలిగాము. ఏ మార్గాన్ని ఎంచుకున్నా లక్ష్యం చెదరిపోకుండా ఆయననే ధ్యానిస్తుంటే ఆయననే చేరుకోవచ్చు.

ఒకప్పుడు శ్రీహరి ద్వారపాలకులుగా ఉండే 'జయవిజయులు' హరిభక్తులైన, బ్రాహ్మణులైన సనకసనందాదులచే శపించబడ్డారు. వారు మొట్టమొదట దితికి హిరణ్యకశిప హిరణ్యాక్షులుగా పుట్టారు. శ్రీహరి వరాహరూపాన్ని ధరించి హిరణ్యాక్షుని సంహరించాడు. నృసింహరూపుడై అవతరించి హిరణ్యకశిపుని వధించాడు.

వీళ్ళే రెండవజన్మలో కైకసి అనే రాక్షసస్త్రీకి రావణ కుంభకర్ణులుగా పుట్టి హరి ద్వేషులయ్యారు. అప్పుడు శ్రీహరి శ్రీరాముడై అవతరించి వాళ్ళని వధించాడు. మూడవజన్మలో వీళ్ళే నీ పినతల్లి కుమారులైన శిశుపాల దంతవక్త్రులుగా పుట్టారు. వీళ్ళని శ్రీకృష్ణుడై మట్టుపెట్టాడు.

హిరణ్యాక్షుని చంపినందు వలన హిరణ్యకశిపుడు గోవులను, విప్రులను, వేదములను, వర్ణాశ్రమ ధర్మాలనూ సర్వనాశనం చేస్తున్నాడు. హిరణ్యకశిపుడు తమ్మునికి అంత్యక్రియలుచేసి, తమ్ముని భార్యలనూ, కుమారులనూ ఓదార్చి "అమ్మా! ఈ జీవులంతా చలువపందిరిలో కలసుకునే బాటసారుల్లాగా సంసారంలో కలుసుకుంటూ, ఎవరిదారిన వారు వెళ్ళిపోతుంటారు. ఎప్పుడూ అందరూ కలిసి ఉండడం అనేది జరగదు. నీ కుమారుడు శూరులు వెళ్ళే మార్గాన వెళ్ళాడు. అతడికోసం దుఃఖించవద్దు" అంటూ తల్లిని ఓదార్చాడు.

ఉశనర దేశాన్ని పాలించే సుయజ్ఞుడు యుద్ధంలో మరణించాడు. అతని మరణవార్త విన్న అతని భార్యలు యుద్ధభూమిలోకి వచ్చి గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నారు. సూర్యాస్తమయమైనా వారి దుఃఖం ఆగడం లేదు. అప్పుడు యముడు బాలబ్రాహ్మణుని రూపంలో అక్కడికి వచ్చాడు.

సుయజ్ఞుని బంధువులతో "ఈ రాజు భార్యలందరూ తమ భర్త మరణించాడని దుఃఖిస్తున్నారు. వీళ్ళు కూడా ఎప్పుడో అప్పుడు మరణిస్తారుగా! మరణం తప్పించుకోవడం

ఎవరి తరమూ కాదు. ఈ జీవులంతా ఎక్కడి నుండి వచ్చారో అక్కడికే వెళ్ళిపోతుంటారు. మీరు ఎంత ఏడ్చినా ప్రయోజనం ఉండదు. మీరు ఇలా నూరేళ్ళు ఏడ్చినా మీ భర్త దగ్గరకు మీరు పోలేరు" అని చెప్పాడు. రాజు బంధువులు అతనికి దహన సంస్కారాలు చేయించారు. యముడు అదృశ్యుడయ్యాడు.

ఇదంతా చెప్పి హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుని గురించి ఘోరమైన తపస్సు చెయ్యడం మొదలుపెట్టాడు. అతడి తపోవేడిమికి తట్టుకోలేక దేవతలంతా రక్షించమంటూ బ్రహ్మదేవుని ప్రార్థించారు. బ్రహ్మదేవుడు వాళ్ళకు అభయమిచ్చి, హిరణ్యకశిపుడి దగ్గరకు వెళ్ళి, అతడి తపస్సుకి కారణం తెలుసుకుని, అతడు అడిగిన వరాలన్నీ ఇచ్చాడు. దుర్లభమైన వరాలు పొందిన హిరణ్యకశిపుడు మూడు లోకాలనూ జయించి, అందరినీ ముప్పతిప్పలు పెడుతున్నాడు.

అతడి బాధలు తట్టుకోలేక దేవతలు, కిన్నరులు, సిద్ధులు, సాధ్యులు, మునులూ మొదలైన వారంతా ఏకాగ్రమనస్సుతో శ్రీహరిని ధ్యానించారు. శ్రీహరి వాళ్ళకి ప్రత్యక్షమై అభయమిచ్చాడు. "మీకందరికీ శుభమే కలుగుతుంది. అతడికి ఇంకా ఆయుర్దాయం ఉంది. అతడు మదగర్వంతో గుడ్డివాడై కన్నకొడుకునే కఠినంగా శిక్షిస్తాడు. అప్పుడే నేను ఆ క్రూరుని సంహరిస్తాను. ఇప్పుడు మాత్రం మీరు మీ నివాసాలకు వెళ్ళండి" అన్నాడు.

శ్రీహరి ఆజ్ఞగా అందరూ తిరిగి వెళ్ళిపోయారు. ఈ లోపల హరిణ్యకశిపుడికి నలుగురు కుమారులు పుట్టారు.

## ప్రహ్లాదుడు భక్తి తత్పరత్వముతో ఉండుట - ప్రహ్లాదుని రక్షించుటకై శ్రీహరి నృసింహుడగుట

సుగుణనిధి అయిన ప్రహ్లాదుడు గర్భమునందున్నప్పటి నుండి శ్రీహరి యందే మనసు లగ్నం చేస్తూ ఉన్నాడు.

కుమారుడు తనకు శత్రువైన శ్రీహరి యందే భక్తిని పెంచుకుంటున్నాడని అతని పట్ల ద్వేషం పెంచుకున్నాడు. పిల్లవాడు చిన్నవాడు, కన్నకొడుకు అనే భావనను కూడా పక్కనపెట్టి అనేక విధాలుగా సేవకులతో హింసింపచేశాడు.

కుమారుడు దేనినీ పట్టించుకోకుండా, తనలో తానే నవ్వుకుంటు, మాట్లాడుకుంటు, దుఃఖిస్తూ పిలిచినా పలకకుండా ఉంటున్నాడని గమనించి, అతనికి బుద్ధి తక్కువగా ఉన్నదని భావించి, కుమారుని పిలిచి "చదువు లేని వాడికి తెలివి వుండదు. చదువుకుంటే మంచి ఏది, చెడు ఏది అని తెలుసుకునే జ్ఞానం లభిస్తుంది. కనుక నిన్ను గురువుల వద్దకు చదువుకోవడానికి పంపిస్తాను. శ్రద్ధగా చదువుకోమన్నాడు.

ప్రహ్లాదుడు తండ్రి ఆజ్ఞ ప్రకారంగా గురుకులానికి వెళ్ళాడు. శుక్రాచార్యుని కుమారులైన చండామార్కుల దగ్గర సమస్త విషయాలు వారు చెప్పినట్లు నేర్చుకుంటున్నాడు. అదే విధంగా తన మనసులో హరిభక్తిని స్థిరం చేసుకుంటున్నాడు. శ్రీహరిని తెలుసుకోడానికి ఉపయోగపడే విద్యయే నిజమైన విద్య అనీ, మిగిలినవన్నీ విద్యలు కావని మనస్సులో గట్టిగా నమ్మాడు.

ఒకరోజు గురుకులం నుండి ప్రహ్లాదుని తన వద్దకు పిలిపించాడు హిరణ్యకశిపుడు. ఏం చదువుకున్నావో చెప్పమని అడిగాడు కుమారుని. ప్రహ్లాదుడు తండ్రితో "మనస్సులో విష్ణువునే స్థిరంగా ఉంచుకోవాలనీ, మిగిలినవన్నీ పనికిరావనీ" చెప్పాడు.

హిరణ్యకశిపుడు ఆశ్చర్యపోయి, గురువులను బెదిరించి, హెచ్చరించి, సరియైన పాఠాలు చక్కగా నేర్పమనీ, అతడి మనస్సు మార్చి తన పట్ల భక్తి శ్రద్ధలను పెంచమనీ చెప్పి, ప్రహ్లాదుని తిరిగి గురుకులానికి పంపించాడు.

మళ్ళీ కొంతకాలమైనాక "చక్కగా చదివించాము" అంటూ చండామార్కులు ప్రహ్లాదుని హిరణ్యకశిపుని వద్దకు తీసుకువచ్చి, అతడిని పరీక్షించమన్నారు.

వినయంతో నిలబడ్డ పిల్లవాడిని, దగ్గరకు తీసుకుని, కౌగిలించుకుని, ఒడిలో కూర్చోబెట్టుకుని ముద్దాడుతూ 'నువ్వు ఏం నేర్చుకున్నావో, దానిలో సారమేమిటో చెప్పమని అడిగాడు. అడిగినదే తడవుగా ప్రహ్లాదుడు "ఈ ప్రపంచంలో సారమైనది హరిభక్తి మాత్రమే. ఆ హరిభక్తి లేనినాడు ఎన్ని ఉన్నా అవి అన్నీ వ్యర్థమే. త్రికరణ శుద్ధితో ఆ భగవంతుని శ్రవణము, మననము, నమస్కారము, పూజించడము, సేవించడము, ఆత్మ సమర్పణము, సంకీర్తనము, సంస్మరణం, సఖ్యం అనే తొమ్మిది రకాల భక్తి మార్గాలలో సర్వోత్తముడైన, సర్వాత్మకుడైన శ్రీహరినే నమ్ముకుని సాధు మార్గాన్ని అనుసరించడమే ఉత్తమమని నా నిర్ణయము. శ్రీహరి

నామస్మరణంతో సాధించలేనిదేదీ లేదు. అంతకుమించి చేయవలసిందీ లేదు” అని చెప్పాడు.

హిరణ్యకశిపుడు తనయుడి మాటలకు రుద్రుడే అయ్యాడు. తండ్రితోనే విరోధం పెట్టుకున్న వీడిని చంపమని ఆదేశించాడు. ఎన్ని రకాలుగా ప్రహ్లాదుని ప్రాణాలు తియ్యాలని ప్రయత్నించినా హిరణ్యకశిపుని సేవకులకు సాధ్యంకాలేదు.

వాళ్ళ ప్రయత్నాలు వారు చేశారు కానీ హరి భక్తితో ప్రహ్లాదుడు ఆ ఆపదల నుండి బ్రతికి బయటపడుతున్నాడు. హిరణ్యకశిపుడు అది చూసి సహించలేక “ఎక్కడున్నాడు రా నీ హరి? ఈ స్థంభంలో ఉన్నాడా? చూపించు...” అంటూ అక్కడ ఉన్న స్తంభాన్ని కొట్టాడు. వెంటనే ఆ స్తంభంలో నుండి ప్రహ్లాదుని రక్షించడం కోసం హరి నృసింహుడై అవతరించాడు. బ్రహ్మదేవుడు హిరణ్యకశిపుని కోరికలను అనుగుణంగా అతడిని సంహరించాడు. నృసింహుని కోపాన్ని ప్రహ్లాదుడే తగ్గించాడు. హరి ధ్యానం చెయ్యడం వల్లనే రాక్షసుడై పుట్టినా ముక్తిని పొందగలిగాడు.

## శ్రీహరి సిద్ధరసమును త్రాగుట - హరుడు త్రిపురాసురులను సంహరించుట

“పూర్వం మయుడనే రాక్షసుడు తన మాయలతోమూడు పురాలను కట్టించి తన వాళ్ళను అందులో ఉండమనీ, అభయమిచ్చి రక్షిస్తున్నాడు. రాక్షసమూక మయుని అండతో దేవతలను, మునులను హింసిస్తున్నారు. దేవతలు వాళ్ళ బాధలు పడలేక శ్రీహరితో మొరపెట్టుకున్నారు.

దేవతల చేతిలో మరణించిన రాక్షసులందరినీ మయాసురుడు సిద్ధరసంతో మళ్ళీ బ్రతికిస్తున్నాడు. అది గమనించిన విష్ణువు గోవురూపాన్నీ, బ్రహ్మదేవుడు వత్స(దూడ) రూపాన్నీ ధరించి వెళ్ళి మయుని దగ్గర ఉన్న సిద్ధరసాన్ని త్రాగేసి అంతర్ధానమయ్యారు. "దైవికంగా వచ్చిన ఆపదను తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. కనుక దుఃఖించవద్దని రాక్షసులను ఓదార్చాడు మయుడు.

తరువాత భూమిని రథంగానూ, బ్రహ్మదేవుని సారథిగానూ, వేదాలను గుఱ్ఱములుగానూ, సూర్యచంద్రులను రథచక్రాలుగానూ, శ్రీహరిని పతాకము, కవచము, ధనస్సు, బాణములగానూ చేసుకుని మహాదేవుడు త్రిపురాసురులను సంహరించాడు" అని ధర్మజుడు నారదుడికి చెప్పాడని, శుకుడు పరీక్షిత్తుకీ, సూతుడు శౌనకులకూ చెప్పారు.

## వర్ణాశ్రమ ధర్మాలు - వాటి వలన మానవులకు కలిగే ప్రయోజనం

బ్రహ్మమానసపుత్రుడైన నారదుడు ధర్మరాజుకు ఈ విధంగా చెప్తున్నాడు.

అన్ని వర్ణాశ్రమాల వాళ్ళకీ, స్త్రీ పురుషులకీ "సత్యము, దయ, ఉపవాసములు, శౌచము, సహనము, మంచి చెడులకు సంబంధించిన వివేకము, మనస్సును అదుపులో పెట్టుకోవడము, ఇంద్రియాలను జయించడము, హింస చెయ్యకుండా ఉండడము, బ్రహ్మచర్యమును పాటించడము, దానము, జపము, సంతోషము, మనస్సులో అన్నిటిపట్ల

సమభావం కలిగి ఉండడము, పెద్దల సేవ చెయ్యడమూ అనేవి ముఖ్యమైన ధర్మాలు.

తనకు ప్రయోజనం కలిగించనిపని మానెయ్యాలి. అధిక ప్రసంగాలు చెయ్యకూడదు. శరీరం నేను కాదు అనే విషయం అందరూ తెలుసుకోవాల్సిందే. తానెవరో అందరూ తెలుసుకోవాలి. తనకున్న దానిలో ఇతరులకు పంచాలి. తనకూ ఇతర ప్రాణులకు ఏమాత్రం భేదం లేదని అందరూ గ్రహించాల్సిన విషయమే. శ్రీహరిని తలుచుకుంటూ అతడిపట్ల అందరూ భక్తి కలిగి ఉండాల్సిందే.

ఈ ధర్మాలన్నీ అందరికీ సమానములే.

అయితే పుట్టుకను అనుసరించి వచ్చే ధర్మాలు వేదంలో ఎవరికి ఏవి ఆచారించాలని ఉన్నదో వాటిని వాళ్ళే అనుసరించాలి. ఆచరించాలి. ఈ ధర్మాలను ఒకరివి మరొకరు ఆచరించకూడదు. వేదములు చదవడం, చెప్పడం ఒకరికి ధర్మం. వ్యవసాయం చెయ్యడం, ఎవరి దగ్గరా ఏదీ అడగకుండా భగవంతుడు అనుగ్రహించిన దానితో కాలం గడపడం మరొకరికి ధర్మం.

ఈ ఇద్దరికీ మిగిలిన ఇద్దరినీ సేవించడం అనేది చెయ్యకూడని పని. ఇతరమైన వాళ్ళకు దేవ, ధర్మపరులను సేవించడం, గోవులను సంరక్షించడం, న్యాయపరులై ప్రవర్తించటం ప్రధాన ధర్మాలు.

ప్రతిరోజూ ఇంటిని చక్కగా శుభ్రపరుచుకుని, ముగ్గులతో అలంకరించుకుని, భర్తతో ప్రియంగా మాట్లాడుతూ, అతనికి

అనుకూలంగా ప్రవర్తిస్తూ, భర్తనే దైవంగా భావిస్తూ, సకల ఉపచారాలూ చేస్తూండటం కులస్త్రీకి ప్రధాన కర్తవ్యం. ఇట్లా ప్రవర్తించే స్త్రీ ఉపవాసాలు ఉండక్కర్లేదు. తపస్సులు చేయక్కరలేదు.

మిగిలిన కులవృత్తుల వారంతా హింసను విడిచిపెట్టి, వారి వారి కులవృత్తులను న్యాయంగా, ధర్మంగా ఆచరించాలి. ఈ విధంగా అన్ని వర్ణాల వాళ్ళూ వారి వారి ధర్మాలను పాటిస్తే ఈ లోకంలోనూ, ఇతర లోకాల్లోనూ కూడా సుఖంగా, ఆనందంగా బ్రతకవచ్చు.

అదే విధంగా బ్రహ్మచారి, గృహస్థు, వానప్రస్థ –సన్న్యాస ఆశ్రమాల వాళ్ళు కూడా ఆయా ఆశ్రమాలు తగిన, వేదం చెప్పిన ధర్మాలను ఆచరించి, హాయిగా ఆనందంగా జీవితాన్ని గడపవచ్చు. ధర్మమును మనం పాటిస్తే ధర్మం మనను రక్షిస్తుంది అన్న విషయాన్ని ఎవరూ మరిచిపోకూడదు.

## ప్రహ్లాద అజగర సంవాదం - నారదుని పూర్వ వృత్తాంతం

ఒకప్పుడు ప్రహ్లాదుడు లౌకికమైన తత్త్వమును తెలుసుకోవడం కోసం లోకంలో తిరుగుతూ, కావేరీ తీరంలో అజగరుడు అనే ఒక మునీశ్వరుని కలుసుకున్నాడు. ఆ ముని శరీరం దుమ్ముతో నిండిపోయి ఉంది. ఆయన ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరిగా ఒక చోట నేలమీద పడుకుని నిద్రపోతూ అజగర వ్రతాన్ని పాటిస్తున్నాడు. ప్రహ్లాదుడు

"మునివర్యా! మీరు ఎవరితోనూ మాట్లాడకుండా, ఏ పనీ చెయ్యకుండా, ఎవరి జోలికీ పోకుండా, ఎప్పుడూ నిద్రపోతూ ఉండడానికి కారణం ఏమిటి?" అని అడిగాడు.

అప్పుడు ఆ మునీశ్వరుడు ప్రహ్లాదునితో "ఓ రాక్షసరాజా! కోరిక అనేది ఒక ప్రవాహం లాంటిది. ఎన్ని తీర్చిన మళ్ళీ ఏదో కోరిక పుడుతూనే ఉంటుంది. ఆ కోరిక కోసం మళ్ళీ ఏవేవో పనులు చేస్తూంటాం. ఆ పనులే మళ్ళీ పుట్టడానికి కారణమవు తున్నాయి. అందుకనే నేను ఏ పనీ చెయ్యకుండా, నా దగ్గరకు వచ్చిన దానిని అనుభవిస్తూ, లేనప్పుడు నిద్రస్తూ కాలం గడుపుతున్నాను" అని చెప్పాడు. అంతా విన్న ప్రహ్లాదుడు తన నివాసానికి వెళ్ళాడు.

నేనెట్లా తరించాలో చెప్పమని నారద మునీశ్వరుని ప్రహ్లాదుడు అడిగాడు. నారదుడు "గృహస్థుడు తాను చేసే పనులన్నింటినీ వాసుదేవుడికి సమర్పించాలి. పెద్దలను సేవిస్తూండాలి. శ్రీహరి కథలను వినాలి. భార్యాపుత్రులతోనూ, బంధుమిత్రులతోనూ తాను గడుపుతున్న జీవితం అంతా 'కల' అని అనుకుంటూ, దేనిమీదా కోరిక లేకపోయినా, అన్నింటి మీదా కోరిక ఉన్నట్లుగానే తాను చెయ్యాల్సిన పనులను చేస్తుండాలి.

తన సంపదను అనుసరించి దేవతలను, పితృదేవతలను, ఋషులను, అతిథులను, అభ్యాగతులను అర్చిస్తూ, ఆదరిస్తూ ఉండాలి. వేదం చెప్పినట్లుగా నడుచుకునే

విద్వాంసుడు తన ఇంట్లో ఉండే నారాయణుని పాదపద్మాలను అర్చించి ముక్తిని పొందగలుగుతాడు" అని చెప్పాడు.

గడిచిపోయిన కల్పంలో నేను "ఉపబర్హణుడు" అనే గంధర్వుడని. చాలా అందగాడిని కూడా. అందుకని స్త్రీలంతా నన్ను ప్రేమిస్తుండేవాళ్ళు. ఒకప్పుడు "దేవసత్త్వమనే" యాగంలో నారాయణ కథలు పాడడానికి వెళ్ళాను. కొంతసేపు పాడినాక ఒక స్త్రీ వ్యామోహంలో పడి, పాడడం ఆపేసి, ప్రక్కకి వెళ్ళిపోయాను. అది తెలుసుకున్న ఆ యాగం నిర్వహిస్తున్న బ్రహ్మలు "స్త్రీ లోలతతో మమ్మల్ని లెక్కపెట్టకుండా పుణ్యకార్యం వదిలేశావు. కనుక నువ్వు తేజోహీనుడవై భూలోకంలో చండాలకులంలో పుట్టమని" నాకు శాపం పెట్టారు.

ఆ శాపం వలన నేను భూలోకంలో చండాలునిగా పుట్టాను. కానీ ఆ జన్మలోనే బ్రహ్మవేత్తలైన పెద్దలకు సేవ చేసి, ఈ మహాకల్పంలో బ్రహ్మదేవుడికి కుమారుడినై పుట్టాను. కాబట్టి చేసే పనిని పరమేశ్వరుని కోసమే ఆయన ఆజ్ఞగా చేస్తున్నాను అన్న భావనతో చేస్తూండాలి. అప్పుడు ఎంతటివాడైనా బంధవిముక్తుడై హరిని చేరుకుంటాడు" అని చెప్పాడు.

**శ్రీమద్భాగవతము నందలి ఏడవ స్కందము**
**పరిసమాప్తము.**

# ఎనిమిదవ స్కందము

## గజరాజు మొసలి నోటియందు చిక్కుకొనుట - శ్రీహరి అనుగ్రహముతో బయటపడి ముక్తినొందుట

సూతుడు శౌనకాది మహర్షులు ఏఏ మనువు కాలంలో శ్రీహరి ఏఏ రూపాలలో అవతరించి ఏ ఏ పనులు చేశాడో ఈ విధంగా వివరిస్తున్నాడు.

మొదటిదైన స్వాయంభువ మన్వంతరంలో తపోనిష్ఠుడైన ఆ స్వాయంభువ మనువునే చంపి తినాలనుకున్న రాక్షసులను చంపడం కోసం "యజ్ఞుడు" అనే పేరుతో అవతరించాడు. రెండవదైన స్వారోచిషమనువు కాలంలో "వేదశిరుడు" అనే బ్రాహ్మణునికి "తుషిత" అనే స్త్రీ యందు "విభుడు" అనే పేరుతో అవతరించి ఎనభై వేలమంది మహర్షుల అనుగ్రహానికి పాత్రుడై బ్రహ్మచర్య వ్రతనిష్ఠుడయ్యాడు. మూడవదైన ఉత్తమ మనువు కాలంలో "ధర్మునికీ సూన్యత"కూ "సత్యసేనుడనే" పేరుతో అవతరించి రాక్షససంహారం చేశాడు.

తామస మనువు కాలం గడుస్తోంది. అప్పుడు శ్రీహరి "హరిమేధునికి 'హరి' అనే కాంతయందు శ్రీహరి అవతరించి మొసలినోట్లో చిక్కిన గజేంద్రుని రక్షించాడు" అని చెప్పాడు. నీళ్ళలో ఉండే మొసలి నోట్లో నేలమీద తిరిగే ఏనుగు ఎట్లా చిక్కిందో, దానిని శ్రీహరి ఎట్లు రక్షించాడో వివరంగా చెప్పు అని పరీక్షిత్తు శుకుని అడిగాడు. శుకుడు ఇట్లా చెప్పసాగాడు.

అమృతసముద్రంలో త్రికూటమనే పర్వతం. దాని మీద పెద్ద అరణ్యం. అందులో అనేక రకాల జంతువులు

ఉంటున్నాయి. ఒక రోజున అక్కడ ఉంటే ఒక మగ ఏనుగు చాలా ఆడ ఏనుగులతో కలసి దాహం తీర్చుకోవడం కోసం ఒకలోతైన సరస్సు దగ్గరకు వచ్చింది.

సరస్సులోకి దిగి నీరు త్రాగి దాహం తీర్చుకున్నాక, ఏనుగులన్నీ సరస్సును చెల్లాచెదురు చేస్తున్నాయి. ఇంతలో ఒక మొసలి నీళ్ళలో ఉన్న మగ ఏనుగుని పట్టుకుని లోపలకి ఈడ్చుకుపోసాగింది. ఏనుగు బయటకు రావాలని ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. మిగిలిన ఏనుగులన్నీ వెళ్ళిపోయినాయి. ఒక్క ఆడేనుగు మాత్రం ఒడ్డున ఉండి ఏం చెయ్యాలో తోచక మొసలి ఏనుగుల పోట్లాటను చూస్తోంది. మొసలి లోపలికి లాగడం..... ఏనుగుని పైకి లాక్కురావడం. ఇట్లా ఎంతో బాధపడింది ఏనుగు. వెయ్యి సం॥ గడిచిపోయింది. చివరికి తన శక్తి అంతా నశించినాక ఏ దేవుడు నన్ను రక్షిస్తాడంటూ ఆలోచించి, "దీనుడవైన నన్ను కాపాడు ఈశ్వరా! వరదా!" అంటూ భగవంతుడితో మొరపెట్టుకుంది ఏనుగు.

అప్పుడు విష్ణువు వైకుంఠంలో శ్రీమహాలక్ష్మితో సల్లాపాలాడుతున్నాడు. అయినా ఏనుగు పిలుపు వినపడగానే ఉన్నవాడు ఉన్నట్లుగా వచ్చి మొసలిని చంపి, ఏనుగుని రక్షించాడు. విష్ణువు వెనుక ఆయన పరివారమంతా కూడా వచ్చారు.

ఈ ఏనుగు గతజన్మలో ఇంద్రద్యుమ్నుడనే హరి భక్తుడు. పైగా మహారాజు. హరిధ్యానతత్పరుడై ఉన్న ఇతను తన

దగ్గరకు వచ్చిన అగస్త్య మహర్షిని గమనించకపోవడంతో ఆయనకు అతిథిసత్కారాలు చేయలేదు. అందుకని అగస్త్యమహర్షి కోపంతో "జ్ఞానం లేకుండా" ప్రవర్తించావు కనుక జ్ఞానం లేకుండా శరీరం పెద్దదిగా ఉన్న ఏనుగుగా పుట్టు" అని శపించాడు.

అందుకని ఆ మహారాజు మహర్షి శాపం వలననే ఏనుగుగా పుట్టాడు. గతంలోని హరి భక్తి జ్ఞాపకానికి వచ్చినప్పుడు ఆ శ్రీహరి చేత మళ్ళీ రక్షించబడ్డాడు. ముక్తినీ పొందాడు.

పూర్వం "హూహూ" అనే గంధర్వుడు దేవతల, మహర్షుల శాపంతో మొసలిగా పుట్టాడు. శ్రీహరి వేసిన విష్ణు చక్రం తగలగానే మొసలి రూపాన్ని వదిలేసి గంధర్వుడై భగవంతుని చూసి, ఆయనకు నమస్కరించి కృతార్థుడై తన లోకానికి వెళ్ళిపోయాడు.

కనుక ఏ పని చేస్తున్నా హరిస్మరణ చేస్తుంటే ఆయా పనులనే వలలో మనం చిక్కుకోకుండా ఉండగలుగుతామనే విషయం మనం గ్రహించాలి.

### క్షీరసాగర మథనం - కూర్మావతార ఆవిర్భం

ఐదవ మనువు రైవతకుడు. ఇతడి కాలంలో హరి "శుభ్రుడూ - వికుంఠా" అనే వాళ్ళకు "వైకుంఠుడు" అనే పేరుతో అవతరించి వైకుంఠాన్ని కల్పించాడు. ఆరవ మనువు చాక్షుషుడు. ఈ మనువు కాలంలో "సంభూతికీ-వైరాజు' కూ "అజితుడు" అనే పేరుతో పుట్టి, ఆదికూర్మమై మంథర

పర్వతాన్ని సముద్రంలో మునిగిపోకుండా ఉద్ధరించాడు. పాలసముద్రాన్ని చిలికి దేవతలకు అమృతాన్ని ప్రసాదించాడు.

దేవదానవులు ఒకప్పుడు గొప్ప యుద్ధం చేసుకున్నారు. ఆ యుద్ధంలో ఓడిపోయిన దేవతలు బ్రహ్మదేవునితో పాటు విష్ణువు దగ్గరకు వెళ్ళి రాక్షస బాధ తొలగించమని ప్రార్థించారు. అప్పుడు పరమేశ్వరుడు "పాము ఎలుకను పట్టుకోవాలనుకున్నప్పుడు తన పొడవైన శరీరాన్ని ఎట్లా ముడి చేసుకుంటుందో అట్లాగే శత్రువులను మట్టుపెట్ట దలచుకున్నవాడు కూడా తగిన సమయం వచ్చేదాకా అణిగి మణిగి, ఎక్కడెక్కడో కాలం గడుపుతుండాలి. దేవతల బలం పెరగాలంటే అమృతం కావాలి. ఆ అమృతం రావాలంటే పాల సముద్రాన్ని చిలకాలి. మందర పర్వతాన్ని కవ్వంగానూ, వాసుకిని తాడుగానూ చేసుకుని, దేవదానవులు వాసుకి తలా తోకలను పట్టుకుని సముద్రాన్ని మథించాలి. సద్బుద్ధితో ఉండే మీకు అమృతం లభిస్తుంది. దుర్బుద్ధులైన రాక్షసులకు దుః ఖమే మిగులుతుంది" అని చెప్పాడు.

పరమేశ్వరుని మాట ప్రకారంగా దేవదానవులు పాలసముద్రాన్ని చిలకడం మొదలుపెట్టారు. పర్వతం లోపలకి మునిగిపోతోంది. సముద్రాన్ని చిలకడం సాధ్యం కావడం లేదు. అప్పుడు శ్రీహరి కూర్మరూపుడై సముద్రంలోకి ప్రవేశించి, పర్వతాన్ని పైకి తేలి ఉండేటట్లుగా చేశాడు. దేవదానవులు మళ్ళీ సముద్రాన్ని చిలకడం మొదలుపెట్టారు.

## ఈశ్వరుడు విషాన్ని తినడం - శ్రీహరి మోహినీ వేషాన్ని ధరించడం

అంతలో సముద్రంలో నుంచి మంటలుకక్కుతూ భయంకరమైన విషం పుట్టింది. ఆ మంటలను దేవదానవులు తట్టుకోలేపోతున్నారు. పరుగులు తీస్తున్న దేవదానవులను ఆ మంటలు వెంబడిస్తున్నాయి. వాళ్ళకి తలదాచుకోడానికి నీడ అనేదే లేకుండా పోయింది. అప్పుడు ఇంద్రాదిదేవతలు కైలాసానికి వెళ్ళి, తమని రక్షించి, లోకాలను కాపాడమని ఈశ్వరుడిని ప్రార్థించారు.

పరమేశ్వరుడు వారికి అభయమిచ్చాడు. ఆ విషాన్ని తానే నేరేడు పండును మింగినట్లుగా మింగాలనుకున్నాడు. ఒక్కసారి పార్వతి వైపు చూశాడు. ఆమె ఒకసారి పరమేశ్వరుడు తన మెడలో కట్టిన మాంగల్యానికి నమస్కరించుకుని, స్వీకరించమన్నట్లుగా పరమేశ్వరుని వైపు చూసింది.

ఆ క్షణంలోనే పరమేశ్వరుడు ఆ మంటలన్నింటినీ ఒక ముద్దగా చేసుకుని నేరేడు పండును నోట్లో వేసుకున్నట్లుగా వేసుకుని  లోకాలన్నింటినీ రక్షించాడు. లోపలికి మ్రింగితే కడుపులోని లోకాలు మాడిపోతాయని తలచి కంఠంలోనే ఆ విషాన్ని అట్టి పెట్టుకుని నీలకంఠుడై లోకరక్షణ చేశాడు.

ఆ తరువాత కామధేనువు, ఉచ్ఛైశ్రవం, ఐరావతం, కల్పవృక్షం, అప్సరసలు, చంద్రుడు, శ్రీమహాలక్ష్మి సముద్రంలోంచి ఉద్భవించినాయి. శ్రీమహాలక్ష్మి తనను చూసి ఏమాత్రం చలించని శ్రీమహావిష్ణువుని వరించింది. చివరగా

అమృతపాత్రని చేత పట్టుకుని శ్రీహరి దివ్యవైద్యుడైన ధన్వంతరి రూపంలో ప్రత్యక్షమయ్యాడు.

రాక్షసులు ఆ దివ్యవైద్యుని చేతిలో నుండి అమృతపాత్రని లాక్కున్నారు. అది చూసి దేవతలు చేతిదాకా వచ్చిన అమృతం చేజారిపోయిందే అని దుఃఖించారు.

అప్పుడే శ్రీమహావిష్ణువు దేవతలను దుఃఖించవద్దనీ, నా మాయా బలంతో దాన్ని మీకు తెచ్చి ఇస్తాననీ మాట ఇచ్చాడు.

**హరి రాహువుని సంహరించడం - హరుని మోహింపచెయ్యడం**

నేను ముందంటే నేను ముందు తాగుతానంటూ కొందరు, మనతో బాటు దేవతలకూ పంచుదాం అంటూ మరికొందరు... ఇలా రాక్షసులంతా పోట్లాడుకుంటున్నారు. ఇంతలో శ్రీహరి మూడు లోకాలనూ మోహింప చేసే విధంగా అందమైన స్త్రీ రూపాన్ని ధరించి, రాక్షసుల మధ్యకు చేరి, నువ్వే మాకు అమృతం పంచమని వాళ్ళ చేతనే అనిపించి, అందరినీ వరుసల్లో కూర్చోబెట్టాడు. మరొక వరుసలో దేవతలు కూర్చున్నారు.

ఇప్పుడే వచ్చి ప్రత్యేకంగా వడ్డిస్తానంటూ రాక్షసులతో కబుర్లు చెప్తూ.... "తొందరగా తాగండి. ఆలస్యం చెయ్యకండి..." అంటూ అమృతాన్ని దేవతలకు పంచుతోంది. ఇంతలో "రాహువు" అనే రాక్షసుడు దేవతల వరుసలోకి దూరాడు. ఈ విషయాన్ని సూర్యచంద్రులు కనుసైగలతో మోహినికి తెలియచేశారు. వెంటనే శ్రీహరి చక్రాయుధాన్ని ప్రయోగించి రాహువు తలను నరికాడు.

కానీ అప్పటికే అమృతం త్రాగడం వలన రాహువు తల ఆకాశంలో నిలబడింది. మొండెం నేలకు ఒరిగింది. బ్రహ్మదేవుడు రాహువు తలను గ్రహాలలోకి చేర్చి గౌరవించాడు. రాహువు సూర్యచంద్రులు తనకు అపకారం చేశారన్న కోపంతో పగబట్టి వాళ్ళిద్దరినీ పర్వదినాలైన అమావాస్య పూర్ణిమలలో పట్టుకుంటున్నాడు.

ఈ ప్రకారంగా రాక్షసులకు ఒక్క చుక్క అమృతం కూడా దొరకకుండా చేసి, దేవతలకే అమృతాన్ని పంచి, నిజరూపాన్ని ధరించాడు శ్రీహరి. ఆ రూపం చూసి దేవతలు సంతోషించారు. దానవులు అదిరిపడ్డారు.

సాగర మథనంలో దేవదానవులు ఇరువురు సమానంగానే శ్రమపడ్డారు. కానీ భగవంతుని ఆశ్రయించిన దేవతలకు అమృతం లభించి శ్రేయస్సు లభించింది. భగవదాశ్రయం పొంది దానవులకు అమృతము దక్కలేదు. పడిన శ్రమా వృథా అయ్యింది. కాబట్టి కమలాక్షుని కరుణా కటాక్షములకు పాత్రులు కాని వాళ్ళకి శుభాలు కలగడం, శ్రేయస్సులు లభించడం కలే.

శ్రీహరి గరుత్మంతునిపై వైకుంఠానికి వెళ్ళాడు. అమృతం దొరకలేదన్న కోపంతో దానవులు దేవతల మీదపడ్డారు. రాక్షసులకు నాయకునిగా ఉన్నాడు బలిచక్రవర్తి. దేవతలకు ఇంద్రుడు నాయకత్వం వహించాడు. దేవదానవులిద్దరికీ భయంకరమైన యుద్ధం జరుగుతోంది. అందులో చాలా మంది రాక్షసులు మరణించారు.

దేవతలు స్వర్గానికి వెళ్ళారు. రాక్షసులు బలిచక్రవర్తితో కలిసి పశ్చిమ శిఖరానికి చేరుకున్నారు. మరణించిన రాక్షసులందరినీ తన దగ్గర ఉన్న మృతసంజీవినీ విద్యతో బ్రతికిస్తున్నాడు.

## హరి మోహినిగా శంకరుని మోహింపచేయుట - సువర్ణ రజతాలు తయారగుట

ఒకరోజు కైలాసంలో కొలువుదీరిన శంకరుడు శ్రీహరి మోహినిగా అవతరించి రాక్షసులను మోహింపచేసి, దేవతలకు అమృతాన్ని పంచిన వార్త విన్నాడు. వెంటనే శంకరునికి ఆ శ్రీహరి మోహినీ రూపాన్ని చూడాలనిపించింది. తన వారందరినీ వెంట బెట్టుకుని వైకుంఠానికి వెళ్ళాడు.

శ్రీమన్నారాయణునితో కబుర్లు చెప్తూ "రాక్షసులను మోసం చేసిన ఆ మోహినీ రూపాన్ని చూడాలని ఉంది. నా కోరిక తీర్చమని" అడిగాడు. ఆ మాట విన్న మాధవుడు చిరుమందహాసం చేసి అక్కడ నుండి మాయమయ్యాడు. మాట్లాడుతున్న మాధవుడేమయ్యాడా అని మహేశ్వరుడు నాలుగు దిక్కులకూ కలియచూస్తున్నాడు.

ఇంతలో మహేశ్వరుని ఎదురుగా ఒక చక్కని పుష్ప భరితమైన తోట, అందులో ఒక చెట్టు నీడలో బంతి ఆడుతున్న ఒక అందమైన యువతి కనిపించింది. మహేశ్వరుడు ఆ యువతిని చూసీ చూడడంతోనే తానున్న పరిసరాలను, తన గణాలను, తనలో సగభాగమైన భవానినీ కూడా గమనించలేదు. తన కనుల ఎదుట కనిపిస్తున్న జగన్మోహినినే చూస్తూ పులకిరించిపోతున్నాడు.

మోహిని ఒలకబోస్తున్న శృంగార చేష్టను చూసి ఆగలేని శంకరుడు ఆమెను పట్టుకోబోయాడు. శంకరునికి అందకుండా పరుగులు తోస్తోంది జగన్మోహిని. మహాదేవుడు మోహినిని వెంబడిస్తూ చాలా దూరం వెళ్ళాడు. అలా వెళ్ళడంతో మోహంతో ఉన్న శంకరుని రేతస్సు నేలపై జారి పడుతోంది. అలా పరమేశ్వరుని రేతస్సు పడిన చోటంతా బంగారం, వెండిగా మారింది. అంతలో మహాదేవుని మోహం తగ్గి తీరిపోయింది.

అప్పటికి తానెవరో జ్ఞాపకానికి వచ్చిన గౌరీకాంతుడు సిగ్గుపడుతూ వెనక్కి తిరిగాడు. మరుక్షణంలోనే రమాకాంతుడు స్త్రీ రూపాన్ని వదిలేసి, పురుషరూపాన్ని ధరించాడు.

కనుక కాముని గెలవడం సాధ్యమే. కాలుడిని గెలవడమూ సాధ్యమే. కానీ కామినిని గెలవడం కామారికి కూడా సాధ్యం కాలేదంటే ఇక సామాన్యుల సంగతి చెప్పాల్సిన పనేలేదు.

అప్పుడు శ్రీహరి హరునితో "నువ్వు కాబట్టి కొంతసేపటికైనా నువ్వు ఎవరో ఆలోచించుకున్నావు. కానీ మరొకరెవరైనా అయితే అలా నా వెంట ఎంతసేపు పరుగులు పెట్టేవారో? అట్లా వాళ్ళు ఎంతదూరం వచ్చినా ఆత్మజ్ఞానం మాత్రం ఎప్పటికీ కలిగేదే కాదు" అన్నాడు.

ఆ తరువాత హరి దగ్గర వీడ్కోలు అందుకుని మరుడు తన వారితో కలిసి కైలాసానికి వెళ్ళిపోయాడు.

పరీక్షిన్మహారాజా! ఇప్పుడు పాలిస్తున్న వైవస్వత మనువు ఏడవవాడు. విష్ణువు అదితీ కశ్యపులకు 'వామనుడనే' పేరుతో అవతరించి ఇంద్రుడికి తమ్ముడయ్యాడు. ఇప్పటివరకూ చెప్పినవి జరిగిన మన్వంతరాలు. ఇకపై జరగబోయే మన్వంతరాలను వివరిస్తాను విను..."

ఎనిమిదవ మనువు సూర్యసావర్ణి. ఇతడి కాలంలో బలి ఇంద్రుడౌతాడు. ఈ బలి పూర్వం స్వర్గాన్ని ఆక్రమించు కున్నప్పుడు, దేవతలను రక్షించడం కోసం శ్రీహరి అతడిని మూడడుగుల నేలను అడిగి, రెండు అడుగులతో భూమ్యాకాశాలను ఆక్రమించి, మూడవ అడుగు ఏదని అడగగా అతడు శ్రీహరి పాదాన్ని తన శిరస్సుపై పెట్టించుకున్నాడు. ఇప్పుడు స్వర్గాన్ని మించిన సుతలంలో ఉంటున్నాడు. ఈ మన్వంతరంలో శ్రీహరి "దేవగుహీ, సరస్వతు" లకు "సార్వభౌముడు" అనే పేరుతో పుట్టి దేవేంద్రుడి పదవి నుండి పడగొట్టి, బలిని ఇంద్రసింహాసనంపై కూర్చోబెడతాడు.

ఇక తొమ్మిదవ మనువు వరుణుని కుమారుడైన "దక్షసావర్ణి'. ఈ మన్వంతరంలో విష్ణువు "ఆయుష్మంతుడు, అంబుధారా" అనే వాళ్ళకు కుమారుడై లోకరక్షణ కావిస్తాడు. పదవ మనువు ఉపశోకుని తనయుడైన "బ్రహ్మసావర్ణి". ఆ కాలంలో విష్ణువు "విసృజుడికీ, విషూచికీ" విష్వక్సేనుడు అనే పేరుతో పుట్టి లోకాలన్నింటినీ రక్షిస్తాడు.

పదకొండవ మనువు "ధర్మసావర్ణి". ఈ మన్వంతరంలో శ్రీహరి 'ధర్మసేతువు' అనే పేరుతో సూర్యపుత్రుడై అవతరించి మూడులోకాలనూ కాపాడతాడు.

పన్నెండవ మనువు"భద్రసావర్ణి". ఇతని కాలంలో శ్రీహరి "సూనృతాసత్యతపు"లకు "స్వధాముడు" అనే పేరుతో పుట్టి ప్రజారక్షణ చేస్తాడు.

పదమూడవ మనువు "దేవసావర్ణి". ఈ మన్వంతరంలో విష్ణువు "యోగవిభుడు" అనే పేరుతో బృహతీ, దేవహోత్రులకు పుత్రుడై అవతరించి సమస్తలోకాలకూ సౌఖ్యాన్ని కలిగిస్తాడు.

పధ్నాలుగవ మనువు "ఇంద్రసావర్ణి." "వితాన, సత్రాయను" లకు శ్రీహరి 'బృహద్భానుడు' అనే పేరుతో తనయుడై అవతరించి దేవతలకు ప్రియమైన యజ్ఞయాగాది క్రతుకర్మలను వృద్ధి పరుస్తాడు.

ఈ పధ్నాలుగు మంది మనువులూ పాలించడం పూర్తయ్యేసరికి వెయ్యి యుగాల కాలం పూర్తి అవుతుంది. అప్పటికి బ్రహ్మదేవునికి ఒక్కరోజు పూర్తి అవుతుంది" అని చెప్పాడు శుకుడు.

పరీక్షిత్తు "అసలు వీళ్ళందరినీ మనువులుగా ఎవరు నియమిస్తారు? వాళ్ళకి అంతటి గొప్పదనం ఎట్లా వచ్చింది? శ్రీహరి అసలు భూలోకంలో అవతరించడం ఎందుకో" వివరించండి అని శుకుని ప్రార్థించాడు.

శుకుడు పరీక్షిత్తుతో "మనువులు, మనుపుత్రులు, ఇంద్రులు, దేవతలు అందరూ శ్రీహరి ఆజ్ఞను

అనుసరించేవాళ్ళే. హరి స్వరూపాలే. వీళ్ళంతా వీళ్ళ పనులను ఆ శ్రీహరి సహాయంతోనే నిర్వహిస్తుంటారు. నాలుగుయుగాల కాలం పూర్తయ్యేసరికి కాలవశాన క్షీణించే వేదాలనూ, తపోబలాలనూ తిరిగి పెంచుకుంటు, బలపరుచుకుంటు ఉంటారు.

అప్పుడు మళ్ళీ ధర్మం నాలుగు పాదాలా నడుస్తూ ఉంటుంది. శ్రీమన్నారాయణుడే యోగ్యులను ఆయా ఇంద్రాది పదవులలో ప్రతిష్ఠిస్తుంటాడు. ఇలా నీకు ఎన్నని, ఎంతని చెప్పను? శ్రీమన్నారాయణుడొక్కడే ఈ విశ్వమై వ్యాపించి, ఇన్ని రూపాలుగా వ్యవహరిస్తుంటాడు" అని చెప్పాడు.

**వామనుడు అవతరించుట - త్రివిక్రమునిగా విజృంభించుట**

పరీక్షిన్మహారాజు "శ్రీహరి బలి చక్రవర్తిని మూడడుగుల నేల ఇమ్మని ఎందుకు అడిగాడు? సమస్తమునూ అందరికీ అనుగ్రహించగల ఆ పరమాత్మ ఒకరిని ఎందుకు యాచించాల్సి వచ్చింది? దానమిచ్చిన దాతనే ఎందుకు బంధించాడు?" వివరంగా చెప్పమని శుకమహర్షిని అడిగాడు.

పాలసముద్రాన్ని చిలికిన తరువాత జరిగిన యుద్ధంలో ఓడిపోయిన బలిచక్రవర్తి రాక్షసగురువైన శుక్రుని సేవించి, ఆయన అనుగ్రహాన్ని పొంది, ఆయన ఆధ్వర్యంలో విశ్వజిద్యాగం చేశాడు. అతడి యాగం పూర్తయ్యాక అతడికి అగ్నిదేవుడు ఒక దివ్యమైన రథాన్నీ, దివ్యమైన ధనస్సునూ, రెండు అమ్ముల పొదులనూ, ప్రహ్లాదుడు ఎప్పుడూ వాడిపోని తామరపూల మాలనూ, శుక్రుడు చందమామ లాంటి శంఖాన్నీ ఇచ్చారు.

వాటి బలగర్వంతో బలి విశ్వాన్నే జయించడానికి బయలు దేరాడు. దేవతలు బృహస్పతి సలహాప్రకారం స్వర్గాన్ని వదిలేసి వెళ్ళిపోయారు. ఒక్క రక్తపు చుక్క కూడా క్రిందపడకుండా అమరావతిని తన వశం చేసుకున్నాడు బలి.

అదితి తన కుమారుల దుస్థితికి దుఃఖించి, వాళ్ళ దుస్థితిని తొలగించమని భర్తని వేడుకుంది. కశ్యపుడు అదితికి "శ్రీహరిని ఆరాధించు. నీ కుమారుల దుస్థితి తొలగిపోతుందని చెప్పి, ఆమెకు "పయోభక్షనం" అనే వ్రతాన్ని ఉపదేశించాడు. అదితి ఫాల్గుణ శుక్ల పాడ్యమి నుండి ద్వాదశి వరకూ పన్నెండు రోజుల పాటు వ్రతం చేసి శ్రీహరికి సమర్పించింది. తత్ఫలితంగా ఆమెకు శ్రీహరి ప్రత్యక్షమై "అమ్మా! నువ్వు దుఃఖించకు. నేనే నీకు కుమారునిగా పుట్టి, బలిని నిగ్రహించి, దేవేంద్రుడి చేత ముల్లోకాలనూ పాలింప చేస్తాను" అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

ఆ తరువాత కొంతకాలానికి అదితి గర్భవతి అయ్యింది. నెలలు నిండినాయి. తగిన సమయం వచ్చింది. సూర్యుడు ఆకాశం మధ్యలో ప్రకాశిస్తుండగా, గ్రహాలన్నీ అనుకూలంగా ఉండగా, శ్రావణ ద్వాదశి నాటి అభిజిత్‌లగ్నంలో శ్రీహరి అదితికి పొట్టివానిగా పుట్టాడు. కశ్యపుడు "వామనుడు" అని ఆ బిడ్డకి నామకరణం చేశాడు.

దినదిన ప్రవర్ధమానుడై పెరుగుతున్న ఆ వామనునికి తగిన వయస్సు రాగానే కశ్యపుడు ఉపనయన సంస్కారం చేశాడు. తల్లిదండ్రుల అనుమతి తీసుకుని, వామనుడు

సాటిలేని దాత అయిన బలిచక్రవర్తి దగ్గరకి ఒక మంచి ముహూర్తంలో బయలుదేరాడు.

బలి యొక్క యాగమంటపంలోకి ప్రవేశిస్తున్నాడు. తేజసంపన్నుడైన వామనుని చూసి అక్కడ వారంతా ఆశ్చర్యపోతున్నారు. శుక్రాచార్యుని తేజస్సు వెలవెలబోతోంది. భృగుమహర్షి వామనుని కుశల ప్రశ్నలడిగారు.

బలి ఎదురువెళ్ళి నమస్కరించి, ఆ బాలబ్రహ్మచారిని తీసుకొచ్చి తన సింహాసనం మీదే కూర్చోబెట్టి, భార్య వింధ్యావళి బంగారు కలశంతో నీళ్ళు పోస్తుండగా బ్రహ్మదేవుడే కడిగిన ఆ పాదాలను శ్రద్ధా భక్తులతో కడిగి, ఆ నీటిని శిరస్సున చల్లుకున్నాడు.

తరువాత ఆ వామనుని వివరాలు అడిగాడు. అతనికి ఏం కావాలో సందేహించకుండా అడగమన్నాడు.

దానవ చక్రవర్తి బలి మాటలకు బాలబ్రహ్మచారి అయిన వామనుడు సంతోషించి "పూర్వం సమస్త సంపదలూ ఉండేవి. ఒంటరివాడినైన నేను సజ్జనులు ఎక్కడ ఉంటే అక్కడ తప్పని సరిగా ఉంటాను. నాది అనుకోడానికి ఒకటి మరియు రెండు అడుగుల నేల నాకు దానంగా ఇవ్వు. నా కోరిక తీరినాక బ్రహ్మలోకాన్ని ముట్టుకుంటాను" అన్నాడు.

"నా అంతటి వాడి వద్దకు వచ్చి ఇంత చిన్నకోరిక కోరావు. నీకు అడగడం కూడా చేతకాలేదన్నాడు" బలి. వామనుడు "నువ్వు చక్రవర్తివి గదా! అని నీకున్నదంతా ఇమ్మని అడగాలా? ఏంటి? ఒకవేళ నువ్వు అన్నీ ఇచ్చినా నేనేం

చేసుకుంటాను?అందుకని నేను అడిగిన మూడడుగుల నేల ఇవ్వు. నాకు అదేచాలు" అన్నాడు.

విషయం గ్రహించిన శుక్రాచార్యుడు బలితో "దేవతలకు శుభం కలిగించడానికీ, నిన్ను మోసం చెయ్యడానికీ శ్రీహరి ఈ రూపంలో అదితి గర్భంలో వామనుడై పుట్టాడు. కనుక అతడు అడిగిన మూడు అడుగుల నేల అతనికి ఇస్తే నీకు నిలవనీడ కూడా ఉండదు" అని హెచ్చరించాడు.

"గృహస్థ ధర్మాన్ని పాటించి, ఇచ్చిన మాటకు కట్టుబడి, ఇస్తానన్న మూడడుగుల నేల ఇతనికి తప్పక దానం చేస్తాను" అన్నాడు బలి. భార్య చేతిలో బంగారు కలశంతో నీరుపోస్తుండగా వామనుని పాదాలు కడిగి, దానం కోసం నీటిధారను వదలబోతున్నాడు బలిచక్రవర్తి.

ఇంతలో రాక్షసరాజ్య నాశనం చూడలేని శుక్రాచార్యుడు కలశరంధ్రంలోకి దూరి రంధ్రానికి అడ్డుగా ఉండి, నీటిధార బయటకు రాకుండా ఆపేశాడు. అది తెలిసిన వామనుడు ఏమీ ఎరగనివాడిలాగా తన దగ్గరున్న దర్భపుల్లతో ఆ కలశరంధ్రంలోకి పొడిచాడు.

ఆ దర్భ కలశరంధ్రంలో అడ్డుగా ఉన్న శుక్రాచార్యుని కంటికి గుచ్చుకుంది. ఆ క్షణంలోనే శుక్రాచార్యుడు ఒంటికంటి వాడయ్యాడు. వామనుడు అడ్డుతొలగిందన్న ఆనందంతో మూడులోకాలలో వ్యాపించి ఉంటూ మూడులోకాలనేలే ముకుందుడికి మూడడుగుల నేలను దానం చేశాడు.

అదే క్షణంలో వామనుడు అందరూ చూస్తుండగానే త్రివిక్రముడై పెరిగిపోయాడు. ఒక అడుగుతో భూమినీ, మరో అడుగుతో ఆకాశాన్నీ వ్యాపించి, మూడో అడుగు ఎక్క పెట్టమటావని మహా దాతని అడిగాడు. బలి బ్రహ్మానందంతో తన తలమీద పెట్టమన్నాడు. వామనుడు తన మూడవ అడుగును బలి తలపైపెట్టి, అతడిని సుతలానికి పంపి, దానికి అధిపతిని చేశాడు.

సావర్ణి మనువు కాలంలో ముల్లోకాల ఆధిపత్యం కట్టబెడుతాననీ, చివరికి తన సాన్నిధ్యాన్ని చేరుకుంటాడనీ, అప్పటివరకూ అక్కడే సుఖంగా కాలం గడుపుమని వరమిచ్చాడు శ్రీహరి. అతనికి సంపూర్ణ యజ్ఞఫలాన్ని ప్రసాదించాడు. దేవతలను ఉద్ధరించిన వామనునికి బ్రహ్మదేవుడు "ఉపేంద్రుడని" పేరుపెట్టి స్వర్గాపవర్గాలకు ఇతడే ప్రధానుడని ప్రకటించాడు.

బలి చక్రవర్తిలోని సత్యనిష్ఠ గరుశాపానికి బెదరలేదు. సంపదలు నశించినా క్రుంగిపోలేదు. బంధువులు దూరమైన బెంగపడలేదు. ఎప్పుడూ ఒకే విధంగా ఉండడం, ఇచ్చిన మాటకు కట్టుబడడమే అతడిని అంతటి వాడిని చేసింది. ఈ విషయం మనందరం గ్రహించాల్సిన గొప్ప విషయం. మరియు మనందరం పాటించాల్సిన, నేర్చుకోవాల్సిన గొప్ప ప్రవర్తన.

## మత్స్యావతార ఆవిర్భావం - సత్యవ్రతుడు వివస్వంతుడై పుట్టడం

శుకుడు పరీక్షిత్తుకి ఇట్లా చెప్పడం మొదలుపెట్టాడు. గడిచిన కల్పంలో చివరి భాగంలో ద్రవిడ దేశపురాజు సత్యవ్రతుడు "కృతమాలిక" అనే నది ఒడ్డున హరికి జలతర్పణం చేస్తున్నాడు. ఇంతలో ఒక చేప అతడి దోసిట్లోకి వచ్చింది. దాన్ని మళ్ళీ నీటిలోకే వదిలేస్తుంటే ఆ చేప "నీళ్ళలోకి వదలద్దనీ, తనను రక్షించమనీ" సత్యవ్రతుని ప్రార్థించింది.

సత్యవ్రతుడు ఆ చేపను కమండలంలో వేసుకుని ఆశ్రమానికి తీసుకెళ్ళాడు. ఆ చేప క్రమంగా పెరుగుతూ, తనకు నివాసానికి తగిన అవకాశం చూపించమంటూ చివరకి సముద్రంలోకి చేరుకుంది. "నన్ను ఈ మొసళ్ళకు ఆహారంగా (చివరికి) వేస్తావా?" అని అడిగింది సత్యవ్రతుని.

సత్యవ్రతుడు "నువ్వు చేపవికాదు. ఆపదలోఉన్నవారిని రక్షించే శ్రీహరివి. మత్స్యావతారంగా అవతరించిన శ్రీమన్నారాయణుడివి అని నాకు అర్థమయ్యింది అన్నాడు. "నువ్వు ఈ విధంగా ఎందుకు అవతరించావో" చెప్పమని అడిగాడు సత్యవ్రతుడు. శ్రీహరి సత్యవ్రతునితో "ఇవాల్టికి ఏడవరోజున బ్రహ్మదేవుడికి పగలు పూర్తయిపోతుంది. మూడు లోకాలూ సముద్రంలో మునిగిపోతాయి. అంతలోనే ఒక పెద్ద నావ ఆ సముద్రంలోకి సప్తర్షులతో వస్తుంది. కొత్తసృష్టికి

కావాల్సిన విత్తనాలను తీసుకుని నువ్వు అందులోకి ఎక్కు. నేను నా మీసాలతో ఆ నావని ఎటూ ఒరిగిపోకుండా రక్షిస్తుంటాను” అని చెప్పి మాయమయ్యాడు.

తరువాత శ్రీహరి చెప్పినట్లే జరిగింది. సత్యవ్రతుడు శ్రీహరి చెప్పినట్లే చేశాడు. తరువాత బ్రహ్మదేవుడు ప్రాణులను సృష్టించాడు. అవి నిలబడలేకపోవడం చూసి, దిగులతో ఆలోచిస్తూ తలకింద చెయ్యి పెట్టుకుని పడుకుని, నిద్రపోయి కలలు కలంటున్నాడు. ఇంతలో ఆ బ్రహ్మదేవుడి ముఖాల నుండి వేదాలు బయటకు వచ్చినాయి.

వాటిని హయగ్రీవుడనే రాక్షసుడు దొంగలించి, సముద్రంలోకి వెళ్ళిపోయాడు. వెంటనే సర్వజగద్రక్షకుడైన పురుషోత్తముడు లక్షయోజనాలుగల మీన రూపాన్ని ధరించాడు. సత్యవ్రతుడున్న నావని చుట్టుకున్న గొప్పసర్పాన్ని తన నుదుటికి కట్టుకుని సముద్రజలంలో ఈదుతున్నాడు.

సత్యవ్రతుడు ఆ పురాణపురుషుని అనేక విధాలుగా స్తోత్రం చేశాడు. అతడి భక్తికి మెచ్చిన శ్రీహరి సత్యవ్రతుడికి సాంఖ్య యోగంతో కూడిన పురాణసంహితను ఉపదేశించాడు. ఆ సత్యవ్రతుడే ఈ కల్పంలో “వివస్వంతుడనే” పేరుతో ప్రసిద్ధుడై సూర్యుడికి కుమారుడై పుట్టాడు.

ఇతడే “శ్రాద్ధదేవుడు” అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. నారాయణుడు ఆ రాత్రే హయగ్రీవాసురుని సంహరించి, ఆ వేదాలను తెచ్చి బ్రహ్మదేవునికి అప్పగించాడు. బ్రహ్మదేవుడు ఆనందించాడు.

జలజనాభునికి జలతర్పణం చేసి, ఆ పుణ్యంతో మనువయ్యాడు సత్యవ్రతుడు.

## శ్రీమద్భాగవతమునందలి ఎనిమిదవ స్కందం పరసమాప్తం

# తొమ్మిదవ స్కందము

### వైవస్వత మనువంశ వర్ణన - నాభాగుడు రుద్రానుగ్రహమును పొందుట

పరీక్షిత్తు శుకమహర్షిని "వైవస్వత మను వంశాన్ని గురించి వివరంగా చెప్పమని" ప్రార్థించాడు. మహర్షి ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

"వివస్వంతుని భార్య సంజ్ఞ. వీళ్ళ కుమారుడు శ్రాద్ధదేవుడు. ఇతడు కూడా హరి అనుగ్రహంతో మనువయ్యాడు. ఇతడి భార్య శ్రద్ధ. వీళ్లకి "ఇక్ష్వాకుడు, నృగుడు, శర్యాతి, దిష్టుడు, ధృష్టుడు, కరూశకుడు, అరిష్యంతుడు, వృషధ్రుడు, నాభాగుడు, కలి" అని పదిమంది కుమారులు.

వీళ్ళు పుట్టకముందు పుత్రుల కోసం చేసిన యజ్ఞంలో ఇతని భార్య పుత్రిక కోసం హోత్రను ఆశ్రయించింది. పరమభక్తితో పయోవ్రతం చేసింది. అప్పుడు 'ఇల' అనే కుమార్తె పెట్టింది.

ఇది తెలియని మనువు కుమారుల కోసం యజ్ఞం చేస్తే కుమార్తె పుట్టిందేమిటని వసిష్ఠుని దగ్గరకువెళ్ళి అడిగాడు. వసిష్ఠుడు జరిగినది గ్రహించాడు. మనువుతో "నా తపఃశ్శక్తితో

ఆమెను పురుషుని చేస్తానని" చెప్పి ఆదిపురుషుడైన శ్రీహరిని ప్రార్థించి, మహర్షి కోరిక తీర్చాడు. ఆ కారణంగా "ఇలా" అనే స్త్రీ "సుద్యుమ్నుడు" అనే పురుషునిగా మారింది. ఆ సుద్యుమ్నుడు రాజయ్యాడు.

ఒకరోజు సుద్యుమ్నుడు కొందరు మంత్రులను వెంటబెట్టుకుని అరణ్యాల్లో వేటాడుతూ కుమారవనంలో ప్రవేశించాడు. వెంటనే అందరూ స్త్రీలైపోయారు. రాజు ఎక్కిన గుర్రమూ ఆడగుర్రమైపోయింది." వెంటనే పరీక్షిత్తు "ఎందుకిలా జరిగింది?" అని ప్రశ్నించాడు.

ఒకప్పుడు కుమారవనంలో పార్వతీపరమేశ్వరులు క్రీడిస్తున్నారు. ఆసమయంలో వారిని చూడడం కోసం వచ్చిన మహర్షులను చూసి వస్త్రరహితంగా భర్త తొడమీద ఉన్న పార్వతి సిగ్గుపడింది. మహర్షులు కూడా రాకూడని సమయంలో వచ్చామనుకుంటూ నరనారాయణుల ఆశ్రమానికి వెళ్ళిపోయారు.

పరమేశ్వరుడు పార్వతికి ప్రియం చేకూర్చడం కోసం ఆ రోజు "ఈ కుమారవనంలో అడుగుపెట్టిన పురుషుడైవరైనా స్త్రీగా మారిపోతాడు" అన్నాడు. అందుకే ఇలా జరిగింది. స్త్రీ రూపాల్లో బయటికి వచ్చినవ్వులపాలవుతామని వారంతా కొంతకాలం అక్కడే గడిపారు.

వీళ్ళంతా ఒకరోజు బుధుడు తపస్సు చేసుకునే చోటికి వెళ్ళారు. బుధుడు సుద్యుమ్నుని స్త్రీ రూపాన్ని చూసి

మోహించాడు. సుద్యుమ్నుడికీ బుధుడిపట్ల అనురాగం కలిగింది. ఆ కారణంగా వాళ్ళకి "పురూరవుడు" అనే పుత్రుడు పుట్టాడు.

తరువాత సుద్యుమ్నుడు తన స్త్రీ రూపాన్ని పోగొట్టుకోవడం కోసం వసిష్ఠుని సలహా అడిగాడు. మహర్షి శంకరుని ఆరాధించాడు. శంకరుడు ప్రత్యక్షమై 'ఈ సుద్యుమ్నుడు ఒక నెలరోజులు స్త్రీగానూ, మరొక నెలరోజులు పురుషుడిగానూ ఉంటూ తన రాజ్యాన్ని పాలిస్తుంటాడని" చెప్పాడు. ఇలా శంకరానుగ్రహాన్ని పొందిన సుద్యుమ్నుడు తిరిగి వచ్చి రాజ్యమేలాడు.

ఉత్కలుడు, గయుడు, విమలుడు అనే కుమారులను పొందాడు. ముసలితనంలో తన రాజ్యాన్ని పురూరవునికి ఇచ్చి తపోవనానికి వెళ్ళిపోయాడు.

పురూరవుడు పుత్రసంతానం కోసం శ్రీహరిని ధ్యానిస్తూ యమునా నది ఒడ్డున వంద సంవత్సరాలు తపస్సు చేశాడు. శ్రీహరి అనుగ్రహంతో పదిమంది పుత్రులను పొందాడు. వాళ్లలో వృషధ్రుడు గురువైన వసిష్ఠుని ఆవులను కాపాడుతూ కొంతకాలం గడిపాడు. ఒకరోజు వానలో ఆవులను కాస్తుండగా పులి అరుపు వినపడింది అతనికి. ఆపులి ఒక ఆవును పట్టుకుంది. అప్పుడు అరిచిన ఆవు అరుపు విని చీకట్లో కనపడక పులి అనుకుని ఆవుని చంపాడు. తరువాత పులినీ చంపాడు.

కానీ ఆవుని చంపానిని మిక్కిలి దుఃఖించాడు. అయినా ఆవుని చంపిన పాపానికి వసిష్ఠుడు కోపంతో వృషధ్రుని "క్షత్రియత్వానికి దూరమై చండాలునివైపోతావని" శపించాడు.

తరువాత గురువును ఎంతగానో వేడుకుని, ఆయన అనుగ్రహంతో సన్యాసం తీసుకుని, హరినే ధ్యానిస్తూ దేశమంతా తిరిగి, చివరికి పరమపదాన్ని పొందాడు. మనుపుత్రులలో చివరివాడైన "కలి" కూడా రాజ్యకాంక్షను వదిలేసి, భగవంతుని ధ్యానిస్తూ, ఉత్తమగతినే పొందాడు.

కరూశుని వలన పుట్టినవాళ్ళూ కారూశులనే క్షత్రియులై ఉత్తరాపథానికి రక్షకులయ్యారు. ధృష్టుని వంశం ధార్ష వంశంగా ప్రసిద్ధి చెందింది. ఈ వంశం వాళ్ళు బ్రాహ్మణులయ్యారు. నృగుని వంశంలో సుమతి పుట్టాడు. సుమతికి భూతజ్యోతి, భూతజ్యోతికి వసువు, వసువుకి ప్రతీకుడు, ప్రతీకునికి ఓఘవంతుడు పుట్టారు.

ఓఘవంతుని పుత్రిక ఓఘవతిని సుదర్శనుడు వివాహం చేసుకున్నాడు. అరిష్యంతునికి చిత్రసేనుడు, చిత్రసేనునికి దక్షుడు, దక్షునికి మీఢాశ్యుడు, అతడికి శర్వుడు, శర్వుడికి ఇంద్రసేనుడు, ఇంద్రసేనునికి వీతిహోత్రుడు, వీతిహోత్రునికి సత్యశ్రవుడు, సత్యశ్రవుడికి ఉరుశ్రవుడు, ఉరుశ్రవునికి దేవదత్తుడు, దేవదత్తునికి అగ్నివేశుడు పుట్టారు. అగ్నివేశుడే "కానీముడనే" పేరు పొంది, "జాతకర్ణి" అనే మహర్షి అయ్యాడు. ఇతని వల్లనే "అగ్నివేశ్యాయన"మనే బ్రాహ్మణ వంశం వచ్చింది.

ధిష్టుని కుమారుడైన నాభాగుడు కర్మవశాన వైశ్యుడయ్యాడు. అతనికి హలంధనుడు, హలంధనునికి వత్సప్రీతి, వత్సప్రీతికి ప్రాంశువు, ప్రాంశువుకి ప్రమతీ, ప్రమతికి ఖనిత్రుడు, ఖనిత్రునికి చాక్షుషుడు, చాక్షుషునికి వివింశతి, వివింశతికి రంభుడు, రంభునికి ఖనేత్రుడు, ఖనేత్రునికి కరంధనుడు, కరంధనునికి ఆవిక్షిత్తూ, ఆవిక్షిత్తుకి మరుత్తుడు పుట్టారు.

ఈ మరుత్తుడు చక్రవర్తి అయినాక చేసిన ఎన్నో యజ్ఞాల కారణంగా దేవేంద్రుడు సంతోషించి అతని యాగశాలలోని సమస్త వస్తువులనూ బంగారుమయాలుగా చేశాడు. మరుత్తువంటి త్యాగసంపన్నుడు మరొకడు లేడు. ఈ మరుత్తుకి దముడు, దమునికి రాజవర్ధనుడు, రాజవర్ధనునికి సుధృతీ, సుధృతికి సౌధృతేయుడు, సౌధృతేయుడికి కేవలుడు, కేవలునికి బంధుమంతుడు, బంధుమంతునికి వేదవంతుడు, వేద వంతునికి బంధుడు, బంధుడికి తృణబిందువూ పుత్రులయ్యారు.

తృణబిందువుకూ, అలంబుస అనే అప్సరసకూ "ఇలబిల" అనే కుమార్తె పుట్టింది. ఈ ఇలబిలను విశ్రవసుడు వివాహమాడాడు. వీళ్ళకు ఐలబిలుడు పుట్టాడు. ఇతడే కుబేరుడనే పేరుతో పిలవబడుతూ, ఉత్తర దిక్కుకి అధిపతిగా ఉన్నవాడు.

తృణబిందుడికి విశాలుడు, శూన్యబందుడు, ధూమ్ర కేతువూ అనే ముగ్గురు కుమారులు పుట్టారు. విశాలుడు వంశాన్ని పెంచి వైశాలీ నగరాన్ని నిర్మించాడు.

విశాలునికి హేమచంద్రుడూ, హేమచంద్రునికి ధూమ్రాక్షుడు, ధూమ్రాక్షునికి సహదేవుడు, సహదేవునికి కృతాశ్వుడు, కృతాశ్వునికి సోమదుత్తడు పుట్టారు. సోమదత్తుడు అశ్వమేధం చేసి స్వర్గానికి వెళ్ళాడు. సోమదత్తుడికి సుమతీ, సుమతికి జనమేజయుడు పుట్టారు. వీళ్లంతా వైశాలురని పేరు పొందారు.

మనుపుత్రులలో ఒకడైన శర్యాతికి సుకన్య అనే కుమార్తె పుట్టింది. ఈమె తాను చేసిన తప్పు నుండి బైటపడడానికి ముసలివాడైన చ్యవనమహర్షిని వివాహమాడింది. ఈ చ్యవన మహర్షి అశ్వినీదేవతలను ప్రార్థించి ముసలితనం పోగొట్టుకుని యౌవ్వనవంతుడయ్యాడు. అతడు అశ్వినీదేవతలకు యజ్ఞాలతో ఇంద్రుడితో బాటుగా యజ్ఞభాగాలను ఇప్పించే ఏర్పాటు కల్పించాడు.

సుకన్య తన పాతివ్రత్యాన్ని శంకించిన తండ్రికి జరిగినదంతా చెప్పింది. శర్యాతి కుమార్తెను, అల్లుడినీ తీసుకువెళ్ళి, అల్లుడినే అధ్వర్యుడిగా పెట్టుకుని యజ్ఞం చేశాడు. చ్యవనుడు అశ్వినులకు సోమరసంలో భాగం ఇవ్వడం చూసి కోపగించిన దేవేంద్రుడు మహర్షిని వజ్రాయుధంతో కొట్టబోయాడు. మహర్షి ఇంద్రుడి చేతినే స్తంభింపచేశాడు. దేవతలు, మునులు చ్యవనమహర్షిని అనేక విధాలుగా పొగిడారు.

శర్యాతికి ఉత్తానబర్హీ, అనర్తుడు, భూరిషేణుడు అని ముగ్గురు కుమారులు. అనర్తుని కుమారుడు రైవతుడు కుశస్థలీపురాన్ని నిర్మించాడు. సముద్రమధ్యలో నిర్మించిన ఈ నగరాన్ని రాజధానిగా చేసుకుని అనేక దేశాలు పాలించాడు. ఇతడికి కుకుద్మి మొదలైన వందమంది పుత్రులు, రేవతి అనే కుమార్తె పుట్టారు. రైవతుడు రేవతిని బ్రహ్మదేవుని మాట ప్రకారంగా బలరాముడికి ఇచ్చి వివాహం చేసి, తాను తపస్సు చేసుకోవడానికి బదరికావనానికి వెళ్ళాడు.

నభగుడికి నాభాగుడనే కొడుకు పుట్టాడు. మహాపండితుడైన నాభాగునికి చెందవలసిన సొమ్మంతా అతని సోదరునే పంచేసుకున్నారు. అతడు సోదరుల మాటపై తండ్రి వద్దకు వెళ్ళి ధనం గురించి అడిగాడు. తండ్రి ఆజ్ఞప్రకారంగా అంగిరసులు చేసే యజ్ఞానికి వెళ్ళి, వాళ్ళకి రెండు వైశ్వదేవ సూక్తాలు వినిపించి, వాళ్ళ మెప్పు పొందాడు.

అంగిరసులు యజ్ఞం చెయ్యగా మిగిలిన ధనాన్నంతటినీ నాభాగునికే ఇచ్చి స్వర్గానికి వెళ్ళారు. నాభాగుడు ఆ ధనాన్ని తీసుకుంటుండగా ఒక అపరిచిత పురుషుడు అడ్డుపడి "ఈ ద్రవ్యం నాది. నువ్వు ఎందుకు తీసుకుంటున్నావు?" అని అడిగాడు. నాభాగుడు "ఇది నాకు అంగిరసులు ఇచ్చిన ధనం. నువ్వెలా నాదంటున్నావు'?" అని అడిగాడు.

ఆ పురుషుడు "ఈ ధనం ఎవరిదో నీ తండ్రినే అడిగి

తెలుసుకో. ఆయన ఏం చెప్తే అది చేస్తాను" అన్నాడు. నాభాగుడు తండ్రితో జరిగినదంతా చెప్పాడు. నభగుడు "నాభాగా! యజ్ఞం చెయ్యగా మిగిలిన ధనం ఉచ్ఛిష్టం. అది రుద్రుడికే చెందుతుంది. నీకు కనపడిన పురుషుడు రుద్రుడే" అని చెప్పాడు.

నాభాగుడు తిరిగి వచ్చి "మా తండ్రి ఈధనం మీదే నన్నారు. తెలియక నేను తీసుకోవాలనుకున్నాను. నీ సొమ్ము నువ్వే తీసుకో.. నన్ను క్షమించు" అని ప్రార్థించాడు. అతని సత్యనిష్ఠకి మెచ్చుకున్న రుద్రుడు ఆ ధనాన్ని మళ్ళీ నాభాగునికే ఇచ్చేశాడు. పైగా జ్ఞానాన్ని కూడా ప్రసాదించి మరీ అదృశ్యుడయ్యాడు. ఈ నాభాగుని కుమారుడే అంబరీషుడు.

## అంబరీషునిపై దుర్వాసుడు ఆగ్రహించుట - శ్రీహరి అంబరీషుని రక్షించుట

సకల సద్గుణ సంపన్నుడైన అంబరీషుడు మహాబలపరాక్రమ సంపన్నుడే కాదు శ్రీహరికి పరమభక్తుడు కూడా. అంబరీషుడు ఏ దోషమూ జరగకుండా చేసిన ఎన్నో అశ్వమేధాలకు మెచ్చిన శ్రీహరి, అతడిని రక్షిస్తూ ఉండమని చక్రానికి చెప్పి, తన చక్రాన్ని అతనికి ఇచ్చాడు.

హరిపరాయణుడైన అంబరీషుడు శ్రీహరి ప్రీతికోసం, కార్తీకమాసంలో ఏకాదశీ వ్రతం చేసి, ద్వాదశి పారాయణ చెయ్యబోతున్నాడు. ఇంతలో ఈశ్వరాంశతో పుట్టిన దుర్వాసమహర్షి వచ్చాడు. అంబరీషుడు మహర్షికి అతిథి

సత్కారాలుచేసి తనతో పాటుగా భోజనం చెయ్యమని ప్రార్థించాడు.

మహర్షి "స్నానం చేసి వచ్చి తప్పక చేస్తానని"మహారాజుకి మాట ఇచ్చాడు. కాళిందీ నదికి స్నానానికి వెళ్ళిన మహర్షి ధ్యాన నిష్ఠలో మునిగి ద్వాదశి ఘడియలు గడిచిపోతున్నా రాలేదు. "ద్వాదశి ఘడియలు దాటకముందు పారణ చెయ్యాలి. భోజనానికి పిలిచిన మహర్షి రాకుండా పారణ చెయ్యడం తప్పు. కనుక ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటారు?" అని అంబరీషుడు బ్రాహ్మణులను ప్రార్థించాడు.

వాళ్ళు "నీటిని త్రాగమని" సలహా ఇచ్చారు. మహర్షిని తిరస్కరించినట్లు కాదని కూడా చెప్పారు. అప్పుడు అంబరీషుడు నీటిని తాగి మహర్షి రాక కోసం ఎదరు చూస్తూ కూర్చున్నాడు.

అంతలో అక్కడికి వచ్చిన దుర్వాసుడు జరిగినది గ్రహించి, మహారాజుపై మండిపడ్డాడు. ఒక మహాశక్తిని అంబరీషుని పైకి వదిలాడు. అది రాజు మీదకి వచ్చింది. విశ్వరూపుడైన విష్ణువు అది చూసి, భక్తునిపై ప్రేమతో మహర్షి చేసిన పనిని అడ్డగించమని తన చక్రాన్ని పంపించాడు.

చక్రం మహర్షి వదిలిన శక్తిని దహించేసి మహర్షి వెంటపడింది. మహర్షి అన్ని లోకాలూ తిరిగాడు. కానీ ఆయనను వెంబడిస్తున్న చక్రం బారి నుండి ఎవరూ ఆయనను

రక్షించలేకపోయారు. కైలాసపతి ఆజ్ఞ మేరకు వైకుంఠానికి వెళ్ళి శరణు వేడినా సాధ్యం కాలేదు.

విష్ణువు "మహర్షీ! నువ్వు ఆలస్యం చెయ్యకుండా ఆ అంబరీషుడినే ప్రార్థించు. అతడే నిన్ను రక్షిస్తాడు" అని చెప్పాడు. వెంటనే మహర్షి మహారాజు పాదాల మీద పడ్డాడు. అంబరీషుడు సిగ్గుపడి, మహర్షిని లేవదీసి, నేనే మీకు నమస్కరించాలి గాని మీరు నాకు నమస్కరించవచ్చా? నన్ను కోపగించుకోకుండా ఉంటే అంతే చాలు" అని చెప్పాడు.

మహర్షిని మన్నించి, రక్షించమని శ్రీహరి దివ్యాయుధమైన చక్రాన్ని ప్రార్థించాడు. వెంటనే చక్రం మహర్షిని వదిలేసింది. మహర్షి ఆనందంతో తన ఆశ్రమానికి వెళ్ళాడు. తరువాత అంబరీషుడు రాజ్యాన్ని కుమారులకు అప్పగించి, అరణ్యాలకు వెళ్ళి, హరిని గూర్చి తపస్సు చేస్తూ మోక్షాన్ని పొందాడు.

అంబరీషునికి విరూపుడూ, కేతుమంతుడూ,శంభుడూ అని ముగ్గురు కుమారులు. విరూపుని కొడుకు పృషదశ్వుడు. పృషదశ్వుని పుత్రుడు రథీతరుడు. రథీతరుడు అంగిరసుడనే ముని అనుగ్రహంతో పుత్రవంతుడయ్యాడు. అతని పుత్రులే రథీతర గోత్రులూ, అంగిరసులు అనే బ్రాహ్మణులుగా పేరు పొందారు.

### ఇక్ష్వాకు వంశక్రమం - హరిశ్చంద్రుడు ముక్తుడగుట

వైవస్వత మనువు యొక్క తుమ్ములో నుండి ఒక బాలుడు పుట్టాడు. అతడే ఇక్ష్వాకుడు. ఇతనే సూర్యవంశానికి

ప్రధానుడయ్యాడు. ఇతనికి వందమంది కుమారులు. వీళ్ళలో పెద్దవాళ్ళైన 'వికుక్షీ, నిమీ, దండకుడూ' అనే వాళ్ళు వింధ్య హిమవత్పర్వతాల మధ్యలో ఉన్న కొంతదేశానికీ, ఇరవై ఐదుమంది ఆ దేశానికి తూర్పున ఉన్న భూమికీ, మరో ఇరవై ఐదుమంది పడమటి దేశానికీ, మిగిలిన నలభై ఏడుమందీ ఉత్తర దక్షిణ దేశాలకూ పాలకులయ్యారు.

వికుక్షి ఇక్ష్వాకువు తలపెట్టిన అష్టకశ్రాద్ధానికి వేటాడగా వెళ్ళి మాంసంలో కొంత తిని, మిగిలినది తెచ్చి ఇచ్చి, తండ్రి కోపానికి గురై రాజ్యం నుండి బహిష్కరించబడ్డాడు. తరువాత ఇక్ష్వాకుడు తపస్సుకి వెళ్ళాడు. అక్కడే శరీరాన్ని వదిలేశాడు. తండ్రి మరణించినాక వికుక్షి రాజ్యంలో ప్రవేశించి శశాదుడనే పేరుతో ప్రజారంజకంగా పాలిస్తూ ఎన్నో యజ్ఞాలు చేసాడు.

శశాదుడి కుమారుడు పురంజయుడు. శ్రీమహావిష్ణువు ఈ పురంజయునిలో ప్రవేశించి కృతయుగం చివరలో జరిగిన దేవదానవ యుద్ధంలో దానవ సంహారం చేశాడు. పురంజయుడికి ఇంద్రుడు ఎద్దు రూపంలో వాహనమయ్యాడు. అందువలన ఇతనికి "ఇంద్రవాహనుడనీ", ఎద్దుమూపురంపై ఎక్కినందువలన "కుకుత్సుడనీ" పేరు వచ్చింది.

ఈ పురంజయుని పుత్రుడు అనేనసుడు. అతడి పుత్రుడు పృథుడు. పృథుడికి విశ్వగంధుడు, విశ్వగంధుడికి చంద్రుడు, చంద్రుడికి యవనాశ్వుడు, యవనాశ్వునికి శవక్తుడు. ఇతడే "శావస్తి" నగరనిర్మాత.

శవస్తునికి బృహదశ్వుడు, బృహదశ్వునికి కువలయాశ్వుడు, కువలయాశ్వునికి ఇరవై ఒక్క వేలమంది కుమారులు. అందరితో కలిసి కువలయాశ్వుడు లోకకంటకుడైన దుంధువనే రాక్షసుని సంహరించాడు.

దుంధువు నోటినుంచి వచ్చిన మంటలకి కువాలయాశ్వుని కుమారులలో ముగ్గురు తప్ప మిగిలిన వాళ్లంతా చనిపోయారు. ఆ ముగ్గురూ దృఢాశ్వుడూ, కపిలాశ్వుడూ, భద్రాశ్వుడూ. దృఢాశ్వునికి హర్సవ్వుడు, హర్సశ్వునికి నికుంభునికి బర్హినాశ్వుడూ, బర్హినాశ్వునికి కృతాశ్వుడూ, కృతాశ్వుడికి సేనజిత్తూ, సేనజిత్తుకి యువనాశ్వుడూ పుట్టారు.

యువనాశ్వునికి ముగ్గురు భార్యలున్నా సంతానం లేకపోవడంతో మునులు అతని చేత 'ఇంద్రయాగం' చేయించారు. యాగం పూర్తయ్యాక అతని భార్యకి ఇవ్వవలసిన మంత్ర తీర్థాన్ని యాగం పూర్తి కాకమందే యవనాశ్వుడు తాగాడు. అప్పుడు అతని పొట్ట చీల్చుకుని ఒక బాలుడు పుట్టాడు. తల్లిపాలు లేక ఏడుస్తున్న ఆ పిల్లవాడికి ఆకలి తీర్చడం కోసం ఇంద్రుడే వచ్చి, ఆ పిల్లవాని బొటనవ్రేలిని అతని నోటిలో పెట్టాడు. ఆ వేలిద్వారా వచ్చిన అమృతాన్ని తాగి, ఆకలి తీర్చుకున్న ఆ బాలుడే మాంధాత. పిల్లవాడు పుట్టినాక యువనాశ్వుడు మరణించకుండా దేవతలు, భూసురులు రక్షించారు.

తండ్రి తరువాత మాంధాత చక్రవర్తి అయ్యాడు. తన పరాక్రమంతో రావణాది శత్రువులను శిక్షించడం వలన ఇంద్రుడు ఇతనిని “త్రసదస్యుడు” అని కీర్తించాడు. ప్రజారంజకంగా పాలించి, అనేక యజ్ఞాలు విష్ణు ప్రీతి కోసం చేసిన మాంధాతకు “పురుకుత్సుడు, అంబరీషుడూ, ముచుకుందుడూ’ అని ముగ్గురు కుమారులు, యాభైమంది కుమార్తెలూ పుట్టారు.

సౌభరి అనే మహర్షి తన తపశ్శక్తితో యువకుడై, స్వయంవరంలో మాంధాత కుమార్తెలందరినీ చేపట్టి, అందరినీ సమానంగా ఆనందపెడుతున్నాడు. అంబరీషుడికి యౌవనాశ్వుడూ, యౌవనాశ్వునికి హారీతుడు పుట్టారు. పురుకుత్సునికి నాగకుమారులు తమ చెల్లెలైన నర్మదను ఇచ్చి నాగలోకంలో వివాహం చేశారు. పురుకుత్సుడు “తన పేరు తలుచుకున్న వాళ్ళకి నాగభయం తొలగిపోయే వరం పొంది” భూలోకానికి వచ్చాడు.

త్రసదస్యుడు, అనరణ్యుడు, హర్యశ్వుడు, అరుణుడు, త్రిబంధవుడు, సత్యవ్రతుడు అనే వాళ్ళు పురుకుత్సుని పుత్రపౌత్రులు. వీళ్ళంతా ఇక్ష్వాకువంశ వర్ధనులయ్యారు. సత్యవ్రతుడనే వాడే త్రిశంకుడనే పేరుతో ప్రసిద్ధి పొందాడు. ఇతడు శరీరంతో ఉండగానే స్వర్గానికి వెళ్ళాలని ప్రయత్నించిన త్రిశంకువు స్వర్గానికి వెళ్ళలేదు గానీ ఈ నాటికీ ఆకాశంలో ప్రకాశిస్తూనే ఉన్నాడు. ఇతని కుమారుడే మూడు లోకాల్లోనూ సత్యవ్రతనిష్ఠుడని కీర్తి పొందిన హరిశ్చంద్రుడు.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడిని అనేక విధాలుగా కష్టపెట్టినా, చండాల సేవపాలు చేసినా తన సత్యనిష్ఠని మాత్రం విడువలేదు. హరిశ్చంద్రుని కష్టపెట్టినందుకు కోపంతో వసిష్టుడు విశ్వామిత్రుని 'గద్దవు కమ్మని" శపిస్తే, విశ్వామిత్రుడు వసిష్ఠునిపై కోపంతో 'నువ్వు కొంగవుకమ్మని" శపించాడు. ఆ ఋషులిద్దరూ పక్షిరూపాలు ధరించి కూడా వాళ్ళ శతృత్వాన్ని మాత్రం విడిచి పెట్టలేదు.

హరిశ్చంద్రుడు సంతానం కోసం నారదుని ఉపదేశంతో వరుణుని ఆరాధించాడు. "నీకు పుట్టిన పుత్రుని నాకు బలిపశువుగా సమర్పిస్తానంటే నీకు తప్పక పుత్రుని ప్రసాదిస్తానన్నాడు" వరుణుడు. వరుణుడు పెట్టిన షరుతుకు ఒప్పుకున్న హరిశ్చంద్రుడు వరుణుని అనుగ్రహంతో పుత్రుని పొందాడు. కానీ ఇచ్చిన మాట తప్పి, ఎన్నిసార్లు వరుణుడు వచ్చి అడిగినా పుత్రుని మాత్రం ఇవ్వలేదు.

ఆ కారణంగా హరిశ్చంద్రుడికి జలోదర వ్యాధి వచ్చింది. ఈ విషయం తెలిసిన రోహితుడు వేటను మాని తన ప్రాణాలు పణంగా పెట్టి తండ్రిని రక్షించుకోడానికి అయోధ్యకు బయలుదేరాడు. కానీ ఇంద్రుడు మారువేషంలో అడ్డుపడి రోహితుని తీర్థయాత్రలకు పంపాడు.

ఇలా దేవేంద్రుడు మాటిమాటికీ అడ్డుపడి రోహితుని తండ్రి దగ్గరకు పోనివ్వకుండా ఐదు సం॥లపాటు ఆపాడు. ఆరవ సం॥లో రోహితుడు శునశ్శేపుడనే ముని కుమారుని తనకు బదులుగా బలిపశువుగా ఉండడానికి ఒప్పించి

అయోధ్యకు తీసుకువచ్చాడు. అప్పుడు శునశ్శేపుని వలన హరిశ్చంద్రుడు వరుణప్రీతికై యజ్ఞం చేసి రోగం నుండి బయటపడ్డాడు.

ఇంద్రాది దేవతల అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. దేవేంద్రుని వలన బంగారు రథాన్నీ సంపాదించాడు. విశ్వామిత్రుని వలన జ్ఞానోపదేశం పొంది, సంసారంపై మోహాన్ని వదిలేసి ముక్తుడై ప్రకాశిస్తున్నాడు.

## సగరుని పుట్టుక - భగీరథుడు గంగను భూమికి తెచ్చుట

రోహితుని కుమారుడు హరితుడు. హరితునికి చంపుడు, ఈ చంపుడు తన పేరుతో ఒక సాగరాన్ని నిర్మించాడు. చంపుడికి సుదేవుడు, సుదేవుడికి విజయుడు, విజయునికి రురుకుడు, రురుకునికి వృకుడు, వృకునికి బాహుకుడు పుట్టారు. ఈ బాహకుడు శత్రువుల చేతిలో ఓడిపోయి, రాజ్యాన్ని వదిలేసి, భార్యలతో కలిసి అరణ్యవాసం చేస్తూ మరణించాడు.

అప్పటికే గర్భవతిగా ఉన్న ఇతని భార్య సహగమనం చేస్తానంటే మునీశ్వరులు అడ్డగించారు. కానీ సవతులు ఈమెకు అన్నంలో విషం కలిపి పెట్టారు. అయినా భగవంతుడు ఆమెనూ, ఆమె గర్భంలోని శిశువునూ రక్షించాడు. కృత్రిమమైన విషాన్ని తనలోనే ఇముడ్చుకుని పుట్టినందు వలన "సగరుడు" అనే పేరుతో విఖ్యాతి పొందాడు. మహర్షుల ఆశీర్వచనంతోనూ,

దైవానుగ్రహంతోనూ తండ్రి రాజ్యాన్ని మళ్ళీ సంపాదించాడు.

ఈ సగర చక్రవర్తికి కేశిని, సుమతి అని ఇద్దరు భార్యలు. సుమతికి అరవై వేలమంది కుమారులు. వీళ్ళే కపిలమహర్షి కోపానికి గురై బూడిద కుప్పలయ్యారు. కేశినికి ఒక్కడే కొడుకు. అతడు గతజన్మలో మహాయోగి. యోగిభ్రష్టుడై పుట్టడం వలన అతడు సమంజసం కాని పనులు చేస్తూ ఉండేవాడు. అందువలస "అసమంజసుడు" అయ్యాడు. ఇతడు పౌరుల పిల్లలను సరయూ నదిలో ముంచేసేవాడు. వాళ్ళ తల్లిదండ్రులు దుఃఖిస్తుంటే తన యోగశక్తితో మళ్ళీ వాళ్ళని తెచ్చి ఇచ్చేవాడు.

అసమంజసుని కుమారుడు అంశుమంతుడు. ఇతడు పాతాళంలోని కపిలమహర్షి ఆశ్రమానికి వెళ్ళి, ఆయన అనుగ్రహానికి పాత్రుడై, తాతగారి యాగాశ్వాన్ని తిరిగి తీసుకొచ్చాడు. సగరుడు యజ్ఞం పూర్తి చేసి, రాజ్యాన్ని మనుమడికి అప్పగించి, తపస్సుకి వెళ్ళాడు. అంశుమంతుడు ఆకాశగంగను తేవాలని ప్రయత్నించాడు కానీ సాధించలేకపోయాడు.

అంశుమంతుని కుమారుడు దిలీపుడు. దిలీపుడు గంగను తేవాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. దిలీపుని పుత్రుడు భగీరథుడు. ఇతడు తపస్సు చేసి, ఆకాశగంగను పాతాళం దాకా రప్పించి, పెద్దలందరికీ ఉత్తమగతులు కల్పించాడు.

## శ్రీహరి శ్రీరాముడై అవతరించుట - అయోధ్యలో పట్టాభిషిక్తుడగుట

భగీరథుడికి శ్రుతుడూ,శ్రుతునికి నాభావరుడూ, నాభావరునికి సింధుద్వీపుడు, సింధుద్వీపునికి ఆయుతాయువు, ఆయుతాయువుకి ఋతుపర్ణుడు పుట్టారు. ఈ ఋతుపర్ణుడే నలమహారాజుతో స్నేహం చేసి తనకు వచ్చిన "అక్ష హృదయ" విద్యను అతనికి ఇచ్చి, అతని వద్ద నుండి "అశ్వహృదయ" విద్యను సంపాదించాడు. ఋతుపర్ణునికి సర్వకాముడూ, సర్వకామునికి సుదాసుడూ పుట్టారు. ఈ సుదాసుడికే "మిత్రసహుడు, కల్మాషపాదుడు" అనీ పేర్లున్నాయి.

ఈ సుదాసుడు కులగురువైన వసిష్ఠుడి శాపానికి గురియై, రాక్షసుడయ్యాడు. అందువలన సంతానం లేని వాడయ్యాడు. రాక్షసుడిగా ఉన్న సుదానుడు వద్దని వారిస్తున్నా వినకుండా ఒక బ్రాహ్మణుని చంపి తిన్నాడు. ఆ బ్రాహ్మణ భార్య చేత "నీ భార్యను ముట్టుకోగానే చచ్చిపోతావు" అని శపించబడ్డాడు.

పన్నెండు సం॥ల తరువాత మళ్ళీ రాజ్యానికి వెళ్ళి, వసిష్ఠుని అనుగ్రహంతో తన భార్యయందు పుత్రుని పొందాడు. అతడిపేరు "ఆత్మకుడు". ఆత్మకుని పుత్రుడు మూలకుడు. ఈ మూలకుడు పరశురాముని బారిన పడకుండా స్త్రీలంతా ఇతనిని చుట్టుముట్టి కాపాడేవాళ్ళు. అందుకని ఇతనికి "నారీకవచుడు" అనే పేరు వచ్చింది.

నారీకవచునికి విశ్వసహుడు, విశ్వసహునికి ఖట్వాంగుడు పుట్టారు. ఇతడే దేవతలతో మాట్లాడుతూ తన ఆయుర్దాయము రెండు క్షణాలని తెలుసుకుని, దివ్య విమానంలో నగరానికి వచ్చి, ఈశ్వరుడు తప్ప తనకు ఇంకేమీ అవసరం లేదని నిశ్చయించుకుని, క్షణకాలంలో వాసుదేవ బ్రహ్మమును ధ్యానిస్తూ శరీరాన్ని వదిలేసి ముక్తిని పొందాడు.

ఈ ఖట్వాంగునికి దీర్ఘబాహువు, దీర్ఘబాహువుకి రఘువు, రఘువుకి పృథుశ్రవుడు, పృథుశ్రవుడికి అజుడు, అజుడికి దశరథుడు పుట్టారు. ఈ దశరథుడికే దేవతల కోరిక మేరకు రావణబ్రహ్మను సంహరించడం కోసమని శ్రీహరి తనను నాలుగు భాగాలుగా చేసుకుని శ్రీరామునిగా కౌసల్యకూ, భరతునిగా కైకకూ, లక్ష్మణ శతృఘ్నులుగా సుమిత్రాదేవికీ అవతరించాడు. ఈ శ్రీరాముని చరిత్రనే వాల్మీకి మొదలైన మహర్షులు వర్ణించారు. అయినా ఆ పుణ్యకథను నేనూ నీకు చెప్తాను విను అన్నాడు శుకుడు పరీక్షిత్తుతో.

దిన దిన ప్రవర్ధమానుడైన శ్రీరాముడు తండ్రి ఆజ్ఞతో విశ్వామిత్రుని యాగరక్షణ కోసం వెళ్ళాడు. దశరథుడు శ్రీరామునికి తోడుగా లక్ష్మణుని కూడా పంపించాడు. విశ్వామిత్రుని మాట మేరకు శ్రీరాముడు తాటకిని సంహరించాడు. మారీచుని తరిమికొట్టాడు. విశ్వామిత్రుని యాగం సంరక్షించాడు. యాగం పూర్తి అయినాక విశ్వామిత్రుడు రామలక్ష్మణులు మిథిలకు తీసుకువెళ్తున్నాడు.

దారిలో శ్రీరాముడు విశ్వామిత్రుని మాటపై అహల్యకు మోక్షం కలిగించాడు. జనకుని కొలువుకు చేరుకుని గురువు ఆజ్ఞతో శివధనస్సును విరిచి సీతను చేపట్టి, అయోధ్యకు తిరిగి వచ్చాడు. ఆ తరువాత తండ్రి తల్లికైకకు ఇచ్చిన వరాలను నిలపడం కోసం సీతాలక్ష్మణ సమేతుడై అరణ్యవాసం చేశాడు. అనేక మంది రాక్షసులను సంహరించి, మునులకు రక్షణ కల్పించి, శబరికి మోక్షాన్ని ప్రసాదించాడు.

సుగ్రీవుని మంత్రి అయిన హనుమ మాటతో సుగ్రీవునితో స్నేహం చేశాడు. వాలిని సంహరించి సుగ్రీవుని రాజుని చేశాడు. సుగ్రీవుని సహాయంతో సముద్రంపై వంతెనకట్టి, లంకకు చేరి, రావణుని సంహరించి, అతనిచే అపహరింపబడిన తన భార్యతో కలిసి, తిరిగి అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడై, కుశలవులను కుమారులను పొంది పదకొండువేల సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. తరువాత వైకుంఠానికి చేరుకున్నాడు.

ఈ శ్రీరాముని నామం తలుచుకున్న వాళ్ళకి పాపాలన్నీ నశిస్తాయి. పుణ్యలోకాలు లభిస్తాయి.

శ్రీరాముని కుమారుడైన కుశునికి అతిథీ, అతిథికి నిషధుడూ, నిషధునికి నభుడు, నభుడికి పుండరీకుడు, పుండరీకునికి క్షేమధ్వనుడు, క్షేమధ్వనునికి దేవానీకుడు, దేవానీకునికి అహీనుడు, అహీనునికి పారియాత్రుడు, పారియాత్రునికి బలుడు, బలునికి చలుడు, చలునికి

వజ్రనాభుడు, వజ్రనాభునికి శంఖణుడు, శంఖణునికి నిధృతి, నిధృతికి హిరణ్యానాభుడూ పుట్టారు.

యాజ్ఞవల్క్యుని వలన ఆత్మయోగాన్ని అభ్యసించిన హిరణ్యానాభునికి పుష్యుడు, పుష్యునికి ధ్రువసంధి, ధ్రువసంధికి సుదర్శనుడు, సుదర్శనునికి అగ్నివర్ణుడు, అగ్నివర్ణునికి శ్రీఘ్రుడు, శ్రీఘ్రుడికి మరువు పుట్టారు. ఆ మరువు ఇప్పుడు కూపగ్రామంలో ఉన్నాడు. అతడు కలియుగం పూర్తయ్యేదాకా బ్రతికే ఉంటాడు. మళ్ళీ సూర్యవంశం అతడి వల్లనే వృద్ధి పొందుతుంది.

ఆ మరువుకి ప్రశుశ్రవుడూ, అతడికి సంధీ, సంధికి అమర్షణుడు, అమర్షణునికి మహస్వంతుడు, మహస్వంతునికి విశ్వసాహ్యుడు, విశ్వసాహ్యునికి బృహద్బలుడు పుట్టారు. ఆ బృహద్బలుడినే భారతయుద్ధంలో నీ తండ్రి చంపాడు.

**రాబోయే రాజులు - చంద్రవంశపు రాజులు**

బృహద్బలుని కుమారుడు బృహద్రణుడు. ఆ తరువాత వరుసగా ఉరుక్షతుడు, వత్సప్రీతుడు, ప్రతివ్యోముడు, భానుడు, సహదేవుడు, బృహదశ్వుడు, భానుమంతుడు, ప్రతీకాశ్వుడు, సుప్రతీకుడు, మేరుదేవుడు, సుతక్షత్రుడు, ఋక్షకుడు, అందరిక్షుడు, సుతపుడు, అమితజిత్తు, బృహద్వాజీ, బర్హీ ధనుంజయుడు, రణంజయుడు, సృంజయుడు, శాక్యుడు, శుద్ధాముడు, లాంగలుడు, ప్రసేనజిత్తు, క్షుద్రకుడు, ఋణకుడు, సుమిత్రుడు అనే వాళ్ళు సూర్యవంశపు రాజులు. సుమిత్రుడితో సూర్యవంశం అంతరిస్తుంది.

ఇక్ష్వాకు కుమారుడైన నిమి, వసిష్ఠమహర్షిని 'తాను చేసే యాగానికి ఋత్విజునిగా ఉండమని' అడిగాడు. 'ఇప్పుడు ఇంద్రయాగానికి వెళ్తున్నాను. అక్కడ నుంచి వచ్చినాక నీచేత యాగం చేయిస్తానన్నాడు' వసిష్ఠుడు నిమితో. కానీ నిమి వసిష్ఠుడు వచ్చేదాకా ఆగకుండా, చంచలమైన ఈ సంసారం ఎప్పుడెలా ఉంటుందో అనుకుని అనుకున్న మంచిపని వెంటనే చెయ్యాలి. అని నిశ్చయించుకుని, వేరే ఋత్విక్కులను ఏర్పాటు చేసుకుని యాగం చేస్తున్నాడు.

వసిష్ఠుడు తిరిగి వచ్చి, తాను వచ్చేదాకా ఆగకుండా యాగం చేశాడన్న కోపంతో "నీ శరీరం నశిస్తుందని" నిమిని శపించాడు. నిమి కోపంతో "నీ దేహమూ నశిస్తుందిలే" అని మహర్షిని శపించాడు.

అందుకనే వసిష్ఠుడు ఆ శరీరాన్ని వదిలేసి మిత్రవరుణుల వలన ఊర్వశికి కుమారుడై పుట్టాడు. మహర్షులు సుగంధ ద్రవ్యాలతో నిమి శరీరాన్ని రక్షించి, యజ్ఞాన్ని పూర్తి చేశారు. తరువాత యజ్ఞానికి వచ్చిన దేవతలతో నిమిని తిరిగి మళ్ళీ బ్రతికించమన్నారు.

దేవతలు నిమిని పిలిచి "నీ శరీరంలోకి నువ్వు వెళ్ళు" అన్నారు. కానీ నిమి ఆ పని చెయ్యడానికి ఒప్పుకోలేదు. దేవతలు నిమిని శాసించలేక "శరీరం ధరించిన వాళ్ళు కళ్ళు తెరిచినప్పుడూ, మూసినప్పుడూ నిమి కనిపిస్తుంటాడు" అని చెప్పి తమ లోకాలకు వెళ్ళిపోయారు.

ఆ తరువాత మహర్షులు నిమి శరీరాన్ని మధించారు. అప్పుడు పుట్టిన పురుషుడే జనకుడు. ఇతనికి వైదేహుడు, మిథిలుడు అనే పేర్లు ఉన్నాయి. ఇతడు నిర్మించినదే మిథిలానగరం. ఈ జనక వంశం రాజులు వరుసగా ఉదావసుడు, నందివర్ధనుడు, సుకేతుడు, దేవరాతుడు, బృహద్రధుడు, మహావీర్యుడు, సుధృతీ, ధృష్టకేతుడు, హర్సశ్వుడు, మరువు, ప్రతింధకుడు, మహారోముడు, స్వర్ణరోముడు, హ్రస్వరోముడు, సీరధ్వజుడు" అనే వాళ్ళు.

ఈ సీరధ్వజుడు యజ్ఞం చేద్దామని భూమిని దున్నుతుండగా నాగలికొనకి తగిలి సీత పుట్టింది. సీరధ్వజుడికి కుశధ్వజుడు, కుశధ్వజుడికి ధర్మధ్వజుడు, ధర్మధ్వజునికి కృతధ్వజ, మిత్రధ్వజులూ పుట్టారు. కృతధ్వజునికి కేశిధ్వజుడు, మితధ్వజునికి ఖాండిక్యుడు పుట్టారు.

పండితుడైన కేశిధ్వజుడు ఖాండిక్యుని తరిమేసి, అతడి రాజ్యాన్ని ఆక్రమించుకున్నారు. ఆ ఖాండిక్యుని కుమారుడే భానుమంతుడు. అతని వంశం వాళ్ళే శతద్యుమ్నుడు, శుచి, సనధ్వాజుడు, ఊర్ధకేతువు, అజుడు, కురజిత్తు, అరిష్టనేమి, శ్రుతాయువు, పార్శ్వకుడు, చిత్రరథుడు, క్షేమాపీ, హేమరథుడు, సత్సరథుడు, ఉపగుర్వుడు, సావనుడు, సువర్చసుడు, జయుడు, విజయుడు, ధృతుడు, అనఘుడు, నీతిహవ్యుడు, ధృతీ, బహుళాశ్వుడు, కృతీ, మహావశీ అనే వాళ్ళు. వీళ్ళంతా మైథిలులనే పేరుతో ప్రసిద్ధులై, గృహస్థులై

ఆత్మజ్ఞానసంపన్నులై నిరంతరం బ్రహ్మాను సంధానం చేస్తూండే మహనీయులే.

ఇక చంద్రవంశంలోకి వస్తే బ్రహ్మాదేవుని మానసపుత్రుడు అత్రిమహర్షి. అత్రిమహర్షి కనుకొలుకుల నుండి పుట్టాడు ఓషధులకు పతి అయిన చంద్రుడు. చంద్రుడికీ తారకూ పుట్టాడు బుధుడు. ఈ బుధుడికీ ఇంతకు ముందు చెప్పిన ఇల అనే ఆమెకీ పుట్టాడు పురూరవుడు. అత్యంత సౌందర్యవంతుడైన పురూరవుని గురించి విన్న ఊర్వశి మిత్రావరుణుల శాపం వలన భూలోకానికి వచ్చి, పురూరవుని చూసి మోహించింది. పురూరవుడూ ఆ దివ్యకాంతను మోహించి, ఆమె పెట్టిన నియమాలను ఒప్పుకుని ఆమెను వివాహమాడాడు. కొంతకాలానికి పురూరవుడు నియమాలను ఉల్లంఘించాడు. అప్పుడు ఊర్వశి దేవలోకానికి వెళ్ళిపోయింది. ఆమె వియోగం భరించలేని పురూరవుడు ఆమెను వెతుకుతూ, సరస్వతీ నదీ తీరంలో చూశాడు. ఆమెను తన వద్దకు రమ్మన్నాడు.

ఊర్వశి రావడానికి ఒప్పుకోలేదు. కానీ ఒక సంవత్సరం గడిచినాక రా! నీ కుమారులను చూసుకుందువుగాని అన్నది. అట్లాగే సంవత్సరం గడిచినాక పురూరవుడు వెళ్ళి, ఊర్వశి మాటపై గంధర్వులను ప్రార్థించి, అగ్నిస్థాలిని పొందాడు. ఆమె ఊర్వశి కాదని తెలుసుకున్న పురూరవుడు వెంటనే ఆమెను అడవిలోనే వదిలేసి ఇంటికి వచ్చాడు.

అప్పటికే త్రేతాయుగం వచ్చేసింది. ఆ యుగపు ప్రభావం కారణంగా ఒకటిగా కనిపించే దేశం మూడుగా కనిపించింది పూరూరవుడికి. వెంటనే పురూరవుడు స్థాలి దగ్గరకు వెళ్ళాడు. ఆ స్థాలిలో జమ్మి కడుపులో నుండి పుట్టిన రావి మొక్క కనిపించింది. దానితో రెండు అరణులు చేసి, వాటిలో తననూ, ఊర్వశినీ, మధ్యలో ఉన్న కర్రను కుమారుడనీ మంత్రం చెప్తూ మథించాడు. అట్లా మథించడం వలన "జాతవేదుడు" అనే అగ్ని పుట్టాడు. పురూరవుడు ఆ అగ్నితో యాగం చేసి, ఊర్వశి ఉండే గంధర్వలోకానికి వెళ్ళాడు. ఊర్వశి వలన పురూరవునికి "ఆయువు, శ్రుతాయువు, సత్యాయువు, రయుడు, జయుడు, విజయుడు" అనే అరుగురు కుమారులు పుట్టారు.

శ్రుతాయువుకి వసుమంతుడు, సత్యాయువుకి శ్రుతంజయుడు, రయుడికి శ్రుతుడు, ఏకుడు, జయుడికి అమితుడు, విజయుడికి భీముడు అనే కుమారులు పుట్టారు.

భీముడికి కాంచనుడు, కాంచనునకి హోత్రకుడు, హోత్రకునికి జహ్ను మహర్షి, జహ్నుమహర్షికి పూరుడు, పూరునికి బాలకునికి అజకుడు, అజకునికి కుశుడు, కుశునికి కుశాంబుడు, ధూర్తయుడు, వసువూ, కుశనాభుడు అని నలుగురు కుమారులు కలిగారు.

కుశాంబుని కుమారుడు గాధిరాజు. ఈ గాధి కుమార్తె సత్యవతి. ఈమెను "ఋచికుడు" అనే మహర్షి

వివాహమాడాడు. మహర్షి భార్యా, అత్తగారూ కూడా పుత్రసంతానం కావాలని అడిగారు.

అప్పుడు మహర్షి బ్రాహ్మణుడు పుట్టడానికీ, రాజు పుట్టడానికీ తగిన మంత్రాలతో చరువును తయారుచేసి పెట్టి, హోమం పూర్తయ్యాక నదిలో స్నానానికి వెళ్ళాడు. ఆ సమయంలోనే తల్లీ కూతుళ్ళిద్దరూ ఒకరికోసం చేసిన చరువును మరొకరు తీసుకున్నారు. అందుకని రాణికి బ్రాహ్మణుడు అయ్యేవాడు, సత్యవతికి రాజు కావలసినవాడు పుట్టారు.

సత్యవతి "నా కుమారుడు హింసచేస్తూ ప్రవర్తించడం చూడలేనని భర్తతో చెప్పింది. అప్పుడు మహర్షి నీ కుమారుడు గొప్ప మహర్షి అవుతాడు. కానీ మనుమడు మాత్రం సాహసప్రియుడై క్రూరమైన పనులు చేస్తాడని చెప్పాడు. మహర్షి మాట ప్రకారమే ఆమెకు "జమదగ్ని" మహర్షి పుట్టాడు. ఆ జమదగ్ని కుమారుడే క్షత్రియులను సంహరించిన పరశురాముడు అయ్యాడు.

సత్యవతీదేవి కౌశికీనదిగా ప్రవహించింది. జమదగ్ని మహర్షి భార్య రేణుక. రేణుకకు వసుమనాది పుత్రులు పుట్టారు. వాళ్ళలోనే శ్రీహరి అంశతో పరశురాముడు పుట్టాడు. ఈ పరశురాముడే తన గొడ్డలితో ఇరవై ఒక్కసార్లు క్షత్రియులను వెతికి వెతికి చంపాడు.

గాధి మహారాజుకి అగ్నితేజంతో ప్రకాశించే విశ్వామిత్రుడు పుట్టాడు. తపోబలమే నిజమైన బలమని

గ్రహించి, గొప్ప తపస్సు చేసి 'బ్రహ్మర్షి'అనిపించుకున్న ఆ విశ్వామిత్రుడికి వందమంది కుమారులు. హరిశ్చంద్రునికి సహాకరించిన శునశ్శేపుని యందు ప్రేమ కలిగిన విశ్వామిత్రుడు అతడిని అన్నగా స్వీకరించమని తన కుమారులకు చెప్పాడు.

కానీ వాళ్ళలో యాభై మంది ఒప్పుకోలేదు. మిగలిన వారు ఒప్పుకున్నారు. ఈ శునశ్శేపుడే దేవతల దయతో బంధవిముక్తుడై "దేవరాతుడని" ప్రసిద్ధి పొందారు. మహర్షిచే శపించబడ్డ యాభైమందీ తండ్రి ఆశ్రమం వదిలేసి వెళ్ళిపోయారు. విశ్వామిత్రుడి కొడుకులు ఈ విధంగా రెండుగా చీలిపోవడం వల్లనే రెండు ప్రవరలు ఏర్పడ్డాయి.

పురూరవుడి పుత్రుడైన ఆయువుకి నహుషుడు, క్షత్రవృద్ధుడు, రజి, రంభుడు, అనేనసుడు అనే ఐదుగురు పుత్రులు. వాళ్ళలో క్షత్రవృద్ధుడికి సుహోత్రుడు, సుహోత్రునికి కాశ్యుడు, కుశుడు, కృత్స్నమధుడు అనే వాళ్ళు పుట్టారు. కృత్స్నమధునికి శునకుడు, శునకునికి బహ్వృచప్రసరుడు పుట్టారు. బహ్వృచప్రసరుడు తపోనిష్ఠుడయ్యాడు. కాశ్యునికి కాశీ, కాశీకి రాష్ట్రుడు, రాష్ట్రుడికి దీర్ఘతపుడూ పుట్టారు. ఈ దీర్ఘతపుడికే శ్రీహరి అంశతో దేవవైద్యుడైన ధన్వంతరి పుట్టాడు.

ఆ ధన్వంతరికి కేతుమంతుడు, కేతుమంతునికి భీమరథుడు, భీమరథునికి దివోదాసుడు, దివోదాసునికి ప్రతీర్ధనుడు, ప్రతీర్ధనునికి కువలయాశ్వుడూ, కువలయాశ్వునికి అలర్కుడు, అలర్కుడికి సన్నతీ, సన్నతికి

సునీతుడూ, సునీతునికి సుకేతనుడు, సుకేతమునికి ధర్మకేతువు, ధర్మకేతువుకి సత్యకేతువు, సత్యకేతువుకి ధృష్టకేతువు, ధృష్టకేతువుకి సుకుమారుడు, సుకుమారునికి వీతిహోత్రుడు, వీతిహోత్రునికి భర్గుడు, భర్గుడికి భార్గ భూమీ పుట్టారు. కాశీరాజు నుండి మిగిలిన వారందరినీ కాశ్యులంటారు.

క్షత్రవృద్ధుని రెండవ కుమారుడైన కుశునికి ప్రీతి, ప్రీతికి సంజయుడు, సంజయుడికి జయుడు, జయుడికి కృతుడు, కృతునికి హార్సధ్వనుడు, అతనికి సహదేవుడు, అతడికి భీముడు, భీముడికి జయత్సేనుడు, జయత్సేనునికి సంకృతీ, సంకృతికి జయుడు, జయుడికి క్షత్రధర్ముడు, ధర్ముడు పుట్టారు.

వీళ్ళంతా క్షత్రవృద్దుని వంశపురాజులు.

రంభుడికి రభసుడు, గంభీరుడు, గంభీరుడికి కృతుడు, అనేనసునికి శుద్ధుడు, శుద్ధుడికి శుచీ, శుచికి త్రికకుత్తూ పుట్టారు. త్రికకుత్తు బ్రహ్మసారధి. త్రికకుత్తు కుమారుడు శాంతజుడు విజ్ఞానంతో విరక్తుడయ్యాడు. రజికి ఐదువందలమంది కుమారులు. దేవతల ప్రార్థనపై రజి కలిసి దానవులను సంహరించి దేవేంద్రుడి స్వర్గాన్ని వశం చేశాడు. రజిపుత్రులు దేవేంద్రుని తరిమేసి స్వర్గాన్ని ఆక్రమించుకున్నారు. ఇంద్రుడు బృహస్పతితో హోమం చేయించి, ఆ హోమప్రభావంతో బలవంతుడై, రజి కుమారులను చంపి స్వర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

నహుషునికీ యతీ, యయాతీ, సంహాతీ, ఆయాయతీ, వియతీ, కృతీ అని ఆరుగురు కొడుకులు. యతి విరక్తుడై రాజ్యాన్ని త్యాగం చేశాడు. నహుషుడు నూరు అశ్వమేధాలు చేసి, ఇంద్రలోకానికి ప్రభువై, ఇంద్రుడి భార్య శచీదేవిని కోరుకుని, మహర్షుల చేత పల్లకీ మోయించుకుని, పాముగా భూలోకంలో పడ్డాడు.

తండ్రీ, అన్నలు రాజ్యం వదిలేసి వెళ్ళిపోగా యయాతి సింహాసనం ఎక్కాడు. తన తమ్ములకు కొంతరాజ్యం పంచి ఇచ్చాడు. తానేమో శుక్రాచార్యుని పుత్రిక దేవయానినీ, వృషపర్వుని కూతురైన శర్మిష్ఠనూ వివాహమాడి, చాలాకాలం రాజ్యమేలాడు. శుక్రాచార్యుని వలన "ముసలివాడిగా అవమని" శపించబడ్డాడు. తరువాత తనకు యౌవనాన్ని ఇచ్చిన పూరువునికి ఇతని రాజ్యంలో మధ్య భాగాన్నిచ్చి, రాజును చేశాడు. ఆపైన విరక్తుడై పరమపదవిని పొందాడు.

పూరువుకు జనమేజయుడు, జనమేజయుడికి ప్రాచీన్వాంసుడు, అతనికి ప్రవిరోదమన్యుడు, అతనికి చారువు, చారువుకి సుద్యువు, సుద్యునికి బహుగతుడు, బహుగతునికి శర్యాతి, శర్యాతికి సంయాతి, సంయాతికి రౌద్రాశ్వుడు, రౌద్రాశ్వునికి ఘృతాచీ అనే అప్పరసవలన ఋతేపువు, కక్షేపువు, స్థలేపువు, జరేపువు, సన్నతేపువు, ధర్మపువు, వ్రతేపువు, వనేపువు అనే పదిమంది పుట్టారు.

ఋతేపువుకి అంతిసారుడు, అంతిసారునికి సుమతీ ధ్రువుడు, అప్రతిరథుడు పుట్టారు. వాళ్ళలో అప్రతిరథుడికి

కణ్వుడు, కణ్వుడికి మేధాతిథీ, మేధాతిథికి ప్రస్కందుడు మొదలైన బ్రాహ్మణులూ పుట్టారు. సుమతి సుతుడైన రైభ్యుని కుమారుడు దుష్యంతుడు. ఈ దుష్యంతుడు తన రాజ్యానికి సముద్రాలనే ఎల్లలుగా చేసుకుని పాలిస్తూ, దైవ యోగంతో కణ్వమహర్షి ఆశ్రమ ప్రాంతానికి వెళ్ళి, మహర్షిచే పెంచబడిన శకుంతలను గాంధర్వ వివాహం చేసుకుని ఆ రాత్రి ఆమెతో గడిపి వెళ్ళిపోయాడు.

కొంతకాలానికి మహర్షి శకుంతలనూ, ఆమెకు పుట్టిన కుమారునీ దుష్యంతుని వద్దకు పంపించాడు. లోకాపవాదానికి భయపడిన దుష్యంతుడు శకుంతలను భార్యగా అంగీకరించలేదు. అప్పుడు ఆకాశవాణి అందరికీ తెలిసే విధంగా "శకుంతల నీ భార్య, అతడు నీ పుత్రుడే" అని చెప్పడంతో ఆమెను స్వీకరించి, రాజ్య సుఖాలనుభవించి, విరక్తుడై శరీరాన్ని వదిలాడు.

శకుంతలా దుష్యంతుల పుత్రుడే భరతుడు. ఈ భరతుడు విదర్భ రాజపుత్రికలను ముగ్గురినీ వివాహమాడాడు. ముగ్గురూ పుత్రవంతులయ్యారు. కానీ అపరవిష్ణువు లాంటి భరతునికి తగిన వాళ్ళు కారు తమ కుమారులని, పుట్టిన వెంటనే తల్లులే వారిని చంపేశారు. తరువాత విషయం తెలిసిన భరతుడు విచారించి, మరుత్స్తోమం చేసి, దేవతలను మెప్పించాడు.

ఆ సమయంలోనే బృహస్పతి అన్న భార్య, చూలాలు అయిన మమత అనే స్త్రీని కామంతో బాధిస్తున్నాడు. ఆమె గర్భంలోని శిశువు వద్దని వరిస్తున్నా వినకుండా తన పని

తాను చేస్తున్నాడు. అది చూసి ఆ ప్లిలవాడు ఏడుస్తుంటే బృహస్పతి కోపంతో "నువ్వు గుడ్డివాడవవుతావని" శపించాడు.

ఆ పిల్లవాడు కూడా కోపంతో బృహస్పతి వీర్యాన్ని బయటికి తన్నేశాడు. ఆ తేజస్సు ఒక బాలుడిగా మారింది. ఆ బాలుని నువ్వు భరించాలంటే నువ్వే భరించాలని మమతా బృహస్పతులు వాదులాడుకుంటున్నారు. ఆ వాదులాట కారణంగా ద్వాజుడై (వదిన మరుదులకు పుట్టినవాడు) పుట్టినవాడు భరద్వాజుడయ్యాడు. మమత గర్భంలోని శిశువు గుడ్డివాడై, దీర్ఘతముడని పేరు పొందాడు.

అప్పుడు మరుత్తులు ఆ భరద్వాజుని తెచ్చి భరతునికి ఇచ్చి "ఇతని వలన నీ వంశం నిలుస్తుంది. కనుక ఇతనిని పుత్రునిగా అంగీకరించి, పోషించమని చెప్పారు. వ్యర్థమైన భరతవంశానికి కర్త అయ్యాడు కనుక అతని వితథుడని పేరు వచ్చింది. వితథునికి మన్యువు, మన్యువుకి 'బృహక్షత్రుడు, జయుడు, మహావీర్యుడు, నరుడు, గర్గుడు' అనే ఐదుగురు పుత్రులు పుట్టారు.

నరుడికి సంకృతీ, సంకృతికి గురుడు, రంతిదేవుడూ పుట్టారు. రంతిదేవుడు మహాదాత. గర్గుని కుమారుడు శని, శని సుతుడు గార్గ్యుడు. గార్గ్యుని వలన బ్రాహ్మణకులం పెరిగింది. మహావీర్యుని పుత్రుడు ఉరుక్షయుడు. ఉరుక్షయుని తనయుడు 'తయ్యారుణీ, కవీ, పుష్కరారుణీ అనే ముగ్గురూ బ్రాహ్మణులయ్యారు. ఇక్కడి నుండీ మరుత్తువరకూ గల చంద్రవంశాన్ని వివరించాడు శుకుడు పరీక్షిత్తుకి.

ఆ తరువాత యయాతి తనయుడైన యదువుతో ప్రారంభించి శూరుని వరకూ, వివరంగా యదువంశ వృద్ధిని వివరించాడు. ఆ శూరునికే మూరిష అనే భార్య వలన వసుదేవుడు, దేవశ్రవుడు, ఆనకుడు, సృంజయుడు, శ్యామకుడు, కంకుడు, అనీకుడు, వత్సకుడు, దృకుడు అని పదిమంది కుమారులూ, పృథీ, శ్రుతదేవ, శ్రుతకీర్తి, శ్రుతశ్రవస, రాజాధిదేవీ అని ఐదుగురు పుత్రికలూ పుట్టారు.

"వసుదేవుడు పుట్టగానే ఆకాశంలో ఆనకదుందుభులు మోగిస్తూ ఇతడికే శ్రీహరి కుమారుడై పుడతాడు" అంటూ దేవతలు హర్షధ్వానాలు చేశారు. అందుకే వసుదేవుడికి "ఆనకదుందుభి" అనే పేరు వచ్చింది.

"శూరుడు తన కుమార్తె పృథను సంతానంలేని కుంతిభోజునికి పెంచుకోమని ఇచ్చాడు. అందుకని 'కుంతి' అనే పేరు వచ్చింది. ఆ కుంతి దుర్వాసునికి సేవ చేసి దేవతలను పిలిచి మంత్రాన్ని వరంగా పొందింది. ఆ మంత్రశక్తిని పరీక్షిద్దామని సూర్యుని పిలిచి, అతని వలన కుమారునీ, కన్యత్వానికి భంగం రాదనే వరాన్నీ పొందింది.

అయినా కుమారుని గంగలోకి వదిలేసింది. ఆ కుంతినే మీ ముత్తాత పాండురాజు వివాహమాడాడు. వసుదేవుడికి దేవకి యందు కీర్తిమంతుడు, సుషేణుడు, భద్రసేనుడు, ఋజువూ, సమదనుడు, భద్రుడు, సంకర్షణుడు అనే ఏడుగురూ పుట్టారు. ఆ తరువాత దుష్టులను శిక్షించడానికీ శిష్టులను రక్షించడానికీ దేవకీదేవి గర్భంలో శ్రీహరే తనకు

తానుగా శ్రీకృష్ణునిగా అవతరించాడు. ఆ తరువాత వసుదేవుడికి సుభద్ర అనే కుమార్తె పుట్టింది. ఆ సుభద్రనే నీ తాతగారైన అర్జునుడు వివాహమాడాడు" అని చెప్పాడు.

## శ్రీమద్భాగవతము నందలి తొమ్మివ స్కందం పరిసమాప్తము

## పదవస్కందము

### శ్రీహరి శ్రీకృష్ణునిగా అవతరించుట - బాలకృష్ణుని బాల్యలీలలు

పరీక్షిత్తు శుకమహర్షితో "మహాత్మా! శ్రీకృష్ణుని చరిత్రనంతటినీ నాకు వినిపించమని" అన్నాడు. అప్పుడు శుకమహర్షి ఈ విధంగా చెప్తున్నాడు.

"మహారాజా! భూదేవి పాపాత్ములను భరించలేక తనగోడు శ్రీమహావిష్ణువుతో మొరపెట్టుకుంది. అప్పుడు శ్రీమహావిష్ణువు తాను వసుదేవునికి కుమారునిగా అవతరిస్తాననీ, దేవతలను కూడా వారి వారి అంశలతో యదుకులంలో జన్మించమని చెప్పాడు. ఆదిశేషుడు బలరాముడై తనకు అన్నగా పుడతాడనీ, దేవకార్య సాధన కోసం దేవకన్యలనూ భూలోకంలో అవతరించమని ఆనతిచ్చాడు. అది విని భూదేవి సంతోషంతో తిరిగి వెళ్ళిపోయింది.

మధురాపురాన్ని రాజధానిగా చేసుకుని పాలిస్తున్నాడు శూరసేనుడు. అతడి కుమారుడైన వసుదేవుడు, మధురలో దేవకిని వివాహమాడి, రథంపై తన నివాసానికి

బయలుదేరాడు. దేవకి అన్న కంసుడు ఆ రథం నడుపుతున్నాడు. రథం కొంతదూరం వెళ్ళింది. అక్కడ ఆకాశవాణి కంసునితో "నువ్వు చాలా సంతోషంతో నీ చెల్లెలిని అత్తవారింటికి తీసుకుపోతున్నావు. కానీ ఆమెకు ఎనిమిదో గర్భంలో పుట్టేవాడు నిన్ను సంహరిస్తాడు" అని అన్నది.

ఆ మాటలు విన్న కంసుడు దేవకిని చంపబోయాడు. వసుదేవుడు అడ్డుపడి 'నీ చెల్లెలిని చంపకు. మాకు పుట్టిన బిడ్డలను నీకే అప్పగిస్తాను' అన్నాడు. అంతటితో చెల్లిని చంపడం మానుకున్నాడు కంసుడు.

కొంతకాలానికి వసుదేవుడికి కొడుకు పుట్టాడు. ఇచ్చిన మాట ప్రకారం వసుదేవుడు ఆ పిల్లవాడిని తెచ్చి కంసుడి చేతిలోపెట్టాడు. కంసుడు బావగారి సత్యనిష్ఠకు సంతోషించి "నాకు వీడి వలన చావు రాదు గదా!కనుక వీడిని తీసుకెళ్ళి ఎనిమిదో సంతానాన్ని నాకు అప్పగించు" అన్నాడు.

వసుదేవుడు సంతోషంగా పిల్లవానిని తీసుకుని వెళ్ళాడు. కాలం ప్రశాంతంగా గడుస్తోంది. దేవకికి వరుసగా ఆరుగురు మగపిల్లలు పుట్టారు.

ఒకరోజు నారదుడు కంసుడి దగ్గరకు వచ్చి, కంసుని పూర్వజన్మ గురించి చెప్పి, కనుక అతడిని సంహరించడానికే దేవతలంతా వసుదేవాదులుగా వచ్చారని చెప్పాడు. ఆ మాటలు విన్న కంసుడు అదిరిపడి, చేసిన పొరపాటుకి చింతించి, దేవకీ వసుదేవుల ఆరుగురు పుత్రులనూ చంపేసి,

దేవకీ వసుదేవులనూ, అడ్డు వచ్చిన తండ్రి ఉగ్రసేనునీ కూడా చెరసాలలో బంధించి తానే రాజ్యపాలన చేస్తున్నాడు.

ఆ తరువాత యాదవులందరినీ పీడించడం మొదలుపెట్టాడు. కొందరు యాదవులు ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. కొందరు "నువ్వేదిక్కంటూ" కంసుని ఆశ్రయించి ప్రాణాలను నిలబెట్టు కున్నారు.

ఇంతలో దేవకి ఏడవ గర్భాన్ని ధరించింది. శ్రీహరి యోగమాయతో "నువ్వు యాదవులున్న పల్లెకు వెళ్ళి, వసుదేవుని భార్య దేవకి గర్భంలో ఆదిశేషుని అంశతో ఉన్న ఆ శిశువుని తీసుకువెళ్ళి రోహిణి గర్భంలో ప్రవేశపెట్టు. తరువాత నేను దేవకికి ఎనిమిదవ పుత్రుడినై పుడతాను. నువ్వు నందుడి భార్య యశోదకు కూతురిగా పుట్టు" అన్నాడు.

యోగమాయ దేవకిలోని శిశువును రోహిణిలోకి ప్రవేశపెట్టింది. చాలా బలంతో పుట్టాడు కనుక "బలభద్రుడనీ" గర్భసంకర్షణం వలన పుట్టాడు కనుక "సంకర్షణుడనీ" అందరినీ రమింపచేసేవాడు కనుక "రాముడనీ" ప్రసిద్ధుడయ్యాడు.

ఆ తరువాత శ్రీహరి దేవకి గర్భంలోకి ప్రవేశించాడు. చెరసాలలో పడేసినా ఆమె ముఖవికాసం చూసి కంసుడు ఆశ్చర్యపోతున్నాడు. "ఎప్పుడు పిల్లవాడు బయటపడతాడా! ఎప్పుడు చంపుతానా!" అని ఎదురుచూస్తూ కాలం గడుపుతున్నాడు.

ఇంతలో శ్రీకృష్ణుడు అవతరించే సమయం రానే వచ్చింది. బ్రహ్మాది దేవతలంతా వచ్చి, దేవకీదేవి గర్భంలోని

శిశువుని అనేక విధాలుగా స్తోత్రం చేసి “నీ కడుపు చల్లగా యాదవులంతా వర్ధిల్లుతారు'' అని ఆశీర్వదించి అదృశ్యమయ్యారు.

**శ్రీకృష్ణుడు అవతరించడం - శ్రీమాత కంసుని హెచ్చరించడం**

దేవతల ఆశీస్సులందుకున్న దేవకి మరునాడే కుమారుని కన్నది. ఆ క్షణాన ప్రకృతి అంతా పరవశించిపోయింది. వసుదేవుడు నాలుగుచేతులలో ఆయుధాలతో, కిరీటాన్ని ధరించి అవతరించిన కుమారుని చూసి యదుకుల కష్టాలన్నీ తొలగిపోతాయని సంతోషించాడు.

తనకు బాలుడైనా అతడిని శ్రీమహావిష్ణువుగానే భావించి సాష్టాంగ నమస్కారం చేశాడు వసుదేవుడు. “దుష్టులను శిక్షించి, సాధు జనులను రక్షించమంటూ” ప్రార్థించాడు. దేవకి కూడా ఎన్నో విధాలుగా ఆ స్వామిని పొగిడింది. అప్పుడు స్వామి తల్లిదండ్రులకు వాళ్ళ పూర్వజన్మలను వివరించి చెప్పాడు.

నందనుడనీ, పరబ్రహ్మమనీ నన్ను ప్రేమిస్తూ, ధ్యానిస్తూ మీరు మోక్షాన్ని పొందుతారని చెప్పాడు. తాను పుట్టినాక చెయ్యవలసిన పనిని వివరంగా చెప్పాడు. ఆ తరువాత తన దివ్యరూపాన్ని వదిలేసి, సామాన్య మానవ శిశురూపాన్ని ధరించి, తల్లిదండ్రులకు సంతోషం కలిగించాడు.

వసుదేవుడు తన కుమారుని తీసుకుని రేపల్లెకు బయలుదేరాడు. ఏ ఆటంకం లేకుండా నందుని ఇంట ప్రవేశించి, ఆదమరిచి నిద్రస్తున్న యశోద ప్రక్కలో తన

కుమారుని పడుకోబెట్టి, ఆమె ప్రక్కనున్న యశోదకుమార్తెను ఎత్తుకొచ్చి మధురలో, చెరసాలలో దేవకి ప్రక్కన పడుకోబెట్టాడు. ఏమీ తెలియనట్లుగా మళ్ళీ సంకెళ్ళను తగిలించుకున్నాడు.

మరుక్షణంలో యోగమాయ ఏడుపు మొదలుపెట్టింది. సేవకులు దేవకి ప్రసవించిన విషయం కంసుడికి తెలియచేశారు. ఒక్కసారిగా అదిరిపడి లేచి ఉన్నవాడు ఉన్నట్లుగా హడావిడిగా చెరసాలలోకి వచ్చి దేవకి ప్రక్కలో ఉన్న పసిపిల్లను చంపబోయాడు. దేవకి అడ్డుపడి, "అన్నా! ఆడపిల్ల పుట్టింది. ఇది నిన్నేం చేస్తుంది? ఆరుగురు కొడుకులను చంపావు ఈ కుమార్తెనైనా నాకు మిగిల్చి పుణ్యం కట్టుకోమంటూ" బ్రతిమాలుతూ ఏడుస్తోంది. అయినా రాతి గుండె కల ఆ రాక్షసుడు ఆమె మాటలను చెవికెక్కించు కోకుండా ఆ పాప కాళ్ళు పట్టుకుని గిరాగిరా తిప్పి నేలమీదకి విసిరికొట్టాడు. కానీ ఆ పాప నేలపైకి పడకుండా అంతే వేగంతో ఆకాశానికి ఎగిరింది. ఎనిమిది చేతులతో దివ్యమైన రూపాన్ని ధరించి "ఓరీ దుర్మార్గుడా! నిన్ను చంపే వీరుడు నాతోనే పుట్టాడు. సుఖంగా పెరుగుతున్నాడు" అని చెప్పి అదృశ్యమైపోయింది. ఆ రోజు నుండి ఆమె అనేక నామ రూపాలతో సమస్త ప్రజల పూజలనందుకుంటూ, కోరిన వరాలను ప్రసాదిస్తోంది.

యోగమాయ మాటలు విన్న కంసుడు తెల్లబోయాడు. చావు తప్పించుకోవడం సాధ్యంకాదని తెలుసుకున్నాడు. దేవకీ వసుదేవులకు చెరసాల నుండి విముక్తిని కలిగించాడు. తాను చేసి క్రూరకార్యాలకు సిగ్గుపడ్డాడు. కానీ మరునాడు. మంత్రులను పిలిచి, జరిగింది చెప్పాడు. అప్పుడు వాళ్ళు "మహారాజా! శత్రు సంహారం జరిగేవరకూ మనం విశ్రాంతి తీసుకోకూడదు. ఆ బాలుడు ఎక్కడున్నా వెతికి వేం సంహరిస్తాం. ఆజ్ఞాపించండి" అన్నారు. కాలపాశానికి బద్ధుడైన కంసుడు "మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యండి" అని ఆజ్ఞాపించి అంతఃపురానికి వెళ్ళాడు.

అక్కడ రేపల్లెలో నందునికి నందనుడు పుట్టాడని బ్రాహ్మణులను పిలిచి ఆనందంతో కుమారునికి జాతకర్మాదులను జరిపించాడు. పితృదేవతలను పూజించాడు. లక్షలకొద్దీ ఆవులను, బంగారు కలశాలను, రత్నాభరణాలను, అమూల్యమైన వస్త్రాలనూ ఇచ్చి వాళ్ళ ఆశీర్వాదాలందు కున్నాడు. రేపల్లెలోని వారంతా వేడుకలు జరుపుకుంటున్నారు. గోపికలు, గోపాలురు అందరూ చక్కగా అలంకరించుకుని యశోదానందునుని చూడడానికి వచ్చారు. వారు తెచ్చిన కానుకలను యశోదకు ఇచ్చి, పిల్లవానిని ఎత్తుకున్నారు. కాళ్ళపై పడుకోబెట్టుకుని, నీళ్ళు పోసి "జో జో కమలదళాక్షా! జోజో సుందరాంగా! జోజో కృష్ణా!" అంటూ పాటలు పాడుతూ నిద్రపుచ్చారు.

నందుడు మధురకు వెళ్ళి కంసునికి కప్పం కట్టి, వసుదేవుని చూడడానికి వెళ్ళాడు. ఇద్దరూ క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. జరిగిన విషయాలన్నీ మాట్లాడుకున్నారు. నందుడు "అంతా దైవాధీనం. ఆపదలు వచ్చినా ప్రాజ్ఞులు దుఃఖించరు. చింతించకు. నా కుమారుడే నీ కుమారుడు" అంటూ ఓదార్చాడు వసుదేవుని. వసుదేవుడు "నందా! ఎన్నో దుర్నిమిత్తాలు కనిపిస్తున్నాయి. నువ్వు త్వరగా రేపల్లెకు చేరుకో" అంటూ పంపించేశాడు.

## శ్రీ కృష్ణుడు లీలలు మొదలుపెట్టడం - విశ్వరూపాన్ని చూపించడం

నందుడు ఇంకా రేపల్లెకి రాకముందే కంసుడి ఆజ్ఞతో పిల్లలను చంపడానికి బయలుదేరిన పూతన అనే రాక్షసి కామ రూపంతో ఆకాశమార్గాన వ్రేపల్లెలో దిగి, యశోదాదేవి ఉన్న చోటికి వచ్చింది. అప్పటివరకూ ఆడుకుంటున్న కృష్ణుడు ఆమె రాక గమనించి, నవ్వుకుని, మంచి నిద్రపోతున్నట్లుగా నటిస్తూ గురకలు పెడుతున్నాడు.

పూతన పిల్లవాడు ఇప్పుడే లేవడని నిశ్చయించుకుని, వెంటనే హడావుడిగా పిల్లవానికి ఎత్తుకుని, గుండెలకు హత్తుకుని, పాలివ్వడానికి ప్రయత్నించింది. యశోదా రోహిణులు వద్దంటున్నా వినకుండా పాలు ఇవ్వడం మొదలుపెట్టింది. కృష్ణుడు అప్పుడే నిద్రలేచినట్లు కళ్ళు తెరిచి చూసి, ఒళ్ళు విరుచుకుని గుటుకు గుటుకూ పాలు త్రాగుతూ రెండు గుక్కల్లో ఆ రాక్షసి ప్రాణులనూ త్రాగేశాడు.

'నాయనా! తాగింది చాలు. నన్ను వదులు' అంటూ అరుస్తూ కిందపడిపోతూనే రాక్షసి రూపంలో బయటపడింది. ఆ భయంకర రూపాన్ని చూసి గోపికలూ, గోపాలురూ "అమ్మో! ఏం ఆడదో" అంటూ గుండెలు బాదుకున్నారు. యశోదా, రోహిణులు మూర్ఛపోయారు. కొంతసేపటికి తెలివి తెచ్చుకుని, రాక్షసి శరీరంపై ఉన్న పిల్లవాడిని ఎత్తుకుని, బుజ్జగించి, ఎన్నో రక్షలు కట్టారు. అప్పుడే వచ్చిన నందుడు ఆ రాక్షసిని చూసి 'వసుదేవుడు చెప్పినట్లే జరిగింది. అతడు ఎంత యోగీశ్వరుడో' అనుకున్నాడు. పాపాత్మురాలైనా హరికి పాలిచ్చినందువల్లనే పూతన పాప విముక్తురాలై పుణ్యలోకాలకు చేరుకుంది. మరి ఆ హరిని కని, పెంచి, పాలిచ్చిన భాగ్యవంతురాలికి మళ్ళీ పుట్టుక అనేది ఉంటుందా?

ఆ తరువాత కృష్ణుడు బోర్లాపడడం, తిరగబడడం నేర్చుకున్నాడని యశోద కృష్ణుని జన్మనక్షత్రం నాడు గోపికలందరినీ పిలిచి వేడుక జరుపుతూ బాలకృష్ణుని సంగతి ఏమరుపాటుగా మరచిపోయింది.

కొంతసేపటికి నిద్రపోతున్న శ్రీకృష్ణుడు నిద్రలేచి, ఆకలేసి పాలకోసం ఏడుస్తున్నాడు. కాళ్ళూ, చేతులూ ఆడిస్తూ ఏడుస్తున్న పిల్లవాడు దగ్గరగా ఉన్న, ఆహారపదార్థాలతో నిండుగా ఉన్న బండిని తన కాలితో తన్నాడు. ఆ తన్నుకి ఆ బండి పైకి ఎగిరి ఇరుసు విరిగి క్రిందపడింది. జరిగిందంతా గోపబాలురు చెప్పగా విన్న యశోదానందులు ఆశ్చర్యపోయారు. పిల్లవాడికి గ్రహమో ఏదో సోకిందని

రక్షరేఖలు కట్టించి, విభూతులు పెట్టించి, హోమాలు చేయించి, బ్రాహ్మణుల చేత ఆశీర్వాదాలిప్పించి, గ్రహశాంతులకు చేయాల్సిన పనులన్నీ చేశారు.

మరొకరోజు యశోద కృష్ణునికి పాలిస్తోంది. ఉన్నట్లుండి కృష్ణుడు బాగా బరువెక్కిపోయాడు. యశోద మొయ్యలేక వీడు నిజంగా పిల్లాడేనా? లోకాలను రక్షించడానికి పుట్టిన దేవుడో ఏమో! అందరిలాంటి వాడు కాదేమో! అనుకుంటూ కృష్ణుని నేలపై కూర్చోబెట్టింది. ఇంతలో కంసుని ఆజ్ఞతో వచ్చిన తృణావర్తుడు సుడిగాలిలగా మారి గిరా గిరా తిరిగి తిరిగి హరిని ఆకాశంలోకి ఎత్తుకుపోయాడు. ఆ వేగానికి రేగిన దుమ్ము కళ్ళలో పడుతుంటే అక్కడ నిలబడలేకపోయారు గోపాలకులు. అంతా కటిక చీకటిగా అయిపోయింది. యశోద పిల్లాడేమయ్యాడో అని కంగారు పడుతోంది.

సుడిగాలి  బిడ్డను ఎత్తుకుపోతుంటే ఏం చెయ్యలేక పోయానే అంటూ కన్నీరుమున్నీరుగా ఏడుస్తోంది. పైకి హరిని ఎత్తుకు పోతున్న రాక్షసుడికీ కృష్ణుడు బరువెక్కిపోయాడు. ఆ రాక్షసుడు అంతకంటే పైకి పోలేక ఆయాసపడుతున్నాడు. ఇంతలో కృష్ణుడు తన బుల్లి చేతులతో ఆ రాక్షసుడి మెడపట్టుకుని వ్రేలాడుతూ బరువెక్కుతున్నాడు. తృణావర్తుడు అప్పుడు ఉరితో పడిన పట్టిలాగా కొట్టుకుంటూ, గుడ్లు తేలవేసి, తూలిపోయి రాళ్ళగుట్ట మీద పడి ప్రాణాలు వదిలేశాడు. కృష్ణుడు నవ్వుతూ వాడి మీదే ఆడుకుంటున్నాడు.

గోపికలు ఆ పిల్లవాడిని ఎత్తుకుని యశోదకి ఇచ్చారు. పిల్లవాడికి గండం తప్పిందని యశోదాదులు సంతోషించారు.

ఇంతలో మధుర నుండి వసుదేవుని పురోహితుడు గర్గుడు వచ్చాడు. నందుడు అతిథి సత్కారాలు పూర్తి చేసి "మీ వంటి మహాత్ముల రాక మాకు మేలు కలిగిస్తుంది. ఈ పిల్లలిద్దరికీ నామకరణములు చెయ్యమని" అడిగాడు. గర్గుడు నందునితో "ఈ కృష్ణుడు దేవకి కుమారుడే అని కంసుడు అనుకుంటున్నాడు. కనుక నిరంతరం ఈ పిల్లవాడికి హానిచెయ్యాలనే చూస్తుంటాడు. కాబట్టి ఏ పని అయినా చాలా రహస్యంగానే చెయ్యాలి" అని చెప్పాడు.

రోహిణి కొడుకుకి రాముడనీ, యశోదానందనుడు నల్లగా ఉన్నాడు కనుక కృష్ణుడని పేరు పెట్టాడు. "ఈ పిల్లవాడు చేసే పనులను బట్టి మరెన్నో పేర్లనూ, ప్రఖ్యాతినీ సంపాదిస్తాడు. ఇతని వలన మీ దుఃఖాలు తొలగిపోతాయి. చెడ్డవాళ్ళను శిక్షిస్తూ, మంచి వాళ్ళను కాపాడుతూ ఈ కృష్ణుడు విష్ణుసమానుడై విఖ్యాతి పొందుతాడు" అని చెప్పాడు. గర్గుడు వెళ్ళిపోయాడు.

నందుడు ఆనందంగా కాలం గడుపుతున్నాడు. రామకృష్ణులిద్దరూ శుక్లపక్ష చంద్రుడి లాగా దినదినాభివృద్ధి చెందుతున్నారు. వాళ్ళ బ్యాలక్రీడలతో రేపల్లెలోని వాళ్ళకి పరమానందాన్ని కలిగిస్తున్నారు. రకరకాల ఆటలతో, చేష్టలతో

ఆ చిలిపి కృష్ణుడు చేసే ఆగడాలను గోపికలు ఓర్చుకోలేకపోయారు.

ఒకరోజున వారంతా యశోద దగ్గరకు వచ్చి "ఓ యశోదా! నీ పిల్లవాడు రోజురోజుకీ మరీ చిలిపివాడై పోతున్నాడు. మా ఇళ్ళలో చంటిపిల్లలకు కావలసిన పాలు ఉంచడం లేదు..' అని కేకలేసినా నవ్వుతూ దూడలను విప్పేసి ఆవుల దగ్గరకు పంపిస్తున్నాడు. మా ఇంట్లో కడవలలోని పాలన్నీ గోపబాలురకు పోసేసి, కడవలు పగలగొడుతున్నాడు. అతడు తాగడానికి పాలు కనిపించలేదని మా ఇంట్లో అమ్మాయిలను ఏడిపించి మరీ వచ్చాడు. వాడికి ఎన్ని ఉపాయాలోనమ్మా! పుట్టినాక నేర్చుకున్నాడో! పుట్టకముందే నేర్చుకున్నాడో గాని మా ఇంట్లో ఉట్టి అందలేదని రోళ్ళూ, పీటూ వేసుకుని ఎక్కి, అయినా అందకపోవడంతో రాయితో కడవ కొట్టి, చిల్లుపెట్టి మీగడ పాలు తాగేశాడు. ఆటలకని వచ్చి మా ఇంట్లో పెరుగుంతా తాగేసి ఆ చెయ్యి కోడలి మూతికి పూసి వచ్చాడు. అత్త చూసి కోడలే పెరుగుతిన్నదని కోడలిని కొట్టింది.

ఒకరి ఇంట్లో కడవలలోని నెయ్యంతా తాగేసి ఆ కడవలు తెచ్చి పక్కవారింట్లో పెట్టాడు. ఆ రెండిళ్ళ వాళ్లూ ఎంతగా పోట్లాడుకుంటున్నారో! గుమ్మంలో తిరగుతుంటే ముద్దుగా ఉన్నాడని పిలిచి "నీ పేరేమిటి?" అని అడిగితే పెదవి కొరికి వెళ్ళిపోయాడు. నా బంతి పడింది అంటూ మా ఇంట్లోకి

వచ్చి, పెరట్లో స్నానం చేస్తున్న మా అమ్మాయి చీర తీసుకొచ్చేశాడమ్మ!

మా పిల్లాడిని కూర్చోబెట్టి బానెడు వెన్న తినిపించేశాడు. చూడు వీడు ఊపిరాకడ ఎట్లా బాధపడుతున్నాడో! మా తలుపులు వేసినవి వేసినట్లే ఉంటున్నాయి. ఒకళ్ళింట్లో ఆటలు, మరొకరి ఇంట్లో పాటలు, మరొక ఇంట్లో కాకి అరుపులు. ఇవన్నీ చేసి మళ్ళీ ఏదారిన బయటకి పోతాడో వాడికే తెలియాలి. కడవలన్నీ ఖాళీలైపోతున్నాయి.

అమ్మా యశోదా! ఎవరికైనా కలిమి ఎక్కువగా ఉంటే కడుపు నిండా తింటారు. ఒంటినిండా కట్టుకుంటారు. కానీ ఇలా పక్కవాళ్ళ ఇళ్ళ మీదకి పిల్లవాడిని వదిలిపెడతారా ఎవరైనా? ఓ యామ్మా! నీ కుమారుడు మా ఇళ్ళలో పాలూ పెరుగూ నిలవనియ్యడు. ఇకమేం ఎలా బతకగలుగుతాం? కనుక ఊరు వదిలేసి ఎక్కడికైనాపోతాం. మా అన్నల ఆవుల మీద ఒట్టు" అని గోప కాంతలంతా మొరపెట్టుకున్నారు యశోదతో.

"మా వాడు పాలు పాలంటూ ఎప్పుడూ నా ఒళ్ళోనే ఉండే నా కొడుకుకి పక్క ఇళ్ళకి వెళ్ళడం తెలీదు. పసివాడిపై ఇలా నిందలు వెయ్యడం మీకు ధర్మం కాదు. ఒక్కడే కూర్చుని వాడిలో వాడే ఆడుకుంటూ, నవ్వుకుంటూ ఉండే ఈ వెర్రి పిల్లవాడని ఏమీ అనకండమ్మా!" అంటూ యశోద వాళ్ళను బ్రతిమాలి ఇళ్ళకు పంపించింది.

కుమారుని మాత్రం కోప్పడలేకపోయింది. కుమారుడు కూడా గోపికలు చెప్పిన మాటలు విని, తల్లి తనని కోపంతో ఏమంటుందో అని బిక్కుబిక్కుమంటూ, భయపడుతూ, బెదురు చూపులు చూస్తూ తల్లినే గట్టిగా పట్టుకుని ఆమె ఒళ్ళోకి ఒదిగిపోతున్నాడు. ఆ చూపులకు ఆ తల్లి కరిగిపోయింది.

ఒకరోజు గోపబాలకులందరూ ఆడుకుంటున్నారు. ఇంతలో బలరాముడు, మరికొందరు గోపబాలకులు పరుగుపరుగున యశోద వద్దకు వచ్చి "అమ్మా! మేము ఎంతగావద్దని చెప్తున్నా వినకుండా కృష్ణుడు మట్టి తిన్నాడమ్మా! మన్ను తింటే జబ్బు చేస్తుంది కాదా! మీ అమ్మతో చెప్తామంటే చెప్పుకోండి" అన్నాడు.

యశోద కృష్ణునితో "విన్నావా నీ స్నేహితులు చెప్తున్న మాటలు. నేను ఎంతగా చెప్పినా నా మాటవినవెందుకు? మన్ను తినడం దేనికి? మనింట్లో తినడానికి నీకు ఇంకేమీలేవా?" అని అడిగింది.

కృష్ణుడు అమ్మతో "అమ్మా! నేనెందుకు మన్ను తింటాను? పసిపిల్లాడినా? నాకు తినడానికేం తక్కువ? నాకేమైనా పిచ్చి ఎక్కిందా? వీళ్ళ మాటలు నమ్మకమ్మా? వీళ్ళు నన్ను నీ చేత కొట్టించాలని చెయ్యని పనులన్నీ చేశానని కల్పించి చెపుతున్నారు. నా మాటలు నమ్ము... నమ్మకపోతే నా నోరు వాసన చూడు. ఒకవేళ నా నోరు మట్టి వాసన వస్తుంటే నన్ను నీ ఇష్టమొచ్చినట్టు కొట్టు" అన్నాడు.

వెంటనే తల్లికి నోరు తెరిచి చూపించాడు. యశోద కృష్ణుని నోరు వాసన చూడబోయింది. ఆమెకు ఆ నోటిలో సముద్రాలు, కొండలు, అడవులు, భూగోళము, సూర్య చంద్రులు, దిక్పాలకులు అనేకంగా ఉన్న ఈ బ్రహ్మాండమంతా కనిపించింది. అదంతా చూసి యశోద ఈ పిల్లవాడు "విష్ణువేనేమో" అనుకుంటున్నది. ఇంతలో తన మాయను ప్రయోగించాడు తల్లిమీద. యశోద చూసిన వన్నీ మరచిపోయి పిల్లాడిని ఒళ్ళోకి తీసుకుని ముద్దులాడడం మొదలుపెట్టింది.

ఇలా వింటున్న రాజు మహర్షిని యశోదానందుల పూర్వ వృత్తాంతాన్ని చెప్పమని అడిగాడు. మహర్షి రాజుతో "ఒకప్పుడు బ్రహ్మదేవుడు ద్రోణుడనే మనువునీ, అతని భార్యనూ! భూలోకంలో పుట్టమని అడిగాడు. ఆ మనువు 'మాకు శ్రీమహావిష్ణువును సేవించే భాగ్యాన్ని ప్రసాదించినట్లైతే తప్పక నీ ఆజ్ఞను పాటిస్తానన్నాడు. ద్రోణుని కోరికను చతుర్ముఖుడు అంగీకరించాడు. కనుక యశోదానందులు ఆ మనువు దంపతులే" అని చెప్పాడు.

## యశోద శ్రీకృష్ణుని పట్టుకొనుట - శ్రీకృష్ణుడు రోటికి కట్టబడుట

ఒకరోజున పిల్లలంతా బయటకు వెళ్ళిన సమయంలో యశోద చల్ల చెయ్యడం మొదలుపెట్టింది.

ఇంతలో ఎక్కడి నుంచి వచ్చాడో గాని చిన్ని కృష్ణుడు గిరగిరా తిరుగుతూ, తూలుతూ, నేల అదిరేట్టు చిందులు

తొక్కుతూ, మారాం చేస్తూ "అమ్మా! రా పాలు ఇవ్వు" అంటూ కవ్వం కదలకుండా పట్టుకున్నాడు.

తల్లి 'కవ్వం వదులు నాన్నా! పాలు ఇస్తానన్నాగా!" అని పెరుగు చిలకడం ఆపేసి, కొడుకుని ఒళ్ళోకి తీసుకుని పాలు ఇస్తూన్నది. అంతలోనే పొయ్యి మీద కాగుతున్న పాలు పొంగి పోతున్నాయి. పిల్లవాడికి కుడపునిండా పాలు ఇవ్వలేదు. కానీ పొయ్యి మీద పాలేమైపోతాయోనన్న భయంతో కృష్ణుడిని నేలపై కూర్చోబెట్టి, పొయ్యి దగ్గరకు పరిగెత్తింది. తల్లి తనను మధ్యలోనే దింపేసిందన్న కోపంతో అమ్మ మీద అలిగి, కన్నీళ్ళు కారుస్తూ, ఒక రాయి వేసి చల్లకుండను పగులకొట్టాడు. అందులో పడిన వెన్న కాస్తా తినేసి, అక్కడ ఉండకుండా తుర్రుమాన్నాడు.

తల్లి వచ్చి పగిలిన కుండని చూసింది. ఇంతలోనే వెన్న తిని పారిపోయిన కొడుకుని పట్టుకోలేకపోతానా అనుకుంటూ, గోపకులందరి ఇళ్ళూ తిరిగి చూసింది. చివరికి ఒక గోపిక ఇంట్లో రోలు మీద ఎక్కి వెన్న తీసి, భయపడుతున్నట్లుగా నటిస్తూ ఒక కోతికి తినమని పెడుతున్న కొడుకుని చూసి, "దొంగపిల్లవాడా! నేను నిన్ను పట్టుకోలేననుకున్నావుగా! ఇప్పుడు నిన్ను పట్టుకుంటాను. ఇంక ఎక్కడికి పారిపోతావు" అన్నది.

తల్లి మాటలు విని రోటి మీంచి కిందకి దూకి పరుగులు మొదలుపెట్టాడు. యశోద కూడా కృష్ణుని వెంట పరుగులు

తీస్తోంది. ఆయాసపడుతూ పరుగెత్తుతున్న యశోదని చూసి గోపికలు నవ్వుతున్నారు.

మహామహా యోగులకే తలక్రిందులుగా తపస్సు చేసినా కనీసం వాళ్ళ మనసుకు కూడా అందని ఆ పరబ్రహ్మాన్ని ఈ యశోదాదేవి పట్టుకోగలదా అని అనుకుంటున్నారు. పరుగులు తీస్తూ కృష్ణుడు "ఇంకెప్పుడు దొంగతనం చెయ్యనమ్మా! ఇప్పటికి వదలేయమ్మా! నన్ను పట్టుకోకమ్మా!" అంటూ పట్టుకుని కొట్టకముందే ఏడవడం మొదలుపెట్టి, కళ్ళకు కట్టిన కాటుకని ముఖమంతా పూసుకుని, బెదురుచూపులు చూస్తూ, అమ్మ ఎటునుండి వస్తుందో, ఎప్పుడు ఎలా పట్టుకుంటుందో..." అని తప్పించుకునే దారి వెతుకుతున్నాడు.

చిట్టచివరికి తల్లి అలసట చూసి ఇకపై ఆమెను బాధించకూడదని, తల్లికి దొరికిపోయాడు. తల్లి కృష్ణుని పట్టుకున్నది గానీ కొట్టలేకపోయింది. అందుకని రోటికి కట్టేసింది. మహర్షుల హృదయాలకు, వేదాలకు కూడా చిక్కని పరమాత్మ తల్లిచేత రోటికి చిక్కిపోయాడు.

తల్లి తాడు తెచ్చి రోటికి కట్టబోతుంటే రెండంగుళాల తాడు తక్కువయ్యింది. ఎన్ని తాళ్ళు తెచ్చి ఎన్నిసార్లు కట్టేసినా రెండుంగుళాలే తక్కువవుతోంది. ఏంటి ఇంత చిన్న పిల్లవాడిని కట్టడానికి ఎంత తాడు కూడా చాలడం లేదు అనకుంది. చివరికి తల్లి బాధ చూడలేక ఆమె చేత కట్టబడ్డాడు. అమ్మయ్య, వీడిని రోటికి కట్టేశాను గదా! ఇంక వీడు ఎక్కడికీ వెళ్లలేడులే

అనుకుని యశోద ఇంటిపనులు చేసుకోవడానికి లోపలికి వెళ్ళింది.

దొరకిందే సందు అనుకున్న కృష్ణుడు నెమ్మదిగా రోలు ఈడ్చుకుంటూ అక్కడికి దగ్గరలోనే నారదుడి చేత శపించబడి మద్దిచెట్లుగా పుట్టిన నలకూబర, మణిగ్రీవులనే వారి దగ్గరకు వచ్చాడు. ఆ రోలుని ఈడ్చుకుంటూ ఆ రెండు మద్దిచెట్ల మధ్య నుండి లాక్కుపోయాడు చిన్నికృష్ణుడు. ఆ మద్ది చెట్లు రెండూ ఒక్కసారిగా పిడుగు పడినంత శబ్దం చేస్తూ వేళ్ళతో సహా పెళ్ళగిలిపడిపోయినాయి. వెంటనే ఆ చెట్లలో నుండి నలకూబర, మణిగ్రీవులు బయటకు వచ్చి, శాపవిమోచనం చేసిన శ్రీకృష్ణునికి నమస్కరించి, తమలోకానికి వెళ్ళిపోయారు.

ఇదంతా చూసి నందుడు శ్రీకృష్ణునికి గండం తప్పిందని సంతోషించాడు. కృష్ణుడు తన ప్రభావం ఎవరికీ తెలియనివ్వకూడదని ఏమీ తెలియని వాడిలాగా నటిస్తూ అందరినీ తన మాయలో ముంచేశాడు. తరువాత కొంతకాలం గడిచింది. "ఈ రేపల్లెలో ఉంటే కృష్ణుడికి ఎన్నో ఆపదలు వచ్చినాయి. ఆ శ్రీహరి అనుగ్రహంతో పిల్లవాడు ఆపదల నుండి బయటపడ్డాడు. లేకపోతే మనం ఏమైపోయేవాళ్ళం" అనుకున్నాడు నందుడు.

..."ఏ క్షణం ఏ ఆపద రూపంలో వస్తుందో తెలియడం లేదు. కనుక బృందావనానికి వెళ్ళాలి." అని నిశ్చయించుకున్నాడు. వెంటనే గోవులతో సహా సమస్త వస్తువులతోనూ నందుడు అందరినీ తీసుకుని బృందావనానికి చేరుకున్నాడు.

## వత్సాసుర బకాసురులను చంపడం - బ్రహ్మదేవుడికి బుద్ధి చెప్పడం

రామకృష్ణులు ఒకనాడు బృందావనంలో తిరుగుతున్నారు. ఇంతలో ఒక రాక్షసుడు లేగ దూడ రూపంలో బలరామకృష్ణులను చంపాలని అక్కడికి వచ్చాడు. శ్రీకృష్ణుడు వాడి మోసాన్ని గమనించాడు. తోటి పిల్లలకి ఆ లేగదూడను చూపించి "ఇది ఎంత బలంగా ఉందో చూడండి. నేను దీనితో ఇప్పుడు ఆడే ఆట ఎంత బాగుంటుందో చూడండి' అంటూ ఆ దూడ నాలుగు కాళ్ళూ, తోకా కలిపి కట్టుకుని గిరగిరా తిప్పి, నేలకేసి విసిరి కొట్టి, ఆ దూడని యముడి దగ్గరికి పంపించాడు.

మరొకరోజు చెరువులో ఆవుల, దూడల దాహం తీర్చి, తమ దాహం తీర్చుకుని, బయటికి వచ్చి, ఒడ్డున ఉన్న శ్రీకృష్ణుని చంపడానికి కొంగ రూపంలో మరొక రాక్షసుడు వచ్చాడు. కృష్ణుడు ఎటు వెళ్తే అంటే అతడినే చూస్తూ కృష్ణుని పట్టుకోవడానికి ప్రయత్నించి, పెద్ద నోరు తెరిచి, చిన్న కృష్ణుని మింగేశాడు. మరుక్షణంలో బలరామాదులంతా కొయ్యబారిపోయారు.

కృష్ణుడు కొంగ మెడలో నుంచి క్రిందికి పోలేదు. ఆ కొంగకి మాత్రం కాలాగ్నితో మండుతున్నట్లుగా మెడ, దవడలు మండిపోతున్నాయి. ఆ మంట తట్టుకోలేక కొంగలాగా ఉన్న రాక్షసుడు తన నోరు మళ్ళీ తెరిచి కృష్ణుని బయటికి కక్కేశాడు.

అప్పుడు కృష్ణుడు ఆ కొంగముక్కులను రెండింటినీ గడ్డిపరకను చీల్చినట్లుగా చీల్చేశాడు.

అప్పుడే దేవతలు ఆకాశం నుండి పూలవాన కురిపించారు. దుందుభులు మ్రోగించారు. కొయ్యబారిన వాళ్ళంతా మళ్ళీ కదలికలవాళ్ళయ్యారు. కృష్ణుని కౌగిలించుకుని ఆనందించారు.

ఆ తరువాత ఒకసారి బలరాముడు, శ్రీకృష్ణుడు, గోపబాలకులతో సహా అందరూ వనంలో చద్ది అన్నాలు తినాలనుకున్నారు. ఆవుల మందలను అదిలిస్తూ కోయిలతో పాడుతూ, నెమళ్ళతో ఆడుతూ, చిలకల్లా పలుకుతూ అడవి అంతా తమదే అన్నట్లుగా విహరించారు. ఒకరి చద్దిని మరొకరు తీసి దాస్తే మరొకడు ఆ చద్దిని తెచ్చి ఇచ్చేవాడు. ఆవుల మంద మధ్యలో దాక్కుని ఆడుకునేవాళ్ళు. కృష్ణుని పట్టుకునేవాళ్ళు. కృష్ణుడి చుట్టూ పరుగులు తీసేవాళ్ళు. మహాయోగీశ్వరులకు కూడా తన పాదధూళిని అందివ్వని ఆ శ్రీహరి శ్రీకృష్ణుడై గోపబాలకులతో ఆడి, పాడి, తన్నుతూ, గుద్దుతూ, నవ్వుతూ, మీదపడుతూ, నవ్విస్తూ, కౌగిలించుకుంటూ ఆటలాడుతుంటే వాళ్లంతా మురిసిపోతున్నారు. ఆ గోపబాలకుల అదృష్టం ఎంత గోప్పదో గదా!

అదే సమయంలో అక్కడికి బకాసురుని తమ్ముడైన అఘుడనే రాక్షసుడు వచ్చాడు. అమృతం తాగిన వాడైనా వాటి

వాతపడితే చచ్చితీరాల్సిందే. వాడు కృష్ణాదులు వెళ్లే దారిలో కొండచిలువలాగా పడి ఉండి, పెద్ద నోరు తెరుచుకుని, కృష్ణుడు ఎప్పుడు వస్తాడా మింగుదామని చూస్తున్నాడు. కృష్ణుడున్నాడు గదా అని ఏమాత్రం భయపడకుండా ముందుకు సాగుతున్నారు గోపబాలకులు. 'నా మీద వీళ్ళకి ఎంత నమ్మకం, ఎంత ధైర్యం' అనుకుంటూ కృష్ణుడు అఘాసురుడి దగ్గరకు రాబోయేంతలోనే వాడు గోపాలకులను, లేగదూడలను మింగేశాడు. అదంతా చూసి కృష్ణుడు గోపాలకుల వెంట తాను కూడా ఆ కొండచిలువలోకి వెళ్ళిపోయి, తన శరీరాన్ని చెప్పలేనంతగా పెంచేశాడు. దాంతో ఆ అఘాసురుడికి పొట్ట ఉబ్బిపోయింది. ప్రాణవాయువులు ఐదూ తలను పగలగొట్టి పైకి ఎగిరిపోయాయి. పిల్లలు, కృష్ణుడు, లేగదూడలు అందరూ కొండచిలువ నోట్లోనుండి బయటపడ్డారు. తరువాత ఆ పాములో నించి ఒక తేజస్సు బయటికి వచ్చి కృష్ణుడిలో కలసిపోయింది.

దేవతలంతా శ్రీకృష్ణునిపై పూలవాన కురిపించారు. ఆ గోలంతా విని బ్రహ్మదేవుడు కిందకి వచ్చి, ఆ కొండచిలువను చూసి, ఇంత చిన్నపిల్లవాడు వీళ్ళందరినీ ఎట్లా రక్షించాడో అని ఆశ్చర్యపోయాడు.

శ్రీకృష్ణుడు దూడలతోను, గోపాలకులతోను కలిసి దారిలో ఉన్న పెద్ద చెరువు చూసుకుని, అక్కడే చద్ది అన్నాలు తిందామన్నాడు. అందరూ కబుర్లు చెప్పుకుంటూ పిల్లలంతా

రాళ్ళూ, లేత ఆకులు, పచ్చిక తీగలు, ఉట్లు, పువ్వులనే కంచాలుగా చేసుకుని, వాటిలో చద్ది అన్నాలు పెట్టుకుని తినడం మొదలుపెట్టారు.

దేవతలు, మహర్షులు, బ్రాహ్మణులు, రాజులు మొదలైన వారంతా చేసే యజ్ఞాల్లోని హవిస్సులు ఆరగించే పరమాత్మ శ్రీకృష్ణుడై గొల్లపిల్లల మధ్య గొల్లపిల్లవాడి లాగానే కూర్చున్నాడు. పొట్టు చుట్టూ చుట్టుకున్న ఉత్తరీయంలో పిల్లనగ్రోవిని దోపుకున్నాడు. కొమ్మునీ, చేతికర్రని ఎడమ చంకలో దోపుకున్నాడు. మీగడ పెరుగతో కలిపిన అన్నపుముద్దని కుడిచేతిలో పట్టుకున్నాడు. నంచుకోవడానికి తెచ్చుకున్న ఊరగాయముక్కలను వేళ్ళ మధ్యలో ఇరికించుకున్నాడు. గోపాలకులు చెప్పే మాటలు వింటూ, నవ్వుతూ, నవ్విస్తూ వాళ్ళతో కలిసి పసివాడిలాగా చద్దన్నం తింటున్నాడు.

ఇంతలో లేగదూడలు మేత కోసం చాలా దూరం వెళ్ళిపోయాయని భయపడుతున్న పిల్లలకు "భయపడకండి. నేను వెళ్ళి వాటిని వెనక్కి తీసుకొస్తాను. మీరు తింటూ ఉండండి" అని చెప్పి ఉన్నవాడు ఉన్నట్లుగా గభాల్న లేచి వెళ్ళాడు. అంతలోనే మాయమయ్యాడు. ఇంతలో బ్రహ్మదేవుడు అఘాసురుని చంపిన ఈ పిలవాడి శక్తి ఏమిటో చూడాలని అనుకుని, లేగదూడలనూ, గోపబాలకులనూ కూడా మాయం చేశాడు. కృష్ణుడు లేగదూడలు కనపడలేదని వెనక్కి వచ్చి, అక్కడ స్నేహితులూ లేకపోవడం చూసి, ఇదంతా బ్రహ్మదేవుడే

చేశాడని నిశ్చయించుకున్నాడు. వెంటనే తానే గోపాలుర రూపాలుగానూ, దూడల రూపాలుగానూ మారాడు. సృష్టి సమస్తమూ అతని స్వరూపమే అయినప్పుడు ఈ కొద్దిమంది రూపాలు ధరించడం ఏమంత ఆశ్చర్యకరం?

ఇలా సంవత్సరకాలం గడుస్తోంది. ఇక ఐదారు రోజులకు సంవత్సరం పూర్తి అవుతుందనగా ఒకరోజున శ్రీకృష్ణుడు అన్నిరూపాలలో అడవిలో తిరుగుతున్నాడు. ఆవులు దూడల వద్దకు వచ్చి ప్రేమతో నాకుతూ పాలిస్తున్నాయి. గోపాలకులూ వాళ్ళ పిల్లలను మరింత ప్రేమతో ముద్దాడుతున్నారు. పాలు మానిన దూడలు పాలు తాగడం, పెద్దలకు పిల్లలపై ఇంతటి ప్రేమ పెరగడానికి కారణం ఏమిటని ఆలోచిస్తున్న బలరాముడు గోపబాలురూ, గోవత్సాలూ అన్నీ శ్రీకృష్ణుని రూపాలే అన్న విషయం తెలుసుకున్నాడు. 'నాకెందుకు ఇలా అనిపిస్తోందని" కృష్ణుని అడిగాడు బలరాముడు. అప్పుడు కృష్ణుడు బ్రహ్మదేవుడు చేసిన పనినీ, దానికి బదులుగా తాను చేసిన పనినీ చెప్పాడు.

అప్పటికి భూలోకంలో సంవత్సరం పూర్తి అయ్యింది. తరువాత బ్రహ్మదేవుడు తనకు క్షణకాలం అయిందనీ, తిరిగి భూలోకానికి వచ్చి అక్కడున్న గోవులను, గోపాలకులను, వాళ్ళతో తిరుగుతున్న శ్రీకృష్ణునీ చూసి ఆశ్చర్యపోయాడు. ఏమిటీ వింత అనుకుంటున్న బ్రహ్మదేవుడికి వారంతా శంఖచక్రాలు ధరించి విష్ణుమూర్తిలాగానే కనపడ్డారు.

బ్రహ్మదేవుడు తెల్లబోయాడు. ఇంతలో శ్రీకృష్ణుడు ఆ మాయారూపాలన్నింటినీ వదిలేశాడు. బ్రహ్మదేవుడు బుద్ధి తెచ్చుకుని, తన అహంకారాన్ని వదిలేసి, తన అవివేకాన్ని మన్నించమనీ, తనను క్షమించమనీ శ్రీకృష్ణుని వేడుకున్నాడు. పిల్లలందరినీ వాళ్ళు అన్నం తింటున్న చోటికే చేర్చాడు. వాళ్ళంతా  కృష్ణుని చూసి "కృష్ణా! లేగలు కనిపించాయా! నువ్వు వచ్చేదాకా తినద్దని ఊరుకున్నాం. రా! అందరం కలిసి చద్ది తిందాం" అని అందరూ కలిసి చద్ది తిని, ఇళ్ళకు చేరుకుని, కృష్ణుడు పాముని చంపిన విషయం తల్లిదండ్రులతో చెప్పారు.

ఆ తరువాత బలరామకృష్ణులు దేవకాసురునీ, అతని బంధు గణాలనూ సంహరించి, తాటిపళ్ళు మానవులు తినేట్లుగానూ, ఆ తోపులో గోవులు పచ్చిక మేసేట్లుగానూ చేశారు.

## శ్రీకృష్ణుడు కాళీయుని మర్దించుట - గోవిందపట్టాభిషేకము చేయించుకొనుట

ఒకరోజు శ్రీకృష్ణుడు, బలరాముడు తన స్నేహితులతో కలసి యమునా నదిలోని కాళిందీ ముడుగువైపుకి వెళ్ళారు. అందులో నీరు తుకతుక ఉడుకుతండడం చూసి, ఈ మడుగులో ఉన్న కాళీయుని తరిమేసి, ఈ మడుగు ప్రజలకు, పశువులకు కూడా ఉపయోగపడేట్లు చెయ్యాలని నిశ్చయించుకున్నాడు శ్రీకృష్ణుడు. కాళీయుని తరమాలని మడుగలోకి

దూకాడు. ఈ బాలుడిని నా విషాగ్నితో చంపేసి ఎవ్వరూ ఈ మడుగువైపు రాకుండా చెయ్యాలని కాళీయుడు బుసలు కొడుతూ, కృష్ణుని వంటినిండా కాట్లువేసి, తన తోకతో కృష్ణుని చుట్టేశాడు.

పాము బారి నుండి కృష్ణుని ఎట్లా రక్షించాలని పిల్లలంతా ఆలోచిస్తుంటే, కృష్ణునికి ఇంత ఆపద వచ్చిందేమిటని మేత కూడా తినడం మానేసి లేగలూ, ఆవులూ అరుస్తున్నాయి. అందరూ తలొక విధంగా దుఃఖిస్తూ మడుగులోకి దూకబోతున్నారు పిల్లలంతా. బలరాముడు కృష్ణుడికి ఏమీకాదని, మీరు ముడుగులోకి దూకద్దనీ ఆపాడు.

కృష్ణుడు తన శరీరాన్ని పెంచేసరికి కాళీయుడు అతడిని చుట్టి పట్టలేకపోయాడు. మండుతున్న కట్టెలాగా విషాగ్నిని కక్కుతున్న పాము పడగలపై తన చేతితో చరిచాడు కృష్ణుడు. వెంటనే చిన్ని కృష్ణుడు ఒక్కసారిగా ఎగిరి కాళీయుని పడగలపై నిలబడ్డాడు. ఆ పడగల మీద ఉన్న రత్నాలు కృష్ణుని పాదాలకు హారతులిస్తున్నట్లున్నాయి.

పాముపడగలపై కృష్ణుని పాదముద్రలు పడ్డాయి. కృష్ణుడు అలల సవ్వడితో లయబద్ధంగా దాని పడగలపై చిందులేస్తూ మడుగులోంచి బయటకి వచ్చాడు. కాళీయుడు మడుగు వదలి వెళ్ళిపోయాడు. మడుగు మానవులకు, పశువులకు ఉపయోగకరమైనది.

పిల్లలు జరిగినదంతా చెప్పగా విన్న యశోద శ్రీకృష్ణుని తన కన్నీటితోనే స్నానం చేయించింది.

ఆ తరువాత ఆ నాటి రాత్రి అరణ్యంలో శ్రీకృష్ణుని చుట్టూ చేరి గోపబాలకులంతా ఉన్నారు. కబుర్లు చెప్తూ నిద్రపోయిన వారందరినీ కార్చిచ్చు ఆవరించింది. ఆ వేడికి లేచిన పిల్లలు శ్రీకృష్ణునితో మొరపెట్టుకున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు శివుడు గరళం మింగినట్లుగా ఆ కార్చిచ్చును మింగి గోపబాలకులనూ, ఇతర ప్రాణులనూ రక్షించాడు. ఆ తరువాత గోపకుమారుని రూపంలో వచ్చిన ప్రలంబుడనే రాక్షసుని సంహరించాడు.

ఒకనాటి ప్రాతఃకాలంలో గోపకన్యలు యమునా నదిలో స్నానాలుచేసి, కాత్యాయనీ దేవిని పదహారు ఉపచారాలతో పూజించి, శ్రీకృష్ణుడినే తమకు భర్తగా ప్రసాదించమని వేడుకున్నారు. అట్లా నెలరోజుల పాటు ఆ దేవిని పూజించి, చివరగా గోపకన్యలు బట్టలన్నీ ఒడ్డున పెట్టి, నదిలోకి స్నానానికి దిగారు.

ఇంతలో శ్రీకృష్ణుడు వచ్చి, చప్పుడు చెయ్యకుండా వాళ్ల చీరలన్నీ తీసుకుని, అక్కడే ఉన్న కడిమి చెట్టు ఎక్కి కూర్చున్నాడు. గోపకన్యలంతా సిగ్గుపడుతూ తమ చీరలివ్వమని అడిగారు. "మీరు నాకు సేవ చెయ్యడానికి మా ఇంటికి వస్తానంటే మీ చీరలు మీకు ఇస్తాను" అన్నాడు కృష్ణుడు. 'మీరు బట్టల్లేకుండా నీళ్ళలోకి దిగచ్చా అసలు?' అని 'బయటకి రండి. వ్రతం చేసిన ఫలం కావాలనుకుంటే

రెండు చేతులూ ఎత్తి, నాకు నమస్కరించి మీ చీరలను మీరు తీసుకోండి' అన్నాడు.

గోపకన్యలు శ్రీకృష్ణునికి నమస్కరించారు. శ్రీకృష్ణుడు వాళ్ళ చీరలు ఇచ్చేసి "మీ వ్రతం ఫలిస్తుంది. మీ కోరికలు తీరతాయి" అన్నాడు. ఆ కన్యలంతా ఆనందంతో కృష్ణుడినే తలచుకుంటూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

ఒకరోజు కృష్ణుడు మునులు యజ్ఞం చేస్తున్న చోటికి వచ్చాడు. అప్పటికి మిట్టమధ్యాహ్నమయ్యింది. తనతోపాటు ఉన్న గోపబాలుర ఆకలి తీర్చాలని నిశ్చయించుకున్నాడు శ్రీకృష్ణుడు. పిల్లలని "యజ్ఞం చేస్తున్న మహర్షుల దగ్గరకు వెళ్ళి, రామకృష్ణులు పంపించారనీ, అన్నం పెట్టమనీ అడగండి" అని చెప్పాడు.

పిల్లలు అక్కడికి వెళ్ళి కృష్ణుడు చెప్పినట్లు అడిగారు. మహర్షులంతా 'అన్నం లేదు, గిన్నం లేదు పొమ్మన్నారు.' పిల్లలు వెనక్కి వచ్చి కృష్ణుడికి చెప్పారు. కృష్ణుడు వారికి మునిపత్నుల దగ్గరకి వెళ్ళి అడగమని చెప్పాడు. మునిపత్నుల దగ్గరకు వెళ్ళి గోపబాలురు విషయం చెప్పి అడిగారు. వెంటనే మునిపత్నులంతా వండిన పదార్థాలను తీసుకుని ఆ పిల్లల వెంటన బలరామకృష్ణుల వద్దకు వచ్చి, వాళ్ళ ముందు పెట్టారు. కృష్ణుడు వాళ్ళ క్షేమ సమాచారాలడిగి, ఏదైనా వరం కోరుకోమన్నాడు. "ఇక్కడే నీ సేవ చేసుకుంటూ చావుపుట్టుకలు లేని ముక్తిని ప్రసాదించమని వేడుకున్నారు" మునిపత్నులు. "మీకోరిక తప్పక తీరుతుంది వెళ్ళిరండి" అన్నాడు కృష్ణుడు.

ఇతరులెవరికైనా ఏదైనా ఇస్తూ “పరమేశ్వరార్పణమని' ఇస్తేనే పరమపదం లభిస్తుంది. అట్లాంటిది సాక్షత్తుగా పరమాత్మకే భిక్ష ఇస్తే ఇంక దాని ఫలం ఎంతని చెప్పగలం? కనుక ఎవరికైనా ఏదైనా ఇచ్చేటప్పుడు పరమాత్మకి ఇస్తున్నట్లు భావించాలి.

ఒకప్పుడు నందుడు ఇంద్రయాగం చెయ్యాలని నిశ్చయించి, ఆ యాగానికి ఏ ఆటంకాలూ రాకుండా చూడమని బలరామ కృష్ణులకు చెప్పాడు. కృష్ణుడు 'ఇంద్రయాగం ఎందుకు? ఎవరి కోసం చెయ్యాలి?' అని తండ్రిని అడిగాడు.

నందుడు కృష్ణునితో “మేఘాలకు అధిపతి అయిన ఇంద్రుడు సంతోషిస్తే సకాలంలో వానలు కురిపిస్తాడు. అప్పుడు పంటలు చక్కగా పండుతాయి. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారు' అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు తండ్రితో “మనం గొల్లవాళ్ళం. మనకు గోవులు, కొండలు, బ్రాహ్మణులు ముఖ్యమైన వాళ్ళు. వీళ్ళని సంతోష పెట్టడానికి చేసే యాగమే మనం చెయ్యాలి. కనుక ఈ గోవర్ధనపర్వతాన్ని పూజించండి” అన్నాడు.

వెంటనే తానే ఒక పర్వతరూపాన్ని ధరించి “ఈ గోవర్ధన పర్వతాన్ని పూజిద్దాం రమ్మని పిలిచాడు” అందరినీ, అందరూ కృష్ణుడు చెప్పినట్టే గోవర్ధన పర్వతాన్ని పూజించారు. ఆ పర్వతరూపంలో కృష్ణుడే ఉండి వాళ్ళు చేసిన పూజలన్నీ స్వీకరించాడు.

అది చూసి దేవేంద్రుడు కోపగించుకున్నాడు. సంవర్తక మేఘాలను పిలిచి "మీరు వెళ్ళి జడివానను, వానతోపాటు రాళ్ళనూ కురిపించి ఆ గోపాలకులను, గోవులను అకాల మృత్యువు పాలు చేయండి" అని ఆదేశించి పంపించాడు. సంవర్తక మేఘాలు ఇంద్రుడి ఆజ్ఞను అమలు జరిపాయి. అందరూ జరుగుతున్నది వివరిస్తూ "నీవే దిక్కు" అంటూ శ్రీకృష్ణునితో మొరపెట్టుకున్నారు.

కృష్ణుడు "మీరు భయపడకండి. భగవంతుడు మీతోనే ఉన్నాడు. మిమ్మల్ని రక్షిస్తాడు" అని ధైర్యం చెప్పి, ఆ గోవర్ధన పర్వతాన్ని గొడుగులాగా తన చిటికెన వ్రేలితో పైకి ఎత్తి పట్టుకున్నాడు. 'కొండపెద్దది, పిల్లవాడు చిన్నవాడు అని సందేహించకండి. ఈ సృష్టి అంతా వచ్చి మీదపడినా నా చెయ్యి ఏమాత్రం కదలదు. కనుక మీరంతా ఈ కొండకింద సురక్షితంగా ఉండండి" అన్నాడు. అందరూ కృష్ణునిపై నమ్మకంతో ఆ గోవర్ధనపర్వతం క్రిందకి వచ్చారు. వాళ్ళు కృష్ణుడినే చూస్తున్నారు. శ్రీకృష్ణుడు వాళ్ళని చూస్తున్నాడు. వారందరూ ఆకలిదప్పులనే మరచిపోయి, భగవంతుని అద్భుతమైన కథలను గురించి చెప్పుకుంటూ ఆనందిస్తున్నారు.

ఇంద్రుడి ఆజ్ఞతో మేఘాలు ఏడురోజుల పాటు ఎడతెరిపి లేకుండా వానని కురిపించాయి. కానీ ఎవరికీ ఏ హానీ జరుగలేదు. ఇంద్రుడు విసిగిపోయి వానకురిపించడం ఆపమన్నాడు. కృష్ణుడు పర్వతాన్ని క్రిందపెట్టేసి గోకులంలోకి చేరాడు. ఇంద్రుడు క్రిందకి వచ్చి, శ్రీకృష్ణుని చూసి,

సాష్టాంగనమస్కారం చేసి, నా తప్పు క్షమించమని ప్రార్థించి, గోవులను, గోపాలకులను కాపాడావు కనుక "గోవిందా నువ్వే సమస్తానికీ ప్రభువువి" ఆ గోవిందునికి పట్టాభిషేకం జరిపించి, స్వర్గానికి తిరిగి వెళ్ళాడు.

ఆ తరువాత ఒకరోజు నందుడు స్నానానికి యమునలో దిగాడు. ఆ నందుని ఒక రాక్షసుడు వరుణలోకానికి తీసుకుపోయాడు. జరిగినది తెలుసుకున్న శ్రీకృష్ణుడు వరుణ లోకానికి వెళ్ళాడు. వరుణుడు శ్రీకృష్ణుని పూజించి, "నా సేవకుడు తెలియక చేసిన పనికి మమ్మల్ని మన్నించమని ప్రార్థించి, నందుని శ్రీకృష్ణునికి అప్పగించాడు. కృష్ణుడు నందుడితో కలిసి బృందావనానికి వచ్చాడు.

## శ్రీకృష్ణుడు గోపికలతో రాసలీల చేయుట - రుక్మిణిని వివాహమాడుట

ఒకనాటి శరాత్కాల పూర్ణిమనాటి రాత్రి సమయంలో శ్రీకృష్ణుడు యమునా తీరానికి వెళ్ళి మధురంగా వేణుగానం చేస్తున్నాడు. ఆ వేణు గానం వినపడగానే గోపికలంతా వాళ్ళు చేస్తున్న పనులన్నింటినీ వదిలేసి, కృష్ణుడినే తలుచుకుంటూ గుంపులు గుంపులుగా శ్రీకృష్ణుడిని చూడడానికి వెళ్ళారు.

కృష్ణుడు వారితో 'ఇంత రాత్రిపూట, ఒంటరిగా, చేసే పనులు మానేసి, సాహం చేసి మీరు ఇక్కడికి రావచ్చా?' అని అడిగాడు. "మీరు ఏ పని చేస్తున్నా నన్నే తలుచుకుంటూ, నా గురించే ఆలోచిస్తూ, నా గురించే మాట్లాడుకుంటూ కాలం నడిపితే మీ జన్మలు తరిస్తాయి. కనుక మీరంతా మీ మీ

ఇళ్ళకు వెళ్ళండి” అన్నాడు. మరుక్షణంలో వారెవ్వరికీ కనపడకుండా మాయమయ్యాడు.

గోపికలంతా కృష్ణుడిని అరణ్యమంతా వెతుకుతున్నారు. కనపడిన ప్రతి చెట్టునీ, చేమనీ ‘కృష్ణయ్య’ కనిపించాడా అని అడుగుతున్నారు. మీ పొదల చాటున మా కృష్ణుని దాచలేదు కదా! అంటూ కృష్ణుని రూపాన్ని వర్ణించి వర్ణించి చెప్పారు. చివరికి కృష్ణుడు కనపడకపోయేసరికి వారికి మతితప్పింది. ఎదురుగా ఏది కనపడినా కృష్ణుడనే అనుకుంటున్నారు. దానినే ‘అద్వైతసిద్ధి’ అంటారు.

ఎవరైనా తమలోనూ బయటా కూడా పరమాత్మని చూడగలగాలి. అట్లా చూడగలిగేవారికి మోక్షం అరచేతిలోని ఉసిరికాయ వంటిదవుతుంది. గోపికలు ‘కృష్ణా!కృష్ణా!’ అంటూ పిలుస్తూ అడవి అంతా తిరుగుతున్నారు. మాకు కనిపించమని వేడుకుంటున్నారు. ఇంతలో వారి మాటలూ, పాటలూ వింటున్న కృష్ణుడు వారందరి మధ్య ఒక్కసారిగా ప్రత్యక్షమయ్యాడు.

‘నేను మీతోనో ఉన్నాను. నన్నే తలుచుకుంటున్న మీకు ప్రత్యుపకారం చేస్తాను’ అన్నాడు. ఇద్దరు స్త్రీల మధ్యతానూ, ఇద్దరు కృష్ణుల మధ్య గోపిక ఉన్నట్లు అందరికీ కనిపించాడు. వాళ్ళతో పాటు నాట్యం చేసి, ఆడి పాడాడు. అందరికీ పరమానందాన్ని కలిగించాడు.

గోపికలను ఆనందపరుస్తున్న ఆ శ్రీకృష్ణ మాయను చూసి దేవతలూ పరమానందాన్ని పొంది కల్పవృక్షపు పూలనే వర్షంలాగా కురిపించి, ఆ పరమాత్మను ఎంతగానో పొగిడారు.

ఆ తరువాత ఆ గోపికలందరినీ తనతో పాటు యమునలో స్నానం చేయించి, ఎవరి ఇళ్ళకు వారిని పంపాడు. తరువాత శాపకారణంగా సర్పరూపంలో ఉన్న విద్యాధరుని బారి నుండి నందుని రక్షించి , అతనికి శాపవిముక్తిని కలిగించాడు. శ్రీకృష్ణుడు శంఖచూడుని సంహరించి, అతడికిరీటంలో ఉన్న మణిని బలరాముడికి ఇచ్చాడు. వృషభాసురుని సంహరించి గోవులనూ, దూడలనూ రక్షించాడు. కంసుడు ధనుర్యాగం తలపెట్టి, రామకృష్ణులను రప్పించి, చంపించాలని ప్రయత్నించాడు. దానిలో భాగంగా గుర్రం రూపాన్ని ధరించి తమను చంపడానికి వచ్చిన కేశి అనే రాక్షసుని సంహరించాడు. తరువాత గోపబాలుని రూపంలో వచ్చిన వ్యోమాసురుని వధించాడు.

కంసుడు బలరామకృష్ణులను తీసుకురమ్మని అక్రూరుని బృందావనానికి పంపించాడు. బలరాముని వెంటబెట్టుకుని కృష్ణుడు రథమెక్కి బయలుదేరాడు అక్రూరునితో. యమునానది రాగానే రామకృష్ణులు దాహం తీర్చుకుని, మళ్ళీ రథమెక్కి కూర్చున్నారు. అక్రూరుడు నదిలో స్నానం చేసి, వేదమంత్రాలు చదువుకుంటూ కాసేపు నదిలోనే ఉన్నాడు.

అప్పుడు అక్రూరునికి నదీజల్లాల్లో బలరామకృష్ణులు కనపడ్డారు. అంతలోనే అదృశ్యుడైన శ్రీహరిని తలుచుకుంటూ

అక్రూరుడు బలరామకృష్ణులను మధురకు తీసుకువెళ్ళాడు. మధురలో ప్రవేశించి తనని నిందించిన పనివాడు తలను నరికాడు. మూడు వంకరలతో ఉన్న మరుగుజ్జు స్త్రీతో సరసమాడి, ఆమెకు అందమైన ఆకారాన్ని అనుగ్రహించాడు. తరువాత ధనుశ్శాలలోకి ప్రవేశించి, అక్కడున్న పెద్దవిల్లును ఎక్కుపెట్టాడు. అది విరిగి భూమ్యాకాశాలను దద్ధరిల్లజేసింది. తమను ముట్టడించిన వీరులను వధించాడు. తనను పొడవబోయిన కువలయాపీడమనే ఏనుగుని (తనను పొడవబోయిన) నేలకూల్చాడు. మల్లయోధులైన చాణూర ముష్టికులను మట్టుపెట్టాడు.

కంసుడి సభలోకి ప్రవేశించి, లేడి మీదకి దూకే సింహంలాగా సింహాసనం మీద ఉన్న కంసుడి మీదకి లంఘించి జుట్టుపట్టిలాగి క్రిందపడేశాడు. అప్పటికే కంసుడు ప్రాణాలు వదిలేశాడు. చెరసాలలో ఉన్న తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి క్షమించమని వేడుకున్నారు బలరామకృష్ణులు. తరువాత కంసుడి తండ్రి ఉగ్రసేనుని మహారాజుగా పట్టాభిషేకం చేశారు. దేవకీవసుదేవులు బలరామకృష్ణులకు ఉపనయనం జరిపించారు.

సాందీపమహర్షి దగ్గర అరవైనాలుగు విద్యలనూ అభ్యసించారు. గురుదంపతుల కోరిక మేరకు యమలోకం నుండి గురుపుత్రుని తెచ్చి గురుదక్షిణగా సమర్పించాడు శ్రీకృష్ణుడు. ప్రభాస తీర్థంలో గురుపుత్రుని మింగిన పంచజనుడనే రాక్షసుని చంపి, అతడి పొట్టలో కనిపించిన

శంఖాన్ని తెచ్చుకుని తన చేతిలో ధరించాడు. అదే పాంచజన్యం.

ఇక్కడ నందయశోదలు కృష్ణుడు ఎప్పుడువస్తాడా అని ఎదురు చూస్తూ అతడి సాహసగాథలు చెప్పుకుంటూ మురిసిపోతున్నారు. తాను వస్తున్న వార్తను గోకులంలో తెలియచేయమని ఉద్ధవుని పంపించాడు. గోకులానికి వచ్చిన ఉద్ధవుడు శ్రీహరి సందేశం చెప్పడానికి గోపికల దగ్గరకు వెళ్ళాడు. గోపికలు ఉద్ధవునితో "నిన్ను ఎవరు పంపించారో, నువ్వు ఎందుకు వచ్చావో మాకు తెలుసు" అంటూ కృష్ణుని కోసం పరిపరి విధాలుగా దుఃఖిస్తూ భ్రమర గీతములు పాడుతున్నారు. ఉద్ధవుడు వారిని ఓదార్చి, గోపికల సందేశం తీసుకుని తిరిగి మధురకు వెళ్ళాడు.

తరువాత శ్రీకృష్ణుడు ఉద్ధవునితో కలిసి కుబ్జ ఇంటికి వెళ్ళాడు. తమతో యుద్ధం చేసిన జరాసంధుని చంపబోయిన బలరాముడికి అడ్డుపడి జరాసంధుని వెనక్కి పంపించాడు. కానీ సైన్యాన్ని సమకూర్చుకుంటూ, ఓడిపోతూ బలరామకృష్ణుల మీదకి పదిహేడుసార్లు దండయాత్ర చేశాడు. పద్దెనిమిదోసారి కూడా బయలుదేరాడు.

అదే సమయంలో నారదుడు కాలయవనుడనే మ్లేచ్ఛరాజు జరాసంధుని గురించి చెప్పి, యదువంశంలోసాటిలేని వాడుగా పుట్టిన శ్రీకృష్ణుని గురించి చక్కగా వర్ణించి చెప్పాడు. కాలయవనుడు మధురకు వెళ్ళి శ్రీకృష్ణుని చూశాడు. భయపడినట్లు నటిస్తున్న శ్రీకృష్ణుని

పట్టుకోవాలని ప్రయత్నించాడు. కాలయవనునికి అందకుండా పరుగులు తీసిన శ్రీకృష్ణుడు చీకటిగా ఉన్న గుహలోకి ప్రవేశించాడు.

కాలయవనుడు కూడా అందులోకి వెళ్ళి, అక్కడ పడుకుని నిద్రపోతున్న ఒక మహాపురుషుని చూసి, శ్రీకృష్ణుడే అనుకుని అట్టహాసం చేస్తూ, గట్టిగా బలం కొద్దీ తన్నాడు. నిద్రిస్తున్న ఆ పురుషుడు నెమ్మదిగా కళ్ళు తెరిచి కోపంతో కాలయవనుని చూశాడు. ఆయన కన్నులలో నుండి వచ్చిన భయంకరమైన అగ్ని ఆ కాలయవనుని కాల్చి బూడిదచేసింది. ఆ మహాపురుషుడు ఇక్ష్వాకు వంశస్థుడైన మాంధాత ముచుకుందుడు. అతడు శ్రీకృష్ణుని విష్ణువుగా గుర్తించి ముక్తిని ప్రసాదించమని ప్రార్థించాడు. అతని కోరిక తపస్సు చేయడం వలన తీరుతుందని చెప్పాడు శ్రీకృష్ణుడు.

ఇంతలో మళ్ళీ తనమీదకి వచ్చిన జరాసంధుని చూసి భయపడినట్టు నటించి రామకృష్ణులు ప్రస్రవణ పర్వతంపైకి ఎక్కారు. జరాసంధుడు ఆ కొండచుట్టూ మంటపెట్టించి, కొంతసేపైనాక వాళ్ళిద్దరూ ఆ మంటల్లో కాలిపోయే ఉంటారనుకుని తన నగరానికి తిరిగి వెళ్ళిపోయాడు. ఆ తరువాత బలరామ కృష్ణులిద్దరూకొండపై నుండి క్రిందకి దూకి ద్వారకకు వెళ్ళారు.

బ్రహ్మదేవుడు ఉపదేశాన్ని అనుసరించి రైవతుడనే రాజు తనకూతురైన "రేవతని" బలరామునికి ఇచ్చి పెళ్ళిచేశాడు. కుండిన నగరానికి రాజు భీష్మకుడు. అతనికి ఏడుగురు

కొడుకులు, ఒక కుమార్తె. కుమార్తె పేరు రుక్మిణి. ఈ రుక్మిణికి భీష్మకుడు వివాహం చెయ్యాలనుకున్నాడు. ఈమె పెద్దన్న రుక్మి ఈమెను తన స్నేహితుడైన శిశుపాలునికి ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. రుక్మిణి పెద్దల వలన శ్రీకృష్ణుని గుణగణాలను విని, రూపాన్ని తెలుసుకుని, బలపరాక్రమాలనూ విని అతడే తనకు తగిన భర్త అని మనసులో నిశ్చయించుకుంది. ఆమెను తండ్రి కూడా శ్రీకృష్ణునికే ఇవ్వాలనుకుంటున్నాడు. శ్రీకృష్ణుడు కూడా ఆమె సౌశీల్యాదులను తెలుసుకుని ఆమెనే చేపట్టాలని నిశ్చయించుకున్నాడు. కానీ ఆమె అన్న మాత్రం శ్రీకృష్ణునికిచ్చి చెయ్యడానికి ససేమిరా అంటున్నాడు. తండ్రిని ఎదిరించైనా రుక్మిణిని రుక్మి శిశుపాలునికే ఇవ్వాలనుకుంటున్నాడు.

శిశుపాలుని చేసుకోవడం ఇష్టంలేని రుక్మిణి అగ్నిద్యోతుడనే బ్రాహ్మణుని ద్వారా శ్రీకృష్ణునికి తమ మనోగతాన్ని చెప్పాలని నిశ్చయించుకుంది. ఆయనతో "శ్రీకృష్ణుని పట్ల ఆమె మనసు మొగ్గుతుందన్నదనీ, తనను రుక్మి బారిన పడకుండా చేపట్టమని, తన కోరిక తీర్చమనీ, వివాహానికి ముందు ఇలవేల్పు పూజకై ఊరి బయట ఉన్న ఆలయంలో అమ్మవారికి ఆరాధన పూర్తిచేసుకుని తిరిగి బయటకు రాగానే నన్ను అపహరించి తీసుకుపొమ్మనీ, ఒక వేళ అలా చెయ్యకపోతే నూరుజన్మల పాటైనా నిన్నే ధ్యానిస్తూ ప్రాణాలు విడిచిపెడతాననీ" శ్రీకృష్ణునికి సందేశం పంపించింది.

శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళిన అగ్నిద్యోతుడు రుక్మిణి పంపిన సందేశం వినిపించి, "ఆమె నీకు తగిన కన్య. నువ్వు ఆమెకు తగిన వరుడివి. మీ ఇరువురి వివాహం తప్పక జరుగుతుంది. కనుక ఆలస్యం చెయ్యకుండా సైన్యంతో వచ్చి, శత్రువులను సంహరించి, కన్యను వరించు" అని చెప్పాడు.

అగ్నిద్యోతుని మాటలు విన్న శ్రీకృష్ణుడు, ఆయనతో కలిసి, సైన్యాన్ని వెంటబెట్టుకుని, కుండిన నగరానికి వెళ్ళాడు. నగరంలో అప్పటికే పెండ్లి ఏర్పాట్లు జరిగాయి. శిశుపాల జరాసందులు, ఇతర రాజులందరూ కూడా వచ్చారు. భీష్మకుడు చేసిన మర్యాదలను స్వీకరించి, విడిది చేసి వున్నారు. అంతఃపురంలో రుక్మిణి శ్రీకృష్ణుని రాకకోసమే ఎదురుచూస్తూ, వస్తాడోరాడో అని ఆలోచిస్తూ, అన్న రుక్మి శిశుపాలుడికి కట్టబెడతాడేమో అని భయపడుతూ, తన అదృష్టం ఎట్లా ఉందో అని అనుకుంటూ, నిద్రాహారాలు మానేసి కిటికీ దగ్గర నిలబడ్డ మనిషి నిలబడినట్టే ఉండిపోయింది.

అంతలో రుక్మిణికి ఎడమకన్ను అదిరింది. ఇంతలో అగ్నిద్యోతనుడు ఆమె భవనంలోకి రావడం చూసి, ఎదురువెళ్ళింది. "నీ సందేశం విని సంతోషించిన శ్రీకృష్ణుడు నన్ను ఎంతగానో గౌరవించి, రాక్షసవివాహంతో నిన్ను తీసుకుపోవడానికి వచ్చాడమ్మా! నీ పుణ్యం ఫలించింది" అని

చెప్పాడు. వెంటనే రుక్మిణి ఇంతటి ఉపకారం చేసిన మీకు నేను మీకు ఏమి చెయ్యగలను? అని నమస్కరించి, సముచితమైన సత్కారాలుచేసి అగ్నిద్యోతనుని సంతోషపెట్టింది.

కుమార్తె వివాహానికి బలరామకృష్ణులు వచ్చారన్న వార్త విన్న భీష్మకుడు వాళ్ళకి ఎదరువెళ్ళి, విడిదిలో దింపి, సమస్త సౌకర్యాలనూ ఏర్పాటు చేయించాడు. రుక్మిణి పెండ్లికూతురై నగరం దగ్గరలోని భవానీ ఆలయానికి బయలుదేరింది. ఆమె శ్రీకృష్ణునినే ధ్యానిస్తూ భవానీమందిరానికి చేరుకుని, ఆలయంలోకి ప్రవేశించింది. జగదాంబను పూజించింది.

ఆ మహాదేవికి నమస్కరించి "ఈశ్వరీ! నేను నా మనసులో సనాతనులైన ఉమామహేశ్వరులైన మిమ్మల్నే నమ్ముకున్నాను గదమ్మా! నిత్యమూ మిమ్మల్నే పూజిస్తున్నాను గదమ్మా! నాకు శ్రీకృష్ణుడినే భర్తగా ప్రసాదించు తల్లీ! నిన్ను నమ్మిన వాళ్ళు ఎప్పటికీ వినాశమును పొందరుగదమ్మా!" అనుకుంది.

తరువాత బ్రాహ్మణస్త్రీలకు అనేక భక్ష్యాలూ, తాంబూలాలూ, కంఠసూత్రాలూ, చెరుకుగడలూ ఇచ్చి వారి ఆశీర్వాదాలు తీసుకుని, మరొకసారి భవానికి నమస్కరించి, ఆలయంలోనించి బయటికి వస్తోంది. అట్లా వస్తున్న రుక్మిణిని

చూసిన వివిధ దేశాల రాజులు తమ గాంభీర్యాన్ని మరిచిపోయి రుక్మిణినే చూస్తున్నారు.

రుక్మిణి మాత్రం శ్రీకృష్ణుని కోసం తన చూపులను సారిస్తూ నెమ్మదిగా నడుస్తోంది. ఇంతలో ఆమె కోరిక ఫలించినట్లుగా నిండు చందమామ వంటి పురుషసింహుని ముఖం కనిపించింది. అది శ్రీహరి ముఖార విందమే అని నిశ్చయించుకుని అక్కడే ఆగిపోయింది. నెమ్మదిగా ఆమె దగ్గరకు వచ్చి రుక్మిణి చెయ్యిపట్టుకుని రథమెక్కి కూర్చున్నాడు. సారథి రథాన్ని ముందుకు పోనిచ్చాడు. రథం అదృశ్యమయింది. రథం వెనుక జయజయ ధ్వానాలు చేస్తూ వెళ్తున్నారు యాదవవీరులు.

ఆ అరుపులకు కుండిన నగరానికి విచ్చేసిన వరులు, వీరులు స్పృహలోకి వచ్చారు. జరాసంధుడు శిశుపాలాదులందరినీ శ్రీకృష్ణని రథం వెనుక పరిగెత్తించాడు కోపంతో. యదువీరులూ వెనుతిరిగి శత్రువులను ఎదుర్కొంటున్నారు. ఇంతమంది ఒక్కసారిగా వస్తే శ్రీకృష్ణుడు వారిని ఎదిరించగలడా! అని సందేహిస్తోంది రుక్మిణి.

అది గమనించిన శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు. రుక్మిణిని వెనక్కి తేవాలని ప్రయత్నించిన రాకుమార, శిశుపాలాదుల ప్రయత్నాలు విఫలమైనాయి. విజయం

యాదవవీరుల వశమయ్యింది. తనకు దక్కాల్సిన రుక్మిణి శ్రీకృష్ణునికి దక్కిందని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు శిశుపాలుడు. మిగిలిన వారు అతడిని ఓదార్చారు. శ్రీకృష్ణుడు రుక్మిని చంపబోయి, రుక్మిణి ప్రార్థనపై గడ్డము, మీసాలు, తల సగంసగం గొరిగి వదిలేశాడు. ఎప్పటికైనా శ్రీకృష్ణుని జయిస్తే గానీ నగరంలోకి రానని ప్రతిజ్ఞ చేసి ఊరి బయటకెళ్ళిన రుక్మి బ్రతికినంతకాలం నగరానికి బయటే ఉండిపోయాడు.

శ్రీకృష్ణుడు రుక్మిణితో కలసి ద్వారకకు వెళ్ళి చక్కని శుభముహూర్తంలో మహావైభవంగా రుక్మిణిని వివాహం చేసుకున్నాడు.

**శ్రీమద్భాగతమునందలి పదవస్కందమునందలి**
**పూర్వభాగము పరిసమాప్తం.**

## పదవస్కందము - ఉత్తరభాగము

### శ్రీకృష్ణుడు లోకనిందను పోగొట్టుకొనుట - సత్యభామను వివాహమాడుట

పరీక్షిత్తు రుక్మిణీ కల్యాణం తరువాత జరిగన కథను చెప్పమని శుకమహర్షిని అడిగాడు.

ఈశ్వరుని కంటిమంటలో మాడిమసైపోయిన మన్మథుడే మళ్ళీ ఈశ్వరానుగ్రహాన్ని పొంది రుక్మిణీ శ్రీకృష్ణులకు కుమారుడై పుట్టాడు. అతడే ప్రద్యుమ్నుడు. ఇతని వల్లనే తనకు

మరణం వస్తుందని తెలిసిన శంబరుడనే రాక్షసుడు ఆ పిల్లవాడిని ఎత్తుకుపోయాడు. సముద్రంలో పారేసి ప్రశాంతంగా ఉన్నాడు. కానీ సముద్రంలో దొరికిన పిల్లవాడిని జాలరి వాళ్ళు శంబరునికే తెచ్చి ఇచ్చారు కానుకగా-

మన్మథుడి భార్య రతీదేవి జరిగింది తెలుసుకుని శంబరుని ఇంట సేవకురాలై జేరి, ప్రద్యుమ్నుని పెంచింది. ఈ మాయ తెలియలేదు శంబరునికి. రతీదేవి పెద్దవాడైన ప్రద్యుమ్నునికి అతని పూర్వగాథ చెప్పి, అతనిని శత్రువుల బారి నుండి రక్షించి, మహామాయా విద్యను ఉపదేశించింది. ఆ విద్యాప్రభావంతో (మన్మథుడు) ప్రద్యుమ్నుడు శంబరుని యుద్ధానికి కవ్వించి మరీ చంపాడు. తరువాత రతీప్రద్యుమ్నులు రుక్మిణీ కృష్ణుల వద్దకు వెళ్ళారు. రుక్మిణి రతీదేవి పాతివ్రత్యాన్ని మెచ్చుకుని కుమారుని కంటే ఎక్కువగా కోడలిని ముద్దు చేసింది.

ద్వారకలో సత్రాజిత్తు అనే సూర్యభక్తుడు చాలాకాలం సూర్యారాధన చేసి, ఆయన అనుగ్రహంతో ఒక దివ్యమైన మణిని సంపాదించాడు. ఆ మణిపేరు శమంతకము. ఆ శమంతకమణి రోజుకి ఎనిమిది బారువుల బంగారాన్ని ఇస్తుంది. ఆ మణిని ఉగ్రసేన మహారాజుకి ఇవ్వమన్నాడు

శ్రీకృష్ణుడు సత్రాజిత్తుతో. కానీ సత్రాజిత్తు అందుకు ఒప్పుకోలేదు. కొంతకాలానికి సత్రాజిత్తు తమ్ముడు ఆ శమంతకమణిని మెడలో వేసుకుని అడవికి వెళ్ళి, సింహం నోటికి చిక్కి, మరణించాడు. కానీ సత్రాజిత్తు మాత్రం ఆ మణి కోసం శ్రీకృష్ణుడే తన తమ్ముని చంపి, ఆ మణిని తీసుకున్నాడని నిందవేశాడు.

వెలిగిపోతున్న ఆ మణిని సింహం మాంసం ముద్ద అనుకుని తీసుకుపోతోంది. అది చూసిన జాంబవంతుడు సింహాన్ని చంపి, ఆ మణిని తీసుకువెళ్ళి తన కుమార్తెకు బంతిలాగా ఆడుకోవడానికి ఇచ్చాడు. తరువాత విషయం గ్రహించిన శ్రీకృష్ణుడు మణిని వెతుకుతూ, జాంబవంతుని వద్దకు వెళ్ళి, అతడితో యుద్ధం చేసి, గతజన్మలో అతని కోరికను తీర్చాడు.

జాంబవంతుడు యుద్ధంలో ఓడిపోయి, మణినీ మణితోపాటు తన కన్య జాంబవంతిని కూడా శ్రీకృష్ణుడు ఇచ్చాడు. శ్రీకృష్ణుడు ఆ మణిని తీసుకెళ్ళి సత్రాజిత్తుకి ఇచ్చి జరిగినదంతా చెప్పి, తనపై పడిన నిందను పోగొట్టుకున్నాడు. సత్రాజిత్తు శ్రీకృష్ణుని క్షమించమని అడిగి, తన కుమార్తె సత్యభామను ఇచ్చి వివాహం చేసి, మణిని కూడా శ్రీకృష్ణునికే ఇచ్చాడు.

## శ్రీకృష్ణుడు మిత్రవిందాదులను వివాహమాడుట - నరకాసురుని సంహరించుట

తరువాత శ్రీకృష్ణుడు పాండవులును చూడడానికి ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి, వారి కోరికమేరకు అక్కడే కొన్ని నెలలపాటు కాలం గడిపాడు. అక్కడ అర్జునునితో వనవిహారానికి వచ్చి కాళిందిని చూసి, ఆమెను ద్వారకకు తీసుకెళ్ళి అక్కడ ఆమెను వివాహం చేసుకున్నాడు. తరువాత అవంతిక చేరుకుని మిత్రవిందను రాక్షసపద్ధతలో పరిణయం చేసుకున్నాడు. తరువాత కోసలదేశానికి వెళ్ళి, నగ్నజిత్తు ప్రతిజ్ఞ నెరవేర్చి, నాగ్నజితిని చేపట్టాడు. తరువాత భద్రా, లక్షణా అనేవాళ్ళనూ పరిణయం చేసుకున్నాడు పరంధాముడైన శ్రీకృష్ణుడు.

ఆ తరువాత శ్రీహరికీ, భూదేవికీ పుట్టి లోకాలన్నింటినీ పీడిస్తున్న నరకుడు అనే రాక్షసుని సత్యభామతో కలిసి సంహరించాడు.

## ఉషా, అనిరుద్ధుల వివాహము - నృగమహారాజు కథ

ప్రహ్లాదుడి మనుమడైన బలికి వందమంది కుమారులు. వాళ్ళలో పెద్దవాడు బాణుడు. వెయ్యి చేతులు గల ఆ బాణుడు తపస్సు చేసి ఈశ్వరానుగ్రహం పొంది, అతడి రాజధాని అయిన శోణపురానికి మహాదేవుని ద్వారాపాలకుని

చేసుకున్నాడు. ఈశ్వరానుగ్రహాన్ని పొంది, అతడి రాజధాని అయిన శోణపురానికి మహాదేవుని ద్వారపాలకుని చేసుకున్నాడు. కుమారస్వామి మొదలైన వాళ్ళు కూడా ఈశ్వరునితో పాటు బాణాసురుని కోటకి కాపలా కాస్తున్నారు. తన భుజబలగర్వంతో విర్రవీగుతున్న బాణునికు రనభిక్షపెట్టమని మహాదేవుడినే కోరుకున్నాడు. అప్పుడు పరమేశ్వరుడు కోపంతో "కొద్దికాలంలోనే నీ రథం మీద జెండా ఏ కారణం లేకుండానే నేలమీద పడుతుంది. అప్పుడు నా అంతటి వాడితో నీకు యుద్ధం వస్తుందిలే" అన్నాడు.

ఈ బాణాసురుడికి ఉష అనే పేరుగల, అత్యంత సౌందర్యవతి అయిన కుమార్తె ఉంది. ఆమె ఒకనాటి కలలో సౌందర్యసామ్రాట్టు అయిన పురుషునితో క్రీడించినట్లు కలగన్నది. మెలుకువ వచ్చినప్పటి నుండి మనసులో ఆ పరుషుడినే తలచుకుంటూ తపిస్తూ, కాలం గడుపుతోంది. ఉష తన స్నేహితురాలైన చిత్రరేఖ చేత తన కలలోని పురుషుని విషయాన్ని సేకరించింది. చిత్రరేఖ ద్వారా ఆమె యోగశక్తి సహాయంతో తన ప్రియుడిని తన దగ్గరకు తెప్పించుకుంది. అతడు వచ్చిన నాటి నుండి ఇద్దరూ ప్రపంచంతో సంబంధం లేనివాళ్ళలాగా కాలం గడుపుతున్నారు. కొంతకాలానికి ఉష గర్భవతి అయ్యింది.

భటుల ద్వారా విషయం తెలుసుకున్న బాణుడు కోపంతో కత్తి పట్టుకుని కుమార్తె భవనానికి వెళ్ళి, అక్కడ అనిరుద్ధుని చూసి, అతడిని బంధించి చెరసాలలో పడేశాడు. అంతలోనే బాణాసురుని రథంపైన్ను జెండా తెగి క్రిందపడింది. ఉష అనిరుద్ధుని బంధవిముక్తుడిని చేయించమని తన ఇష్టదైవాలను ప్రార్థిస్తోంది. శ్రీకృష్ణుడు మొదలైన వారంతా నాలుగు నెలలుగా కనపడని అనిరుద్ధుని కోసం దుఃఖిస్తూన్నారు.

నారదుడు వచ్చి శ్రీకృష్ణునితో అనిరుద్ధుని కథ అంతా చెప్పాడు. వెంటనే శ్రీకృష్ణుడు బాణాసురుడి మీదకి దండెత్తాడు. భక్తవత్సలుడైన పరమేశివుడు బాణుని రక్షించాలనుకుని ప్రమథగణాలతో బయలుదేరి బాణుని రథానికి ముందుండి శ్రీకృష్ణుని ఎదుర్కున్నాడు. ఈశ్వరుడే తమవైపు ఉన్నాడుగదా మనకే విజయం లభిస్తుందని రాక్షసులూ, బలరామకృష్ణులు మనవైపుండగా విజయం మననే వరిస్తుందని యాదవులూ వీరవిహారం చేశారు.

శ్రీకృష్ణుని ధాటికి తట్టుకోలేక బాణుడు తల్లి ఆలోచనతో, శ్రీకృష్ణుని ముఖం పక్కకు తిప్పుకునేట్లుగా చేసి, ఆ సమయంలో పారిపోయి నగరంలో దాక్కున్నాడు. శివకేశవులిద్దరూ రాక్షస యాదవ సైన్యాల మీదకి శివ, విష్ణుజ్వరాలను

పంపించుకున్నారు. కానీ విష్ణు జ్వరమే గెలిచింది. శివజ్వరం విష్ణువుకి నమస్కరించి వెనక్కి వెళ్ళిపోయింది.

కొంతకాలానికి బాణుడు మళ్ళీ సైన్యాన్ని సమకూర్చుకుని, శ్రీకృష్ణుని ఎట్లాగైనా గెలవాలనే కోరికతో రెండవసారి శ్రీకృష్ణునిపై యుద్ధానికి వచ్చాడు. శ్రీకృష్ణుడు అతడికి నాలుగుచేతులను మాత్రమే మిగిల్చి, మిగిలిన వాటిని నరికేశాడు. ఇంతలో బాణుని రక్షించాలనుకుని పరమశివుడు అక్కడికి వచ్చి, పురుష సూక్తంతో శ్రీకృష్ణుని స్తోత్రం చేశాడు. శివుడు చేసిన స్తోత్రానికి సంతోషించిన కృష్ణుడు బాణుని క్షమించాడు. బాణుని క్షమించినందుకు పరమశివుడు సంతోషించాడు.

బాణుడు కూడా హరిహరులిద్దరికీ నమస్కరించి, తన పట్టణంలోకి వెళ్ళి ఉషాసుందరినీ, అనిరుద్ధునీ తెచ్చి శ్రీకృష్ణునికి అప్పగించాడు. శ్రీకృష్ణుడు బాణుని ఆశీర్వదించి, వధూవరులతో కలిసి ద్వారకకు తిరిగి వెళ్ళాడు. ఈ శ్రీకృష్ణుని విజయగాథను చదివిన వారికి ఎప్పుడూ విజయాలే వరిస్తాయి. ఇహపర సౌఖ్యాలను రెండింటినీ అనుభవిస్తారు.

ఒకసారి యదుకుమారులు అడవిలో తిరుగుతూ, ఒక నూతిలో కొండచిలువలాగా పెద్దగా ఉన్న ఊసరవెల్లిని చూసి,

ఆ విషయాన్ని శ్రీకృష్ణునికి చెప్పారు. దాన్ని చూడడానికి వాసుదేవుడు వాళ్ళతో పాటు ఆ నూతి వద్దకు వెళ్ళాడు. నూతిలోనుంచి ఆ ఊసరవెల్లిని గడ్డిపరకను తీసినట్టుగా పైకి తీసి, ఏమీ తెలియని వాడిలాగా "నువ్వు ఎందుకు ఇట్లా ఈ నూతిలో పడి వున్నావని" అడిగాడు.

అప్పుడు ఆ ఊసరవెల్లి తాను గతజన్మలో ఇక్ష్వాకు కుమారుడనైన నృగుడిననీ, తాను ఎన్నో గోదానాలు చేశాననీ, అట్లా ఒక బ్రాహ్మణునికి ఇచ్చిన గోవులలో గోవు నా మందలో కలిస్తే, ఆ గోవు నాదే అనుకుని ఆ గోవుని మరొకరికి దానమిచ్చాననీ, తరువాత నా దగ్గర దానం తీసుకున్న బ్రాహ్మణుడు ఆ గోవును గుర్తించాడనీ, ఆ బ్రాహ్మణులిద్దరూ తగాదా తీర్చమని నా దగ్గరకే రాగా, రెండవ బ్రాహ్మణుని ఆ గోవును మొదటి బ్రాహ్మణునికే ఇవ్వమని బ్రతిమిలాడానీ, అతడు అంగీకరించలేదనీ తరువాత తాను మరణించి యమలోకానికి వెళ్ళాననీ, యముడు "ఒకరికి దానమిచ్చిన దానినే మళ్ళీ మరొకరికి దానం ఇవ్వడం వలన నువ్వు కొంతకాలం భూలోకంలో ఉండిరావాల్సిందే అంటూ క్రిందకి తోయించాడనీ, అందుకనే ఊసరవెల్లిలాగా ఈ పాడు నూతిలోపడి ఉండాల్సి వచ్చిందనీ" తన కథ అంతా శ్రీకృష్ణునికి చెప్పుకున్నాడు.

తరువాత శ్రీకృష్ణుడు నేను వాసుదేవుడినని విర్రవీగుతున్న పౌండ్రక వాసుదేవుని సంహరించాడు. ఆ పైన నరకాసురుని స్నేహితుడైన ద్వివిదుడనే వాడిని బలరాముడు సంహరించాడు. శ్రీకృష్ణుడు కౌరవుల చెరలో ఉన్న జాంబవతీ తనయుని విడిపించుకు రావడానికి హస్తినాపురానికి వెళ్ళాలనుకున్నాడు. కానీ బలరాము సామంతో సాధించుకుని వస్తానని హస్తినకు వెళ్ళాడు.

దుర్యోధనుడు గురువైన బలరాముని రాకకు సంతోషించి, సత్కరించి, ఆయన ఆశీర్వచనాన్ని పొందాడు. బలరాముడు "ఉగ్రసేనుని ఆజ్ఞ ప్రకారం సాంబుని విడిచిపెట్టమని" అడిగాడు. దుర్యోధనుడు బలరాముని కోరికని తిరస్కరించాడు. అందుకని దుర్యోధనునిపై కోపగించిన బలరాముడు తన నాగలి కొసని హస్తినాపురానికి గుచ్చి, ఒక గడ్డలాగా పైకి తీసి, గంగానదిలో పడేయబోయాడు. విషయం గ్రహించిన భీష్మాదుల లక్షణనూ, సాంబుడినీ పెండ్లివేషాలతో అలంకరించి తెచ్చి బలరామునికి అప్పగించారు.

ఈ ఉపద్రవాన్ని ఆపి రక్షించమని బలరాముని ప్రార్థించారు. వారితో పాటు దుర్యోధనుడూ శిరస్సు వంచి

ప్రార్థించేసరికి శాంతించిన బలరాముడు లక్షణాసాంబులను తీసుకుని ద్వారకకు వెళ్ళి తమ్మునికి సంతోషం కలిగించాడు. అందుకే ఇప్పటికీ హస్తినాపురం దక్షిణభాగం పైకి లేచి, ఉత్తర భాగం గంగవైపుకి ఒరిగి ఉండి భగవంతుని మహిమను మనకు చూపిస్తుంటుంది.

## శ్రీకృష్ణుడు శిశుపాలుని వధించుట - దంతవక్త్రుని సంహరించుట

తరువాత ఒకరోజు నారదుడు నరకుని చెర నుండి విడిపించిన పదహారువేలమంది రాజకన్యలతో పదహారువేల రూపాలతో శ్రీకృష్ణుడు ఒక్కసారిగా వివాహం చేసుకున్న విషయం విని, ఆ వైభవాన్ని చూడడానికి ద్వారకకు వచ్చి, పదహారువేల భవనాలకూ వెళ్ళి అంతమంది కృష్ణులనూ చూసి, ఆశ్చర్యపోయి, శ్రీకృష్ణుని మహిమను అనేక విధాలుగా పొగిడి, తన దారిన తాను వెళ్ళిపోయాడు.

జరాసంధుడు పెట్టే బాధలు పడలేక రాజులందరూ ఓ బ్రాహ్మణుని ద్వారా తమను జరాసంధుడి బారి నుండి విముక్తిని కలిగించమని శ్రీకృష్ణునికి సందేశం పంపించారు. శ్రీకృష్ణుడు ఆ సందేశం వినడం పూర్తయ్యేసరికి నారదుడు వచ్చి, ధర్మరాజు రాజసూయ యాగం చేస్తున్నాడనీ, ఆ

యాగాన్ని రక్షించి, ఆ యాగం చూడడానికి వచ్చిన వారికి నీ దర్శన భాగ్యం కలిగించమనీ ప్రార్థించాడు.

శ్రీకృష్ణుడు సందేశం తెచ్చిన బ్రాహ్మణునికి అభయమిచ్చి పంపించి, తాను ఇంద్రప్రస్థపురానికి వెళ్ళాడు. పాండవులు శ్రీకృష్ణుని రాక రాజసూయం నిర్విఘ్నంగా సాగుతుంది అనడానికి సూచనగా భావించి సంతోషించారు. రెట్టింపు ఉత్సాహంతో భీమార్జున నకుల సహదేవులు కొద్దికాలంలోనే జైత్రయాత్ర ముగించుకుని తిరిగి వచ్చారు. ఒక్క జరాసంధుడు తప్ప తక్కిన వాళ్ళంతా కప్పం చెల్లించి కానుకలు సమర్పించారు. జరాసంధుని సాధించే బాధ్యత తన మీద వేసుకుంటున్నానని శ్రీకృష్ణుడు ధర్మనందనునికి మాట ఇచ్చాడు.

ఆ మరునాడే బ్రాహ్మణవేషాలు ధరించిన భీమార్జునులు, శ్రీకృష్ణుడు గిరివ్రజపురానికి బయలుదేరారు. భీముడు శ్రీకృష్ణుని కనుసైగలను, చేష్టలను గమనించి, జరాసంధుని పాదం నుండి తలవరకూ రెండుగా చీల్చి సింహనాదం చేశాడు. తరువాత శ్రీకృష్ణుడు చెరసాలలో బందీలుగా ఉన్న రాజులందరినీ విడిపించాడు. అందరూ కలిసి జరాసంధుని కుమారునికి పట్టాభిషేకం చేశారు. అతడు సమర్పించిన

కానుకలను స్వీకరించి శ్రీకృష్ణభీమార్జునులు ఇంద్రప్రస్థపురానికి తిరిగివచ్చారు.

శ్రీకృష్ణుని అనుమతితో ధర్మజుడు రాజసూయం మొదలుపెట్టాడు. అందులో అగ్రపూజ శ్రీకృష్ణునకు చెయ్యాలని సంకల్పించాడు. అనుకున్న ప్రకారంగా శ్రీకృష్ణునికే అగ్రపూజ చేసి కృతార్థుడయ్యాడు. కానీ శిశుపాలుడు కృష్ణునిపై ద్వేషంతో అగ్రపూజ అందుకున్న శ్రీకృష్ణుని, అతనికే చెయ్యాలన్న ఇతరులందరినీ నోటికి వచ్చినట్టు నిందించి, వాళ్ళతో తగాదాకి సిద్ధపడ్డాడు. శ్రీకృష్ణునితో యుద్ధమెందుకని ఎందరడ్డగించినా ఆగలేదు. వంద తప్పులు పూర్తి అవడంతో చివరకు శ్రీకృష్ణుడు తన చక్రాన్ని ప్రయోగించి శిశుపాలుడిని సంహరించాడు.

## బలరాముని తీర్థయాత్ర -పల్వలాసురుని అంతిమయాత్ర

ఇంతలో రుక్మిణీ కల్యాణ సమయంలో పరాభవాన్ని పొందిన సాల్వరాజు ద్వారకపై దండెత్తాడు. ఎన్నో మాయలు చేసిన సాల్వుని శ్రీకృష్ణుడు మహర్షుల ఉపదేశంతో కౌమోదికిని ప్రయోగించి, తన చక్రంతో తలనరికి చంపాడు. తన స్నేహితుడైన శిశుపాలుని చంపాడన్న కోపంతో శ్రీకృష్ణునిపై పగ తీర్చుకోబోయాడు దంతవక్త్రుడు. శ్రీకృష్ణుడు అతడిని

తన గదతో మోది మట్టుపెట్టాడు. దంతవక్త్రుని తమ్ముడు విధూరథుడు కూడా శ్రీకృష్ణునితో పోరాడి అన్న దగ్గరకే వెళ్ళాడు.

ఆ తరువాత కొంతకాలానికి కౌరవపాండవులకు యుద్ధం తప్పదన్న విషయం తెలిసింది బలరాముడికి. ఆ విషయాన్ని సహించలేక బలరాముడు తీర్థయాత్రలు చేస్తానంటూ ద్వారకను వదలిపెట్టి వెళ్ళిపోయాడు. నైమిశారణ్యం చేరుకున్నాడు. శౌనకాదులంతా ఆసనాల నుండి లేచి బలరాముని గౌరవించాడు. సూతమహర్షి మాత్రం లేవలేదు. కోపంతో ఒక దర్భకొసతో సూతమహర్షి తలనరికాడు బలరాముడు.

"లోకమర్యాదననుసరించి బ్రహ్మస్థానంలో ఉన్న వ్యక్తి లేవకూడదు కదా! ఆ విషయాన్ని ధర్మపాలకుడవైన నువ్వే ఉల్లంఘిస్తే ఎలా?" అని శౌనకాదులు బలరాముని ప్రార్థించారు. అప్పుడు సూతుడిని మళ్ళీ బ్రతికించాడు బలరాముడు.

ఆ తరువాత ఋషుల ప్రార్థనమేరకు నాగలితో పల్వలాసురుని మెడని పట్టి ఉంచి, రోకలితో అతని తలను ముక్కలు చేసి, ఋషులు మన్ననలను స్వీకరించి ప్రభాస

తీర్థానికి చేరుకున్నాడు. కురుపాండవ యుద్ధంలో జననష్టం అధికంగా జరిగిందని విని, ఇప్పటికైనా యుద్ధం మానమని ఎంత చెప్పిన కురుపాండవులు ఆ బలరాముని మాటను పెడచెవినే పెట్టారు. 'జరగవలసి ఉన్నది జరగక మానదు కదా!' అనుకుంటూ ద్వారకకు తిరిగి వెళ్ళి బంధుమిత్రులకు ఆనందం కలిగించాడు.

## కుచేలుడు శ్రీకృష్ణుని అనుగ్రహమును పొందుట - శ్రీకృష్ణుడు అన్నలను తల్లిదండ్రులకు చూపుట

పరీక్షిత్తు 'సంసార చింతలను విడిచి హరిపద చింతనాసక్తుడైన ఒక హరిభక్తుని కథను చెప్పమని' శుకమహర్షిని అడిగాడు. శుకమహర్షి ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

"రాజా! హరి భక్తులలో అగ్రగణ్యుడు శ్రీకృష్ణుని బాల్యమిత్రుడైన కుచేలుడు. అతడు పరమ దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నా హరిపాదపద్మచింతనమును మాత్రం వదలలేదు. అతని భార్య వామాక్షి పరమపతివ్రత. పిల్లల ఆకలి బాధ చూడలేక వామాక్షి ఒక రోజు "మీ బాల్య స్నేహితుడైన శ్రీకృష్ణుని చూసి రండి.. అప్పుడైనా ఈ పేదరికం తీరిపోతుందేమో" అన్నది భర్తతో.

కుచేలుడికి భార్య చెప్పిన మాటలు నచ్చాయి. ఆ శ్రీహరి పాదాలు చూడడం అంటే ఇహపరముక్తి లభించినట్లే అనుకున్నాడు. తప్పక వెళ్ళాలని నిశ్చయించుకుని, అటుకులు తీసుకుని శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళాడు. శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటాడో అనుకుంటూ అన్ని భవనాలనూ పరికించి చూస్తూ వస్తున్న కుచేలుని తన భవనంలోంచే చూశాడు కృష్ణుడు.

వెంటనే ఎదురువెళ్ళి, స్వాగతం పలికి, లోపలకి తీసుకువచ్చి, తన పడక మీద కూర్చోబెట్టి, రుక్మిణీ సమేతుడై కుచేలుని కాళ్ళు కడిగి, ఆ నీటిని తన శిరస్సుపై చల్లుకుని, కుచేలుని శరీరానికి గంధం పూసి, తాటాకు విసనకర్రలతో అతనికి చల్లని గాలి వచ్చేట్లు విసిరి, మణుల దీపాలతో నీరాజనాలిచ్చి, పూలదండలు సమర్పించి, ఆదరంతో సత్కరించాడు. శ్రీకృష్ణుని స్పర్శతో కుచేలుడు తనను తానే మరచిపోయాడు. శ్రీకృష్ణుడి అంతఃపుర కాంతలంతా కుచేలుని అదృష్టానికి ఆశ్చర్యపోయారు.

ఇంతలో నాకు తినడానికి ఏమైనా తెచ్చావా? అంటూ తానే కుచేలుని వద్ద నుండి అటుకులను తీసుకుని తిన్నాడు. ఆ క్షణంలోనే అతడి దారిద్ర్యాన్ని అతడికి తెలియకుండానే తొలగించాడు. మరునాడు తిరిగి బయలుదేరుతున్న కుచేలుని

శ్రీకృష్ణుడు ప్రియమార కౌగిలించుకున్నాడు. తన పేదరికం పోగొట్టడానికి ధనమేమీ ఇవ్వలేదు శ్రీకృష్ణుడు.. అయినా దరిద్రుడు ధనవంతుడైతే గర్వంతో తనను మర్చిపోతాడు అనుకుని ఇవ్వలేదేమో అనుకున్నాడు.

ఆ పరమాత్మనే తలచుకుంటూ పరమసంతృప్తితో తన పల్లెకు వెళ్ళాడు. తన గుడిశె, భార్య పిల్లలు ఎవరూ ఎక్కడా కనిపించలేదు. ఆ ప్రదేశంలో పెద్ద భవనం ఉన్నది. అంతలో అక్కడికి వచ్చిన భార్య అతడి వద్దకు వచ్చి.... అక్కడ ఉన్న భవనంలోకి తీసుకువెళ్ళి సమస్తఉపచారాలు చేసింది... అది చూసి "ఇదంతా ఆ శ్రీకృష్ణ పరమాత్ముని అనుగ్రహమే కదా!" అని అనుకున్నాడు. ఆ భోగభాగ్యాల మీద ఏమాత్రం అభిమానం పెంచుకోకుండా హరిభక్తితో కాలం గడిపి, శ్రీహరిని స్మరిస్తూ సంసారబంధం నుండి విముక్తుడై హరిసన్నిధికి చేరుకున్నాడు.

ఆ తరువాత శ్రీకృష్ణుడు బంధువులందరితో కలిసి ఒకనాటి సూర్యగ్రహణ సమయంలో శమంతపంచకంలో స్నానానికి వెళ్ళాడు. అదే సమయంలో మద్రరాజపుత్రి లక్షణ ద్రౌపదికి తన వివాహ వృత్తాంతం అంతా చెప్పింది. ఆ తరువాత నారదాది మహర్షులు శ్రీకృష్ణుని చూడడానికి వచ్చి

వసుదేవునితో దేవఋణం తీర్చుకోడానికి క్రతువు చెయ్యమని ప్రోత్సహించి, అతని చేత క్రతువు చేయించారు.

ఆ తరువాత తల్లిదండ్రుల కోరిక మేరకు బలరామకృష్ణులు తన అన్నలైన ఆరుగురిని తెచ్చి వారికి చూపించారు. ఆపైన కపటయతిగా అర్జునుడు తీర్థానికి చేరుకుని, అక్కడ నుండి ద్వారకకు వెళ్ళి శ్రీకృష్ణుని సహాయంతో సుభద్రను చేపట్టాడు. అడ్డు వచ్చిన యాదవ వీరులని జయించి సుభద్రతోకలిసి ఇంద్రప్రస్థానికి చేరాడు.

శుకమహర్షిని "వస్తువులను నిర్దేశించి చెప్పడానికి కుదిరినట్లుగా కుదరని భగవత్స్వరూపాన్ని వేదాలు ఎలా వర్ణించి చెప్పాయో నాకు వివరించమని" అడిగాడు పరీక్షిత్తు. శుకుడు ఆ భగవత్సరూపాన్ని ఈ విధంగా వివరించడం మొదలుపెట్టాడు.

''భగవంతునికి ఏ గుణాలూ లేవు. కానీ గుణములతోకూడిన చరాచరాలన్నింటిలోనూ అంతర్యామిగా ఉండి, చైతన్యం కలిగిన వాటికి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఈ విధంగా పరమాత్మ అనేక రూపాలతో....అనగా అనేక గుణాలతో రకరకాల నగల రూపంలో ఉన్నది అంతా బంగారమే. కానీ దాన్ని బంగారం అనకుండా నగ పేరుతో

ఎట్లా పిలుస్తున్నామో, కుండ, మూకుడు, పిడత మొదలైన రూపాలతో వేరు వేరుగా కనిపిస్తున్నా అన్నిట్లో ఉన్నది మట్టి ఎట్లాగో.. ఈ సృష్టి రూపంలో అన్ని వస్తువులుగా, అన్నింటిలో, అన్ని చోట్లా వ్యాపించి ఉండి, ఆయా రూపాలలో ప్రకాశిస్తూ, వాటికి ప్రకాశాన్ని ఇస్తున్నది ఆ భగవంతుడే. ఉన్నదంతా ఆయనే అయినా తన యోగమాయతో అన్ని రూపాలనూ అన్నింటినీ సృష్టిస్తుంటాడు. ఈ విషయాన్ని గ్రహించి, శ్రద్ధతో జీవితంలో అన్వయం చేసుకునేవాడు మోక్షాన్ని సులభంగా పొందుతాడు.

## విష్ణుమాయతో వృకుడు నశించడం - శ్రీకృష్ణుడు విప్రసూతులను తీసకురావడం

శుకాసురుని కుమారుడు వృకాసురుడు. ఈ వృకాసురుడు శివుడు తొందరగా వరాలిస్తాడని తెలుసుకుని, శివుడి గురించి తపస్సు చేసి, చివరికి గండ్రగొడ్డలితో తన తలనే శివుడికి సమర్పించబోయాడు. అంతలోనే భక్తవత్సలుడైన పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు వృకాసురుడిని. వెంటనే వృకాసురుడు “నేను ఎవరి తలపై చెయ్యిపెడితే వాడి తల వెయ్యి ముక్కలయ్యేట్లుగా వరం ఇవ్వమని” అడిగాడు.

అతడు అడిగిన వరమిచ్చి, అదృశ్యమవుదామను కున్నాడు శివుడు. కానీ శివుడు ఇచ్చిన వరం నిజం అవుతుందో లేదో చూడాలనుకున్నాడు వృకాసురుడు. అందుకని శివుడి తలమీదే తన చేతిని పెట్టాలని చేయి చాపాడు. వరమిచ్చిన పరమేశ్వరుడు అతని ఉద్దేశ్యం గమనించి పరుగులు తీశాడు. అలా పరిగెడుతున్న శివుడు వైకుంఠానికి వెళ్ళాడు. శివుడి పరుగులు చూసి విష్ణువు దివ్యజ్ఞానంతో జరిగింది తెలుసుకుని, శివుడిని వెంబడిస్తూ పరుగులు తీస్తున్న వృకాసురుడి ఎదుట బాలబ్రహ్మచారిగా నిలబడి, అతడిని ఆపి, తన మాయతో స్నానానికి దిగిన వృకాసురుని చేతులు అతని తల మీదనే పెట్టించాడు.

అతడి తల వెయ్యి ముక్కలైంది. కానీ అతడు అడిగిన వరం ఫలించిందని తెలుసుకోవడానికి అతడే లేకుండా పోయాడు. 'ఇతరులకు చెయ్యాలనుకున్న హాని ఎదురు తిరిగి హాని చెయ్యాలనుకున్న వారికే తగులుతుంది' అనే విషయాన్ని ఈ కథ ద్వారా మనం గ్రహించాల్సిన ప్రధానమైన విషయం.

ఒకప్పుడు సరస్వతీనదీ తీరంలో యాగం చేస్తున్న మహర్షులకు "త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో ఎవరు గొప్ప" అన్న సందేహం వచ్చింది. "మీకు వచ్చిన సందేహాన్ని తీర్చడానికి ముగ్గురిలో ఎవరు గొప్పో తేల్చుకుని వస్తాను" అని చెప్పి బయలుదేరాడు భృగువు.

మొట్టమొదట భృగుమహర్షి బ్రహ్మలోకానికి వెళ్ళి బ్రహ్మదేవుడికి నమస్కరించకుండా నిలబడ్డాడు. తనకు నమస్కరించనందుకు బ్రహ్మదేవుడు భృగు మహర్షిని కోపగించుకున్నాడు. ఆ క్షణమే అక్కడ నుండి బయలుదేరి కైలాసానికి చేరుకున్నాడు భృగువు. శివుడు భృగువుని గౌరవించినా శివుని కంటే తానే గొప్ప అన్నట్లుగా శివుడిని భృగువు గౌరవించలేదు.

రుద్రుడు భృగునిపై కోపగించి శూలం ఎత్తాడు. వెంటనే భృగువు వైకుంఠానికి వెళ్ళాడు. ఆ సమయానికి శ్రీమహావిష్ణువు శేషపాన్పుపై శ్రీమహాలక్ష్మితో వినోదిస్తున్నాడు. అది చూసి భృగువు కోపంతో విష్ణువు యొక్క హృదయం మీద తన్నాడు. వెంటనే విష్ణువు లేచి, మహర్షికి నమస్కరించి, "పరాకులో మీ రాకను గమనించలేదు. కనుక నన్ను మన్నించమంటూ" ప్రియ వచనాలతో గౌరవించాడు. వెంటనే భృగువు తన రాకకు గల కారణాన్నీ, తానలా చెయ్యడానికి గల కారణాన్నీ కూడా వివరించి, విష్ణుమూర్తిని స్తోత్రం చేసి, సరస్వతీ నదీ తీరానికి వెళ్ళి ముగ్గురిలోకీ అధికుడు శ్రీమహావిష్ణువే" అని చాటి చెప్పాడు.

ద్వారకలో ఒకప్పుడు ఒక బ్రాహ్మణుని కుమారుడు పుట్టిన వెంటనే మరణించాడు. వెంటనే ఆ బ్రాహ్మణుడు ఆ పిల్లవాని శరీరాన్ని తెచ్చి రాజద్వారం ముందు పెట్టి "దేశంలో

అకాలమరణానికి కారణం రాజు చేసిన దోషమే" అని ప్రజలందరూ వినేట్లుగా చెప్పి రాజుని నిందించబోయాడు.

ఈ విధంగా ఎనిమిదిసార్లు చేశాడు. అయినా అతని గోడు ఎవరూ పట్టించుకోలేదు. తొమ్మిదవసారి కూడా అట్లాగే జరగడంతో అతడు అలాగే రాజద్వారం ముందు విలపిస్తున్నాడు. అది చూసి అర్జునుడు ఆ బ్రాహ్మణునితో "నీ కుమారుని నేను బ్రతికిస్తాను. లేకపోతే అగ్నిలోకి దూకుతాను" అని ప్రతిజ్ఞ చేశాడు.

పదవసారి పురిటి సమయానికే బ్రాహ్మణుడు అర్జునుని తన ఇంటిలో పెట్టుకున్నాడు. అర్జునుడు కాపలా కాస్తున్నాడు. అయినా ఆ పిల్లవాడు పుట్టిన వెంటనే మరణించాడు. ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కానీ అర్జునుడు మాట నిలబెట్టుకోలేకపోయాడు.

బ్రాహ్మణుడు తన పిల్లవాడిని తెచ్చి కృష్ణ పరమాత్మ ముందుంచి "ఎవరో అర్జునుడనే గర్విష్ఠి నా పిల్లవాడిని రక్షిస్తానని డంబాలు పలికాడు. కానీ రక్షించలేకపోయాడు" అని చెప్పాడు. అది విన్న అర్జునుడు రోషంతో అగ్నిలోకి దూకబోయాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునునితో "నీకు ఆ పిల్లలను చూపిస్తానని చెప్పి" వైకుంఠానికి తీసుకెళ్ళాడు. అక్కడ శేషశయనుడైన ఆదినారాయణుడు కృష్ణార్జునులను చక్కగా ఆదరించి వారితో "మీరిద్దరూ నా అంశతో పుట్టిన

నరనారాయణులు. మిమ్మల్ని చూడాలనే కోరికతోనే నేనే ఆ పిల్లలను కారణంగా చేసి మిమ్మల్ని ఇక్కడికి రప్పించాను” అని చెప్పి ఆ పదిమంది కుమారులనూ నరనారాయణులనైన కృష్ణార్జునులకు అప్పగించాడు. వాళ్ళు ఆ పిల్లలను తెచ్చి బ్రాహ్మణ దంపతులకు అప్పగించి వారిని సంతోషపెట్టారు.

ఈ విధంగా శ్రీకృష్ణుడు భక్తులను అనుగ్రహిస్తూ దుష్టులను శిక్షిస్తూ చాలా కాలం ద్వారకలో ఉండి యదువంశ కీర్తి వర్ధనుడయ్యాడు. ఈ పరమాత్మ నామం తలుచుకున్నంత మాత్రం చేతనే అమంగళాలన్నీ నశిస్తాయి. ఓ పరీక్షిన్మహారాజా! ఈ శ్రీకృష్ణ గాథను విన్నివారికి ఈ లోకంలో సమస్త సుఖాలూ లభిస్తాయి. పాపాలన్నీ కాలిపోతాయి. మోక్షమూ లభిస్తుంది” అని శుకుడు పరీక్షిత్తుకి చెప్పినట్లు సూతుడు శౌనకాదులకు చెప్పాడు.

## శ్రీమద్భాగవతమునందలి పదవ స్కంధము పరిసమాప్తము

# పదకొండవ స్కంధము

సూతడు శౌనకాదులకు ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

“మహారాజా! జన్మ, కర్మ, వ్యాధి అనే వాటిని నశింప చేసుకోవడానికి గల దివ్యమైన ఔషధం శ్రీకృష్ణుని కథలను వినడమే. కనుక ఆ కథలను భక్తితత్పరుడవై విను.

శ్రీకృష్ణుడు భూలోకంలో భూభారం తీర్చాలన్న

సంకల్పంతోనే ఆవిర్భవించాడు. అతడికి తన వారు, పరాయివారు అనే తేడా లేదు. తనతో తగాదా పెట్టుకున్న రాక్షసులను సంహరించాడు. తన బంధువర్గం వాళ్ళైన కౌరవపాండవుల మధ్య సంధి కుదర్చగల సమర్థుడై ఉండి కూడా, సంధి కుదర్చకుండా యుద్ధం జరిపించి, పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యాన్ని అంతమొందించి, భూభారాన్ని తీర్చాడు. చివరికి తాను పుట్టిన యాదవవంశాన్ని కూడా తానే అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు.

### యాదవులు మహర్షులతో పరిహాసమాడడం - బ్రాహ్మణ శాపంతో యదువంశ వినాశనం కావడం

ఇంతలో ఒకరోజున విశ్వామిత్రాది మహర్షులు శ్రీకృష్ణుని చూడడం కోసం ద్వారకకు వచ్చారు. కొంతసేపు శ్రీకృష్ణునితో మాట్లాడినాక పిండారకమనే తీర్థానికి వెళ్ళారు. అక్కడ తిరుగుతున్న యాదవులు త్రికాలవేత్తలనే విషయంలో నమ్మకం లేక, వాళ్ళని ఎగతాళి చేస్తూ సాంబుడికి గర్భవతి వేషం వేసి, వారి దగ్గరకు తీసుకువెళ్ళి "ఈమెకి ఎవరు పుడతారో చెప్పమని" అడిగారు.

మహర్షులు యాదవుల మదమణచడానికి "ఈమెకు యదువంశాన్ని నాశనం చేసే రోకలి పుడుతుంది" అని చెప్పాడు. మహర్షులు శపించారని యాదవులు తెలుసుకునే లోపలే, సాంబుడిలో నుండి రోకలి జారిపడింది. అది చూసి భయపడిన యాదవులు జరిగినదంతా శ్రీకృష్ణునికి చెప్పారు.

అదంతా అట్లా జరిపించింది ఆయనే. అయినా ఏమీ తెలియని వాడిలాగా "మహర్షులను పరిహాసం చేసి కులనాశనం ఎవరైనా తెచ్చుకుంటారా! బ్రాహ్మణ శాపాన్ని త్రిమూర్తులూ అడ్డుకోలేరు గదా! అయినా పూర్వజన్మకర్మ ప్రకారవే జరుగుతున్నప్పుడు మీరేం చేయగలరు? మహర్షులను పరిహాసం చేశారు గనుక యదువంశం తప్పక నశించిపోతుంది. అయినా మీరు రోకలిని సముద్రతీరంలో ఉన్న పర్వతం మీద ఉన్న పెద్ద రాతి మీద మీ బలం కొద్దీ అరగదీసి, ఆ పొడినంతటినీ సముద్రం నీటిలో కలపమని" యాదవులను ఆదేశించాడు.

యాదవులు కృష్ణుడు చెప్పినట్లే చేశారు. కానీ ఆ రోకలిని అరగదీయగా మిగిలిన ముక్కని మాత్రం అట్లాగే వదిలేసి, దాన్ని కూడా సముద్రంలో కలిపేశారు. ఆ ముక్కని సముద్రం లోని ఒక చేప మింగింది. ఆ చేపని పట్టుకుని కోసిన బోయవాడికి ఆ రోకలి ముక్క దొరికింది. అతడు ఆ ముక్కనే తన బాణానికి ముక్కుగా చేసుకున్నాడు... తరువాత ఆ బాణమే శ్రీకృష్ణునికి తగిలింది.

## విదేహఋషభ సంవాదం - హరిభక్తికి ఉపాయం

ఒకరోజు నారదమహర్షి శ్రీకృష్ణుని చూడడానికి వచ్చాడు. అప్పుడు వసుదేవుడు ఆ మహర్షిని పూజించి "ఏ ధర్మాలు వింటే నరకం తప్పుతుందో, హరిభక్తి స్థిరమై పరమపదం పొందవచ్చో" వివరంగా చెప్పమని ప్రార్థించాడు.

అప్పుడు వసుదేవుడు అడిగిన దానికి బదులుగా నారదమహర్షి "ప్రియవ్రతుని వంశంలో ప్రసిద్ధుడైన భరతుడనే రాజు యొక్క నూరుగురు కుమారులలో ఒక కుమారుడు ఋషభుడు అనేవాడు విష్ణువు అంశతోపుట్టాడు. మిగిలిన వాళ్ళలో కవి, హరి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, అనిర్హోత్రుడు, ప్రమీళుడు, చమసుడు, కరభాజనుడు" అనే తొమ్మిది మంది బ్రహ్మచర్యం పాటిస్తూ బ్రహ్మవిద్యా విశారదులయ్యారు. వాళ్ళు సమస్త లోకాల్లో యధేచ్ఛగా తిరుగుతూ ఒకసారి విదేహరాజు యాగశాలకు వచ్చారు. రాజు వారిని పూజించి ''మానవులు ఈ సంసారసముద్రాన్ని దాటడానికి ఏదైనా ఉపాయం చెప్పమని" అడిగాడు. అప్పుడు కవి అనే వాడు ఈ విధంగా చెప్పాడు.

''మానవుడు ఇంద్రియాలకు వశుడైపోతే మాత్రం భయానికే వశుడైపోయినట్లే. అట్లా భయానికి వశుడైపోయినవాడు ఎన్ని జన్మలెత్తినా ఈ సంసారాన్ని దాటలేడు. ఈ సంసారాన్ని దాటడానికి 'హరి నామ సంకీర్తనం చెయ్యడం, హరికథను వినడం, హరిని ధ్యానించడం, హరిని సేవించడం, హరి భక్తులతో స్నేహం చెయ్యడం అనేవి మాత్రమే కావలసినవి" అని చెప్పగా విని, సంతృప్తి పడిన రాజు "భాగవతులంటే ఎవరు?" వివరంగా చెప్పమని అడిగాడు.

అప్పుడు కవి “సమస్తప్రాణులలో నిండి ఉన్న శ్రీహరియే తన ఆత్మలోనూ ఉన్నాడని తెలుసుకుని, వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తూ, లోకమంతటా నిండి ఆ భగవంతుడే ఉన్నాడని నమ్మినవాడు మాత్రమే నిజమైన భాగవతుడు” అని చెప్పాడు.

తరువాత రాజు శ్రీహరి గుణాలను వివరించమని అడిగాడు. అప్పుడు కవి ‘‘భగవంతుడైన శ్రీహరి ప్రపంచమంతటా నిండి ఉన్నా, ప్రపంచంలోని సుఖదుఃఖాలకు అతీతుడై ఉండే ఆనందమయుడు. ఆ పరమాత్మ తన వినోదం కోసం ఈ చరాచరాత్మకాలైన లోకాలను సృష్టించి, పాలించి, తనలోనే కలిపేసుకుంటూ ఉంటాడు. ఇదంతా విష్ణుమాయ చేసే వింతలీల మాత్రమే” అన్నాడు.

ఆ తరువాత రాజు ‘‘మునులను ఆటాడించే ఆ హరిమాయను దాటి ఆ శ్రీహరి సాన్నిధ్యానికి చేరుకోవాలనుకునే వాడు ఏం చెయ్యాలో చెప్పమని’’ అడిగాడు. కవి రాజుకి సమాధానంగా “హరి మాయను దాటి హరిని చేరుకోవాలనుకున్నవాడు హరిభక్తిత్పరుడైన సద్గురువుకి నిరంతరం సేవ చెయ్యడమే” అని చెప్పాడు.

“ఆ సేవ వలననే హరిభక్తీ, సమస్త ప్రాణుల పట్ల దయ కలిగి ఉండడము, ఈ ప్రపంచ విషయాల పట్ల విరక్తి, శుచిత్వము, క్షమ, మౌనవ్రతము అనేవి కలుగుతాయి.

హరిభక్తుల సేవచేసే వారిని హరిమాయ ఎప్పుడూ జయించలేదు" అని వివరించాడు.

అంతా విన్న రాజు కవి సమాధానాన్ని మెచ్చుకుని, ఆ భాగవతలను "నారాయణుని ప్రభావం ఎంతటిదో వివరించమని" అడిగాడు. అప్పుడు పిప్పలాయనుడు రాజుతో "నారాయణుడు జ్యోతి స్వరూపుడు, వృద్ధి క్షయాలు లేనివాడు, సృష్టి స్థితి లయలను మూడింటికీ మూలమైన వాడు నారాయణుడే. కానీ ఆ నారాయణుడు ఎప్పుడే  వికారమూ పొందని పరంజ్యోతి స్వరూపుడై వెలిగిపోతుంటాడు. ఏ భక్తుడు తనను కోరి సేవిస్తాడో ఆ భక్తుని చిత్తంలోని దోషాలను తొలగించి సుజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు" అని చెప్పాడు.

విదేహరాజు "మానవుడు ఏ పనులు చేస్తే పాపాలకు దూరంగా ఉండి హరిపాదపద్మాలను చేరుకోగలుగుతాడో చెప్పమని" కోరాడు. అప్పుడు అర్హోత్రుడు "హరిపాద పద్మాలను చేరుకోవాలనుకునే మానవుడు శాస్త్రం చెప్పిన పద్ధతిని అనుసరించి, ఆ ప్రతిరోజూ స్నానం చేస్తూ, నిర్మలమైన మనస్సు గలవాడై పదహార ఉపచారాలతో ఆ శ్రీహరిని పూజించాలి" అని చెప్పాడు.

అర్హోత్రుడు చెప్పినదానికి సంతృప్తి పడిన రాజు "పరమేశ్వరుడు చేసే పనులు ఏమిటో వివరించమని" అడిగాడు. అప్పుడు ద్రమీళుడు "ఆకాశంలో నక్షత్రాలూ, నేలపై

భూరేణువులూ ఎన్ని ఉన్నాయో లెక్కించి చెప్పచ్చుగానీ పరమేశ్వరుడు ఇన్ని పనులు చేస్తాడు అని లెక్కకట్టి చెప్పడం మాత్రం ఎవరికీ సాధ్యం కాదు. ఆ పరమేశ్వరుడే నారాయణ ఋషిగా అవతరించాడు. త్రిమూర్తులుగా ఉన్నదీ ఆ నారయణుడే. ఆ మహాత్ముడే తన రోమాలలోనించి ఊర్వశిని సృష్టించాడు. ఆతడే ఋషభునికి ఆత్మతత్త్వోపదేశమూ చేశాడు. మానవునిగా అవతరించి దానవులను మట్టుపెట్టాడు. శ్రీహరి అవతారాలు ఇన్ని అని చెప్పడంగానీ, వాటిని వర్ణించడం గానీ ఎవరికీ సాధ్యం కాదు" అని చెప్పాడు.

రాజు "జడులు ముక్తిని పొందడానికి ఏదైనా ఉపాయం" చెప్పమన్నాడు. అప్పుడు చమనుడు "హరిభక్తి లేకపోతే ఎంతటివారైనా ముక్తిని పొందలేరు. ముక్తిని పొందడానికి కావలసినది భక్తేగాని తెలివి కాదు. భక్తి గలవారికి ఉత్తమగతి, భక్తి లేని వారికి అథోగతి" అని చెప్పాడు.

విదేహరాజు "విశ్వమయుడైన విష్ణువు ఏం యుగంలో ఏ రూపంలో ఉంటాడో చెప్పమని" అడిగాడు. అప్పుడు కరభాజనుడు రాజుతో ఈ విధంగా చెప్పాడు.

''కృతయుగంలో విష్ణువు తెల్లని రంగుతో, నాలుగుచేతులతో మునిరూపాన్ని ధరించి మునిరూపంలో విరాజిల్లుతాడు. త్రేతాయుగంలో ఎరుపురంగుతో నాలుగు చేతులతో వేదత్రయరూపుడై విలసిల్లుతుంటాడు. ద్వాపర

యుగంలో నల్లని రంగుతో, రెండుచేతులు గలవాడై, పీతంబరాన్ని ధరించి శోభిల్లుతుంటాడు. కలియుగంలో కృష్ణవర్ణుడై, కృష్ణుడనే పేరుతో స్తుతించబడుతుంటాడు" అని చెప్పాడు.

ఆ తరువాత ఋషభ పుత్రులంతా అదృశ్యులయ్యారు. వారి ఉపదేశం విన్న విదేహరాజు జ్ఞాన నిష్ఠుడై మోక్షాన్ని పొందాడు. దేవకీ వసుదేవులు ముక్తులయ్యారు.

**ద్వారకకు బ్రహ్మాదుల రాక - వైకుంఠమునకు బలరామకృష్ణులు**

అంతలో బ్రహ్మాది దేవతలు ద్వారకకు వచ్చి, శ్రీకృష్ణుని దర్శనం చేసుకుని, "ఓ శ్రీహరీ! నువ్వు భూలోకంలో అవతరించి నూట ఇరవై ఐదు సంవత్సరాలయ్యింది. ఇక వైకుంఠానికి రావలసిన సమయం వచ్చేసింది" అన్నారు. శ్రీకృష్ణుడు వాళ్ళ మాటను అంగీకరించి, ఇక మిగిలిన యదువంశ వినాశం ఒక్కటీ చేసి, త్వరలో వైకుంఠానికి వస్తానని వాళ్ళకి మాట ఇచ్చి వారిని పంపాడు.

ఆ తరువాత బలరామకృష్ణులు ద్వారక విడిచి పెట్టేశారు. యాదవులు ప్రభాసతీర్థంలో మద్యం మత్తులో మునిగి, వారిలో వారే తగాదాలు పెట్టుకుని నశించిపోయారు. బలరాముడు తన యోగమహిమతో అనంతుడిలో లీనమయ్యాడు. శ్రీకృష్ణుడు ఒక్కడే ఒక చెట్టు క్రింద నీడలో పడుకుని ఉన్నాడు. దూరం నుండి ఒక బోయవాడు నల్లగా కదులుతున్న శ్రీకృష్ణుని

పాదాన్ని చూసి నల్లని జింకచెవి అనుకుని, గురి చూసి బాణమేసి కొట్టాడు. ఆ దెబ్బ తగలగానే శ్రీకృష్ణుడు "హా" అన్నాడు.

ఆ శబ్దం విన్న బోయవాడు కృష్ణుని వద్దకు పరుగున వచ్చి, తన తప్పును మన్నించమని ప్రార్థించాడు. కృష్ణుడు బోయవాడితో "ఇందులోనీ తప్పేమీ లేదు. అంతా విధి నిర్ణయం ప్రకారం జరిగింది" అని చెప్పాడు. అయినా బోయవాడు తాను చేసిన పాపానికి తనంతటతానే శరీరాన్ని వదిలేసి, వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

అంతలో దారకుడు అక్కడికి రథం తీసుకొచ్చాడు. శరీరం వదలబోతున్న ప్రభువుని చూసి విలపిస్తుండగానే రథం అదృశ్యమైంది. కృష్ణుడు దారకునితో "ద్వారకలోని స్త్రీ బాల వృద్ధులందరినీ హస్తినాపురానికి తీసుకెళ్లమని అర్జునునికి చెప్పమని" చెప్పి పంపించాడు. తానేమో దివ్యరూపాన్ని ధరించి వైకుంఠంలో విరాజిల్లడానికి వైకుంఠం చేరుకున్నాడు.

**శ్రీమద్భాగవతమునందలి పదకొండవ స్కందము పరిసమాప్తము.**

## పన్నెండవ స్కందము

తరువాత శుకమహర్షి పరీక్షిత్తుకు అతని తరువాత జరగబోయే కాలగతులను వివరించాడు. శ్రీకృష్ణుడు పరమపదానికి చేరుకున్న రోజే కలియుగం మొదలయ్యింది.

కలి ప్రవేశించి వెయ్యి దివ్య సంవత్సరాల కాలం గడిచినాక నాలుగో పాదంలో కృతయుగం ప్రవేశిస్తుంది.

ఈ కలియుగంలో శంతనుని సోదరుడైన దేవాపీ, ఇక్ష్వాకు వంశస్థుడైన మరుత్తు కలాపగ్రామంలో నివసిస్తూ తనయోగశక్తితో, విష్ణుదేవుని ప్రోత్సాహంతో ప్రజలు వర్ణాశ్రమ ధర్మాచారాలను తప్పకుండా నడిపిస్తుంటారు. ఆ కారణంగా భగవంతుని అనుగ్రహానికి పాత్రులై పరమపదానికి చేరుకుంటారు" అని చెప్పాడు.

పరీక్షిత్తు శుకమహర్షిని "కలిలో పాపాలకు లోనుకాకుండడా ఉపాయము, మార్గమూ ఉంటే చెప్పమని" అడిగాడు.

## యుగధర్మములు - పరిణామాలు

మహారాజా! కృతయుగంలో సత్యము, దయ, దానము, తపస్సు అనేవి ధర్మాలు. ధర్మదేవత నాలుగుపాదాలపై నడుస్తుంది. ప్రజలు ధర్మపరాయణులై ఆత్మజ్ఞాన సంపన్నులై, సుఖశాంతులను అనుభవిస్తుంటారు.

త్రేతాయుగంలో ధర్మదేవతకి ఒకపాదం కుంటు పడుతుంది. ప్రజలకు ఆత్మజ్ఞానం జ్ఞాపకం ఉండదు.

ద్వాపరయుగంలో ధర్మదేవత రెండు పాదాలతోనే నడుస్తుంది. ఆ కారణంగా ప్రజలకు శాంతి అనేది ఉండదు.

ఇక కలిలో ధర్మదేవత కేవలం ఒక్క పాదంపైనే నడుస్తుంది. ఆ కారణంచేత ప్రజలకు ఇంద్రియనిగ్రహమూ, ఆత్మజ్ఞానమూ ఉండవు. ధర్మానికి నిలవడానికి నీడ కూడా ఉండదు. ప్రజలు అసత్యం మాట్లాడుతుంటారు. కామక్రోధాదులు పెరుగుతుంటాయి. వాటికి లొంగిపోయి దురాచారాలు పాటిస్తూ, దుష్టాన్నం తింటూ ఉంటారు.

కరువులు, రోగాలు మొదలైన వాటితో బాధలు పడుతూ ప్రజలు ఎక్కువగా నశిస్తుంటారు. బ్రాహ్మణులు ధనం కావాలన్న ఆశతో యజ్ఞాది పనులను చేస్తూ దుష్టుల దగ్గర నుండి ధనాదులను తీసుకుంటూ, లోకుల చేత నిందింపబడుతుంటారు. కనుకనే ఈ కలియుగంలో రెండు ఘడియల కాలం పాటైనా ప్రతిరోజూ ప్రతిఒక్కరూ హరినామాన్ని తలుచుకుంటూ ఉండాలి. అట్లా చేస్తూ నూరు యజ్ఞాలు చేసిన ఫలం లభిస్తుంది" అని చెప్పాడు శుకమహర్షి.

ఆ తరువాత పరీక్షిత్తు అడిగినట్లుగా కల్పప్రళయ విధానాన్ని వివరించాడు. ఆపైన "ఓ మహారాజా! నేను మరణిస్తాను అనే భయాన్ని వదిలిపెట్టు. పుట్టిన ప్రతివాడూ మరణించక తప్పదు. కనుక ఆ శ్రీహరిని ధ్యానిస్తూ కాలం గడుపు. నీకు మాధవలోక సౌఖ్యాలు లభిస్తాయి" అని బోధించాడు.

## శుకమహర్షి పరీక్షిత్తుకి హితబోధ చెయ్యడం - పరీక్షిత్తు పుణ్యలోకాలకు చేరుకోవడం

రాజా! ఈ శరీరమే చావు పుట్టుకలకు కారణం. ఈ శరీరంలో ఉండే జీవుడు కుండలోని ఆకాశం లాంటివాడు. కుండ పగిలిపోతుంది. కానీ అందులో ఆకాశం నశించదుగదా! ఆ ఆకాశం మహాకాశంలో కలిసిపోతుంది.

అట్లాగే శరీరం నశించినా జీవుడు కూడా నశించడు. ఈశ్వరునిలోకే వెళ్ళిపోతాడు. మన కంటికి కనిపించేవీ, కనిపించనివీ అనే రెండింటికీ వేరుగా ఉండే ఈ ఆత్మలో ఆ శ్రీహరిని ధ్యానించు. అప్పుడు తక్షకుడూ ఉండడు. కరవడమూ ఉండదు. నువ్వు మరణించడమూ ఉండదు. లోకం మీద చూపులేకపోతే నువ్వు నీ ఆత్మలోనే ఉండిపోగలుగుతావు. అప్పుడు నీకు సుఖదుఃఖాలనేవి ఏవీ అంటవు. కనుక శోకాన్ని విడిచి అనుక్షణం హరిధ్యానతత్పరుడవై ఉండు" అని బోధ చేశాడు.

అలా మహర్షి చెప్పిన పద్ధతిలో పరీక్షిత్తు హరిధ్యాన తత్పరుడై ఉండిపోయాడు. అప్పుడు తక్షకుడు ఒక పండులో ప్రవేశించి, ఒక బ్రాహ్మణుని ద్వారా పరీక్షిత్తు దగ్గరకు వెళ్ళాడు. శృంగి శాపం ఫలించి పరీక్షిత్తుని కాటు వేశాడు. ఆ క్షణంలోనే పరీక్షిత్తు శరీరం భస్మమయ్యింది. అతడి ఆత్మ పుణ్యలోకాలను చేరుకుంది.

పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు తండ్రిని చంపిన కారణంగా పాముజాతిపై పగబట్టి సర్పయాగం చేశాడు. కానీ అంగిరసుడనే ముని వచ్చి, జనమేజయుని ఊరడింపచేసి, అతని చేత సర్పయాగం మాన్పించి తక్షకుడినీ, ఇంద్రుడినీ కూడా రక్షించాడు. అందుకే మానవులు ఒకరిపట్ల ఒకరు వైరాన్ని వదిలిపెట్టాలి.

ఆ తరువాత వ్యాసమహర్షి ఒకటిగా ఉన్న వేదాన్ని నాలుగు భాగాలుగా చేసి, తన శిష్యులైన పైలుడూ, వైశంపాయనుడూ, జైమినీ, సుమంతుడూ అనే నలుగురి చేత ఆ నాలుగు వేదాలనూ వ్యాప్తి చేయించాడు. 18 పురాణాలను రచించాడు. వీటిని చదివినా, విన్నా, వ్రాసినా పాపాలన్నీ నశిస్తాయి.

తరువాత శౌనకాదులు సూతమహర్షిని "పాపాత్ములూ, పాప బుద్ధి గలవాళ్ళూ ఈ సంసారాన్ని ఎట్లా దాటాలి" వివరించమని అడిగారు. అప్పుడు సూతమహర్షి వాళ్ళకి మార్కండేయుని కథ చెప్పాడు.

## కర్మసాక్షి - ద్వాదశాదిత్యులు

ఆ తరువాత ప్రత్యక్షదైవమైన, శ్రీమన్నారాయణ స్వరూపుడైన ఆ సూర్యభగవానుడు చైత్రంలో 'ధాత' అనీ, వైశాఖంలో 'అర్కు'డనీ, జ్యేష్ఠంలో 'మిత్రు'డనీ, ఆషాఢంలో

'వరుణు'డనీ, శ్రావణంలో 'ఇంద్రు'డనీ, భాద్రపదంలో 'వివస్వంతు'డనీ, ఆశ్వయుజంలో 'త్వష్ట' అనీ, కార్తీకంలో 'విష్ణు'వనీ, మార్గశీర్షంలో 'ఆర్యము'డనీ, పుష్యంలో 'భగు'డనీ, మాఘంలో 'పూషు'డనీ, ఫాల్గుణంలో 'క్రతు'వనీ పిలవబడుతుంటాడు. ఆ పరమాత్మ వెంట రెండు నెలలకు ఒకరు చొప్పున ఆరుగురు పరిజనులు ఉంటారు. వీళ్ళు కూడా ప్రతిమాసానికీ మారుతుంటారు.

ప్రపంచంలో ప్రతి ప్రాణి చేసే ప్రతిపనికీ సాక్షిగా ఉండే ఈ సూర్యభగవానుడు తనను ఆరాధించే వాళ్ళకి ఇహపరలోకాల ఫలితాలను ప్రసాదిస్తుంటాడు.

## భాగవత ప్రశస్తి - పఠనఫలము

బ్రహ్మ, విష్ణు, శివ, భాగవత, నారద, మార్కండేయ, అగ్ని, భవిష్యోత్తర బ్రహ్మవైవర్త, లింగ, వరాహ, స్కాంద, వామన, కూర్మ, మత్స్య, గరుడ పురాణములని పద్దెనిమిది పురాణాలు ఉన్నాయి. వీటన్నింటిలోకీ నదులలో గంగలాగా, నక్షత్రాలలో చంద్రునిలాగా, ఆశ్రమాలలో గృహస్థాశ్రమం లాగా, వర్ణములలో ఓంకారం లాగా, ఋతువులలో వసంతం లాగా, యుగాలలో కృతయుగం లాగా, ప్రకాశిస్తూ ఉంటుంది ఈ భాగవత పురాణం.

ఈ పురాణమును చదివిన వారు, విన్నవారు ఇహలోకంలో ఆయురారోగ్యసంపన్నులై, పరంలో విష్ణుసాయిజ్యాన్ని పొందుతారు. పుష్కరంలోగానీ, ద్వారకలోగానీ, మధురలోగానీ ఆదివారం నాడు భాగవతాన్ని చదివేవారికి ఈ సంసారం నుండి విముక్తి లభిస్తుంది" అని ఈ భాగవతాన్ని హరిభక్తుడైన పరీక్షిన్మహారాజుకి శుకమహర్షి వినిపించాడు. సూతుని వలన భాగవతాన్ని విన్న తరువాత శౌనకాదులు తమ తమ ఆశ్రమాలకు వెళ్ళిపోయారు.

**శ్రీభాగవతమునందలి పన్నెండవ స్కందము**

**పరిసమాప్తము.**

**ఓం తత్సత్**




వ్యాసుని
శ్రీ మహా భారతం


వాల్మీకి
శ్రీ రామాయణం


పోతన
శ్రీ భాగవతం